శ్లో॥ ఏవమ్ ఉక్త్వా అర్జునః సంఖ్యే రథోపస్థే ఉపావిశత్ ।
విసృజ్య సశరం చాపం, శోక సంవిగ్న మానసః ॥

సంఖ్యే శోకసంవిగ్నమానసః అర్జునః ఏవమ్ ఉక్త్వా ।
సశరం - చాపం విసృజ్య, రథోపస్తే ఉపావిశత్ ॥

శోక సంవిగ్నమానసుడైన అర్జునుడు ఆవిధంగా అంటూ ధనుర్బాణాలను విడచి రథం వెనుకభాగంలో కూర్చుండిపోయాడు.

# 1.
# అర్జున విషాదయోగ పుష్పం

ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో ధర్మ - అధర్మముల మధ్య యుద్ధ సన్నివేశము అనివార్యం అయింది. భీష్మ - ద్రోణ - విదురాదుల ధర్మప్రవచనాలు దుర్యోధనాదుల చెవులకు ఎక్కనేలేదు. శ్రీకృష్ణ భగవానుని హెచ్చరిక వాక్యాలు పెడచెవిన పడిపోయాయి. శ్రీకృష్ణపరమాత్మయే స్వయముగా అర్జునుని రథసారథ్యం వహించారు.

⋆⋆⋆

**ధృతరాష్ట్రుడు** : ఓ సంజయా! 'ధర్మక్షేత్రము' అను అభివర్ణనముతో లోకప్రసిద్ధమైయున్న కురుక్షేత్రంలో యుద్ధ సన్నద్ధులై సమావేశమయినట్టి మావారు - ఆ పాండవులు ఏమేమి చేయబూనారో..... ఏమేమి విశేషాలు జరిగాయో, వివరించు.

**సంజయుడు** : ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఉభయసేనలు యుద్ధ సన్నద్ధులు కాసాగారు. అప్పుడు మీ జ్యేష్ఠపుత్రుడు దుర్యోధనుడు పాండవులసేనను, వారు

మొహరించియున్న తీరును పరికించి చూచాడు. సాలోచనగా ద్రోణాచార్యులవారిని సమీపించాడు.

“ఆచార్యవర్యా! అటు చూస్తున్నారా! పాండు పుత్రులు పెద్దసైన్యమునే సమీకరించుకున్నారే! ద్రుపదనందనుడు – మీ శిష్యుడు అగు దృష్టద్యుమ్నుడు పాండవసేనను గొప్పవ్యూహంగా మొహరించాడు. ఇంకా చూడండి! వారి సైన్యంలో భీమ – అర్జునులకు సరితూగగల వీరులు చాలామంది కనిపిస్తున్నారు. సాత్యకి, విరాటుడు, మహారథి అయినట్టి ద్రుపదుడు, ధృష్టకేతు, చేకితానుడు, వీరప్రసిద్ధుడైనట్టి కాశీరాజు, పురజిత్తు, కుంతిభోజుడు, రాజశ్రేష్ఠుడుగా ప్రసిద్ధిగన్న శైబ్యుడు, యుయుధానుడు, మహాపరాక్రమవంతుడగు ఉత్తమౌజుడు, అభిమన్యుడు, పంచపాండవులు ..... వీరంతా అతిరథ – మహారథులు!

ఇక మనవైపు మహావీరుల గురించి చెప్పవలసివస్తే, ....... మీరు, భీష్మాచార్యులు ఉండనే ఉన్నారు. మన కర్ణుడు, కృపాచార్యులు, సమితింజయుడు, అశ్వత్థామ, వికర్ణుడు, సౌమదత్తుడు మొదలైన వారంతా ఉన్నారు. వీరేకాక ఇంకా ఎందరెందరో వీరాధి వీరులు – మహాశూరులు నాకొరకై తమ ప్రాణాలైనా అర్పించటానికి సిద్ధపడి యుద్ధభూమికి వచ్చి నిలచియున్నారు.

*అయితే, భీష్మ రక్షితమగు మనసేనను – భీమరక్షితమగు పాండవసేనను పోల్చి చూస్తూఉంటే,......* వారిబలగాలు పరిమితమైయున్నట్లు, మనసైన్యం అపారంగాను కనిపిస్తున్నాయి.

సరే! ఇక యుద్ధరంగం సిద్ధమైనట్లే! మీరంతా కుడా మీమీ నియమిత స్థానములు చేరండి. మన సేనానాయకులగు భీష్మాచార్యులవారికి అన్నివైపులనుండి సంరక్షకులై ఉండండి.

⋆⋆⋆

అప్పుడు కురువృద్ధులు, అమితపరాక్రమవంతులు అగు భీష్మాచార్యులు దుర్యోధనునికి తదితరులకు ‘ఉత్సాహం’ కలిగించే నిమిత్తం తమ యుద్ధ శంఖం

పూరించారు. వెంటనే అనేక శంఖాలు, భేరీలు, డోళ్ళు, మృదంగాలు మార్మోగాయి. ఆ శబ్దాలు దిక్కులంతా విస్తరించాయి.

అది విని తెల్లటి గుఱ్ఱములు పూన్చబడ్డ రథం అధిరోహించిన పార్థుడు, పార్థసారథి శ్రీకృష్ణుడు తమ దివ్య శంఖములను పూరించారు. హృశీకేశుడు (శ్రీకృష్ణుడు) 'పాంచజన్యం' పూరించారు. ధనంజయుడు 'దేవదత్తం' పూరించసాగాడు. అప్పుడిక తదితర వీరులంతా తమ తమ శంఖాలు పూరించనారంభించారు. భీమకర్మ బిరుదాంకితుడగు భీమసేనుడు తన 'పౌండ్రము' అనే పేరుగల శంఖం పూరించాడు. యుధిష్ఠిరుడు 'అనంతవిజయము' అనే శంఖం పూరించారు. శ్రేష్ఠధనుర్ధారుడగు కాశీరాజు, మహారథియగు శిఖండి, పాండవసేనాధ్యక్షుడగు దృష్టద్యుమ్నుడు, విరాటరాజు, పరాజయం ఎరుగని సాత్యకి, ద్రౌపతీపుత్రులగు పంచపాండవులు, మహాపరాక్రమవంతుడుగా అభివర్ణించబడే సుభద్రా పుత్రుడగు అభిమన్యుడు, ..... ఒకరి తరువాత ఒకరుగా, ఒకేసారిగా కూడా తమతమ శంఖాలు పూరించారు. ఆ శంఖనినాద శబ్ద తరంగాలు భూమిని – ఆకాశాన్ని పూరించివేశాయి. ఓ ధృతరాష్ట్ర మహారాజా! అప్పుడు జనించిన ధ్వని – ప్రతిధ్వని తరంగాలు మీ సైన్యంలోని వారందరి హృదయాలను కపింపజేశాయి. ఉభయ సేనలలోని వీరుల శంఖారావాలతో అక్కడి దిక్కులు పిక్కటిల్లాయి. ఇక కొద్ది సమయంలో యుద్ధం ప్రారంభం కాబోతోంది.

అప్పుడు అర్జునుడు, శ్రీకృష్ణునితో "కృష్ణా ! కౌరవ – పాండవులకు తోడుగా ఏఏ రాజులు యుద్ధభూమికి వచ్చియున్నారో వారందరినీ ఒకసారి కలియచూద్దాం! ఉభయ సేనల మధ్య రథం నిలపండి!" అని పలికాడు.

ఉభయ సేనలమధ్య తెల్లటి గుఱ్ఱములు కూర్చిన ఉత్తమమైన రథమును నిలిపి, శ్రీకృష్ణుడు, "అర్జునా ! నీవు కోరినట్లు ఇక్కడ సమావేశమైన రెండు సేనల మధ్య రథము నిలిపాను. ఇక యుద్ధసన్నద్ధులైనవారినందరినీ పరికించి చూడవచ్చు" .... అని పలికారు. అర్జునుడు యుద్ధభూమి యొక్క నలువైపులా

పరికించి చూచాడు. ఎదురుగా భీష్మ-ద్రోణులు కనిపించారు. అంతే కాకుండా అటు-ఇటు తండ్రులు, తాతలు, కొడుకులు, మనుమలు, స్నేహితులు, పిల్లను ఇచ్చినవారు, మేనమామలు, మేనల్లుళ్లు ..... అంతటా యుద్ధ సంసిద్ధులై కనిపించారు. అందరూ సంబంధీకులే! అందరూ బంధువులే! అర్జునుని మనస్సును ఆ యుద్ధ సమావేశ-దృశ్యం కలచివేసింది. గుండె బరువెక్కింది. "అయ్యో ! ఏమిటిదంతా?" అని నిరుత్తరుడయ్యాడు. విషణ్ణ వదనుడయ్యాడు. శ్రీకృష్ణ భగవానునితో ఇట్లా పలకసాగాడు.

**అర్జునుడు** : హే శ్రీకృష్ణా! ఇక్కడ నాకు మన స్వజనులే అన్నివైపులా కనిపిస్తున్నారయ్యా! అటూ-ఇటూ అంతా మనవారే! యుద్ధమునకు తరలివచ్చినట్టి మనవైపు - వారివైపు వారంతా మనమన బంధువులే! సంబంధీకులే! వీరందరినీ చూస్తుంటే నా అంగములు కృంగిపోతున్నాయి. నోరు ఎండి మాటలు పెగలటం లేదు. శరీరం కంపిస్తోంది. వెంట్రుకలు ఆవేదనతో నిక్కబొడుస్తున్నాయి. గాండీవం చేతిలోంచి జారిపడుతోంది. నా చర్మమంతా విపరీతంగా దహించబడుతోంది. నేను ఇక నిలబడలేకపోతున్నానయ్యా! మనసంతా అనేక భ్రమలకు లోను అవుతోంది. నాకు అంతటా అనేక దుశ్శకునాలు కనిపిస్తున్నాయి. ఈ అయినవాళ్లనంతా చంపి మనం పొందే శ్రేయస్సు నాకేమీ కనిపించటంలేదు. మనం ఎవరిపై గెలవాలి? గెలిచి ప్రయోజనం ఏమిటి? ఈ గెలుపు, ఈ రాజ్యం, ఈ సుఖాలు ఎవరికి కావాలి? నాకేం అఖర్లేదు. యుద్ధం చేసి రాజ్యం సంపాదిస్తే ఆ సంపదలు, ఆ సుఖాల జీవితం వలన మనకేమి లాభం? ఎవ్వరికోసమైతే మనం రాజ్య భోగాలు, సుఖాలు కోరుకొంటామో .... అట్టి పుత్ర-మిత్ర తదితర బంధు జనమంతా తమ తమ ధన-మాన-ప్రాణాలు వదలుకొని యుద్ధభూమికి వచ్చి, యుద్ధంలో పాల్గొనటానికి సిద్ధంగా ఉన్నారు! అటు చూడండి. గురుదేవులగు ద్రోణాచార్యులు, తండ్రులు, కొడుకులు, తాత భీష్మాచార్యులు, పిల్లనిచ్చిన మామలు, మేనమామలు, .... తదితర మన బంధువులు... అంతా ఇక్కడ యుద్ధరంగంలోనే కనిపిస్తున్నారు.

మా పెదతండ్రి కుమారులగు ఈ ధృతరాష్ట్ర పుత్రులను చంపి మనం ఎవరికి ప్రీతి కలిగిస్తున్నట్లు? పైగా, వీరంతా పంచమహాపాతకాలకు ఒడిగట్టినవారు. వీరిని చంపితే వీరి పాపాలన్నీ మనం మూటగట్టుకోవటమే అవుతుంది. అయినాకూడా వీరంతా మనకు బంధువులేనాయె! మనవారినంతా చంపి మనం సుఖాలు పొందాలనుకోవటం ఎంత నీచమైన విషయం! ఓ జనార్దనా! ఆ ధార్తరాష్ట్రులు లోభముచేత, మలినమైన బుద్ధి కలవారై వంశనాశనము – మిత్రద్రోహము వంటి దుష్టకార్యముల పర్యవసానమేమిటో గమనించక యుద్ధం చేయాలని తహతహపడుచూ తయారై ఉండవచ్చుగాక! లోకమంతా మనమేదో మంచివారమని ప్రశంసిస్తోంది కదా! మనం లోభమునకు, వంశనాశనమునకు – మిత్రద్రోహమునకు సిద్ధం ఎందుకవ్వాలి? ఏది తప్పో – ఏది ఒప్పో మనం గమనించి ఈ యుద్ధమునుండి విరమించవచ్చునే! ఈ యుద్ధము జరిగిందా, .... వంశనాశనం, కులక్షయం తప్పదు కదా! కులక్షయంతో, సుదీర్ఘ కాలంగా కొనసాగుతూ వస్తున్న కుల ధర్మాలు – జాతి ధర్మాలు మంట కలిసిపోతాయి! కుల – జాతి ధర్మాలు నశిస్తే ఇక మిగిలిపోయి ఉన్నవారంతా అనేక దోషములు పొంది, తద్వారా లోకమంతా అధర్మము ప్రకోపించదా చెప్పు? అధర్మము ప్రబలటం చేత కులస్త్రీలంతా చెడిపోతే లోకమంతా వర్ణసంకరం కాక మరింకేమున్నది? అట్టి వర్ణసంకరము – వంశనాశనమునకు ఒడిగట్టిన వారమంతా నరకానికి త్రోవ కట్టక మానము కదా! అప్పుడు అందరి పితృదేవతలు శ్రార్ధ– తర్పణములు పొందకపోవటంచేత అధోగతి పాలు కానున్నారే! ఈ విధంగా వర్ణసంకరం చేత వంశపారంపర్యంగా వస్తున్న కుల ధర్మాలు, జాతి ధర్మాలు నశించిపోతాయికదా! అట్టి ధర్మాలు నశించినప్పుడు అందుకు కారణమైనవారు, వారి పితృ దేవతలు దీర్ఘకాలం నరకలోక వాసులు కావటం తప్పదని పెద్దలు అనగా, పురాణాలు చెప్పగా – మనం విని ఉన్నాం కదా!

ఆహాఁ! ఇప్పుడిదంతా గమనించాము కాబట్టి సరిపోయిందికాని, .... లేకపోతే త్రుటిలో ఎన్ని దోషాలు జరుగబోయేవో కదా! అరెఁ! ఇదంతా తర్కించుకోకుండా మనం ఎట్లా యుద్ధమునకు సిద్ధమయ్యాం? ఎంత

పాపకార్యానికి ఒడిగట్టాం! ఇంతకూ, రాజ్యలోభం చేతనే కదా మనం ఇంతకు సిద్ధపడినది? అయినదేమో అయింది. ఈ ఆయుధాలు వద్దు, మనకీ యుద్ధం వద్దు. నేను ప్రతీకారం వదలి ఆయుధాలు విసర్జించడం చేత, ... ఆయుధధారులైన ఆ ధృతరాష్ట్ర పుత్రులు నన్ను అంతం చేయటం ఒకవేళ జరిగితే, ... నాకు యుద్ధం కన్నా వారి చేతులలో అటువంటి మరణమే మంచిదని అనిపిస్తోంది!

☆☆☆

**సంజయుడు**: ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ అర్జునుడు ఇట్లా పలికి రథంలో చతికిలబడి కూర్చుండిపోయాడు. చేతిలో ఉన్న ధనుర్బాణాలు జారవిడిచాడు. ఆతని మనస్సునంతా కకావికలమై, దుఃఖము ఆక్రమించివేసింది. విషణ్ణమైన ముఖంతో దిగాలుపడుతూ ఉండిపోయాడు.

*ఇతి భాగవద్గీతా... అర్జునవిషాద యోగ పుష్పః*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

★★★



శ్లో॥ విహాయ కామాన్ యః సర్వాన్ పుమాన్ చరతి నిఃస్పృహః ।
నిర్మమో నిరహంకారః స శాంతిమ్ అధిగచ్ఛతి ॥

యః పుమాన్ సర్వాన్ కామాన్ విహాయ–నిర్మమః నిరహంకారః,
నిస్పృహః చరతి, సః శాంతిమ్ అదిుగచ్ఛతి ॥

ఏ జీవుడైతే సమస్త దృశ్య సంబంధమైన కోరికలు త్యజించి, మమకార – అహంకారములను వదలి, సర్వప్రాపంచక స్పృహలు (Avocations) అధిగమించినవాడై ఉంటాడో, ....అట్టివాడు 'పరమశాంతి'ని సముపార్జించుకుంటున్నాడు.

# 2.

# సాంఖ్య యోగ పుష్పం

**సంజయుడు** : ఒక్కసారిగా అత్యంత విషాదము - జాలి - దుఃఖములతో నిండిపోయిన అర్జునుని విషణ్ణ ముఖం చూచి శ్రీకృష్ణ భగవానుడు ప్రోత్సాహక వాక్యాలు పలుకసాగారు.

**శ్రీకృష్ణుడు** : అర్జునా! ఏమిటి ఇదంతా? అసందర్భము–పెద్దలు మెచ్చనివి–నరక ద్వారహేతువు- విషముతో సమానము అయినట్టి దోష - నైరాశ్య - మోహములతో కూడిన ఈ దుఃఖమంతా ఇప్పుడు నీకు ఎక్కడి నుండి వచ్చిపడిందయ్యా? ఇది అసమర్థతను - నిరుత్సాహమును తెచ్చి పెట్టుకునే సమయమేనా? కానే కాదు. ఇటువంటి పిరికితనపు పేడిమాటలు కట్టిపెట్టు. ధైర్యము - సాహసము - సామర్థ్యము ప్రదర్శించవలసినట్టి ఈ సమయంలో ఇటువంటి మనో దౌర్బల్యం ఆశ్రయించటం ఉచితం కాదు. ఇది కార్యసిద్ధికై ముందుకు అడుగులు వేయవలసిన సందర్భం సుమా! హృదయ బలహీనతకు చోటు ఇవ్వటం ఎంత క్షుద్రము - నీచము? చాలుచాలు. ఇక లే! అల్పమగు మనోదౌర్బల్యం వదలు. యుద్ధ కార్యమునకు ఉపక్రమించు. ధనుర్బాణాలు

ధరించు. నైరాశ్యము నీవంటి వానికి అనుచితం సుమా! యుద్ధము చేయటానికి సిద్ధం కమ్ము!

**అర్జునుడు** : బావా! శ్రీకృష్ణా! నా ఆవేదన ఏమిటో సరిగ్గా గమనించినట్లు లేవు. మనం ఇప్పుడు యుద్ధం చేయబోతున్నది ఎవరితో? ఈ యుద్ధ పర్యవసానంగా చంపాలనుకుంటున్నది ఎవరెవరిని? మనవారినే కదా! బాల్యంలోనే తండ్రిని పోగొట్టుకున్న మమ్ములను చిన్నప్పటి నుండి తండ్రితో సమానంగా సాకి - ముద్దు చేసి - గురువులను చూపి - విద్యాబుద్ధులను నేర్పించి - సర్వవేళల సంరక్షకుడై కాపాడిన పూజనీయులగు తాతగారు భీష్మాచార్యులవారినా? శస్త్ర-అస్త్ర విద్యలలో ఇంతటి వారిగా మమ్ము తీర్చిదిద్దుటచే మా సేవకు సర్వదా అర్హులగు ద్రోణాచార్యులవారినేనా? వారిద్దరు అత్యంత భక్తితో సేవింపబడటానికి, పూజింపబడటానికి అర్హులైనట్టి మహనీయులు కదా! వారు తీర్చిదిద్దిన ఈ చేతులతో వారినే గాయపరచటానికి, సంహరించటానికి బాణాలు వదలటమా? ఇంతకన్నా నరకద్వారము, దుఃఖప్రదము, దౌర్బల్యము, దౌర్భాగ్యము, పేడితనము మరింకేమి ఉంటుంది? అర్థ-కామాల కోసం రాజ్యపిపాసతో వారిని సంహరించే ప్రయత్నాలు చేయటం ఎంత నీచం? గురువులను సంహరించి అర్థ-కామాలు పొంది జీవించే బదులు భిక్షాటనంతో పొట్ట నింపుకొని జీవించటం మెరుగు కదా!

పోనీ; "రాజ్యం వీరభోజ్యం మనం యుద్ధం చేసి రాజులమై రాజ్యాలు పరిపాలిద్దాం..." అనుకుందామా? వారేమైనా తక్కువవారా? మహావీరాధివీరులు అటువైపు ఉన్నారు. వారు బలవంతులా? మనం బలవంతులమా? యుద్ధంలో వారు గెలుస్తారా? మనం గెలుస్తామా? అదీ చెప్పలేము. పోనీ మనమే గెలిచినప్పటికీ మన బంధువులను, పూజ్యనీయులగు తాతగారిని, గురువులను, సోదరులగు ధార్త్ర రాష్ట్రులను పోగొట్టుకుని కదా మనం గెలువకలిగింది? అంతా మనవాళ్లే కదా! మనవారిని చంపుకొని మనం జీవించి మాత్రం ఏమి లాభం?

హే కృష్ణా! ఏదో దిగులు - జాలి - కార్పణ్యము - భయము- బాధ నా బుద్ధిని ఆవరించివేసినాయయ్యా! ఇప్పుడు కింకర్తవ్యా విమూఢుడనైనాను.

ఎటువైపుగా ముందుకు పోవాలో ఏమీ పాలుపోవటం లేదు. అందు చేత కృష్ణా! నేను నీకు శిష్యుడనై శరణు వేడుచున్నాను. నీకు ప్రపన్నుడను అగుచున్నాను. ఈ యుద్ధం చేయటం ఉచితమా? అనుచితమా? ఇక ఇచ్చట ఇంతటితో విరమించటం మంచిదా? ఏది శ్రేయోదాయకం? నేను నిర్ణయించుకోలేకపోతున్నాను. నీవే యోచించి నిర్ణయించు. నియమించు. ఆజ్ఞాపించు. ఇంతటి దుఃఖం నన్ను ఆవరించి ఉండగా నేను యుద్ధం ఎట్లా చేస్తాను? ఏ భయ-వేదన-దుఃఖాలు నన్ను ఆక్రమించుకొని ఉన్నాయో అవి శత్రువులందరూ తొలగినప్పటి రాజ్యలాభం చేతగాని, దేవలోకాధిపత్యం చేతగాని తొలగేవి కావని నాకు అనిపిస్తోంది.

***

**సంజయుడు** : ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఈ విధంగా పలికి ఆ అర్జునుడు "నేను యుద్ధం చేయలేనయ్యా" అంటూ గాండీవమును ప్రక్కకు నెట్టాడు. దుఃఖభారంతో మౌనం వహించాడు. చూచారా! ఎంత ఆశ్చర్యం!

శ్రీకృష్ణుడు అంతా విని హాస్యం చేస్తున్నట్లుగా పకపక నవ్వారు. ఉభయ సేనల మధ్య నిలిచియున్న రథంలో, విషాదమంతా గూడు కట్టుకొనియున్న ముఖంతో - చతికిలపడి కూర్చుని యున్న అర్జునుని చూచి ఇట్లా ప్రవచించసాగారు.

**శ్రీకృష్ణ భాగవానుడు** : అర్జునా! దేనిని గురించైతే దుఃఖించవలసిన అవసరమే లేదో, దుఃఖించి ప్రయోజనంకూడా లేదో .... అట్టి దాని గురించి నీవు దుఃఖం పొందుచున్నావయ్యా! ఈ దృశ్యప్రపంచమంతా తనదైన శైలిలో అనేక సంగతి - సంఘటనాక్రమ పరంపరలు కొనసాగిస్తూనే ఉన్నది. *ఇక సుఖ-దుఃఖాలంటావా? అవన్నీ మనసులోని ఇష్ట-అయిష్టములను అనుసరించి మనోకల్పితంగా అనుభవమౌతున్నాయి.* సంఘటనలు స్రవంతిగా కొనసాగుతూనే ఉంటాయి. వాటిని నిరోధించటం ఎట్లా సాధ్యం? అనివార్యమగు ఈ జగత్ విషయ ప్రవాహ పరంపరల గురించి దుఃఖించటం అనవసరం.

**ప్రజ్ఞావాదం** [Assumptions and pressumptions structured by one's own self]: నీవు ప్రజ్ఞావాదివై ఇంతవరకూ సంభాషించావు. ప్రతి వ్యక్తి తన లౌకికప్రజ్ఞను ఉపయోగించి కొన్నిటిని నమ్ముకొని ఉంటాడు. కొన్నిటి పట్ల నమ్మకము ఉండదు. కొన్ని ఇష్టపడతాడు. మరికొన్నిటిని అయిష్టపడతాడు. ఈ విధంగా తనకుతానే అభిప్రాయము - భావన - అభిరుచుల రూపంతో కూడిన బుద్ధితో తన సుఖ దుఃఖ సంబంధమైన నిర్వచనాలు కల్పించుకొని తన సుఖ-దుఃఖాలన్నీ తానే అనుభవముగా పొందుతూ ఉంటాడు. ఇప్పుడు ఇంతవరకు నీవు చెప్పుకొంటూ వచ్చినదంతా అటువంటి ప్రజ్ఞావాదం నుండి బయల్వెడలిన వాదనావిశేషాలు మాత్రమే!

అటువంటి నీ యొక్క ప్రజ్ఞావాదము నీ నిత్యానిత్య వివేకమును కప్పి ఉంచుతోంది. అనగా నీ ప్రజ్ఞ అల్పకాలికమైన - సాపేక్షికమైన (Temporary and relative) సత్యమును నీకు అనుభూతపరచుచుండగా, అది నిన్ను శాశ్వతమైన సత్యమును ఏమరచేటట్లు చేస్తోంది. అయితే నిత్యానిత్య వివేకమును దృఢపరచుకొన్న మహనీయులగు పండితులకు ఇక్కడ కనిపించేది, అనిపించేది రెండురకములుగా మాత్రమే! ఆ రెండిటి గురించి వారు దుఃఖించరు.

(1) గతాసమ్ (2) అగతాసమ్

I. **గతించిపోయినవారు - గతించపోబోయేవారు** : ఈ కనబడే నామరూపాత్మక జీవ-జీవన ప్రపంచాంతర్గతమైనదంతా కాలముచేత ఏర్పడి, కాలముచే లయించబడేదే కదా! మనకు తెలిసినట్టి, మనకు కనిపిస్తున్నట్టి జనుల సమూహమంతా ..... గతించిపోయినవారు - గతించబోయేవారు మాత్రమే! అనివార్యమగు ఈ గతిని గురించి ఇక దుఃఖించవలసిన పనేమున్నది?

II. ప్రతి వ్యక్తిలోనూ రెండే విశేషాలు సమావేశమై సమకూడి, సంయోగం పొంది ఉంటున్నాయి.

(1) "గతాసమ్": గతించిపోబోయేవి, మార్పు చెందేవి (దృశ్యజగత్తు)

(2) “అగతాసమ్”: నిశ్చలమైనది, మార్పు చెందనిది. (ఆత్మ)

మార్పు చెందే స్వభావం గల ఈ దేహ – ఇంద్రియ – ఇంద్రియవిషయ – సంగతి – సంఘటన – సందర్భ – అభిరుచి – విషయనిర్ణయాలన్నీ ఒక మహా సాగరంలోని కెరటంలాగా ఎప్పటి కప్పుడు మార్పు చెందుతూనే ఉంటాయి. అట్టివాటి గురించి దుఃఖించి ఏం ప్రయోజనం? ఒకడు దుఃఖించినా, దుఃఖించకున్నా అవి మార్పు–చేర్పులు అనివార్యంగా సంతరించుకుంటున్నాయి. ఇక ఆత్మయో! మార్పు– చేర్పులు చెందనిది. ఈ దేహాదుల రాకపోకలతో మార్పు చెందని ఆత్మ గురించి ఎవ్వరికైనా దుఃఖమెందుకు?

ప్రతి ఒక్కరు ఈ “మార్పు చెందే జగత్ విషయాలు – మార్పు చెందని ఆత్మ” ఈ రెండిటి కలయికయే తమ స్వరూపముగా కలిగియున్నారు..

మార్పు చెందే విభాగం మార్పు చెందుతూనే ఉంటుంది. మార్పు చెందని ఆత్మ సర్వదా యథాతథం. రెండిటి గురించీ దుఃఖించటం అనవసరం, అసందర్భము, అనుచితము, అనర్థము కూడా!

“నా ఈ బంధువులంతా గతిస్తారేమో?” అని కదా, నీ దిగులు? ఇక్కడ ఒక విషయం నీవు గమనించు.

**నేను** ఒకప్పుడు ఉండి–మరొకప్పుడు లేకుండా పోయేవాడినా? కానేకాదు. అనగా, ఈ పాంచభౌతిక దేహానికి మునుముందే ఉన్నాను. సరే, ఈ దేహం వచ్చిన తరువాత ఉండనే ఉన్నాను కదా! అట్లాగే ఈ దేహం నశించిన తరువాత కూడా నేను ఉండియే తీరుతాను.

**నేనే కాదు. నీవు క□డా!** – ఇతఃపూర్వం నీవు ఉన్నావు. ఇప్పుడున్నావు. తరువాత కూడా ఉంటావు. అనగా ముందుముందుకూడా ఎప్పటికీ ఉండబోయేవాడివే.

**నేనూ–నీవే కాదు**. ఇక్కడి రాజులంతా కూడా ఇంతకుముందు– ఇప్పుడు – ఇకముందు ఎప్పటికీ ఉండేవారే! భవిష్యత్‌లో రాబోయే జీవులు కూడా అంతే ! వారు – వీరు – మనం ... అందరము ఎప్పటికీ సర్వదా

సత్‌స్వరూపులమై ఉండియే తీరుతాము! ఇక ఎవరి గురించైనా ఎందుకు దుఃఖించటం?

**ప్రతి జీవుడు ఈ రెండిటి కలయికయే సుమా!**

(i) **దేహి (దేహము దాల్చినవాడు)** + దేహములు

(ii) **ఆలోచన చేయువాడు** + ఆలోచనలు

(iii) **భావించువాడు** + భావనలు

(iv) **అనుభవము ఆశ్రయించువాడు : ఆస్వాదించువాడు [అనుభవజ్ఞుడు** + అనుభవములు]

(v) **ఆత్మ .....** + దృశ్యము.

ఈ దేహములోని దేహి ఒకానొక సమయంలో ఈ దేహ వ్యవహారమును ఆశ్రయించినట్టి అప్రమేయ చైతన్యమూర్తి సుమా! దేహమును ఆశ్రయించినట్టి దేహి ఈ దేహమును పాంచభౌతిక జగత్తులో కదిలిస్తున్నాడు. అనగా దేహ సంచారం ప్రారంభించుచున్నాడు. ఈ దేహము యొక్క ఉత్పత్తి - వృద్ధి - బాల్యము - కౌమారము- యౌవనము - వార్ధక్యములను కాలానుగతంగా పొందుచున్నాడు. అటువంటి దృశ్యమానమగు దేహము యొక్క వృద్ధి - హానిలను చూస్తూనే ఉన్నాము కదా! పసిబాలత్వం పోయి యౌవనం వస్తోంది. అప్పుడు "అరెః! నా బాల్యం ఎటు పోయింది?" అని ఇళ్లు వాకిళ్లు గాలిస్తున్నామా? వృద్ధాప్యం వచ్చినపుడు "యౌవనం ఏమైనది?" .... అని ఎక్కడైనా వెతుకుచున్నామా? అదే రీతిగా వర్తమాన దేహం పోయి మరొక దేహం వస్తోంది. వివేకము - ధీశక్తి - పరిశీలనాత్మకమైన, సుతీక్ష్ణమైన బుద్ధిగల ధీరులు ఈ దేహముల రాకపోకలు చూస్తూ కూడా ఏ మాత్రం మోహం పొందటంలేదు. ఎందుకంటే "ఈ దేహాదుల రాక-పోకలు బాల్య - యౌవన - వార్ధక్యముల రాకపోకల వంటివే"నని వారు గమనించియుండటంచేతనే!

అయితే అనేకులు ఈ సుదీర్ఘ దేహ - దేహాంతర స్వప్నసదృశ చమత్కారం

గమనించక వర్తమానంతో పరిమితులై సుఖ-దుఃఖములచే తన్మయులై ఉంటున్నారు. ఎందుచేత? విను. చెపుతాను.

ఈ దేహమునకు "చెవులు - చర్మము - కళ్లు - నాలుక - ముక్కు" అనే ఇంద్రియాలు ఉన్నాయి కదా! వాటి ద్వారా వినటం - స్పర్శ - చూడటం - రుచి చూడటం - ఆఘ్రాణించటం (పంచతన్మాత్రలు), వాటి విషయపరంపరలు ఈ జీవుడు పొందుచున్నాడు. అట్టి ఇంద్రియ విషయపరంపరలను పంచతన్మాత్రలతో కూడి పొందుతూ వాటి పట్ల ఇష్ట - అయిష్టములను పెంపొందించుకొని కాలము గడపుచున్నాడు. అవన్నీ ఆ జీవుని ఇష్ట - అయిష్టములను అనుసరించి సుఖ-దుఃఖములు కలుగజేస్తూ పోతున్నాయి. *తన శాశ్వతమగు 'ఆత్మ'ను ఆస్వాదించటం ఏమరచి ఈ జీవుడు అనిత్యము - రాకపోకలుతో క□డూనవి అయినట్టి విషయములు పట్ల బుద్ధిని మళ్లించుకొని ఉంటున్నాడు.* అనిత్యమైన విషయాలు నిత్యమైన ఆనందమును కలుగజేయగలవా? లేనేలేదు. అందుచేత అభ్యాసవశం చేత మనస్సుకు అనుభవమగుచున్న ఇక్కడి సుఖ - దుఃఖాలకు తల్లడిల్లకూడదు. "ఇవన్నీ ఇట్లే ఉంటాయి కదా!".... అని గ్రహించి, వాటి పట్ల ఓర్పు వహించి ఉండటం (తితీక్ష) అలవరచుకోవాలి. ఎందుచేతనంటావా? ఎవరైతే ఈ దృశ్య సంఘటన - వ్యవహారము - సంపద - ఆపదల పట్ల వ్యథ చెందరో.... అట్టి పురుష ప్రయత్నశీలురగువారు మాత్రమే "అమృతము - మార్పు చేర్పులు చెందనిది" అగు స్వస్థితికి అర్హులు అగుచున్నారు. స్వస్థత చెందగలుగుచున్నారు. ఇక్కడి దృశ్యప్రపంచమంతా ఒక సుదీర్ఘమైన కథలోని అంతర్విభాగం వలె, స్వప్నంలోని కథనంలాగా, ఊహలోని ఒక భావావేశం వలె ఎదురుగా కొనసాగుతోంది. అయితే "ద్రష్ట - దృశ్యము"లలో ..... ద్రష్ట సత్‌స్వరూపుడు. వాస్తవము - శాశ్వతము - అప్రమేయము అయినట్టి 'ఉనికి' కలవాడు. ఇక దృశ్యమో .... భావనోద్వేగరూపంగా ద్రష్టకు స్వయంకృత నిర్వచనానుసారంగా ప్రాప్తిస్తూ పోతోంది. కథలోని (లేక నాటకములోని) సంఘటనలు, పాత్రల సంబంధములు, సంఘటనలు, అనుబంధములు, బాంధవ్యములు ఆ కథను (లేక నాటకమును)

ఆస్వాదించేవారికి 'నిజమే' అనే రక్తి - అనుభూతులతో కొనసాగవచ్చుగాక ! కానీ, ఆ కథ (లేక నాటకం) కల్పితమే అయి ఉన్నప్పుడు అందులోని విషయాలు - వ్యవహారాలు కూడా కేవలం కల్పితం కాక మరింకేమిటి? తత్త్వదర్శులగు మహనీయులు 'సత్తు' అగు ఆత్మను, 'అసత్తు' అగు ఆత్మాంతర్గత జగత్ వ్యవహారమును వేరు-వేరు చేసి సర్వదా దర్శిస్తున్నారు.

ఈ కనబడే అన్ని దేహాలలో ప్రసరించియున్నట్టి 'దేహి' నాశరహితుడు సుమా! అట్టి అవ్యయమగు 'దేహి'కి ఎవ్వరూ వినాశనము కలిగించజాలరు. "ఈ దేహము (+) దేహి" అను రెండింటిలో దేహము ఏదో ఒకప్పుడు అంతము కావటం అనివార్యం. ఇది అందరికీ తెలిసినదే! అందరమూ గమనిస్తున్నదే ! అయితే 'దేహి నిత్యము' అని మహనీయుల వాక్యాలు ప్రకటిస్తున్నాయి. వేద - వేదాంగ - పురాణాదులు గొంతు ఎత్తి గానం చేస్తున్నాయి. 'నిత్యము' అయినట్టి దేహిని ఎవ్వరూ నశింపజేయలేరు. కాబట్టి దేహముల దృష్టిని అధిగమించు. ఒక సైనికుడిగా నీ విధ్యుక్త ధర్మమగు ఈ యుద్ధమును నిర్వర్తించు.

ఎందుకంటావా?

ఎవ్వరైతే 'నేను చంపుతున్నాను' అని చెప్పుచున్నాడో, ఎవ్వరైతే 'నేను చచ్చుచున్నాను" అని అంటున్నాడో, ... ఆ ఇద్దరు కూడా శరీరముల దృష్ట్యా మాత్రమే అట్లా అంటున్నారని గమనించు. ఆత్మదృష్ట్యా (లేక దేహి దృష్ట్యా) ఏమాత్రం కాదు.

దేహి అగు ఆత్మ ......

- తాను చావదు. మరొక దేహిని చంపదు. (ఒక తరంగంలోని జలం మరొక తరంగంలోని జలమును నశింపజేయడమెక్కడిది?)
- దేహి జన్మించటంలేదు. మరణించటంలేదు.
- అది ఇతఃపూర్వం లేకుండా మధ్యలో వచ్చి భవిష్యత్తులో లేకుండా పోయేది కాదు.

'దేహి'యగు ఆత్మ అజము (జన్మరహితము). నిత్యము. శాశ్వతము. ఎల్లప్పుడూ ఉండనే ఉంటుంది. అనంతకాలంగా కొనసాగేది. అట్టి దేహి నశించదు. ఈ దేహాలు మాత్రమే రూపం దిద్దుకోవటం, రూపాలు కోల్పోతూ ఉండటం జరుగుతోంది.

"దేహము - దేహి" లేక "దృశ్యమానమగుచున్న ఈ శరీరము + కళ్ళకు కనిపించని దేహమును కదిలించే ఆత్మ"...... కలిపి మనం ఒకనిని జీవుడుగా చూస్తున్నాం. ఈ దేహమునకు పుట్టుక - మార్పు - చేర్పులు - వినాశనము అనే ధర్మాలు అందరికీ కనిపిస్తున్నాయి కదా! మరి 'దేహి' లేక 'ఆత్మ' యొక్క ధర్మములు ఎటువంటివి? అది గమనించాలి కదా? దేహి వినాశరహితుడని, ఎల్లప్పుడూ ఉండియే తీరుతాడని, జన్మరహితుడని, మార్పు - చేర్పులు లేనివాడని ఎవ్వరు గమనిస్తారో, .... ఇక ఆతని దృష్టిలో "చావటం - చంపటం" అనబడునవి ఎక్కడుంటాయి?

మరి, ఇప్పుడు ఈ ఎదురుగా కనిపిస్తున్న పుట్టుక - దేహవృద్ధి - బాల్యయౌవన వార్ధక్యమరణాలు - దేహ - దేహాంతరాలు ..... ఇవన్నీ ఏమిటంటావా? విను.

ఒకడు ఒక వస్త్రం ధరిస్తూ .... అది చినిగిపోయినప్పుడు దానిని విసర్జించి మరొక క్రొత్త వస్త్రం ధరిస్తున్నాడు కదా! అట్లాగే ఈ దేహి "దేవత - మనుష్య - జంతు"...... ఇత్యాది దేహాలు ధరిస్తున్నాడు. ఆ దేహవస్త్రం చినిగిపోయినపుడు దానిని త్యజించి మరొక నూతన దేహవస్త్రం ధరిస్తున్నాడు. దేహి దృష్ట్యా జన్మ - జరా - మరణములు ఇంతమాత్రమే. దేహి (లేక ఆత్మ) సమక్షంలో దేహాలు రావచ్చు. కాలక్రమేణా అవి ఛిన్నం కావచ్చు గాక! దేహి (ఆత్మ) ధర్మాలు వేరు. దేహధర్మాలు వేరు. వేసుకున్న చొక్కాకు ఆ చొక్కా ధరించిన జీవునికి ఉన్న సంబంధంవంటిదే ఈ దేహ-దేహి సంబంధం!

| దేహధర్మాలు<br>Qualities of Physical Body | దేహి (ఆత్మ) ధర్మాలు<br>Qualities of User of the Body |
|---|---|
| – దేహం బాణములచే ఛేదించబడ గలదు | – దేహి ఛేదించబడడు |
| – దేహం అగ్నికి ఆహుతి కాగలదు | – దేహి అగ్నిచే దహించబడడు |
| – దేహం నీళ్లచే తడుపబడగలదు | – దేహిని నీరు తడుపజాలదు |
| – దేహం గాలిచే ఎండింపబడగలదు | – దేహి ఎండింపబడేవాడు కాడు |
| – దేహం అనిత్యం | – దేహి నిత్యము |
| – దేహం ఒక ప్రదేశంలో మాత్రమే ఉంటుంది. | – దేహి అక్కడ – ఇక్కడ – అంతటా ఆక్రమించుకొని ఉంటాడు. |
| – దేహం ఒక చోటునుండి ఇంకొక చోటుకు వెళ్లుచున్నది | – దేహి ఎక్కడున్నాడో, – సర్వదా అక్కడే ఉంటాడు. |
| – దేహం ఈ మధ్య వచ్చింది (Just like Light Rays of a Tubelight that emit and fall on various objects). | – దేహి సనాతనం. ఇప్పుడున్నాడు. ఇతఃపూర్వం ఉన్నాడు. ఎప్పటికీ ఉంటాడు ((Just like electricity – One function of which is to make a tube light to be able to emit light). |

చూచావా అర్జునా! ఈ విధంగా ప్రతిజీవుని యొక్క ఆత్మస్వరూపం (లేక) దేహి స్వరూపం (One Who is moving the body, ideas, feelings, thoughts, senses etc) ఛేదించడేది, దహించబడేది, తడుపబడేది, ఎండించబడేది కాదు. దేహి నిత్యుడు. స్వప్నద్రష్ట స్వప్నమంతా ఆక్రమించుకొని ఉన్నట్లుగా ..... తాను దర్శించే దృశ్యమంతా ఆక్రమించుకొని ఉన్నవాడు. మార్పు – చేర్పులు లేనివాడు (యథాతథస్వరూపుడు). ఇక్కడినుండి ఎక్కడికో – ఎక్కడినుంచో ఇక్కడికి వచ్చి వెళ్లేవాడు కాదు. ఇక్కడ – అక్కడా ఆతడు 'తానే' అయి ఉన్నవాడు. దేహికి ఎటువంటి ఆకారవికారాలు లేవుకాబట్టి సర్వదా అనంతుడు.

దేహాలు వ్యక్తమై కనిపిస్తున్నాయి కదా! అయితే వీటిని వ్యక్తీకరించే దేహి మాత్రం కళ్లకు కనిపించేవాడు కాదు, అవ్యక్తుడు. ఆయన దేహాదులను, వ్యక్తిత్వములను వ్యక్తీకరిస్తూ తాను సర్వదా సర్వ సందర్భములలోను అవ్యక్త స్వభావసిద్ధుడై ఉన్నాడు. "ఆతని దేహరూపం ఇది కదా" .... అని మనం చింతించగలమేమోగాని, దేహియొక్క స్వరూపం చింతకు (ఆలోచనకు) అందనిది. ఆలోచనలన్నీ కళ్లకు కనబడే దానికే పరిమితం కదా! కదిలే దేహం కనబడుతుందిగాని, కదిలించే వాడు అయినట్టి దేహి (లేక) ఆత్మను ఏమని ఊహించగలం? ఉదాహరణకు "శక్తి" యొక్క రూపం ఏమని ఊహించి చెప్పగలం?

కాబట్టి ఓ పార్థా! కదిలించే 'దేహి' నిజ – వాస్తవ – తాత్విక ధర్మములు ఎటువంటివో పరిశీలించు. ప్రతిజీవుడు ఆత్మ స్వరూపుడేగాని దేహస్వరూపుడు కాదని గ్రహించి, ఇక వారి – వీరి కొరకై దుఃఖించటం అసంగతమని, అనవసరమని గమనించు.

ఒకవేళ "దేహి దేహంతో పుడతాడు. దేహంపోతే మరణిస్తాడు. మరల మరొక దేహంతో పుడతాడు" .... అని అంటావా? అప్పుడు కూడా నీవు ఏ జీవుని గురించీ దుఃఖించవలసిన పనేమీ లేదు. ఎందుచేతనంటావా?

"జాతస్యహిధ్రువో మృత్యుః, ధృవం జన్మ మృతస్య చ"

పుట్టిన ప్రతివాడూ ఎప్పటికో అప్పటికి ఆ దేహం త్యజించవలసినదే ! మరణించిన ప్రతివాడూ మరల దేహస్వరూపంగా జనించవలసిందే!

ఉదయాస్తమయములు లాగా దేహముయొక్క రాక – పోకలు దేహికి అనివార్యం అయినప్పుడు దుఃఖించటం ఎందుకు? "రాత్రివేళ పగటి కోసం – పగటి వేళ రాత్రి కోసం" ఎవరైనా దుఃఖించటం ఎంత అర్థరహితమో ఈ అప్రమేయుడగు దేహియొక్క ఒకానొక స్వల్ప – అంశవిభాగంలో జరుగుచున్న దేహము యొక్క రాక – పోకలకు దుఃఖించటం అంతటి అర్థరహితం, అసందర్భము అయిన విషయం!

- దేహి దేహం లేనప్పుడు అవ్యక్త స్వరూపుడై ఉన్నాడు.
- దేహం వ్యక్తీకరిస్తూ దేహముతోకూడి కనిపిస్తున్నాడు.
- మరల దేహం త్యజించి అవ్యక్తరూపం సంతరించుకుంటున్నాడు.

ఇటువంటి వక్తీకరణ – అవ్యక్తీకరణలకు నాంది, ఆధారము, కారణము అయినట్టి దేహి గురించి నీవు వేదన చెందవలసినదేమున్నది?

"ఈ దేహి అవ్యక్త స్థితినుండి దేహముతో ప్రకటనమవటం" .... అనేది కొందరు, "ఆహాఁ! ఏమిచమత్కారం ! అవ్యక్తమగు ఆత్మ దేహంతో ప్రదర్శితమగుచున్నది కదా". అని ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఇంకొకరు "ఆత్మ ఎట్టిది" .... అని ఆశ్చర్యంగా మాట్లాడుచున్నారు. ఇంకొకరు "ఆత్మ ఎంత ఆశ్చర్యకరమైనది!" అని వింటున్నారు. మరికొందరేమో ఎంతో ఎంతో విన్నప్పటికీ ఆత్మ ఎట్టిదో గ్రహించలేకపోతున్నారు.

కొందరు "ఆయన ఎంతగొప్ప వాడండీ" అని ఒకని గురించి ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఇంకొందరు "ఆయన చాలా గొప్పవాడు. ఈఈ లక్షణాలచేత!"... అని చెప్పుచున్నారు. మరికొందరు ఆశ్చర్యంగా వింటున్నారు. ఇంతకీ ఆ వర్ణింపబడు దేహ విశేషాలే చెప్పుకుంటున్నారు గాని 'దేహితత్త్వం' ఏమిటో,..... దేహం ఏర్పడక ముందు ఎట్టిదో,.... దేహానంతరం దేహి స్వరూపం ఏమి అగుచున్నదో, .... అస్సలు దేహి యొక్క తాత్త్విక స్వరూప స్వభావాలు ఎటువంటివో ... చాలామంది ఏ మాత్రం పరిశీలించటమే లేదు కదా!

అయితే...., ఎవ్వరి గురించి మరొకరు ఏమని ఆశ్చర్యవచనాలతో చెప్పుకున్నా....ఉన్న సత్యం ఒక్కటే.

- సర్వదేహములలోని దేహి 'నిత్యుడు'.
- దేహికి చావు – పుట్టుకలు, రాక – పోకలు, గుణ – స్థాన విభాగ చమత్కారాలు లేవు. దేహి వాటినన్నిటికీ అవల ఉన్నవాడు.
- సర్వదేహములలోని దేహి దేహములకంటే సర్వదా ప్రత్యేకమైనవాడు.

కనుక ఈ దేహధారులలో ఏ ఒక్కరి గురించి నీవు దుఃఖించవలసిన పని ఏమాత్రం లేదు.

## స్వధర్మము

కాబట్టి అర్జునా! దేహి – దేహముల దృష్ట్యా ఈ తదితర యుద్ధవీరులను చూచినప్పుడు ఇక్కడి వారిగురించి నీవు ఏమాత్రం దుఃఖించవలసిన పని లేదని అనుకున్నాంకదా! ఇప్పుడు నీవు నిర్వర్తించవలసి యున్న 'యుద్ధము' అనే కర్మను 'స్వధర్మం' దృష్ట్యా చూద్దాం.

నీకు నియమించబడి నీస్వధర్మమును అనుసరించి "నేను ఈ యుద్ధం చేయవలసి వచ్చిందే!" ..... అని వేదన చెందవలసిన పనే లేదు. ఎందుకంటావా? నీవు ఎంతో శ్రమ – తపస్సులను నిర్వర్తించి అస్త్ర – శస్త్ర – యుద్ధ నైపుణ్యములను సంపాదించుకొన్నది ఎందుకు? నీకు నేర్పినవారు ఎందుకు నేర్పారు? నేర్పించినవారు ఎందుకు నేర్పించారు? 'ధర్మ రక్షణ' అనే సదుద్దేశ్యంతోనే అస్త్ర – శస్త్ర విద్యా పారంగతుడవు అయ్యావు కదా! అట్టి నీవంటి సైనికునికి "ధర్మ రక్షణకొరకై యుద్ధం చేయడం" అనేది ఒక మహత్తరమైన అవకాశం. 'ధర్మము'ను ప్రేమించేవాడు ధర్మముకొరకై యుద్ధం చేయటంకంటే శ్రేయోదాయకమైనది మరింకేమి ఉంటుంది? క్షత్రియునికి ధర్మము కొరకై యుద్ధం చేయటం ఒక సదవకాశమే కదా!

ఈ యుద్ధం నీవు కోరి చేయటం లేదే! ఆయా సందర్భముల పరిణామంచేత ఇప్పుడు యుద్ధం చేయవలసిన సమయం వచ్చింది. ధర్మము కొరకై యుద్ధం చేసేవారికై స్వర్గద్వారాలు సర్వదా తెరిచి ఉంచబడతాయి. అంటే నీ శౌర్యము ప్రదర్శించవలసిన సమయ – సందర్భాలు ఇప్పుడు నీకు సమాయత్తమయ్యాయి. యాదృచ్ఛికంగా లభించిన ఈ "ధర్మ రక్షణ కొరకు యుద్ధం" అనే సందర్భమును సద్వినియోగ పరచుకొని ఇట్టి పుణ్యకార్య సుఖఫల ప్రాప్తికి వీరుడు ఆనందిస్తాడేగాని దుఃఖించడే!

ఒకవేళ ఒక సైనికుడిగా యాదృచ్ఛికంగా నీకు ప్రాప్తించిన "ధర్మముకొరకై

యుద్ధం చేయటం" అనే సందర్భమును తిరస్కరించి యుద్ధం చేయవనుకో! అప్పుడు నీకు సంబంధించిన పరిణామాలు ఏమేమిటి? అది కూడా విను, చెపుతాను.

నీవు "స్వధర్మ మార్గము – కీర్తి" ఈ రెండూ పోగొట్టుకొన్నవాడివౌతావు. ఏ జీవుడైనా, తన స్వధర్మమును ఏమఱచినందుకు ఫలితంగా పాపము చేసినవాడై దుఃఖమార్గంలో ప్రయాణించువాడే అవుతాడు. ఇక ఈ యుద్ధంలో మరణాదుల దుఃఖమంటావా? "ధర్మమును ఏమరచి ప్రవర్తించాడు".... అనే అపకీర్తితో బ్రతికేకంటే మరణమే మేలయి ఉండేదని నీకు అనిపించగలదు సుమా! "అర్జునుడు అహింసావాదంతో యుద్ధం నుండి తొలగాడు" ..... అని ఇప్పటి సందర్భంలో నిన్ను గురించి జనులు అనుకోరు! "కర్ణునికో, మరొకరికో భయపడి యుద్ధ భూమి నుండి పారిపోయాడు".... అని నీ గురించి అనేకులు అనుకుంటారు. ఎవ్వరైతే నిన్ను 'మహాయోధుడు' అని గానం చేస్తున్నారో, ...... వారంతా, "అర్జునుని గురించి ఏదేదో అనుకున్నాం. నిజానికి ఆతడు ఒక పిరికివాడు"..... అని మహారథులగు కర్ణ – భీష్మ – ద్రోణ – దుర్యోధనాదులు అనుకుంటారు. ఇంకా ఇంకా ఏవేవో వినరాని మాటలు వినిపిస్తాయి. "సంపదల లోభంతో, కక్కుర్తిగా దుర్యోధనునితో లోపాయికారి అయి ధర్మానికి, ధర్మరాజుకు ద్రోహం చేశాడు..."..... అని చెప్పుకుంటారు. "అసలు అర్జునుడు ఒక అసమర్థుడు".... అని పలుకనారంభిస్తారు. ఇంతకన్నా నీకు కలుగగల దుఃఖం ఇంకేముంటుంది?

"వారు బలవంతులా – మనం బలవంతులమా..... తెలియదు కదా?" అని నీవు అన్నావుకదా! .....నిజమే! జయాపజయాలు దైవాధీనాలే! అయితే..... ఈ 'యుద్ధము' అనే ధర్మాన్ని ఎందుకు చేస్తున్నావు? అది సునిశ్చయం చేసుకోవాలిసుమా! శంకరభగవానులు ప్రసాదించిన పాసుపతాస్త్రం, తదితర అస్త్ర – శస్త్ర దేవతల వరప్రసాదాలు లభించినదెందుకు? ధర్మ రక్షణ కొరకే కదా! ప్రకృతిమాత ప్రసాదిత శౌర్య – శస్త్రాస్త్ర సంపద ఇప్పుడు ధర్మరక్షణ కొరకై సద్వినియోగ పరచాలి కదా! ఈ యుద్ధంలో మరణించావా, .....స్వర్గ

లోకాలు ప్రాప్తిస్తాయి. అథవా, జయించావా...... రాజ్యభోగం లభించనున్నది. ఉభయత్రా శ్రేయోదాయకమే కదా! అందుచేత ఓ అర్జునా! ఉత్తిష్ఠ! ఉత్తిష్ఠ! యుద్ధం చేయటానికే కృతనిశ్చయుడవగుము.

అయితే.....

కర్మ ప్రతి జీవుడు అనుక్షణం నిర్వర్తిస్తూనే ఉన్నాడు. అందులో విశేషం లేదు. "కర్మ నిర్వర్తిస్తూ, కర్మలకు సంబంధించిన దోషం అంటకుండా ఉండటం ఎట్లా?"..... అనునది గమనించాలి. ఒకానొక సమున్నత స్థానంలో తన యొక్క 'ఆశయము'ను ప్రతిష్ఠించి ఈ జీవుడు కర్మ నిర్వర్తించటం తెలుసుకొని ఉండాలి సుమా!

అందుచేత .... "గెలుస్తామా? ఓడుతామా? సుఖమా? దుఃఖమా? లాభమా? నష్టమా?".... అనునది ప్రక్కకు పెట్టి "ఇది నా స్వధర్మం కదా! కనుక ఈ ధర్మము నేను నిర్వర్తించెదనుగాక!"..... అను సమున్నతమైన అవగాహనతో నిర్వర్తించు. అప్పుడు ఆ కర్మ యొక్క దోషం నిన్ను అంటదు.

☆☆☆

**బుద్ధియోగం :**

ఇప్పటి వరకు "వివేకముతో నిత్యమైనది – అనిత్యమైనది – పరిశీలిస్తూ ఉండటం" – అనే సాంఖ్యమార్గంలో యుక్తాయుక్తాలు ఏమిటో చెప్పుకున్నాంకదా! ఇప్పుడు "బుద్ధియోగ మార్గం" దృష్ట్యా విశదీకరిస్తాను.... విను. ఏ "యుక్తి" లేక "యోగం" చేత కర్మ చేస్తూ కూడా ఆ కర్మ 'బంధం' అవదో, పైగా ......, కర్మ నిర్వర్తించటం చేత కర్మయొక్క బంధం ఈ జీవునికి మొదలంటా కూడా తొలగగలదో – అట్టి బుద్ధిజ్ఞానయోగం గురించి వివరిస్తున్నాను. విను.

## జ్ఞానంతో కూడిన కర్మ నిర్వహణ

'కర్మ'కు ఫలం ఉంటుంది. ప్రయోజనం ఉద్దేశ్యించే ఎవరైనా కర్మ చేస్తారు. అనేకులు "ఈ కర్మకు ఈ దృశ్యమునుండి నాకు ఈ ప్రయోజనం

సిద్ధించుగాక!" .....అను భావనతో నిర్వర్తిస్తున్నారు కదా!

## సకామకర్మ :

- ఈ కర్మ వలన మనకేమన్నా లాభమేనా ?
- ఈ దానం చేస్తున్నాను. తీసుకునే ఆయన నేనిస్తున్నానని గమనించాలి కదా! నలుగురు చూస్తూ మెచ్చాలికదా!
- ఈ పని బాగా చేస్తున్నాను. నేను పని బాగా చేయగలనని అందరూ అనుకోవాలి కదా! పేరు – ప్రతిష్ఠలు కొనసాగాలికదా!
- ఇంత కష్టపడి చేస్తున్నాను. ఇది గుర్తించి నాకు నా స్థితిగతులలో పదవులలో ఉన్నతి కావాలి కదా! ఆయా విషయాలలో కలసిరావాలి కదా!
- వీరి కొరకై ఇంత చేస్తున్నాను. వీరు సుఖపడాలికదా! పైకిరావాలి కదా!"

ఇటువంటి భావనలతో కర్మ నిర్వర్తిస్తూ ఉంటే ఇది **"సకామ కర్మ"** అవుతుంది.

## నిష్కామ కర్మ

"నాకు నియమించిన కర్మలు నా బుద్ధిని నిర్మలము – సునిశితము – విస్తారము – నిశ్చలము – బలయుక్తము చేయటానికి నాకు ప్రసాదించబడిన అవకాశం"... అను భావనతో నిర్వర్తించే కర్మను 'నిష్కామకర్మ' అని పిలుస్తున్నారు.

"జీవుడు ఎందుకు పుడతాడు?" ..... అని ప్రశ్నిస్తే "బుద్ధిని నిర్మలము – నిశ్చలము – సునిశితము – విస్తారము చేసుకోవటానికే" అనునది సమాధానమై యున్నది. "వర్తమానపు స్వధర్మములను బుద్ధి నిర్మలం – సునిశితం చేసుకోవటానికి".. అని ఎవ్వరు ఉద్దేశిస్తారో... వారు "నిష్కామ కర్మిష్ఠులు" అని చెప్పబడుచున్నారు. సామాన్యంగా జీవుని పట్ల కర్మలు అనేవి అనేక

బంధాలుగా పరిణమిస్తున్నాయి. ఎందుచేత? ఒక కర్మ నిర్వర్తించినప్పుడు "సంస్కారాలు – కర్మ ఫలితాలు" అనే రెండు ప్రయోజనాలు అనివార్యం. కర్మలవల్ల ఫలితాలు, ఆ ఫలితాల వలన మరికొన్ని కర్మలు... ఈ విధంగా ఇదంతా అంతు లేకుండా ప్రవర్తించటంచేత జీవునికి కర్మలనుండి – కర్మ బంధములనుండి విశ్రాంతి లభించటం లేదు. **"కర్మను నియమిత ధర్మానుసారం సమర్పణబుద్ధితో చేసి, తద్వారా, శుభప్రదమగు బుద్ధిని సంపాదించుకుంటాను"**.... అను ఉద్దేశ్యముతో కర్మలను నిర్వర్తించే నిష్కామ కర్మ యోగులు తాము నిర్వర్తించే కర్మల ప్రయోజనంగా సర్వకర్మబంధముల నుండి విడివడగలుగుచున్నారు.

నిష్కామ కర్మయోగమార్గంలో కొంచం కొంచం ముందుకు సాగుచున్నా సరే, ... అది ఆ కర్తకు అమోఘమైన ప్రయోజనం ప్రసాదించగలదు. లౌకిక ప్రయోజనముల కొరకై కర్మలు చేసేవారికి రెండు దోషాలు తారసపడుతూ ఉంటాయి.

**1. అభిక్రమనాశదోషం** (Task Incomplete) :

ఒకపనిని కొంతవరకు నిర్వర్తించి, సగంలో ఆపి పూర్తిగా, సమగ్రంగా నిర్వర్తించనందుకు ఏర్పడే దోషస్థితి. మధ్యలో ఆపినందుచేత వచ్చే అపక్రమస్థితి. (ఉదాహరణకు ఒక ఇల్లాలు "ఇల్లంతా శుభ్రం చేద్దాం. అనవసరమైన కాగితాలు మొదలైనవి తొలగిద్దాం"... అని ఆ కార్యక్రమానికి ఉపక్రమించిందని అనుకుందాం. ఎక్కడో మూలలోను, అటకలపైన, చూర్లలోను గల అనవసరమైన కాగితాలను, చెత్తను ఊడ్చి నేలపై వేయనారంభించి మధ్యలో బద్ధకం చేతనో, కోపంచేతనో, మరేదోకారణంచేతనో ఆ పని ఆపిందనుకుందాం. అప్పుడు ఇల్లంతా చెత్తతో నిండి ఇతఃపూర్వంకంటే మరింతగా ఘోరంగా తయారవుతుంది కదా!)

**2. ప్రత్యవాయుదోషం** (Negative Side - effects) **:**

"నేనే కదా, చేయగలిగాను! పొందగలిగాను!" అనే అహంకారం పొందటం. "నేను ఇతరులకంటే కొంత ప్రత్యేకత కలవాడను" ....అనిపించటం.

అయితే......,

అభిక్రమదోషం, ప్రత్యవాయు దోషం సకామ కర్మలకు మాత్రమే ఉంటాయి. నిష్కామకర్మలకు ఆ దోషఫలితాలు ఉండవు. నిష్కామ కర్మిష్ఠులను ఆ దోషాలు అంటజాలవు.

'నిష్కామ కర్మ' కొంచం నిర్వర్తించినప్పటికీ.... అది భయంకరమైన "జన్మ – మృత్యు – జరా" ప్రవాహములతో కూడిన సుదీర్ఘ సంసార బంధ – భయములనుండి ఆ కర్తను రక్షించగలవు. "పిల్లలను పెంచటం – ఉద్యోగం చేయటం – ఇంటి పనులు చూడటం మొదలైనవన్నీ నేను నా యొక్క బుద్ధిని నిర్మలం చేసుకోవటానికి నిర్వర్తిస్తున్నాను.".... అను భావన పెంపొందించుకొని – సంతరించుకొని ఉండటం.... "నిష్కామ కర్మ" యొక్క బాహ్యరూపం. "సర్వకర్మలు దైవోపాసనయే" అని అనుకోవటం నిష్కామకర్మయొక్క అంతరంగ రూపం. "వారికోసం – వీరికోసం – వీరినో వారినో ఉద్ధరించటంకోసం – మెప్పుకోసం – కర్మకొద్దీ – ఇక తప్పక".... మొదలైనదంతా 'సకామం'.

బుద్ధిని నిశ్చయాత్మకంగా "కర్మోపాసనాభావన"తో తీర్చిదిద్దుకోవాలి. అప్పుడు బుద్ధి ఏకాగ్రమై పరిపరివిధాల ప్రయాణించకుండా ఉంటుంది. ఎవరి బుద్ధి నిశ్చయాత్మకంగా ఉండదో... అట్టిబుద్ధి పరిపరి మార్గాలలో పయనిస్తూనే ఉంటుంది. "ఏదో పొందాలి! ఏదో చేయాలి! ఏదో కావాలి! ఏదో తెలుసుకోవాలి! ఏదో గుర్తించబడాలి! ఏదో పోవాలి! ఏదో రావాలి!".... అని ఆబుద్ధి ఎక్కడెక్కడో ఏదేదో ఒకటి తరువాత మరొక విషయాన్ని అవిశ్రాంతంగా ఆశ్రయిస్తూనే పోతుంది. ఫలాసక్తిగల బుద్ధి పొందే ఆటు – పోట్లకు అంతూ – పొంతూ ఉండదు.

## దృశ్యాంతర్గత ప్రయోజనాలు :

వేదవాదరతులైన కొందరు "కర్మలు చేయండి. తద్వారా మీకు అనేక లౌకిక – ప్రయోజనాలు, స్వర్గము మొదలైన పారలౌకిక ప్రయోజనాలు పొందుతారు. సత్ఫలితాలు వస్తాయి. మీరు గొప్పవారౌతారు. అందరిని

మించిపోతారు."... ఇటువంటి ఇహ-పరలోక అర్ధసాధన వాక్యాలు ప్రచారం చేస్తున్నారు. అయితే కర్మలయొక్క పూర్ణార్థము - అంతిమోద్దేశ్యము దర్శించక, కేవలం దృశ్యములోని ప్రయోజనాలు వల్లిస్తూ "ఈ దృశ్యము సత్యమే! శాశ్వతమే" .... అనే భ్రమను వారు మరింత పెంపొందించి, పరిపోషిస్తున్నారు. "కర్మలఫలం స్వర్గాది సుఖమయలోకాలు" అంటూ గానం చేస్తున్నారు. వారు "ఆత్మయొక్క ఆనందాస్వాదనానుభవం" ఉద్దేశించక, ఆయావిధాలుగా లోక సంబంధమైన ప్రయోజనాలను ప్రచారం చేస్తున్నారు. **కర్మాు ఉత్తమప్రయోజనం బుద్ధి యొక్క కుశుత్వం - సమగ్రత్వం - ఉన్నతమైన అవగాహన పెంపొందటమే గాని.... అ్పుమగు స్వప్నసదృశ - ఇంద్రియానంద - దృశ్యపరిమిత ప్రయోజనాు కాదుసుమా।**

స్వర్గలోకసుఖ సమాచారములకు - భోగైశ్వర్యగతులకు సంబంధించిన అనేక క్రియావిశేషాలు విని విని ఈ జీవుడు ఆశ - నిరాశల వలయంలో చిక్కుకుని, ఇక కర్మబంధములను అతిక్రమించ లేకపోతున్నాడు. అనేక భోగ - ఐశ్వర్యములకు సంబంధించిన ఆశయముల మధ్య చిక్కిన ఆ మనుజుడు నిశ్చలబుద్ధిని కోల్పోతున్నాడు. ఆతని బుద్ధి ఏకాగ్రతతో కూడిన సమాధిస్థితికి చేరలేకపోతోంది. పైగాబుద్ధి భోగైశ్వర్యముల వైపు ఆకర్షించబడి మరింత చంచలత్వం సంతరించుకోవటం జరుగుతోంది. తత్ఫలితంగా స్వస్వరూప ఆనందమును ఆస్వాదించగల నిశ్చలబుద్ధి రూపు దిద్దుకోవటంలేదు.

వేదములు అనేక విధి - విధానములను కార్యక్రమముల రూపంగా ప్రతిపాదిస్తున్నాయి. త్రిగుణాత్మకమగు ఆచార - వ్యవహార - విధి -విధానములు మనముందు ఉంచుతున్నాయి. అయితే అర్జునా! *త్రిగుణమూుతో క□డున వేదప్రవచిత సాధనామార్గం ఉపయోగించుకొని నీవు త్రిగుణాతీతుడవుకావాలి. గుణమూుకు ఆవు - గుణమూుకు మునుముందే సర్వదా వేంచేసియున్న నిర్ద్వైతుక - ఆనందమయ మగు నీ ఆత్మతత్వం గమనించి - గ్రహించి ఆస్వాదించాలిసుమా!* బుద్ధి ఆత్మానుభవమునందు నిలకడ పొందాలి.

## నిర్ద్వంద్వ స్థితి :

- ద్వంద్వవిషయములను ఉపయోగించి ...... ద్వంద్వాతీతుడవు కావాలి.
- నిత్యసత్వస్థితిని సంపాదించుకోవాలి. "నేను ఆత్మయే స్వరూపముగా సర్వదా కలిగియున్నాను"... అనే నిత్య సత్వస్థితిని (A sense that Iam always present/existent) సంతరించుకోవాలి. సుస్థిరీకరించు కోవాలి. "ఇది పొందాలి – అది తొలగాలి. అప్పుడు గాని ఆత్మ సాక్షాత్కారం కాదు".... ఇటువంటి అల్పవాక్యాలను అధిమించాలి. యోగ – క్షేమములచే స్పృశించబడని ఆత్మస్వరూపంగా ప్రకాశించాలి.

☆☆☆

## వివిధ సాధనములలోని ఏకత్వం :

ఒకాయన ఏదో కొత్త ఊరు వెళ్ళాడు. అక్కడ 'స్నానం చేయాలి' అని అనుకున్నాడు. అక్కడి వారిని "నీళ్ళు ఎక్కడ?" అని వాకబు చేశాడు. అక్కడివారంతా ఒక్కొక్కడు ఒకొక్కరీతిగా వివరించటం ప్రారంభించారు.

- స్నానం చేస్తారా? మంచిది. మీకు జలం కావాలి కదా!

**ఒకాయన** : ఇక్కడ దగ్గిరలో ఒక నుయ్యి ఉంది. ఇక్కడే స్నానం చేయండి. ఇంకెక్కడన్నా స్నానం చేశారో ........ ఇక అంతే!

**2వ వ్యక్తి** : ఊరిచివరి కాలువ ఉన్నది. అక్కడ స్నానం చేయండి. కాలువలోనే స్నానం చేయండి. ఇంకెక్కడా చేయకండి. ఎవరి మాటలూ నమ్మకండి.

**3వ వ్యక్తి** : కొంత దూరంలో పెద్ద తటాకం ఉన్నది. అక్కడైతే స్నానం మంచిది. ఇంకెక్కడా స్నానం చేయకూడదు సుమా!

**4వ వ్యక్తి** : మరికొంత దూరంలో నదీజలం ఉన్నది. అక్కడే స్నానం చేయండి. ఇంకెక్కడా చేయకండి. చెయ్యనేవద్దు. అంతే!

**5వ వ్యక్తి :** కొద్ది మైళ్ళ దూరంలో సముద్రం ఉన్నది. అక్కడే స్నానం చేయవచ్చు. సముద్రస్నానవే మంచిది. వెళ్ళండి. ఇంకెవరి మాటలూ పట్టించుకోకండి.

అప్పుడు ఆ బాటసారి అనుకున్నాడు గదా, "స్వామీ! స్నానం చేయటం ముఖ్యం. అంతేగాని నూతినీళ్లైతేనేం? కాలువనీళ్లైతేనేం? తటాకజలం అయితేనేం? నదీజలం అయితేనేం? సాగరజలం అయితేనేం? కాలము – అవకాశము – సందర్భములను బట్టి ఎక్కడో – అక్కడ స్నానం చేస్తూ ఉంటాను. జలం అంతటా ఒక్కటేకదా!"

అట్లా ఆ బాటసారి అనుకుంటున్నట్లే.....

'బ్రహ్మజ్ఞానం' లేక 'ఆత్మజ్ఞానం' అనే ఆశయం కలవాడు సర్వవేదములలోని అసంఖ్యాక విధి – విధానములలో వేరు – వేరైన ఉపాసనామార్గాలలోనూ "బుద్ధి స్థిరపరచుకోవటం – బుద్ధి చాంచల్యమును వదిలించుకోవటం".... అనే ఒకే ఒక ఆశయాన్ని హృదయస్థం చేసుకొని ఉంటాడు. వివిధములైన వేద ప్రవచిత ఉపాసనా విధానాలలో ఏకత్వమును సందర్శిస్తూ ఉంటాడు. కర్మ – జ్ఞాన – భక్తి – యోగ మార్గాలలోగల "బుద్ధి నిశ్చయాత్మకత" అనే ఏకోపాసన – ఏకైక సాధనను ఆశ్రయించి ఉంటాడు. ఆతని దృష్టికి నిష్కామకర్మ – ధ్యాన నిష్ఠ – పూజ మొదలైనవన్నీ వేరు వేరు కాదు.

కాబట్టి ఓ అర్జునా! నీవు కర్మయోగివై నిష్కామబుద్ధితో మనోనిర్మలత కొరకై కర్మలు ఆచరించు.

*శ్లో॥ కర్మణ్యేవ అధికారస్తే మాఫలేషు కదాచన ॥*

'కర్మ'కు ప్రయోజనం అనివార్యం. అయితే, "ఈ కర్మలోక శ్రేయస్సుకొరకై వినియోగమగుగాక! నా బుద్ధి వికశించునుగాక! నిర్మలమగుగాక!" అనునది మహదాశయం. 'నాకేమి వచ్చింది?' అనునది అల్పాశయం

*సందర్భానుచితాశయం* (Incidental objective) *:*

"ఒక విద్యార్థి "నేను బాగాచదవాలి" అని శ్రమించటం.

– సందర్భానితమైన ఆశయం. అది అత్యవసరం. అయితే అది మహదాశయమునకు సోపానం కావాలి!

*మహదాశయం :* (Main Objective : Life Objective)

"ఇప్పుడు బాగా చదవి, తగిన ఉద్యోగంద్వారా సంస్థకు సేవచేస్తూ.... నా కుటుంబానిగి – సంఘానికి ఉపయోగపడతాను" ....... అనునది మహదాశయం.

"ఏ కర్మ చేస్తున్నాము?" అనేది ముఖ్యం కాదు. "ఏ ఉద్దేశ్య – అవగాహనలతో – ఏ మహదాశయంతో ఆ కర్మ చేస్తున్నాము?" ..... అనేది ముఖ్యం సుమా!

*శ్రద్ధ – కర్మనిర్వహణ – కర్మఫలసమర్పణ – కర్మఫలాతీతత్వం :*

"ఎంత శ్రద్ధగా నాకు విధించబడిన కర్మలు నేను నిర్వర్తిస్తున్నాను?".... అనేదే నీ నిర్ణయాత్మక పరిధి. "నా పని నేను బాగా చేయాలి" అనుకునేంత వరకే నీకు కర్మతో సంబంధం. "ఈ కర్మలవలన నాకో – మరొకరికో లాభం ఏమిటి?" అనే శంక – భావనలు నీకు ఉండకుండుగాక! "కర్మఫలం' నేను అనుకున్నట్లే ఉండాలి. మరొక రకంగాకాదు" అని తలుస్తూ కర్మఫలహేతువుగా నీ బుద్ధి పరిణమించకూడదు. బుద్ధి దిగజారకూడదు.

అంతేకాదు

కర్మఫలములందు 'ఆసక్తి' (Attachment) నీకు ఉండకుండుగాక! "ఈ కర్మల ద్వారా అది పొందాలి. అద్దాని తరువాత ఇదంతా చేయాలి"...... ఇటువంటి ఆసక్త బుద్ధిని క్రమ క్రమంగా త్యజించుచున్నవానికి కర్మబంధం ఉండదు. ఉండకపోగా... ఆ కర్మలు ఉపాసనారూపం సంతరించుకొని ఆ కర్తను

సముద్ధరించగలవు. అట్టి నిష్కామకర్మలు బుద్ధి చాంచల్యాన్ని తొలగించి బుద్ధినిశ్చలతకు కారణమౌతున్నాయి.

ఓ అర్జునా! 'యోగము'నందు నిన్ను నీవు ప్రతిక్షేపించుకొని, అప్పుడు ఇక నియమిత కర్మలకు ఉపక్రమించు. యోగము. అనగా?

*"సిద్ధ్యసిద్ధ్యో సమోభూత్వా సమత్వమ్" .... 'యోగమ్' ఉచ్యతే"*

కర్మయోగికి "నేను చేయవలసిన కర్మ శ్రద్ధగా, శాస్త్ర – లోక విధి పూర్వకంగా నిర్వర్తిస్తున్నానా? లేదా?" అనునది మాత్రమే ముఖ్యం.

"నేను అనుకున్నది నాకుగాని, మరొకరికిగాని సిద్ధించిందా? అందరూ మెచ్చుకుంటున్నారా? 'సంతోషం' ప్రకటిస్తున్నారా? నాకు అనుకున్నది లభిస్తోందా? నేను చెప్పినట్లే చేయరేం? వీళ్లను బాగుపరచలేమా? నాపేరు – ప్రతిష్ఠలు శోభిస్తున్నాయా?" .... ఈప్రశ్నల సమాధానాలు కర్మయోగి ఏ మాత్రం వెతకడు.

"కర్మయొక్క ఫలం ఇప్పుడు సిద్ధించవచ్చు. నేను అనుకున్నట్లో, మరొకరు కోరుకున్నట్లో సిద్ధించవచ్చు. సిద్ధించకపోవచ్చు. కర్మను ఉపాసనగా నిర్వర్తించటమే ముఖ్యం" అను భావనతో సిద్ధ – అసిద్ధములను ఏకభావనతో దర్శిస్తూ కర్మను నిర్వర్తించటం కర్మయోగము. ఇదియే కర్మ సిద్ధాంతం. "నేను ఉత్తమమైన ఆశయంతో శ్రద్ధగా నా ధర్మము నిర్వర్తించటమే నా జీవితాశయం"... అని కర్మయోగి గ్రహించి ఉంటాడు. (అందుకే ఇది 'కర్మభూమి' అంటారు)

ఇక, కర్మచేస్తూ "ఇది అట్లా అవుతుందంటావా? అవదంటావా?" అని తలుస్తూ కర్మఫలం పట్ల ధ్యాసంతా కలిగి ఉండటం కర్మతాదాత్మ్యం. "కర్మ యోగం (లేక) నిష్కామ కర్మ" తో పోలిస్తే.... కర్మతాదాత్మ్యం చాలా స్వల్ప స్థితి అనిపించుకుంటుంది. "కర్మ ఫలాలు ఆశ్రయించి ఉండటం" అనేది "కొండను సొంతం చేసుకోవటానికి వెళుతూ గులకరాయి కనబడితే ప్రయాణం ఆపి, ఆ గులకరాయి చుట్టూ ప్రదక్షిణాలు చేయటం".... వంటిది. రత్నాన్ని వదలి రాళ్ళకోసం పరుగులు తీయటం వంటిది. కర్మఫలాలకోసం ప్రార్థనలు చేసే

బదులు "నా బుద్ధి సమున్నతమగుగాక" అని ఉత్తమబుద్ధి (నిశ్చయాత్మకబుద్ధి) కొరకై ప్రార్థన చేయి. ఎందుకంటే **కర్మ ఫలాల కొరకై ఆశించటం కర్మమార్గము యొక్క అల్పఫలాలను ఆశ్రయించటం వంటిది.** తామరపుష్పాలను తటాకంలో వదలి తామరతూళ్ళగుట్టలను ఇంటికి తెచ్చుకోవటం వంటిదని గమనించు.

*శ్లో॥ బుద్ధౌశరణమన్విచ్ఛ కృపణా ఫలహేతవః ॥*

కర్మ ఫలాలను ఆశ్రయించేబదులు ఉత్తమబుద్ధినే ఆశ్రయించు. శరణువేడు. కర్మఫల హేతువులను – లౌకిక స్థితి – గతులను ఆశ్రయించే వారు అల్పబుద్ధిని ఉపాసించుచున్నవారుగా అగుచున్నారు.

అందుచేత ఓ అర్జునా! బలవత్తరమైన – ప్రశాంతమైన – సుతీక్షణమైన – విస్తారమైన బుద్ధిని సంపాదించుకొని బుద్ధియుక్తుడవు కమ్ము. బుద్ధి యుక్తితో సుకృతఫలాలను – దుష్కృత ఫలాలను రెండిటిని అధిగమించివేయి. అనగా ఫలితాలను దృశ్య ప్రపంచానికి వదిలివేయి. సమత్వంతో కర్మఫలాలను కూడిన బుద్ధిని పెంపొందించుకో. కర్మలను నేర్పుగా.... కర్మదోషములకు అంటక, కర్మఫలములను అధిగమించి నిర్వర్తించటమే 'కర్మయోగము'. కర్మ బాగుగా నిర్వర్తించు. కాని కర్మలను "కర్మల అతీతత్వానికి ప్రయాణించే నౌక"గా ఉపయోగించుకో. కర్మలు ఏ ఉద్దేశ్యంతో ఎంతవరకు ఎందుకు ఎట్లా చేయాలో తెలుసుకొని నిర్వర్తించటమును శాస్త్రములు కర్మయోగంగాను, బుద్ధియోగంగాను గానం చేస్తున్నాయి. బుద్ధి యొక్క సమత్వమును సంపాదించుకొన్న బుద్ధిమంతులు – శాస్త్రవిద్వాంసులు కర్మఫలములకు అతీతత్వం సముపార్జించుకొని ఉంటున్నారు. తద్వారా జన్మ – కర్మ – బంధములను త్రెంచి వేసుకొంటున్నారు. బంధరహితమగు అనామయ స్థానమును సంపాదించుకొని క్రమంగా ఆత్మానందం సుస్థిరీకరించుకుంటూ ఆస్వాదిస్తున్నారు. అనగా ఈలోక – లోకాంతర సంఘటనలేవీ వారి దృష్టిలో వారికి బంధం కాదు. ఎప్పుడైతే నీ బుద్ధి "కర్మల ప్రాపంచక ప్రయోజనములు" ... అనబడే మోహకాలుష్యాన్ని తొలగించుకొంటుందో...., అప్పుడు మాత్రమే ఆ నిర్మలమైన బుద్ధికి ఇతఃపూర్వం

వినియున్న - ఇప్పుడు వింటున్న శాస్త్ర - గురు - మహనీయ ప్రవచితమైన ఆప్త వాక్యాలు అవగతమౌతాయి. నిర్మలమైన బుద్ధి సహజసిద్ధంగా లౌకిక ప్రయోజనముల పట్ల నిర్వేదం (Non - Interested) పొందినదై ఉండగలదు. లౌకిక - లోకానంతర ప్రయోజనములకు సంబంధించిన శ్రుతి - శ్రుత వాక్యములతోనిండిన బుద్ధి అనుక్షణికంగా చంచలత్వం పొందుతోంది. బుద్ధి ఎప్పుడైతే లౌకిక - పారలౌకిక ప్రయోజనాలను త్యజించి నిశ్చలత్వం సంతరించుకుంటుందో.... అప్పుడు యోగస్థితి పొందినదగుచున్నది.

## స్థితప్రజ్ఞుడు

**(ఏకాగ్ర బుద్ధియోగి : సమాధీ స్థితుడు)**

**అర్జునుడు:**

ఓ కేశవా! నిశ్చయాత్మకమై, నిశ్చలత్వం పొంది సమాధిస్థితికి చేరిన బుద్ధిని సముపార్జించుకొన్న స్థితప్రజ్ఞుడి భాష - మాటలు ఎట్లా ఉంటాయి? ఆతను ఎచ్చట ఆసీనుడై ఉంటాడు? ఎక్కడ సంచరిస్తూ ఉంటాడు. ఆతని సమాధాన స్థితి (Well Answered state of one's own self) ఎట్లాఉంటుంది?

**శ్రీకృష్ణభగవానుడు** : ఓ పార్థా! బుద్ధి యొక్క నిశ్చలత సముపార్జించుకున్నట్టి స్థిత ప్రజ్ఞుని లక్షణ - ప్రవర్తన - అవగాహన - సందర్శన - సమభావనా విశేషాలు చెపుతాను. విను.

(స్థితా ప్రతిష్ఠితా "అహమస్మి బ్రహ్మ" ఇతి ప్రజ్ఞా యస్య, సః "స్థితప్రజ్ఞః")

- ఎప్పుడైతే ఒకడు మనస్సులో ప్రవేశించియున్న - ప్రవేశించుచున్న సర్వ ప్రాపంచకార్థములను (సర్వకామములను - All Expectations in this world) మొదలంట్లా త్యజించి ఉంటాడో....,
- ఎప్పుడెప్పుడైతే 'ఆత్మ'ను సందర్శిస్తూ (ఆత్మయే ఇదంతా - నేను ఆత్మస్వరూపుడను - అను) తృప్తి - ఆనందములను అనుక్షణికము, స్వభావసిద్ధము చేసుకొని ఉంటాడో...

అప్పుడు ఆతనిని శాస్త్రవాక్యములు "స్థిత ప్రజ్ఞుడు" ... అని పిలుస్తున్నాయి.

ఆ స్థితప్రజ్ఞుడు జీవితంలో సందర్భపడే వేదన – దుఃఖ సంఘటనలను చూచి బెంబేలు పడడు. మనస్సులో అంతర్గతంగా ఉద్విగ్నం (Emotion) పొందడు. "ప్రపంచంలో అందరికీ కష్టాలు వస్తూ – పోతూ ఉంటాయి. ఇవన్నీ సహజమే"... అనే అవగాహనతో మనస్సును ప్రశాంత స్థితినుండి చ్యుతి పొందకుండా, ఉద్విగ్నం కాకుండా చూచుకుంటాడు. అట్లాగే సుఖ సంఘటనలు వస్తున్నప్పుడు "ఇటువంటివన్నీ కూడా వస్తూనే ఉంటాయి. పోతూనే ఉంటాయి. ఈ మాత్రం పొందుటచే ఇదీ శాశ్వతం కాదు. నేను తదితరజీవులకంటే గొప్ప కాదు." అనే అవగాహనతో గర్వము తనను సమీపించకుండా చూచుకొంటాడు. "**ప్రపంచంలో ప్రతిదీ ప్రపంచం కొరకే అయి ఉంటుందేకాని నా కొరకు కాదు. నాది కాదు. నేను విద్యార్థినై నేర్చుకోవటమొక్కటే నాకు చెందినది**" అని గ్రహించి ఉంటాడు.

- "ఇది ఇష్టం. కాబట్టి నాకే ఎల్లకాలం ఉండాలి".... అనే **రాగము** కలిగి ఉండడు.
- "వారు నాకు అనుకూలంగా ఉండటం లేదు. అందుకే ఇష్టం ఉండదు".... అనే **ద్వేషము**నకు చోటు ఇవ్వడు.
- "ఇది అట్లా ఉండదేమో! అది ఇట్లా ఉంటుందేమో! ఏది ఏమి కానున్నదో".... అనే **భయం** దగ్గరకు రానివ్వడు.
- "వారు **నాకు** ప్రతికూలురు. వీరి సంగతి చూడాలి".... ఇటు వంటి **క్రోధము**నకు లోనుకాడు.

రాగము – ద్వేషము – భయము – క్రోధము మనస్సునుండి తొలగించుకొని ఉంటాడు. అట్టి వాడు "నిశ్చల బుద్ధి సముపార్జించుకొన్న మౌని" అని, "స్థితధీర్మని" అని చెప్పబడుచున్నాడు. ఆతడు ఆయా విషయ – వ్యవహార – సంబంధములపట్ల అతిస్నేహం (Heavy relationship) కలిగి ఉండడు. ఆయా ప్రాప్తించే శుభ – అశుభవిశేషాలను చూచి సంతోష – ద్వేష – ఉద్వేగములను

దరిజేరనీయడు. ఆతని బుద్ధి చాంచల్యము వీడి ప్రతిష్ఠితమై, ప్రశాంత – నిర్వేద – నిర్లేపమై ఉంటుంది. ఆతడు స్థిరచిత్తుడై ఉంటాడు.

ఓ అర్జునా! తాబేలును గమనించావా? అది ప్రమాద సంకేతాలు గమనించగానే తన అంగాలన్నీ ఉపసంహరించుకొంటుంది చూచావా? అట్లాగే, ఇంద్రియములద్వారా ఇంద్రియార్ధములు ఆయా శబ్ద – స్పర్శ – రూప – రస – గంధ విశేషములను సమీపిస్తున్నప్పుడు స్థితప్రజ్ఞుడు తన బుద్ధిని ఆసక్తిచే చంచలం కాకుండా చూచుకుంటూ పరిపోషించుకుంటూ ఉంటాడు. **అనగా, తన బుద్ధి నిశ్చూలతను సంరక్షించుకుంటూ ఉంటాడు.** ఇంద్రియార్ధములు విషయ నిర్వహణ చేయవచ్చుగాక! విషయములను పొందుతూకూడా విషయముల ఆస్వాదనను, విషయముల పట్ల రాగమును తొలగించుకొంటూ వస్తున్న యోగియొక్క బుద్ధి 'విషయ నిరాహారం' సముపార్జించుకొంటోంది. అప్పుడు "సర్వము పరమాత్మయొక్క ప్రదర్శనా చమత్కారమే"... అను దృష్టి క్రమంగా పెంపొందుచుండగా.... స్వభావసిద్ధంగానే, ఆతని బుద్ధి విషయరసాతీతస్థితి పొంది సర్వే – సర్వత్రా పరమాత్మాభిషేక స్థితిని సముపార్జించుకొని ఆనందిస్తోంది!

ఒక విద్యార్థికి "బాగా చదువుకోవాలి. తెలివిగలవాడిని కావాలి" అని ఉన్నప్పటికీ "బజార్లలో పచార్లు చేయాలి! స్నేహితులతో ఆయా కాలక్షేపాలు చేయాలి".... అనే ధ్యాస చేత చదువుపై ఏకాగ్రత కుదరకుండా ఉంటోంది చూచావా? అట్లాగే ఒకనికి అల్పమగు ఇంద్రియానంద సంభ్రమములను – ఇంద్రియ విషయ యండమావులను అధిగమించి "దృశ్యజగత్తును పరమాత్మగా సందర్శించటం" .... అనే శాశ్వతాత్మానందం సంపాదించుకోవాలని ఉన్నప్పటికీ, తాను విద్వాంసుడైకూడా, అది సముపార్జించుకోలేకపోతున్నాడు. ఎందుచేత? ఈ ఇంద్రియములు ఇతఃపూర్వపు అనేకములైన అభ్యాసముల కారణం చేత ఇవి ఎల్లప్పుడూ ఇంద్రియ విషయములవైపుకే ఎక్కుపెట్టబడినవై ఉంటున్నాయి. అవి బలవత్తరమై, బలవంతంగా మనస్సును కూడా ఈడ్చుకుపోయి ఇంద్రియ విషయములలో ప్రవేశింపజేసివేస్తున్నాయి. ఆత్మస్వరూపుడగు ఈ ద్రష్టను ఇంద్రియ – విషయాభి ముఖం చేసివేస్తున్నాయి. అందుచేత అట్టి ఇంద్రియాలను,

వాటి కార్యక్రమములను అదుపులో ఉంచాలి. ఎవ్వడైతే ఏకాగ్రచిత్తం కలవాడై ఇంద్రియ విషయ ప్రవాహములను నిగ్రహించి, వాటిని వశంచేసుకొని ఉంటాడో అట్టివాని బుద్ధి క్రమక్రమంగా చంచలత్వం త్యజించి నిశ్చలత్వం సంతరించుకుంటోంది. ఆత్మను దర్శించటంలో, ఆత్మస్వరూపము నిర్దుష్టం చేసుకోవడంలో అట్టి ''నిగ్రహించబడిన ఇంద్రియములు'' మాత్రమే సహకరించగలవు.

ఈ దృశ్యముతో అనుబంధం అతి చమత్కారంగా ఎవరికి వారు కల్పించుకుంటున్నదే సుమా! ఇది స్వయంకల్పితంగా ఎట్లా ఏర్పడుతోందో చెపుతాను. విను.

- విషయముల గురించి మననము – ఆ తరువాత ధ్యాస – ఆ తరువాత ధ్యానముల చేత ఈ జీవునికి క్రమంగా ఆయా ఇంద్రియవిషయములతో "సంగము (Relatedness - Attachment)" ఏర్పడుతోంది.
- క్రమంగా ఆ సంగము మరికొంత కొనసాగుచుండగా "అదిపొందాలి – ఇది కావాలి" అను రూపంతో కూడిన 'కామం' (Emotionally expecting) రూపుదిద్దుకుంటోంది.

ఆ కామం ఇంకొంతగా కొనసాగుచుండగా...., అది కాస్తా "ఏమిటిరా ఇది? నాకు ఎందుకు లభించటంలేదు? ఏమిచేయాలి? ఏమి చేయాలి" అనే క్రోధావేశస్థితిగా పరిణమిస్తోంది.

- ఆ క్రోధం కాస్తా క్రమక్రమంగా "సమ్మోహస్థితి (A State of Illusionary Sense)"కి దారి తీస్తోంది.
- ఆ సమ్మోహస్థితి ఉన్నది లేనట్లుగా లేనిది ఉన్నట్లుగా అనుభవం కలిగించటం ప్రారంభిస్తోంది.
- అటువంటి సమ్మోహస్థితి ఇంకొంతకాలం కొనసాగటంచేత... అది కాస్తా "స్మృతి విభ్రమం (A forgotten State of what originally one is)"గా ప్రాప్తిస్తోంది. జ్ఞాపకశక్తి నశించటం – ఏమరచటం జరుగుతోంది.

- స్మృతి (Remembrance) భ్రంశం అవటం చేత బుద్ధి (Intellectual) నశిస్తోంది.
- బుద్ధి అపక్రమస్థితి పొందుటచే ఆత్మ స్వరూపుడగు జీవుడు "నేనొక మానవదేహాన్ని – కోతి దేహాన్ని – కాకి దేహాన్ని – పురుగు దేహాన్ని".... ఇట్లా అవరోహనస్థితిని తెచ్చిపెట్టుకుంటున్నాడు.

''ఆత్మస్వరూపాస్వాదన'' అను స్థితి నుండి ఈ జీవుడు 'విషయానందానుస్మరణ'చే వివశుడై "ఈ దేహమే నేను. ఈ దేహం నాది. నేను ఈ దేహమునకు సంబంధించినవాడను. ఈ దేహం నాకు సంబంధించినది"..... అను **అనాత్మానుబాయాతస్థితికి** చేరుచున్నాడు.

అందుచేత అర్జునా! ఇప్పుడు ఈ మనస్సును "రాగ – ద్వేషములు, ఇష్ట – అయిష్టములు" అనే స్థితినుండి విడిపించి అందరిలోను సర్వదా ఏకరూపమైయున్న "ఆత్మతత్త్వము" వైపుగా నడిపిస్తూ ఉండగా అప్పుడు క్రమంగా చిత్తము నిర్మలత్వం సంతరించుకుంటూ ఉంటుంది. చిత్తం నిర్మలం అవుతూఉంటే, అప్పుడు క్రమక్రమంగా అన్ని ఆందోళనలు, ఆదుర్దాలు, ఆవేదనలు, ఆవేశాలు వాటికవే తొలగుతూ వస్తాయి. చిత్తము ప్రసన్నం అవుతూ వస్తుంది. ప్రసన్నమైన చిత్తము వలన బుద్ధి వికశించగలదు. వికశించిన బుద్ధి ప్రత్యక్షంగా ఆత్మసాక్షాత్కారం సంతరించుకొని ప్రశాంతపడగలదు.

జీవులందరూ 'సుఖం'గా ఉండాలనే కోరుకొని అద్దానికోసం సుదీర్ఘంగా వెతుకుతున్నారు. శ్రమిస్తున్నారు.

మంచిదే! అయితే.....!

ఎవరికి ప్రాపంచకవిషయ – విశేష – వ్యవహార – సంఘటనల సమూహముల పట్ల యుక్తియుక్తమైన చిత్తము రూపందిద్దుకోదో... వారి అవగాహన రూపమైన 'బుద్ధి' సక్రమమైన మార్గంలో ప్రయాణించదు. బుద్ధి సునిశితంగాను, నిర్మలంగాను, సువిశాలంగాను ఉండకపోతే సరిఅయిన అవగాహన – భావన ఉండవు. సదసద్వివేకముతో కూడిన భావన,

పెంపొందకపోతే మనస్సుకు 'శాంతి' ఉండదు. ఇక శాంతి సముపాదించుకొనని చిత్తమునకు సుఖం ఎక్కడిదిచెప్పు? ఎవరి చిత్తము (లేక) మనస్సు ఇంద్రియముల – ఇంద్రియవిషయములగు దృశ్య పరంపరలవైపుగా ఏమాత్రం విధేయత (Control) లేకుండా ప్రయాణిస్తూ ఉంటుందో... వారి ప్రజ్ఞ (లేక తెలివితేటలు) కూడా ఇంద్రియ విషయపరంపరలవైపుగానే ప్రసరిస్తాయేగాని "ఇదంతా నా స్వరూపమే" ... అను ఆత్మజ్ఞానము వైపుగా కాదు. పెనుగాలులు వీస్తూ ఉండగా సముద్ర – మధ్యంలో చిక్కుకున్న నావ సముద్రపు ఆటు – పోట్లకు లోనై ఎటు కొట్టుకుపోతుందో ఎవరు చెప్పగలరు? ఇంద్రియ – ఇంద్రియ విషయ ధ్యాసలలో చిక్కుకున్న మనస్సుగలవాని ప్రజ్ఞకూడా ఈ సంసారనడిసముద్రంలో ఏఏ ఉపాధి పరంపరల వైపు కొట్టుకుపోతుంతో... ఏం చెప్పగలం? అందుచేత గొప్ప బాహువులుగల ఓ అర్జునా! ఎవనియొక్క ఇంద్రియాలు ఇంద్రియార్ధ విషయములైనట్టి ఈ దృశ్యమానమగుచున్న శబ్ద – స్పర్శ – రూప – రస – గంధములకు వశం అయిఉండవో... అట్టివాని 'ప్రజ్ఞ' లేక 'తెలివి' లేక 'బుద్ధి' ప్రతిష్ఠితమై ఉంటుంది. స్థిరంగా ఉంటుంది. ఈ ఇంద్రియములు విషయముల వైపుగానే క్షణక్షణం పరుగులు తీస్తున్నాయా... అట్టి వాని బుద్ధికి నిశ్చలత – ప్రతిష్ఠత ఉండదుసుమా!

అనేకమంది సంసారజీవులు దేనినైతే ఏమాత్రం పరిశీలించకుండా రోజులు (దృశ్యస్వప్న ద్రష్టలుగా) గడిపివేస్తున్నారో, .... అట్టి **"ఆత్మస్వరూప సమాచారం"** పట్ల ఇంద్రియముల అజమాయిషీగల యోగి జాగరూకుడై పరిశీలించి హృదయస్థం చేసుకుంటున్నాడు. అనేకులు ఏ ఇంద్రియ విషయమాత్రములు, స్వప్న సదృశ లోకవ్యవహారముల పట్ల జాగరూకులై రాత్రింబవళ్ళు అనేక ధ్యాసలతో కూడి ప్రవర్తిస్తున్నారో.... అట్టివాటి పట్ల స్థిత ప్రజ్ఞుడగు 'సంయమి' (లేక 'యోగి')... తుచ్ఛ – స్వల్ప – అల్ప విషయములుగా – చూడటం జరుగుతోంది.

స్థిత ప్రజ్ఞుని మరొక విశేషం విను.

సముద్రం ఎల్లప్పుడూ జలంతో నిండుగా ఉంటుంది. సర్వదా యథాతథంగా ప్రతిష్ఠితమై ఉంటుంది. "ఆహాఁ! ఈ నదుల జలం నాయందే ప్రవేశిస్తోంది కదా!" ... అని పొంగిపోదు. "అయ్యో! ఈ జలమును సూర్య కిరణాలు పీల్చి – ఆవిరిచేసి ఎత్తుకు పోతున్నాయే?" .... అని క్రుంగిపోదు. సముద్రం ఎప్పుడూ నిండుగా, సమగ్రంగానే ఉంటుంది. అట్లాగే స్థితప్రజ్ఞుడు "ఆహాఁ! నేను అనుకున్నవన్నీ జరుగుచున్నాయి. వద్దనుకొన్నవి తొలగుచున్నాయి" అని పొంగిపోడు. "అయ్యయ్యో! ఈ నా కోరికలు తీరటంలేదే! అనుకున్నవి లభించటం లేదే? అనుకున్నవి అనుకున్నట్లుగా జరగటం లేదే?" అని కృంగిపోడు. సర్వదా – సర్వవిధములగాను జీవితపు ఆటు – పోట్లను చిద్విలాసంగా గమనిస్తూ సర్వాతీతమైన ప్రశాంత స్థానమును బుద్ధిచే ఆశ్రయించినవాడై ఉంటాడు. ఈ ప్రాపంచక విషయాలు, సంఘటనలు, కోరికలు ఆతనియందు ప్రవేశించి ఆతని ప్రశాంతతను తాముకూడా సంతరించుకుంటాయి.

ఇక 'కామకామి' (కోరికలు కోరుకునేవాడు) కోరికలు తీరినా, తీరకున్నా శాంతిని పొందలేడు. ఎందుకంటే కోరికలు కలిగిఉండే స్వభావం కొనసాగేంతవరకు కోరికలకు అంతు ఎక్కడ? ఒకటి తీరితే పది మొలకెత్తుతూనే ఉంటాయి.

ఎవ్వడైతే అంతర్గతమైన సర్వ దృశ్యసంబంధ కోరికలు త్యజించి 'నేను – నాది' అనే అహంకార – మమకారములను మొదలంట్లా తొలగించుకొని ఉంటాడో..... అట్టి స్థిత ప్రజ్ఞుడు పరమప్రశాంతస్థానమును తనకుతానే తనయందుతానే సముపార్జించుకొని ఉండగలడు.

**బ్రాహ్మీస్థితి :**

ఓ పార్థా! అటువంటి సర్వకామాతీత – అహంకార – మమకారాతీతమై ప్రకాశించే స్థితి, స్వఉపాధితో సహా సర్వమును కేవలాత్మ తత్త్వచమత్కారంగా సందర్శిస్తూ ఆస్వాదించే స్వభావం "బ్రాహ్మీస్థితి" అని చెప్పబడుతోంది. అది, "లోకాలలో నేను లేను. లోకాలన్నీ నాయందే ఉన్నాయి." అను అవగాహన –

అనుభూతి సంతరించుకునే స్థితి. అట్టి బ్రాహ్మీస్థితి "సర్వము బ్రహ్మమే"..... అను అభ్యాసముచే స్వభావసిద్ధంగా సుస్థిరీకరించుకొన్న స్థితప్రజ్ఞుడు ఇక ఈ లోక - లోకాంతర సంఘటన - వ్యవహార సముదాయములను చూచి ఏమాత్రం విమోహం పొందదు. ముగ్ధుడు కాడు.

"ఇది కలయే", "ఇది ఒక కథారచనలోని అంతర్గత చమత్కారం" అని గ్రహించిన తరువాత ఇక "ఈ కలలో కనిపించిన ప్రదేశం ఏ ఊళ్ళో ఉండి ఉండవచ్చు?" అని సమాలోచన చేసే వాడెవ్వడుంటాడు? "కథలో చెప్పబడే బంగారం లభించే కొండ ఎక్కడ ఉండి ఉండవచ్చు?" అని వాకబు చేస్తాడా? లేదు కదా!

అట్టి బ్రాహ్మీస్థితి ఈ శరీరం నేలరాలకముందే జీవితంలో సంపాదించుకొన్నవాడు జీవితమును సార్ధకపరచుకొన్నవాడు అవుతాడు. ఆతడు తానే బ్రహ్మమై సర్వాంతర్యామి అయి, కేవలానంద స్వరూపుడై, సర్వబంధములను తృణీకరించినవాడై ఆత్మానందములో ఓలలాడుతూ ప్రకాశించగలడు. బ్రహ్మమే తానై వెలుగుడు.

*ఇతి భాగవద్గీతా... సాంఖ్యయోగ పుష్పః*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

★★★

శ్లో॥ మయి సర్వాణి కర్మాణి సన్యస్య అధ్యాత్మ చేతసా
నిరాశీః నిర్మమోభూత్వా యుద్ధ్యస్వ విగతజ్వరః ॥

అదార్యాత్మచేతసా సర్వాణి కర్మాణి మయి సన్యస్య నిరాశీః –
నిర్మమః – విగతజ్వరః బూత్వా యుద్ధస్వ ॥

అంతర్యామినగు నాయందు నీమనస్సును లగ్నంచేసి, సర్వ కర్మలు నాకు సమర్పిస్తూ ఆశ – మమకారము – వేదనలు త్యజించి నీ స్వధర్మమైనట్టి ఈ యుద్ధము నిర్వర్తించు.

# 3.

# కర్మయోగ పుష్పం

**అర్జునుడు** : ఓ జనార్దనా! మీరు "బుద్ధి యోగం" గురించి చెప్పారు. *"ఉత్తమమైన నిర్మలమైన – సుతీక్షణమైన బుద్ధిని సముపార్జించుకోవటమే 'జీవితము' యొక్క సమున్నతమైన ప్రయోజనం. ఇక ప్రాపంచక ప్రయోజనములన్నీ అల్పవిషయాలు"* ... అని ఒకానొక మహత్తరమైన బుద్ధి యోగసిద్ధాంతమును ప్రతిపాదించారు. బుద్ధి నిశ్చలత్వం సంపాదించుకున్నట్టి స్థితప్రజ్ఞుని మహోన్నతమైన గుణగణాలు ప్రవచించారు. *"నదులన్నీ సముద్రంలో ప్రవేశించి తమ నామరూపాలు త్యజించి సముద్రంలో కలిసిపోతున్నట్లుగా, దృశ్యప్రపంచ సంబంధాలమైన సర్వ విషయాలు స్థిత ప్రజ్ఞునిలో ప్రవేశించిక□డా, అవి, 'సశాంతి'ని పొందుతాయి"....* అని *విశదీకరించారు. "సర్వకోరికలు త్యజించి ప్రపంచముపట్ల నిస్పృహ సముపార్జించుకొని అహంకార – మమకార దోషవర్జితుడై స్థితప్రజ్ఞుడు పరమశాంతిని సర్వదా ఆస్వాదిస్తున్నాడు"....* అని అభివర్ణించారు.

'బుద్ధియోగం' విషయమై మీరు విశదీకరించిన విశేషాలన్నీ అమోఘం! యుక్తి యుక్తం కూడా!

అయితే....,

మీరు చెప్పే వాక్యాలు కర్మ – బుద్ధియోగ – జ్ఞానముల విషయంలో మిశ్రమంగా – కలగలుపుగా ఉన్నాయని అనిపిస్తోంది. బుద్ధితో ఆత్మజ్ఞానం సంపాదించటమే జీవితాశయమని చెప్పి, ఇంతలోనే “కర్మనుచేయి” అని ప్రోత్సహిస్తున్నారు. “కర్మచేయటం నీపని, కర్మఫలితాలతో సంబంధం పెట్టుకోకు.... అని బోధిస్తున్నారు. “కర్మలు స్వల్ప విషయాలు”... అని ఒకప్రక్క చెప్పుచూనే, “కర్మ బాగా చేయటమే యోగము” .... అని నిర్వచనం చేస్తున్నారే! (యోగః కర్మసు కౌశలమ్!)

“కర్మలు నిర్వర్తించటంకంటే బుద్ధి యోగం గొప్పది”.... అనునది మీ ఉద్దేశ్యమా? అదే మీఉద్దేశ్యమయితే, హింసతోకూడిన ఈ యుద్ధం చేయమని నన్ను ఇంతలోనే ఎందుకు ప్రోత్సహిస్తున్నారు?

మీరు చెప్పే ద్వంద్వ ప్రయోజన వాక్యములచేత నా బుద్ధి మరికొంత మోహం (Confusion) సంతరించుకున్నదేగాని .... వర్తమానపు ‘యుద్ధం చేయటం’ అనే విషయంలో నేను ఒక నిర్ణయానికి రావటానికి నాకు దోహదం కావటంలేదు, స్వామీ!

సరే! ఇప్పుడు ఈ ‘యుద్ధం’ అనే కర్తవ్యం నిర్వర్తించమంటారా? లేక విరమించి, ఉద్విగ్నరహితమైన బుద్ధి కొరకై జ్ఞానమార్గం ఆశ్రయించమంటారా? **బాగా నిశ్చయించి ఏదో ఒక్కమార్గం నాకు చెప్పండు.** నాకు ఇప్పుడు ఏది శ్రేయమో అది చెప్పండి. అది నేను నిర్వర్తిస్తాను.

**శ్రీకృష్ణుడు** : ఓ పాపబుద్ధి రహితుడవగు అర్జునా! ఈ ప్రపంచంలో రెండు మార్గాలు (లేక) నిష్ఠలు నాచేత ఇతఃపూర్వమే చెప్పబడినాయి.

1. **జ్ఞానానువర్తులకు** : జ్ఞాన మార్గం (సాంఖ్యమార్గం. జ్ఞానయోగం)
2. **కర్మానువర్తులకు** : కర్మమార్గం (కర్మ యోగం. నిష్కామకర్మ)

అయితే.... కర్మలతో అవసరములేని స్థితి ఎప్పుడు లభిస్తుంది?

చెపుతాను. విను.

కర్మ నిర్వర్తించకుండానే కర్మలకు అతీతమైన స్థితి ఎవ్వరికీ లభించేది కాదు. కర్మలు వదిలివేసినంత మాత్రంచేత కర్మలకు అతీతమైన "సమాధాన స్థితి, సిద్ధి" లభించదు సుమా!

అయినా, "కర్మలేవీ నిర్వర్తించను" అనునది ఎట్లా కుదురుతుంది? ఏ ఒక్కడుకూడా ఏదోకర్మ చేయకుండా (నిర్వర్తించకుండా) ఒక్క క్షణం కూడా ఏమాత్రం ఉండలేడే! ఎందుకంటే దేహము కలిగిఉండటమంటే ప్రకృతితో (లేక) స్వభావముతో సంబంధం కలిగి ఉన్నట్లే కదా! ప్రకృతి (లేక) స్వభావజనితమైన గుణములు ప్రతి జీవుని ఆశ్రయించియే ఉంటాయి. ఆ గుణములకు (లేక) స్వభావమునకు వశుడై ప్రతివాడు కర్మలు చేస్తూనే ఉంటాడేకాని, "నేను కర్మలు నిర్వర్తించను" .....అని ఎవ్వడుండగలడు? దేహం ఉన్నంతకాలం ఆహారం కావాలి! ఆహారం అరగాలంటే దేహం పనిచేయటానికి ఉపక్రమించియే ఉండాలి కదా! పైగా, ప్రకృతి అత్యంత బలవత్తరమైనది. అది దేహములను కర్మలలో నియమిస్తోంది సుమా!

కాదూ....?

"కర్మేంద్రియములను సంయమం చేసివేస్తాను. కట్టడి చేస్తాను. ఈ కళ్ళతో అందరూ చూచేవి నేను చూడను. అందరూ వినేవి నేను వినను. స్పర్శ – రూప – రస – గంధాలన్నీ త్యజించి ఉంటాను..." అని ఒకానొకడు వాటిని నిరోధించాడనుకో, అప్పుడో? వాటినన్నిటినీ తనవిగా చేసుకొని వర్తించే ఆలోచనా రూపమైన మనస్సు సంగతేమిటి? అది ఆలోచిస్తూనే ఉంటుందే! ఆ మనస్సు ఆలోచించేదంతా ఇంద్రియ విషయ పరంపరలేకదా! ఇంద్రియములను మాత్రం పూర్తిగా కట్టడి చేసి ఏం ప్రయోజనం?

ఇంద్రియాలు ఉపయోగించక, మనస్సుతో మాత్రం మననం చేస్తూ ఉంటే.... అప్పుడది కర్మలను అధిగమించినట్లో, నిరోధించినట్లో అవదు కదా....! అటువంటివాడు ఇంద్రియములను వదలి ఇంద్రియార్థములచే విమూఢుడు (Illusioned) అయినట్లే! అతని "ఇంద్రియములను ఉపయోగించను" అనే

| | |
|---|---|
| కళ్ళతో చూడడు | కాని, దృశ్యాలు ఊహలో ఉండియే ఉంటాయి |
| చెవులతో వినడు | కాని, ఎవరెవరి మాటలో (మంచివో.... చెడువో) గుర్తుకొస్తూనే ఉంటాయి. |
| నోరుతో ఎవరితోనూ మాట్లాడడు | కాని, "వాళ్ళు అటువంటివారు, వీరు ఇటువంటివారు" అని తనలో తానే అనుకుంటూనే ఉంటాడు. |
| దేనినీ స్పృశించడు | కాని, భార్య – భర్త – పిల్లల – తల్లి – తండ్రి – స్నేహితుల స్పర్శ గుర్తు చేసుకుంటూ ఉంటాడు. |
| దేనినీ వాసన చూడడు | కాని, ఆఘ్రాణానుభవాలు గుర్తుకు వస్తూ ఉంటాయి. |
| దేనినీ రుచి చూడడు | కాని, అనేకరుచులు గుర్తుకు తెచ్చుకొని నాలుక పరవశం – అభిలాష పొందుతూ ఉంటుంది |

ప్రయత్నం మిథ్యా ప్రయత్నమే! అందుచేత, "కర్మలు చేయను, కర్మమార్గం వదులుతాను".... అనునదంతా మిథ్యాప్రలాపములు, మిథ్యాప్రయత్నములు మాత్రమే! అది మిథ్యాచారమే!

ఇక 'సదాచారం' ఏమిటంటావా?

'ఇంద్రియాలు మనస్సును నడపటం' అనేది అధిగమించాలి. మనస్సుతో ఇంద్రియములను నియమించి ఇంద్రియ విషయములతో ప్రవర్తించేటట్లు చేయాలి. అనగా ఇంద్రియములు – ఇంద్రియ విషయములు మనస్సుకు ఉపకరణములు కావాలి. వాహనం మనం నడుపుతాం గాని, వాహనము మనలను నడిపించదుకదా! అట్లాగే మనస్సు ఇంద్రియవిషయములను ఉపయోగించాలికాని ఇంద్రియ విషయములగు దృశ్యము – శబ్దము – రూపము

– రసము మొదలైనవి మనస్సును పాడుచేయటం, స్వాధీనం చేసుకోవటం అనుచితం కదా!

అందుచేత ఓ అర్జునా! ఏ 'అధ్యాస' లేక 'ధారణ' (Cogitation of our thoughts) చేత "దృశ్యాసక్తి రహితమైన – దృశ్యాతీతమైన" మనస్సుతో ఇంద్రియములను నియమించగలుగుతామో, ...అట్టి మార్గంలో మనస్సును అవధరించటమే ఉత్తమం. మనస్సు అప్రమేయస్థానంలో ప్రతిక్షేపించబడి ఇంద్రియములు – ఇంద్రియవిషయములు ఉపకరణమాత్రంగా (Merely as instruments) – *ఈ దేహమే ఉపకరణ మాత్రంగా అనుభూతమవటమే 'కర్మయోగం'* అని చెప్పబడుతోంది. మనస్సు – ఇంద్రియాలు నీవు ఉపయోగించాలేగాని, అని నిన్ను ఉపయోగించుకోవటమేమిటి?

ఓ కిరీటీ! నీకు నియమితమైన కర్మలు నీవు నిర్వర్తించటమే యుక్తియుక్తం. అదియే ఎవ్వరికైనా ఉచితం. "కర్మలు నిర్వర్తించను" అనే పట్టుదల కలిగియుండటంకంటే కర్మలు కర్మయోగముతో కూడిన మనుస్సుతో నిర్వర్తించటమే మంచిది. లేదా? జనులంతా కర్మలు మానివేస్తే ఈ శరీరయాత్రలు కొనసాగేది ఎట్లా? అకర్మవర్తులకు దేహయాత్ర క్లిష్టమౌతుంది కదా!

***అయితే "నాకు నియమించబడిన కర్మలు నేను ఏ ప్రయోజనం ఉద్దేశ్యించి నిర్వర్తించాలి" అనే విషయంలో మాత్రం ఒక నిర్దుష్టమైన – సుస్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి.***

"నాకు ఇష్టం కదా – నాకు ఇష్టమైనవారి కొరకు – నాకు ప్రియమైనవారి కొరకై – ఏదో బాధ్యత కాబట్టి – మరి నేను గుర్తించబడాలి – నాకు తృప్తిని ఇస్తుందిలే – నాకు అనుకూలం కాబట్టి – నాకు భవిష్యత్ సానుకూలం కనుక......"

ఇటువంటి అవగాహన – ఆదర్శము – ఆవేశము కలిగి ఉంటే.... ***అది నీకొరకు చేసినట్లు అవుతుంది.***

"విధినిర్వహణ – పరమాత్మ సమర్పితము – సమాజశ్రేయస్సు –

స్వధర్మము – నియమితముల దృష్టితో ఒక ఉపాసనగా నిర్వర్తించటం”

**.... ఇది *యజ్ఞభావ సమన్వితమైన “కర్మ నిర్వహణ”***

***“యజ్ఞార్థాత్ కర్మ = యజ్ఞము (సమగ్రము – Corporate objective)”***

‘యజ్ఞము’ కొరకై కాకుండా మరింకే ఉద్దేశ్యంతోనైనా (లేక ఆశయంతోనైనా) కర్మనిర్వహిస్తే... అది ‘కర్మబంధనము’నకు దారి తీస్తుంది. అందుచేత అర్జునా! నీవు లోకసానుకూల్యత కొరకై స్వధర్మానుసారం కర్మ (Duty) నిర్వర్తించు. అంతేకాదు. “సంగము (Attachment)నకు చోటు ఇవ్వకుండా కర్మ నిర్వర్తించు. అనగా, “ఇది నాకు సంబంధించినది. నేను దీనికి సంబంధించిన వాడను'' అను భావనను క్రమక్రమంగా తొలగించుకుంటూ ‘విధి’గా నిర్వహించు. అప్పుడు అది ‘యజ్ఞకర్మ’గా రూపు దిద్దుకుంటుంది. **కర్మ చక్కగా, బాగుగా నిర్వర్తించు.**

ఈ ‘సృష్టి’ అనే మహాయజ్ఞం నిర్వర్తిస్తున్న సృష్టికర్త, “జీవులు – యజ్ఞకర్మలు – దైవీతత్త్వాలు” సృష్టించారు. “ఓ జీవులారా! మీతోబాటే దేవతలను (దైవీతత్త్వాలు) కూడా ఈ సృష్టిలో సృష్టిస్తున్నాను. దేవతలు మీ ఇష్ట – కామ్యాలకు అనుకూలంగా ఈ సృష్టి సంపదను, జీవజీవన ప్రవంతిని యజ్ఞ భావితులై తమ కార్యక్రమములుగా నడుపుతూ ఉంటారు. మీ జీవులంతా దేవతల కార్యక్రమమైన ‘సృష్టిరచన’ను జీవిత విధానంగా ప్రయోజనం పొందండి. దేవతలు తమ క్రియల శోభచే మిమ్ములను ఆనందింపజేస్తారు. ఆ దేవతలకు సేవ – భక్తి – ప్రపత్తులచే పూజించి వారిని సంతోషింపజేయండి. మీరు మీ నియమిత కర్మలచే సమర్పిత బుద్ధితో దేవతల కార్యక్రమములకు సహకరించండి”... అని ఆదేశించారు. [God - command]

ఈ విధంగా – “జీవులు – దేవతలు పరస్పర ప్రయోజనంగా ఈ సృష్టిని ఆస్వాదిస్తూ, అనువరిస్తూ ఆనందించటం'' ......... అనునది సృష్టికర్తయొక్క ఉద్దేశ్యం.

యజ్ఞభావితులై దేవతలు జీవులకు ఇష్ట - భోగాలను ప్రసాదిస్తూ ఉంటారు. దేవతల నుండి తాము పొందవలసినదంతా పొందుతూ కూడా ఏ జీవుడైతే "స్వధర్మ - కర్మనిర్వహణ" అనే యజ్ఞ కర్మ నిర్వర్తించటానికి ఔత్సాహితుడుకాడో.... అట్టివాడు ఇతరుల సొమ్ముదొంగిలించే దొంగతో సమానం. అనగా దేవతలకు, సృష్టికర్తకు ఋణగ్రస్తుడు అగుచున్నాడు.

కర్మలలో దోషం ఉంటే ఉండవచ్చుగాక! **యజ్ఞభావంతో కర్మ నిర్వర్తించి** (Eg. One who works for success of Team (or) Organisation but not for Personal Gains) **యజ్ఞప్రసాదితమైన ఫలమును ఆస్వాదించటంలో పాల్గొనేవానికి ఆ కర్మ యొక్క దోషం అంటదు.** వాస్తవానికి ఆతడు సర్వ పాపభావములనుండి విముక్తుడు అవుతాడు. అట్లా కాకుండా, ఎవ్వడైతే "నా కొరకు – నా అభిరుచికై – నాకు ప్రియం కనుక – నేను గొప్పగా ఉండాలి కాబట్టి – నన్ను మెచ్చుకోవాలిగా..."... ఇటువంటి స్వకీయపరిమిత భావములు ప్రవృద్ధం చేసుకొంటాడో ఆతను అనుభవించేది – పొందేది పాపపు కూడే అవుతుంది.

ఈ జీవులంతా పాంచభౌతికమైన దేహాలు కలిగి ఉన్నారు కదా! ఈ దేహరచనకు మూలపదార్థం (Raw - material) ఆహారమే. ఆహారం సృష్టిలో ఎట్లా రూపుదిద్దుకుంటోంది? ఆకాశంనుండి వర్షాలు సంభవించటం చేత కదా! వర్షమో? సూర్య తేజస్సు యొక్క విధి – విధానం చేత ప్రాప్తిస్తోంది. అనగా సృష్టిలో అంతర్లీన గానంగా ప్రసరిస్తున్న 'యజ్ఞము' (A Function for Collective Gain)చేత జరుపబడుతోంది. అనగా ఆ యజ్ఞము విధి – విధానములతో కూడిన కార్యక్రమం చేతనే జరుగుతోంది. జరిగే కర్మలన్నీ జరిగితేనే "యజ్ఞకర్మ – సృష్టి – వర్షం – ఆహారం – జీవుల జీవిత విధానం".... ఇవన్నీ ఒనగూడుచున్నాయి. అనేక కర్మలు – కార్యక్రమములు ఇవన్నీ.... పరబ్రహ్మమునుండే బయల్వెడలుచున్నాయి. కనుక "కర్మ (Work)" అనునది బ్రహ్మమునుండే ఉద్భవిస్తోంది... అని గమనించబడును గాక! బ్రహ్మము అక్షరస్వరూపం – అక్షయం కదా! అందుచేత నీవు వెతికే "పరబ్రహ్మము" లేక "పరమాత్మ" నీవు నిర్వర్తించవలసిన కర్మలలోనే దాగి ఉన్నది. ***జగదీశ్వరుడు జగత్‌రూపంగా*** నీ

**కర్మాలు ఆస్వాదిస్తున్నారు.** కనుక యజ్ఞభావంతో కర్మలు నిర్వర్తించు (So please funciton with team or corporate objectives but not with objective of personal gains).

జీవులు యజ్ఞభావంతో కర్మలు నిర్వర్తించి దేవతలకు సమర్పించాలి. దేవతలు కర్మోపాసనకు సంతోషించి జీవులకు కావలసిన ఋతుపవనాలు - సంపద - సుఖ - సంతోషాలు ప్రసాదించాలి. ఇది ఒక కర్మచక్రం. అట్టి కర్మ మహాచక్రం ఈ బ్రహ్మాండాలను - జీవులను - వారి జీవితములను నడుపుతూ ఉన్నది.

1. జీవుడు తనకు లభించిన ఇంద్రియములద్వారా ఇంద్రియప్రసాదకులగు - ఇంద్రియ పరిరక్షకులగు" దేవతల ఉపాసన.
2. దేవతలు జీవులను పరిపోషించటం.
3. ఆ పరిపోషణ నుండి ప్రయోజనం పొందిన జీవులు దేవతలకు తమ 'యజ్ఞకర్మ సమర్పణ' ద్వారా సహకరించటం ఇదంతా ఒక కర్మ మహాచక్రం.

ఉదాహరణకు...

- కొంతమంది యొక్క సమాలోచన - పరిశ్రమలచే ఒక సంస్థ ఏర్పడుతోంది.
- ఒకడు ఆ సంస్థలో ఉద్యోగానికి చేరుతాడు.
- చేరి ఆ సంస్థ అందించే జీత - భత్యములు పొందుతాడు.
- పొంది తానుకూడా సంస్థయొక్క ఆశయముల కొరకై, కార్యక్రమముల కొరకై శ్రమను అందిస్తాడు.
- ఆ సంస్థ అట్టి ఉద్యోగుల పరిశ్రమ యొక్క ప్రయోజనంగా ప్రవృద్ధమౌతూ ఉంటుంది.
- ఆ ప్రవృద్ధి నుండి తిరిగి ఆ ఉద్యోగి సత్ప్రయోజనాలు పొందుతూ ఉంటాడు.

ఈ కర్మ – కర్మప్రయోజన చక్రంతో ఎవ్వరైతే తమవంతు కర్మను యజ్ఞభావంతో నిర్వర్తించరో... వారు పాపం చేస్తున్నవారౌతారు. ఇంద్రియలోలులు – ఇంద్రియ బద్ధులు అవుతారు. వారి జీవితం మోహభూయిష్టం, నిష్ప్రయోజనం అయిపోతుంది. వారు ఋణగ్రస్థులౌతారని మరొక్కసారి గుర్తు చేస్తున్నాను.

ఇక 'ఆత్మజ్ఞానం' దృష్ట్యా 'యజ్ఞకర్మ' యొక్క విశేషమేమిటో పరిశీలిద్దాం.

ఆత్మ సర్వదా పొందబడియున్నది కదా! అందుకు క్రొత్తగా ప్రయత్నించి పొందవలసినదేమున్నది? జీవులంతా 'ఏదో పొందాలి' అని భావిస్తూ కర్మలు చేస్తూ ఉండగా, .... ఆత్మజ్ఞాని ఎట్లా భావిస్తున్నాడో... విను.

"ఆత్మజ్ఞాని ఆత్మచేత ఆత్మయందే తృప్తిపొందినవాడై ఉంటున్నాడు."

ఆతడు ఆత్మయందే ఎల్లప్పుడు రమిస్తూ, ఆత్మచేతనే తృప్తినిపొందుచూ, తన "ఆత్మస్వరూపము" అయినట్టి పరమాత్మను సందర్శిస్తూ సర్వదా "సంతుష్టి" పొందినవాడై ఉంటున్నాడు. ఆత్మసందర్శనంచేత ఆనందించేవాడికి ఇక క్రొత్తగా కర్మలద్వారా పొందవలసినది – కావలసినది ఏమీ ఉండదు. అందుచేత ఆతనికి 'ఇది కర్తవ్యము' అనేది ఉండదు. అట్టి ఆత్మ సాక్షాత్కార దృష్టి సముపార్జించుకొన్న తరువాత – కర్మలు చేయటం చేత లభించేదికాని, కోల్పోయేదికాని ఉండదు. ఆతనికి కర్మలు నిర్వర్తించేటప్పుడు "నాకు ఇది కావాలి – అది తొలగాలి".... అనే ఆసక్తి ఉండదు. ఇక ఆత్మయోగి కానివానికి **ఆత్మ సందర్శనముచే పరితృప్తి పొందే స్థితి వరకు 'కర్మాలు' అవసరమే!**

కనుక ఓ అర్జునా! నీకు నియమించిన కర్మలు – ధర్మములు (works & functions) నిర్వర్తించు. చక్కగా నిర్వర్తించు. కౌశలముతో నిర్వర్తించు. సమర్పిత – యజ్ఞభావనతో నిర్వర్తించు. అయితే "ఆత్మానందసందర్శి" వలె అనాసక్తితో నిర్వర్తించు. "ఇది నాకు చెందినది. నేను దీనికి చెందినవాడను. ఇది కావాలి. అది పోవాలి. ఇది అట్లా ఉండాలి. అది ఇట్లా ఉండకూడదు"... అనే ఆసక్తి (Attachment) లేనివాడవై నిర్వర్తించు.

ఎందుకంటావా?

***"అసక్తో హి ఆచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః"*** – ఆసక్తి లేకుండా (Without attachment and without maintaining Relatedness) కర్మలు నిర్వర్తించేవారికి స్వభావసిద్ధంగా 'పరమపురుషత్వం' అనే ప్రయోజనం లభిస్తోంది.

కొందరు, "ఈ కర్మలు నిర్వర్తించవలసిరావటంచేత 'ఆత్మజ్ఞానం – ఆత్మానందం' సంపాదించుకునే ప్రయత్నాలు చేయలేకపోతున్నాం. ఇవన్నీ ఒక కొలిక్కి వచ్చిన తరువాత ఇక జ్ఞానమార్గం ఆశ్రయిస్తాం".... అని అనుకుంటూ రోజులు గడుపుచున్నారు. అది సత్యం కాదు. భ్రమ మాత్రమే.

1. నిర్వర్తించవలసివస్తున్న కర్మలు 'జ్ఞాన ప్రతిబంధకాలు' కాకుండా చూచుకునేది ఎట్లా?
2. అనివార్యంగా నిర్వహించవలసి వస్తున్న ఈ కర్మలు (Functions) జ్ఞానప్రదంగా – మోక్షదాయకంగా తీర్చిదిద్దుకునేది ఎట్లా?"

ఈ రెండు తెలిసి కర్మలు నిర్వర్తించేవాడే కర్మయోగి. అదియే కర్మయోగం.

మహనీయులెందరో అనివార్యంగా తాము చేయవలసివస్తున్న కర్మలను తమ "మోక్షానంద సంసిద్ధి"కి సోపానములుగా తీర్చి దిద్దుకుంటున్నారు. జనకుడు మొదలైన వారెందరో కర్మలే (Their duties / functions itself) తమను ఉద్ధరించే సాధనములుగా తీర్చిదిద్దుకున్నారు. తీర్చిదిద్దుకుంటున్నారు. కర్మలు 'సంసిద్ధి' (Fulfillment) ప్రసాదించే మార్గములుగా చేసుకొని, జీవిత మహదాశయాన్ని సిద్ధింపజేసుకుంటున్నారు. వారు స్వకర్మ నిర్వహణద్వారా మోక్షస్థితిని సముపార్జించుకుంటున్నారు.

ఆత్మజ్ఞానులు, **ఆత్మానుబూవూు అయినవారు కర్మూువూున క్రొత్తగా పొందవూుసినది లేక పోయినప్పటికీ కర్మూు లోకక్షేమంకోరి లోకానుక□్యత కొరకై చేస్తున్నారు.** అట్లాగే నీవుకూడా సహజీవుల సానుకూల్యత కొరకై – లోక క్షేమం ఏమిటో చక్కగా పరిశీలించి కర్మలు నిర్వర్తించటమే సముచితం.

ఎందుకంటావా?

*శ్లో॥ యత్‌యత్ ఆచరతి శ్రేష్ఠః తత్ తత్‌ఏవ ఇతరో జనః ।*
*సయత్ ప్రమాణం కురుతే లోకస్తి అనువర్తతే ॥*

ఒక శ్రేష్ఠుడైనవాడు [ముఖ్యుడైనవాడు. Say a Leader or a Senior, A Head of the Family] ఏ ఏ ఉద్దేశ్యములతో, అవగాహనలతో కర్మలు ఆచరిస్తూ ఉంటాడో – తదితరులలో అనేకులు అదేమార్గంగా ఎన్నుకుంటూ ఉంటారు. ఆతనినే ప్రమాణంగా తీసుకొని తదితరులు ఆచరణను కొనసాగిస్తూ ఉంటారు.

ఉదాహరణకు...,

ఒకడు తల్లి – తండ్రులు పెద్దలతో తిరస్కారపూర్వకంగా, అవమానిస్తున్నట్లు మాట్లాడితే పిల్లలు కూడా "ఓహో! పెద్దలతో ఇట్లా పెంకిగా మాట్లాడవచ్చును కదా!".... అని నేర్చుకుంటూ ఉంటారు. అందుచేత తల్లితండ్రులు తమ ప్రవర్తన విషయంలో (తాము సరియే అని అనుకున్నా కూడా) జాగరూకులై ఉండాలి.

కనుక శ్రేష్ఠుడైనవాడు కర్మప్రయోజనములను అధిగమించిన ఆత్మజ్ఞాన దృష్టిని అభ్యసించవచ్చుగాక! "కర్మలకు – కర్మ ప్రయోజనములకు నాకు సంబంధంలేదు. వాటికి ఆవల గల ఆత్మను సందర్శిస్తూ ఉంటాను కదా!" ... అని అనుకోవచ్చుగాక! ... ఆతడు కర్మలు త్యజించక పోవటమే సముచితం. "కర్మ – కర్మఫల ధ్యాస అంతరంగంలో కలిగి ఉన్నవారు, కర్మలచే ఉద్ధరించబడవలసినవారు కర్మ భ్రష్టులు కాకూడదు కదా!".... అని అనుకొని లోకక్షేమం ఉద్దేశ్యించి ఆత్మజ్ఞానికూడా కర్మలు నిర్వర్తిస్తూనే ఉంటాడు.

ఉదాహరణకు, ....నా గురించే చెపుతాను. విను.

ఈ మూడు లోకములలో నాకు "ఇది చేయాలి – తద్వారా అది పొందాలి".... అనునదేమీ లేదు. నేను పొందవలసినది – నాకు తొలగవలసినది అంటూ నా ఉద్దేశ్యంలో నాకు ఏదీ కించిత్‌కూడా ఎక్కడా లేదు. అయినప్పటికీ ఈ శ్రీకృష్ణోపాధి యొక్క "లోకప్రయోజనం – ఉపాసనాప్రయోజనం" దృష్టియందు

ఉంచుకొని కర్మలు నిర్వర్తిస్తూనే ఉన్నాను సుమా! ఇప్పుడు ఈ 'పార్థరథ సారథ్యం' కూడా అట్టిదే కదా! ఒకవేళ "సర్వాంతర్యామిత్వం ఆస్వాదించే నేను ఒకానొక విధి ఎందుకు నిర్వర్తించాలి?" .... అని అనుకున్నాననుకో! అప్పుడు? అప్పుడు నన్ను శ్రేష్ఠుడుగా - అవతారమూర్తిగా భావించేవారందరూ, "మేము కర్మలు మానివేస్తాం,.... శ్రీకృష్ణమూర్తివలె"... అనే నిర్ణయానికి రావటం జరుగవచ్చు. అప్పుడు కర్మలే ఆధారముగా గల ఈ ప్రపంచంలోని కర్మచక్రాలకి అడ్డులు (Hurdles) తగులుతాయి. తల్లితండ్రులు "పిల్లలను వదిలేస్తాం. మేముకూడా కృష్ణుని ప్రమాణంగా తీసుకొని కర్మలు మానివేస్తాం".... అని అంటే? లోకమంతా కర్మలు మానివేసేవారివలన అల్లకల్లోలం అవుతుంది కదా! తదితర అనేకమంది జనులకు క్లేశములు వస్తాయి. అట్టి కర్మసంకరమునకు నేనే బాధ్యుణ్ణి అవుతాను. అందుచేత నేను నియమిత కర్మలను నిర్వర్తిస్తూనే ఉన్నాను.

అయితే...,

అందరూ కర్మలు చేస్తున్నారు. వారిని రెండు విభాగాలుగా విభజించవచ్చు.

1. ఆసక్తిపరులు (Those who have attachment).
2. అనాసక్తి పరులు (Those who have no attachment).

ఆసక్తిపరులు ఎంతగా సక్తతతో (with attachment) చేస్తున్నారో, కర్మతత్త్వం గ్రహించిన విద్వాంసులు అదే శ్రద్ధతో - అంతగానూ - ***ఆసక్తిరహితంగా*** నిర్వర్తిస్తూ ఉంటున్నారు. అందుచేత "కర్మలయొక్క పరిమితి" తెలిసియున్న విద్వాంసులు కర్మ ఫలములపట్ల సక్తతతో (Only with attachment) మాత్రమే కర్మ చేయగలవారిని ఆ కర్మలనుండి నిరుత్సాహపరచరు. ఎందుకంటే కర్మలు నిర్వర్తించబడితేగాని లోకవ్యవహారం నడువదు. అందరూ కర్మలు మానివేస్తే లోకమే నశించగలదు. జ్ఞాని కర్మనిష్ఠున్ని కర్మలకు ఉత్సాహపరచాలేగాని కర్మలను నిరుత్సాహపరచి ఉపశమింపజేయటం లోకశ్రేయం కాదు. జ్ఞాని తాను కర్మలు చేస్తూ, ఇతరులను ప్రోత్సహిస్తూ "కర్మయోగం" (కర్మలను ఆత్మజ్ఞానము

వైపు నడిపే ఉపకరణములుగా మలచుకోవటం) నేర్వాలి.

మరొక విషయం.

అసలు కర్మలు ప్రేరేపించేది ఎవరు? ప్రకృతి యేసుమా! - ప్రకృతికి చెందిన సత్వ - రజ - తమో గుణములు - ఆయా సందర్భములు జీవులను కర్మలకు ఉపక్రమింపజేస్తున్నాయి. కనుక ప్రేరేపణ ప్రకృతిదేగాని జీవునిది కాదు. అహంకారముచే విమూఢుడైన జీవుడు "ఇది నేనే చేస్తున్నాను సుమా! కర్తాఽహమ్".... అని ప్రకటించుకుంటున్నాడు. అయితే గుణ - కర్మ విభాగం అధ్యయనం చేసి గమనించిన తత్త్వవేత్త *"గుణములే గుణమూచే ప్రేరేపించబడా, తద్వారా గుణమూు కర్మరూపంగా ప్రదర్శనమగుచున్నాయి".... అని తెలుసుకొని, వాటిలో తన మనసూ - బుద్ధి కలిసిపోకుండా, తన్మయం కాకుండా చూచుకుంటున్నాడు.*

"పిల్లలపై నాకుగల మమకారం నాది కాదు. జంతు - పక్షి - మానవాది సకల జీవులలో తమతమ సంతానంపై ప్రేమ ప్రకృతి కల్పించి తద్వారా జీవజాతుల పరిపోషణ నిర్వర్తిస్తోంది. కనుక, ప్రేమ - కోపం - ఆవేశం - ఆశ - నిరాశ - ఉత్సాహం - ప్రేరణ - నిరుత్సాహం - ఉపశమనం - అన్నీక□డా ప్రకృతివే! నావి కావు. స్వార్థం - త్యాగం మొదలైనవన్నీ ప్రకృతి గుణాు. నేను వాటితో తాదాత్మ్యం చెంది లోకదర్శనం చేయటం అహంకారమే! కనుక నిరహంకారంగా వీటికి అప్రమేయమైయున్న ఆత్మ నాలోను - తదితరూులోను దర్శించెదనుగాక!" అని తత్త్వవేత్త ఒకానొక సమున్నతమైన అవగాహన కొనసాగిస్తూ ఉంటాడు.

ఒక మేకకు మేకపిల్లపై మమకారం ఎవరుపెట్టారు? ఒక పక్షికి గ్రుడ్డుపై, పక్షి పిల్లపై ప్రేమ ఎవరు నేర్పారు? ప్రకృతియే కదా! ఇదంతా గమనించి ఈ ప్రపంచంలోని సంబంధ - అనుబంధ - బాంధవ్య - ఇష్ట - అయిష్టాలతో తన బుద్ధిని తాదాప్యం చెందనీయడు. ప్రకృతికి సంబంధించిన గుణములతో తదాప్యంచెంది ప్రవర్తించే తదితర జీవులను చూచి కొంచం కూడా ఖేదం

పొందదు. ప్రకృతియొక్క పాత్రని గమనించకుండానే "నేనే ఇవన్నీ చేస్తున్నాను".... అనుకుని కర్మలు నిర్వర్తించేవారిని ఖండించడు. కర్మలు జరగవలసినదేకదా! జరుగుతూనే ఉంటాయికదా!

అయితే తత్త్వవేత్త కర్మలు చేస్తూ "ఇవన్నీ పరమాత్మని ఉద్దేశ్యించి - పరమాత్మకి సమర్పిస్తున్నాను.".... అనే అవగాహన బలవత్తరం చేసుకుంటూ ఉంటాడు. అందుచేత ఓ అర్జునా! **సర్వకర్మలుక□డా నాకు సమర్పించు.** కర్మలు చేస్తూనే అవన్నీ ఉపాసనాపూర్వకంగా పూజాద్రవ్యాలుగా భావించి నాకు ఇచ్చివేసి కర్మసన్యాసం వహించు. నాకొరకు మాత్రమే ఉద్దేశ్యించి కర్మలన్నీ చేయి. అంతరంగంలోగల ఆశలన్నీ వెడలగొట్టివేసి 'నిరాశి'వి కమ్ము. "నాది - నాకు చెందినది - నేను పొందవలసినది - నావారు."...ఇటువంటి సర్వ మమకారములు త్యజించియుండి కర్మలు నిర్వహించు. అన్ని ఆదుర్దాలు త్యజించి "నా ధర్మము ఇది కదా!" .... అను భావనతో ఈ యుద్ధం చేయి.

"స్వధర్మము - కర్మ నిర్వహణ" విషయంలో నేను చెప్పిన "కర్మలు నిర్వర్తించటం - సమర్పణభావంతో నిర్వర్తించటం - కర్మలు సన్యసించి ఉండటం" .... అనే కర్మయోగము యొక్క అంగములను ఎవరు అనువర్తిస్తారో, కర్మల పట్ల శ్రద్ధ వీడకుండా ఉంటారో, హృదయంలో 'అసూయ' ప్రవేశించనీయకుండా ఉంటారో... ***అట్టివారు తాము నిర్వర్తిస్తున్న కర్మలుచేతనే సర్వ కర్మ బంధములనుండు విముక్తి పొందగలరు.***

***ఉపాసనా పూర్వకం కర్మలు నిర్వర్తించే వారి విషయంలో, వారి కర్మలే వారికి ముక్తిని ప్రసాదించగలవు.***

అట్లాకాకుండా....,

ఎవ్వరైతే, "అయ్యో! ఈ కర్మలు నేనే చేయవలసివస్తోందే? అందరూ హాయిగా ఉన్నారే!".... అని అసూయ - ద్వేష - వేదనలకు చోటు ఇస్తూ, తమకు విధించబడిన కర్మల పట్ల అశ్రద్ధవహిస్తారో, దైవదూషణకు ఆత్మదూషణకు ఉపక్రమిస్తారో... వారు సర్వజ్ఞానవిమూఢులై అల్పత్వముతో కూడిన బుద్ధిని

పొందగలరని గుర్తు చేస్తున్నాను. అయినా, ఇక్కడ ఒక విషయం గమనించు! సకల జీవులు ప్రకృతి నుండి స్వభావమును పొందుచున్నారు. అట్టి స్వభావమునకులోబడి ఇష్టం ఉన్నా – లేకున్నా కర్మలు నిర్వర్తిస్తూనే ఉన్నారు. అనివార్యంగా నిర్వర్తిస్తూనే ఉంటారు కూడా! ప్రకృతియే జీవుల కర్మ – ప్రవృత్తికి కారణముగా అగుచున్నది. ఈ దేహము – ఇంద్రియములు మొదలైనవి ప్రకృతి చేతనే నిర్మింపబడి – వ్యవహరిస్తూ ఉండగా జీవునియొక్క "నేను కర్మలు చేయను" అనే పట్టుదల ఏమి చేయగలదు? కనుక ప్రతిజీవుడు తన ప్రకృతికి (లేక తన స్వభావమునకు) బద్ధుడై అనివార్యంగా కర్మలు చేయక తప్పేదేమీ కాదు.

అయితే జీవునికి కర్మలు నిర్వర్తించవలసి రావటంచేత బంధం ఏర్పడటం లేదు. మరి? రాగ – ద్వేషములే మనస్సును కలచివేయటానికి అసలు కారణం.

- కొందరంటే ఇష్టం (అనురాగం)
- మరికొందరంటే అయిష్టం (ద్వేషం).
- కొన్ని విషయాలు ఇష్టంగా – ప్రియంగా ఉంటాయి.
- మరికొన్ని విషయాలు – అప్రియంగా ఉంటాయి.

ఈ విధంగా జీవుడు ఇంద్రియములపట్ల – ఇంద్రియార్థముల పట్ల (శబ్ద – స్పర్శ – రూప – రస – గంధాదుల పట్ల) ఇష్ట – అయిష్టములు, రాగ – ద్వేషములు, తనకు తెలియకుండా – తానే అభ్యాసవశంచేత పెంపొందించుకొని ఉంటున్నాడు. ***అట్టి ఇష్ట – అయిష్టములకు వశుడై తనస్వరూప – స్వభావమును ఏమరచి ఉంటున్నాడు.*** అదియే జీవుని ఆనందమును ప్రక్కత్రోవపట్టిస్తోంది.


రాగ – ద్వేషములు ఈ జీవుని యందు అభ్యాసవశంచేత రూపు – దిద్దుకొని ప్రవర్ధమానమగుచున్నాయి. అది జీవునికి సర్వ బంధములు తెచ్చిపెడుతోంది. అందుచేత ***ఆ రాగద్వేషములే జీవునికి శత్రువులు.*** ఈ జీవుడు రాగద్వేషములచే దృశ్యపరంపరలకు బద్ధుడు కాకుండా తనను తాను కాపాడుకోవాలి సుమా! తాను వాటికి వశుడు కాకూడదు.

అందుచేత ఓ అర్జునా! ***ప్రతి ఒక్క జీవునికీ స్వదార్మనిర్వహణయే శ్రేయము.*** "వారు అట్లాఉన్నారుగా! వీరిట్లా చేస్తున్నారుగా! నేను నాధర్మం నిర్వర్తించకపోతే ఏం?" ... అని స్వధర్మాన్ని ఏమరచి పరధర్మాన్ని ఆశ్రయించటం క్షేమం కాదు. ఎవ్వరికైనా స్వధర్మమే సర్వదా శుభప్రదం. ఎవరెవరినో చూచి "నేనెందుకు చెయ్యాలి" అని తనకు విధించబడిన కర్మలు ఏమరచటం ఆతనికి అశుభప్రదము - భయకారణము అవుతుంది సుమా! ఒక సైనికుడివయి ఉండి యుద్ధధర్మము నిర్వర్తించవలసిన తరుణంలో, "నేను సన్యాసివలె, వానప్రస్తునివలె యుద్ధంనుండి విరమించి జ్ఞానవిచారణ చేస్తూ ఎక్కడో ఉంటాను" .... అను పరధర్మాశ్రయం నీకు భయ - చాంచల్యాలు కలుగుటకు కారణం కాగలదు. కనుక దోషములు ఉన్నప్పటికీ స్వధర్మమే ఎవ్వరికైనా శ్రేయస్సు కలుగజేయగలదు.

**అర్జునుడు:** హే భగవాన్! శ్రీకృష్ణా! ఓ వార్ష్ణేయా! "అందరూ కర్మలు చేస్తునే ఉన్నారు - ప్రకృతి చేతనే అందరూ ప్రేరేపించబడి కర్మలు నిర్వర్తిస్తున్నారు" అని మీరు అన్నారు కదా! అయితే, కొందరు - చేస్తున్న ఆయాకర్మలు ....... సహజీవులపై అసూయ - కోపం - ఆవేశం - తప్పులు పట్టుకోవటం - క్రోధం - దురాశ - దెప్పిపొడవటం - తమకే అన్యాయం జరిగిందని వాపోవటం - ఆత్మస్తుతి - పరనింద - 'ఎందుకొచ్చిందిరా' అని బాధపడటం .......... మొదలైన దోషాలతో కూడి ఉంటున్నాయి. ఆవేశ - కావేశాలతో మిళితమై కర్మలు చేస్తూఉండగా రోజులు గడచిపోతున్నాయి. చాలామందికి తాము "ఆవేశపడటం, అసూయపడటం, ద్వేషించటం, దూషించటం, గర్వించటం, ఏవేవో తదితరుల తప్పులు వల్లె వేయటం, 'పరిస్థితులు ఇట్లా ఉన్నాయే?" అని వేదన చెందటం, చెడు విషయాలు మరలమరల గుర్తు చేసుకొని నిష్ప్రయోజనంగా సంభాషించుకోవటం" - ఇవన్నీ తప్పేనని, కాలం వృధా చేసుకోవటమేనని బాగా తెలుసు. కానీ వారు తమకు ఇష్టంలేకపోయినప్పటికీ, కోరుకోకపోయినప్పటికీ, దోషములను ప్రవృద్ధంచేసే కర్మలు "ఏదో అదృశ్యశక్తి యొక్క హస్తలాఘవమా?" అన్నట్లుగా దోషభూయిష్ట - పాపభూయిష్ట భావములతో నిర్వర్తిస్తున్నారే! ఎందుచేత? బలవంతంగా - తీవ్రప్రేరణచే పాపపు

పనులు తెలిసికూడా కొనసాగిస్తున్నారే? అలా ***ఈ జీవులు ఎవరిచేత ప్రేరేపించబడుచున్నారు? ఎవరిచే అట్లు నియమించబడుచున్నారు?*** ప్రకృతియొక్క ప్రేరేపణతోనేనా? జీవుడే కారణమా? ఇంకెవరన్నా కారణమా?

**శ్రీకృష్ణుడు** : ఓ అర్జునా! "ఏదో కావాలి – ఏదో పొందాలి – ఇదంతా నేను అనుకున్నట్లే వారు, వీరు, ఇవి, అవి ఉండాలి – నేను చెప్పినట్లు వారు – వీరు చేయాలి – నేను చెప్పినదే వినాలి – నేను అనుకున్నట్లే జరగాలి"..... అనే ఒకానొక దోషగుణం జీవుడిలో ప్రవేశించి ఉంటోంది. దీనినే 'కామము' (Expectational Tendency) అని పిలుస్తున్నారు. "ఇట్లా ఉండాలి – అట్లా వీరంతా చేయాలి" అనే ఆవేశ సంకల్పాలు ఈ దృశ్య ప్రపంచముపట్ల జీవుడు కర్మలు నిర్వర్తిస్తూ – నిర్వర్తిస్తూ క్రమక్రమంగా తెచ్చిపెట్టుకొని మనస్సులో పేర్చుకొంటున్నాడు. అనుకున్నది అనుకున్నట్లుగా లేనప్పుడు, పొందాలనుకొన్నది పొందనప్పుడు, తాను అనుకున్నట్లుగా తదితర జీవులు ప్రవర్తించనప్పుడు, తన ఆశలు నెరవేరనప్పుడు ఇక క్రోధం బయలు దేరుతోంది. "నేను చదివించాను, పోషిస్తున్నాను, నేను అనుకున్నట్లుగా ఉండాలికదా?"... అనే కామ – క్రోధాలు క్రమంగా కొనసాగుచున్నాయి




జీవులు కర్మలు నిర్వర్తించటం అనివార్యం. అయితే ఆ కర్మలు సమర్పణ బుద్ధితో మమకార – అహంకారరహితంగా నిర్వర్తించటం ఏమరచి, ఈ జీవుడు ఆశ – పేరాశ – దురాశ – నిరాశలతో కూడినవాడై నిర్వర్తించటం ప్రారంభిస్తున్నాడు. ఇది రజోగుణం నుండి ప్రాప్తిస్తున్న దోషం. క్రమంగా ఆతడు కామ – క్రోధాలు (Expectation and Anger) ప్రవృద్ధం చేసుకొంటున్నాడు.

అయితే, "అనుకున్నవి అనుకున్నట్లుగా ఉండటం, జరగటం"... అనేదానికి అంతు ఎక్కడ? తద్వారా కామ – క్రోధాలు ఇంతకింతకూ ప్రవృద్ధ

మౌతున్నాయేగాని, అవి 'తీరటం' అనే మాట ఎక్కడిది? కామ - క్రోధాలే జీవునికి తెలిసి - తెలిసి దుష్టకర్మలు ఆశ్రయించటానికి కారణమగుచున్నాయి. *ఈ జీవుడు తన ప్రవర్తనను తానే ఉపశమింపజేయలేనంతగా కామ - క్రోధాలు దుష్టకర్మల వైపుగా ప్రేరేపకాలుగా అగుచున్నాయి.* కనుక ఓ అర్జునా! "*ఈ కామ - క్రోధాలు నాకు శత్రువులు! ఇవి నా పతనానికి, అజ్ఞాన యోనుల అనుభవానికికారణం కాగలవు!*".... అని గమనించు. కామ - క్రోధాలను నీవు యుద్ధం చేసి-చేసి ఓడించవలసిన (ప్రయత్నించి త్యజించవలసిన) శతృవులుగా చూడు. అంతేగాని "కామ - క్రోధాలు ఎవరికి మాత్రం ఉండవులే" .... అని నిన్ను నీవే ఓదార్చుకుంటూ వాటిని ప్రవృద్ధం చేసుకోకూడదు సుమా! ఎందుకంటే.... అవి అంతఃశత్రువులు.

ప్రతి జీవునిలోను ఆనందరూపమగు ఆత్మ జ్వాజ్వల్యమానంగా ప్రకాశిస్తోంది. ప్రతి జీవునికి ఆత్మగురించి తెలుసు. తన స్వరూపం తనకు తెలియక, మరొకరు చెపితేగాని తెలియకపోవటం ఏమిటి? అయితే, ఆ ఆత్మ జ్ఞానమును కామ - క్రోధ - లోభ - మోహ - మద - మాత్సర్యాదులు (అరిషట్ వర్గం - ఆరుగురు శత్రువులు) ఆవరించి ఉన్నాయి. అవియే ఈ జీవుడు తన ఆత్మానంద స్వరూపం తాను ఆస్వాదించకుండా అడ్డు తగులుచున్నాయి.

- పొగచేత కప్పబడిన అగ్ని వెలుగును ప్రదర్శించలేకపోవటం చేత చీకటి కొనసాగుతుంది చూచావా! అట్లాగే కామక్రోధాదులు ఆవరించినప్పుడు వాటి కారణంగా జీవునకు స్వస్వరూపాత్మ అనుభవం కావటం లేదు. అందుకు ఫలితంగా జీవుడు అజ్ఞానాంధకారంలో మ్రగ్గిపోతున్నాడు.
- అద్దం (Mirror) ధూళిచే కప్పబడినప్పుడు ప్రతిబింబం దోషభూయిష్టంగా కనబడుతుంది కదా! సుస్పష్టత ఉండదు కదా! అట్లాగే జీవుడు జ్ఞానస్వరూపుడై ఉండి కూడా... కామ క్రోధాదులచే నింపబడిన దృష్టిచే ('దృశ్యమ్ ఆత్మస్వరూపమ్' - తన స్వరూపమే - అయి ఉండికూడా) గజిబిజిగా, అనేక దోషములతోకూడి ఉన్నట్లుగా చూస్తున్నాడు.

– తల్లి గర్భంలో పెరుగుచున్న శిశువు క్రితం దేహాలకు సంబంధించిన అనేక అనుభవ జ్ఞానాలు కలిగి ఉండి కూడా 'మావి'లో ఉండి, తన హావభావాలు – అనుభవాలు – తెలివి తేటలు చెప్పుకోలేక, అనుభవానికివచ్చీ – రాక స్తబ్ధతతో ఉండిపోతుంది చూచావా? అట్లాగే ప్రతి ఒక్కని అంతరంగంలోను స్వస్వరూపజ్ఞానం ప్రకాశిస్తున్నప్పటికీ దృశ్యసంబంధమైన ఆశ – పేరాశ – నిరాశ – కోపం – ఆవేశం – వేదన – పగ – ఆభిజాత్యం – భయం ......ఇటువంటివన్నీ జ్ఞానమును ఆవేశించి ఉండటంచేత ''అఖండమగు ఆత్మను నేనే'' అనే పరమసత్యము అనుభవానికి రావటం లేదు.

కనుక ఓ అర్జునా! జ్ఞానికి వేరే శత్రువు అంటూ ఉండదు. *కర్మయోగి తన జ్ఞానాన్ని ఆవరించి ఉన్న కామక్రోధములే తనకు శత్రువులని, తాను సమర్పితబుద్ధితో క□డున కర్మలచే, స్వధర్మములచే కామక్రోధాలను జాగరూకతతో జయిస్తూ ఉండాలని తన ఆశయమును బలపరచుకుంటూ ఉంటాడు. జ్ఞానికి ఆతని దృష్టిలో నిత్యవైరులు ఆతని కామక్రోధములే!* ఈ కామములు, అగ్నికి ఆజ్యంలాగా, తీరుతున్న కొలది ప్రవృద్ధమౌతూనే ఉంటాయి. (The wishes and expectations never end up by fulfillment, because new wishes and new expectations emerge ahead and multi-fold again and again while existing expectations are being attempted to be met). తగలబడుతున్న అగ్నిలో కట్టెలు వేసినకొలదీ అగ్ని ఉపశమిస్తుందా? లేదు. ఇంకా ప్రవృద్ధమౌతుంది కదా!

అయితే *ఈ కామ – క్రోధ – లోభాలు ఉండే స్థానం ఏమిటి?* అది గమనించు. అవి ఈ దృశ్యంలో లేవు. ఈ జీవునిచే ప్రదర్శించబడుచున్న కామ – క్రోధాలు ఈతని అంతరంగంలో తిష్టవేసుకొని ఈ జీవుడు కష్టపడి సంపాదించుకున్న 'మానవజన్మ' వంటి ఉత్తమ జన్మలను, ఉత్తమ గుణాలను భ్రష్టు పట్టిస్తున్నాయి. అవి క్రమంగా ఇంద్రియములందు చోటు చేసుకుంటున్నాయి. ఇంద్రియ విషయములపై మునుముందుగానే ప్రసరించి అమృతతుల్యమగు దృశ్యమును విషతుల్యంగా అనుభవం అయ్యేటట్లు చేస్తున్నాయి. అంతేకాదు. అవి మనస్సులో ప్రవేశించి మనస్సుపై పెత్తనం చెలాయిస్తున్నాయి.

తనయొక్క ఆలోచనలను కామ – క్రోధ – లోభ – మోహాదులతో కూడినవై బయల్వెడల తీస్తున్నాయి. ఈ కామ – క్రోధాలు అంతటితో ఆగక, బుద్ధిలోకూడా ప్రవేశించి బుద్ధిని కలుషితం చేస్తున్నాయి. (The Logic is getting polluted because of worldly wishes and expectations). కనుక దోషములు కర్మలలో లేవు. భావన – ఆలోచన – ఉద్దేశ్యములలో దోషములు పేరుకొని ఉంటున్నాయి. అప్పుడిక అనుభవాలు, ఉద్దేశ్యాలు, అవగాహనలు, అభిప్రాయాలు కూడా మరికొన్ని దోషాలు తెచ్చిపెట్టుకుంటున్నాయి.

అందుచేత ఓ భరతర్షభా! మునుముందుగా ఈ ఇంద్రియములను సరి అయిన మార్గంలో నియమించు. "నేను కామ క్రోధములు ప్రవృద్ధమయ్యే మార్గంలో ఇంద్రియములను నియమిస్తూ కార్యములను ఆశ్రయించటం లేదుకదా?" .... అని తరచి తరచి ప్రశ్నించి, సరి అయిన విచక్షణతో ఇంద్రియములను ఉపయోగించు. "నేను మాట్లాడేది, చూచేది, వినేది, నిర్వర్తించేది... కామ – క్రోధ రహితమైనదేనా? కాదా?"... అని మరల మరల పరిశీలించి, అప్పుడు ఇంద్రియములను నియమించు. లేదా? కామ – క్రోధములు కొనసాగిస్తూ.... ఇంద్రియములు కర్మలలో నియోగించబడ్డాయా, అప్పుడు ఆ కర్మలలో అనేక దోషాలు కొనసాగుతాయి. ఆ కర్మలన్నీ జ్ఞాన – విజ్ఞానాలను పెడత్రోవను పట్టిస్తాయి.

ఇంద్రియములతో జీవుడు కర్మలు నిర్వర్తిస్తున్నాడు కదా! అయితే ఇంద్రియములను నియమిస్తున్నది ఎవరు? మనస్సు (లేక) ఆలోచనలు. కనుక ఇంద్రియములకంటే ఆలోచనలు ఉన్నతమైనవి కదా! ఇంద్రియ సమన్వితమైన ఈ భౌతిక దేహం నేలకూలినప్పటికీ ఆలోచనలు కొనసాగుతూనే ఉంటాయి. (ఇందుకు దృష్టాంతం స్వప్నమే!) ఆలోచనల రూపమైన మనస్సు ఎందులోంచి బయల్వెడలుతోంది? విచక్షణారూపమైన బుద్ధి (Logic / Differentiation) నుండి. కనుక మనస్సుకన్నా బుద్ధి సమున్నతమైనది. అటువంటి బుద్ధి ఎద్దానిలోంచి ప్రదర్శించబడుతోంది? ఆత్మనుండి. కనుక ప్రతిఒక్క జీవుని బుద్ధికి ఆవల పరమాత్మ సర్వదా – అనుక్షణికంగా వేంచేసి ఉన్నారు.

బుద్ధితో తన యందలి అట్టి పరమాత్మయొక్క సందర్శనమే జీవునికి ప్రశాంతతను ప్రసాదించగు ఏకైక స్థానం.

అనగా బుద్ధికి ఆవల ఉన్న జ్ఞానానందమయమగు పరమాత్మను బుద్ధితో గ్రహించాలి.

ఓ అర్జునా! అట్టి పరమాత్మయొక్క సర్వే - సర్వత్రా వేంచేసియున్న రూపమును ఆస్వాదిస్తూ నీవు క్రమంగా దుర్జయ శత్రువులైన కామ - క్రోధాలను జయించివేయి.

ఆత్మానందం ఆస్వాదించు.

*ఇతి భాగవద్గీతా ..... కర్మయోగ పుష్పః*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు.*

★★★

శ్లో॥ న హి జ్ఞానేన సదృశం పవిత్రమ్ ఇహ విద్యతే ।
తత్ స్వయం యోగసంసిద్ధః కాలేన ఆత్మని విందతి ॥

ఇహ జ్ఞానేన సదృశమ్ పవిత్రమ్ హి న విద్యతే ।
తత్ (జ్ఞానం) యోగ సంసిద్ధః కాలేన ఆత్మని విందతి ॥

ఈ దృశ్యజగత్తులో 'ఆత్మ జ్ఞానము'తో సమానమైన పవిత్రవస్తువు ఇంకేదీ ఎక్కడా లేదు. యోగసాధనలతో సంసిద్ధుడగుచున్న యోగి హృదయంలో ఆత్మజ్ఞానం క్రమంగా వికసించగలదు.

# 4.

# జ్ఞాన యోగ పుష్పం

**శ్రీకృష్ణభగవానుడు** : ఓ అర్జునా! సర్వకర్మలు "నాయొక్క నియమిత ధర్మానుకూలమేనా? కాదా?" అని పరీక్షించుకుంటూ, ఆ యా సర్వకర్మలను దేహమును ప్రసాదించి సంరక్షిస్తున్న దేవతలకు ఆనందకరంగా సమర్పించటం" – ఇదియే కర్మమార్గం. సర్వాత్మకుడగు సర్వేశ్వరునికి సమర్పణ పూర్వకంగా ఆశ – నిరాశ – మమకారం – అహంకారములు లేనివాడవై, ఎట్టిమానసిక వేసట లేకుండా భగవత్‌సేవాపుష్ప సమర్పణగా స్వధర్మములను నిర్వర్తించటం 'కర్మమార్గం'అని నిర్వచించుకున్నాము కదా! యోగస్థుడవై నిర్వర్తించే కర్మలు నీకు మోక్షమార్గాలు కాగలవు.

ఇట్టి కర్మయోగము సృష్టి ప్రారంభంలోనే సూర్యభగవానునికి బోధించాను. సూర్యభగవానుడు మానవజాతి యొక్క మనుగడ – ప్రవర్తనా విధానములను సశాస్త్రయుక్తంగా గ్రంథస్థం చేసినట్టి మనువునకు బోధించి యున్నారు. మనువు ప్రజాపాలకుడగు 'ఇక్ష్వాకుడు' అనే రాజర్షికి బోధించారు. ఇట్లా ఈ కర్మయోగం కాలానుగతంగా ఒకానొక పరంపరగా బోధింపబడుతూ రాగా రాగా, కాలక్రమేణా, అద్దానిని అనేకమంది రాజర్షులు గ్రహించి ఆచరించి

చూపటం ... జరుగుతూ వచ్చింది. అయితే కాలచమత్కారం చేత క్రమంగా కర్మయోగ పాత్యాంశమైనట్టి "**స్వధర్మమును శ్రద్ధగా నిర్వర్తించి మోక్షమార్గం సుగమం చేసుకొనుట**"ను జనులు ఏమఱుస్తూ వస్తున్నారు. కర్మల ప్రయోజనంగా ఉన్నతి పొందవలసినది పోయి, కామ–క్రోధ–లోభ–మోహాలచే ప్రభావితులై దుఃఖితులు అవటం జరుగుతోంది. అందుచేత పురాతన కాలంలో నాచే సూర్యభగవానునికి బోధించబడిన ఉత్తమమైన కర్మయోగ విశేషాలను, రహస్యాలను ఈ రోజు నాకు భక్తుడవు – సఖుడవు అగు నీకు కూడా చెప్పుచున్నాను. ఈ మన గీతాగానము ద్వారా మరల లోకములకు బోధించటం జరుగుతోంది

**అర్జునుడు** :– స్వామీ! ఒక్క నిమిషం! ఒక చిన్న ప్రశ్న

- మీరు .... కొన్ని సంవత్సరముల క్రితం భూమిపై జన్మించియున్నారు.
- ఇక సూర్య భగవానుడు .... కొన్ని వేల – లక్షల ఏళ్ళక్రితంనుండియే ఆకాశంలో ప్రకాశిస్తున్నారు.
- "ఆ సూర్యభగవానునికి నేను కర్మయోగ రహస్యాలు మొట్టమొదటే బోధించాను" .... అనే వాక్యం నేను ఎట్లా సమన్వయించుకోవాలో .... గమనించలేకపోతున్నాను.

**శ్రీకృష్ణభగవానుడు** : ఓ అర్జునా! నా యొక్క సత్ – చిత్ తత్త్వం ఈ దేహంతోనే ప్రారంభమైనదని అనుకుంటున్నావా? కానే కాదు. నాకు అనేక దేహాలు వచ్చాయి. పోయాయి. నాకే కాదు. నీకు కూడా ఈ నీ వర్తమానదేహం కంటే ముందు అనేక దేహాలు జనించి – గతించి ఉన్నాయి. 'దేహ – దేహాంతరములు' అనే మాయకు ఆవల ఉండి నేను దర్శిస్తూ ఉండటం చేత, మాయచే కల్పించబడే ఈ దేహాలన్నీ నేను ఎఱుకయందు కలిగియే ఉన్నాను. 'వర్తమాన దేహతదాత్మ్యము' అనే మాయయందు నీ దృష్టి పరిమితమవటం చేత .... అవన్నీ నీవు గమనించలేక పోతున్నావు. దృష్టిలో పెట్టుకోలేక పోతున్నావు.

వాస్తవానికి నాకు జన్మలే లేవు. జన్మలకంటే మునుముందుగా జన్మించు

వాడు ఉండాలి కదా? లేకపోతే జన్మలు ఎవరికి? ఈ జన్మల ప్రహసనం యొక్క ప్రారంభానికి మునుముందుగా ఏర్పడిఉండే ఆత్మ స్వరూపుడను నేను. అనగా, జన్మ – కర్మలచే మార్పు – చేర్పులు పొందని అవ్యయమగు ఆత్మను. ఇక నాకు ఈ దేహాలు ఎట్లా ఏర్పడుచున్నాయంటావా? నా యొక్క నియామక చమత్కారం చేతనే! నేను పంచ భూతములచే నిర్మించబడే వాడను కాను. వాటిని నేనే నియమించి దేహాలు పొందుతాను. నేను నా ప్రకృతిని అధీనం చేసుకొని ఆత్మమాయాచమత్కారంగా ప్రకృతియందు సంభవిస్తూ ఉంటాను. ప్రకటితం చేసుకుంటూ ఉంటాను. అనగా, నా ప్రకృతియందు నేను దేహరూపంగా ప్రత్యక్షమౌతూ ఉంటాను. నిర్గుణ తత్వం నుండి సగుణతత్వం ప్రదర్శిస్తూ ఉంటాను. (అందుకే శ్రీకృష్ణస్వామిని 'అవతారమూర్తి' అని పురాణద్రష్టలు గానం చేస్తున్నారు.)

[అలాగే, ప్రకృతికి ఆవలగల తమ స్వరూపం ఏమరిచినప్పుడు ... అట్టి అజ్ఞాన స్రవంతిలో కర్మలచోదనం చేత కూడా దేహాలు వస్తూ – పోతూ ఉంటాయి. అట్టి వానిని 'జీవుడు' అని పిలుస్తున్నారు.]

ఆత్మ ధర్మ స్వరూపుడనగు నేను సృష్టి ధర్మాలకు గ్లాని (హాని) కలిగినప్పుడు, అధర్మము ప్రబలుచున్నప్పుడు నన్ను నేనే ఈ సృష్టియందు సృష్టించుకుంటూ ఉంటాను. సాధుజనులకు ఆశ్రయభూతుడనగునేను సాధుజనులను సంరక్షించటానికి, దుష్కృతులైన జీవులను సుశిక్షించటానికి, ధర్మమును సంస్థాపించి తద్వారా సృష్టికి శ్రేయస్సు కలుగజేయటానికి యుగయుగములలో ఆయా సమయములలో ఆయా ప్రదేశములలో అవతరిస్తూ ఉంటాను.

చూచావా....!

- జన్మలనేవి ఏ క్షణంలోనూ ఏ మాత్రం లేని నేను నా ప్రకృతిని ఉపకరణంగా తీసుకొని యోగమాయచేత దేహరూపములతో ప్రకృతియందు దేహస్వరూపంగా ప్రత్యక్షం కావటం ...,

- కర్మలకు ఆవల అతీతమగు ఆత్మ స్వరూపుడనై ఉండి కూడా, ........ 'అవతరించటం' అనే కర్మ నిర్వర్తించటం

ఇట్టి నా యోగమాయా చమత్కారం తత్త్వతః (వెనుకగల తాత్విక విశేష సమన్వయ పూర్వకంగా) ఎవరు గమనిస్తారో, ..... తెలుసుకుంటారో, ........వారు కూడా పునర్జన్మ రహితులౌతారు. జన్మ-కర్మలకంటే ముందే ఏర్పడియున్న నిర్విషయ - అఖండ - అప్రమేయ ఆత్మతత్వమే తమ స్వరూపంగా గ్రహించి ... జన్మరాహిత్యం సంపాదించుకుంటారు.

అట్లా అనేకులు జన్మరాహిత్యం (జన్మించినప్పటికీ - "నాకు జన్మలు లేవు" ... అను అవగాహన) సముపార్జించుకొంటున్నారు. ఏ విధంగా? వారు 'జ్ఞానము' అనే తపస్సుచే హృదయంలో గల అజ్ఞానాంధకారం తొలగించుకొంటున్నారు. 'నాది' అనే రాగము (Attachment), "ఏదో కోల్పోతున్నామేమో? మును ముందు ఇక ఏమికానున్నదో?" అనే భయము, "వీరు సానుకూల్యురు కాదు. వీరి సంగతి చూడాలి..." అనే క్రోధము ఆ అజ్ఞానాంధకారము యొక్క ముడిపదార్థాలు (Raw-material). "నాది - నేను" అనే మమకార - అహంకారములను 'ఉపాసన' అనే ఉపకరణంతో తొలగించుకొని 'జన్మకర్మలకు సంబంధించని ఆత్మయే నేను' .... అని నేను చెప్పుచున్న - నాకు సర్వదా అనుభూతమగుచున్న 'ఆత్మాఽహమ్' భావనకు చేరారు. చేరుచున్నారు. చేరగలరు.

కొందరు జన్మ - కర్మల అతీతత్వమును సముపార్జించుకోవటం ఉపాసిస్తూ ఉంటే, .... ఇక మరికొందరేమో ..... రాగ - భయ - క్రోధములు ఇంకనూ శేషించినవారై ఉంటున్నారు. ప్రాపంచికమైన స్థితి-గతులకై దేవతలను ఉపాసిస్తున్నారు. ఎవరు ఏ ఆశయము కొరకై ఉపాసిస్తున్నారో .... వారికి అది నేను ఆయా దేవతారూపుడనై సిద్ధింపజేస్తున్నాను. అనుగ్రహిస్తున్నాను. ఎవ్వరు ఏ రూపంగా ఎద్దానిని ఉపాసిస్తున్నారో ... వారు ఆరూపంగాఉన్న నన్నే ఉపాసిస్తూ, నా నుండియే ఆయా పరిలక్షిత ప్రయోజనములు పొందుచున్నారు.

ఈ మానవలోకంలో ఒకానొక కర్మ సిద్ధాంతము పరఢవిల్లుతూ ఉంటుంది. ఎవరు ఏ ఫలములను కోరి ఆయా దేవతలను ఉపాసిస్తారో .... ఆయా ఉపాసనా క్రమమును అనుసరించి త్వరితగతిగా ఆయా దేవతలనుండి ఆ ఉపాసకులు తాము కోరుకునే ఫలములను పొందుతూ ఉంటారు. ఉపాసన – శ్రద్ధలను అనుసరించి ఎవ్వరు ఏది పొందాలని ఆయా శాస్త్ర విహిత కర్మలను నిర్వర్తిస్తారో ... ఆ ఫలాలు తప్పక పొందుతారు. ఈవిధంగా ఎవరు దేనిని పొందాలని ఉద్దేశించి "పూజ– దేవతార్చన – అనుస్మరణ" మొదలైన కార్యక్రమములను నిర్వర్తిస్తారో .... ఆయా జీవుల ఆ ఉద్దేశ్యములను అనుసరించి నాలుగురీతులుగా జీవులు విభజించబడుచున్నారు.

(1) **బ్రహ్మయతులు** : "ఇదంతా పరబ్రహ్మస్వరూపమే కదా! నాతో సహా సర్వము అద్వితీయ నిరామయ – నిరాకార – నిర్గుణ బ్రహ్మము యొక్క చమత్కార సంప్రదర్శనమే" అనే అవగాహన పెంపొందించుకోవటానికి మనస్సు యొక్క (లేక దృష్టియొక్క) శుద్ధి కొరకై కర్మలు, ఉపాసనలు చేపట్టేవారు.

(బ్రహ్మయతులగు బ్రాహ్మణులు : సాత్విక ఉపాసకులు)

(2) **క్షత్రియ స్వభావులు** : వ్యవహారదక్షత, కార్యదీక్ష, పరిస్థితుల సానుకూల్యము, పేరు – ప్రతిష్ఠలు ... ఇటువంటి వ్యవహారికమైె ఆశయములతో వాటి సముపార్జనకై పరమాత్మను ఉపాసించేవారు (క్షత్రియ స్వభావులు : రాజసికోపాసకులు, సామర్థ్యరాజసికులు)

(3) **వైశ్య స్వభావులు** : వస్తుసమృద్ధి – ధన – గృహ – సంపద – మొదలైనవి పొందటానికి పరిలక్షితులై దైవోపాసనకు ఉపక్రమించేవారు.

(వైశ్య స్వభావులు – సంపద సంసిద్ధి రాజసికులు)

(4) **శూద్ర స్వభావులు** : ఇంద్రియ సంబంధమైన అనుభవముల సంప్రాప్తికై దైవోపాసనను ఆశ్రయించేవారు.

(శూద్ర స్వభావులు : ఇంద్రియానందాశ్రిత తామసికులు)

ఈ విధంగా సాత్విక – రాజసిక – తామసిక గుణ మిశ్రమములను అనుసరించి జీవులు నాలుగు రకాల వర్ణములు – స్వభావములు కలిగి యుంటున్నారు. అయితే .... ఈ చాతుర్వర్ణ్యములకు రచయితను నేనే! గుణ–కర్మ విభాగములను అనుసరించి ఈ చాతుర్వర్ణ్య చమత్కారములతో కూడిన ఈ జగత్ రచన కొనసాగిస్తూ ఉన్నాను. ***నవలలోని నవరసాలు నవలారచయిత యొక్క నవనవోన్నత నాటకరచనా వ్యాసంగము నుండు నవోద్భావించినవే కదా!***

అయితే, సర్వాంతర్యామినగు నేనే ఈ గుణ–కర్మ విభాగ పూర్వకములగు 4 వర్ణములకు (బ్రాహ్మణ స్వభావ – క్షత్రియ స్వభావ – వైశ్య స్వభావ – శూద్ర స్వభావ విభాగములకు) "కర్త" అయినప్పటికీ ..., నన్ను సర్వవ్యవహారసరళికి ఆవల ఉన్నవాడుగా గమనించు. దర్శించు. నవరసములతో కూడిన నాటకములోని ఆయా వివిధ పాత్రలకు, వారి స్వభావ – సంభాషణలకు రచయితే సృష్టికర్త అయినప్పటికీ ... నాటక రచయిత నాటకములోని ఒక పాత్ర కాదు కదా! అట్లాగే ''మనందరి ఆత్మ స్వరూపము జగన్నాటకములోని గుణ–కర్మ–బద్ధమైన ఒకానొక పాత్ర కాదు" ..... అని గమనించబడుగాక!

ఓ అర్జునా! ఒక నాటకరచయితవలె "సర్వజగదంతర్గత నాటక పాత్రల అంతర్యామి" యగు నన్ను నా విరచితమైన జగత్‌నాటకంలోని పాత్రల గుణ – కర్మ – స్వభావాదులు స్పర్శించవు. ఈ గుణ – కర్మ – స్వభావాలను అనుసరించి "పరమాత్మ ఇట్టివాడు" అని ఎట్లా అంటావు? నాటక రచనలోని పాత్రల స్వభావములు – స్వరూపములు కర్మలు రచయితకు ఆపాదించలేం! అంతేకాదు. ఆయా పాత్రల యొక్క కర్మల వ్యవహారం పట్ల నాకు ఎట్టి ఇష్ట – అయిష్టములు గాని ఉండవు. "నాటక రచయితకు ఈ ఈ పాత్రల ప్రవర్తనంటే ఎంతో ఇష్టం – లేక అయిష్టం".... అని అనంకదా! అట్లాగే నాకు "కర్మల స్పృహ – కర్మల ఆసక్తి" మొదలైనవి లేవు. ఈ విధంగా ఎవ్వరైతే నన్ను జగన్నాటకు సూత్రధారిని అయి ఉండికూడా......,

- కర్మల - గుణముల ఆసక్తి - అనాసక్తులు,
- కర్మల - గుణముల - అభిమాన - ద్వేషములు,
- కర్మ - గుణముల ఇష్ట - అయిష్టములు,
- కర్మ - గుణముల బంధ - మోక్షములు........,

ఏ మాత్రం అంటనట్టి "అప్రమేయము - అనునిత్యము - అఖండము" - అగు సర్వాంతర్యామిగా గమనిస్తూ - దర్శిస్తూ ఉపాసిస్తూ ఉంటారో .. అట్టివారు సర్వకర్మబంధముల నుండి స్వభావసిద్ధంగా విముక్తులు అగుచున్నారు. అనగా "కర్మల వలన నాకు బంధము" ... అనే భ్రమ నుండి విడివడుచున్నారు.

ఓ అర్జునా! "పరమాత్మ కర్మలకు అతీతమైన అంతర్యామియగు ఆత్మస్వరూపుడు కదా!" అని గ్రహించియే, పూర్వంలో ఆయా ముముక్షువులు అట్టి తమ అఖండాత్మ స్వరూపమును "నిర్దుష్టము - సుస్పష్టము' చేసుకొనే ప్రయత్నంలో సాధనాపూర్వకంగా కర్మయోగవిధానంగా స్వకర్మలు నిర్వర్తించారు. ఏ విధంగా పూర్వ-తత్పూర్వ ముముక్షువులు ఉపాసనారూపంగా ఆత్మజ్ఞాన సమన్వితులై స్వధర్మములు నిర్వర్తించారో ..... నీవుకూడా అట్లాగే నిర్వర్తించు.

చూచావా ఫల్గుణా! "ఏఏ కర్మలు చేయాలి?", "ఏ ఉద్దేశ్యంతో చేయాలి?" అనే విషయంలో ఎంతో వేద-వేదాంగ పరిణతిగల కొందరు పండితులు కూడా మోహం చెందుతూఉంటారు. అది దృష్టిలో పెట్టుకొని 'కర్మతత్త్వము' ఏమిటో ఇప్పుడు చెప్పుకుందాం. కర్మల యొక్క ఉద్దేశ్యము - ప్రయోజనము - ఆశయములు ఎట్లా ఉంటే, అవి ఆ కర్తను అశుభమగు సంసారము నుండి ఉద్ధరిస్తాయో .... అట్టి "జ్ఞాన సమన్వితమైన కర్మ నిర్వహణ", గురించి మరికొంత వివరిస్తున్నాను.

ముందుగా ఈ విషయాలు చక్కగా తెలుసుకోవాలి

(1) **కర్మాద్వారా ఉపాసన** : కర్మల స్వరూపం ఎటువంటిది? కర్మలనేవి ఎందుకున్నాయి? (మనం చేయవలసిన కర్మలు పరమాత్మచే మనకు

ఉద్ధరణకై అవకాశంగా ప్రసాదించబడినవి – కర్మ బ్రహ్మోద్భవం విద్ధి)

(Our functions are a facility accorded to us to reach God)

(2) **యజ్ఞకర్మ** : "జగత్‌యజ్ఞములో నా స్వధర్మములు నాకు నియమించిన యజ్ఞకర్మవిభాగములు" అని గ్రహించిఉండటం.

(3) **విహిత – అవిహిత కర్మ నిర్ణయం** : నేను చేయవలసిన కర్మలు ఏమిటి [Do's] ? – చేయకూడని కర్మలు ఏమిటి [Don'ts]?" అని శాస్త్రములను, పెద్దలను సంప్రదించి లోక–శాస్త్ర సానుకూల్యంగా, లోకహితం దృష్టిలో పెట్టుకొని అసంగమైన బుద్ధితో నిర్వర్తించటం, "వికర్మ" (చేయకూడని కర్మలు – ఉండకూడని దురుద్దేశాలు) ---> హృదయమునుండి తొలగించుకోవటం

(4) **కర్మాతీత ఆత్మ సందర్శనం** : కర్మలు నిర్వహిస్తున్న సహజీవులలోను, తనయందు, తదితరుల రూపంగాను, తన రూపంగాను .... ఏ ఆత్మతత్వము ప్రదర్శితమౌతోందో ... అట్టి స్వస్వరూపాత్మ సర్వదా నిష్క్రియము. జన్మ – మృత్యు కార్యవ్యవహారములకు కూడా సర్వదా అప్రమేయమైనది. సంబంధించనిది ---> ఇట్టి అకర్మతత్వాన్ని గ్రహించటం.

ఈ విధంగా కర్మ – యజ్ఞకర్మ – వికర్మ – అకర్మల శాస్త్ర ప్రవచిత గూఢార్థాన్ని చక్కగా గ్రహించి కర్మలు నిర్వర్తించటము జ్ఞానకర్మయోగము. ఈ విధంగా కర్మతత్వము అతి గూఢమైనది, సూక్ష్మమైనది సుమా!

ఎవ్వరైతే ... జగత్‌దృశ్యంలోని సర్వజీవుల వారివారి కర్మలను చూస్తూ .... వారందరు కర్మాతీతమగు ఆత్మస్వరూపముగా దర్శిస్తారో, (అనగా) కర్మలలో అకర్మతత్వమగు ఆత్మను (సర్వవ్యవహారములందు పరమాత్మయే అంతర్లీనంగా ప్రసరించి ఉన్నారని) ...... దర్శిస్తారో, సర్వకర్మలు – వాటిని నిర్వర్తించే జీవులు "ఆత్మయందు – ఆత్మకు అనన్యమై (స్వదృష్టిభేదంచేత మాత్రమే ఆత్మకు వేరుగా

ఉన్నట్లుగాను), ఆత్మదృష్టి చేత సర్వము ఆత్మ స్వరూపంగాను ..... (పరమాత్మయే సర్వవ్యవహారములుగా కనిపిస్తున్నారని) దర్శిస్తారో .....

అట్టి దార్శనికులు అందరిలోకీ 'ఉత్తమ బుద్ధి సమన్వితులు' అని అనిపించుకుంటారు. అట్టి ఆత్మదృష్టియోగులు "సర్వకర్మలయొక్క ప్రయోజనం సొంతం చేసుకొన్న వారు" అగుచున్నారు.

దృష్టాంతానికి .... తరంగాలన్నిటిలో ... ఒకే జలం ఉన్నదని, జలంలోనే .... తరంగాలన్నీ ఉన్నాయని గ్రహించిన తరువాత, అప్పుడు "ఈ ఈ తరంగాలను ఆశ్రయిస్తే గాని మరి జలం ఎక్కడున్నదో తెలియదుకదా?".... అనే మీమాంస ఇక మిగలదు కదా!

అటువంటి "**ఆత్మీదృష్టి – ఆత్మసాక్షాత్కారం – ఆత్మతత్వానుభూతి – మమాత్మా సర్వభూతాత్మానుభూతి**" సంపాదించుకోవటం అత్యంతికమైన ఆశయము. అట్టి మహాశయుడు తాను అనివార్యంగా చేయవలసి వస్తున్న కర్మలను (The functions that he has to inevitably discharge ) ఆత్మీదృష్టి అలవరచుకొనే ఉపకరణములుగా మలచుకోవచ్చు. ఎట్లాగో చెపుతాను. విను.

(1) **కామసంకల్ప వర్జితాః సమారంభాః** : ఎవనిచే కర్మలు ప్రారంభించేటప్పుడే "ఈ రీతిగా సర్వాత్మకుడగు పరమాత్మను ఉపాసిస్తున్నాను" అనే భావంతో ("ఏదో పొందాలి" .... అనే దృశ్యవ్యాపకానికి అతీతత్వం వహించి) నిర్వర్తిస్తాడో, అతడు వివేకి. చేసే కర్మల ఉత్తమోత్తమ ప్రయోజనానికి స్వభావసిద్ధంగా అర్హుడు. ఎవడు కామ సంకల్పములను వర్జించి ఉంటాడో, అతడు ఆత్మోన్నతి సముపార్జించుకొంటాడు.

(2) **జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణః** : నిత్య – అనిత్య వివేకముతో నిర్మలమైన మనస్సు – జ్ఞానము సంపాదించుకొనే ఉద్దేశ్యముతో కర్మలు నిర్వర్తించటం ప్రారంభించేవాడు జ్ఞానాగ్నితో కర్మలు అనే ఉపకరణములను పరిశుభ్రపరచుకొని, తళ-తళ మెరిసే బంగారంలాగా కర్మలను తీర్చిదిద్దుకున్నవాడు అగుచున్నాడు. అట్టివాడే పండితుడు.

(3) **త్యక్త్వా కర్మఫలాసంగం** : కర్మలు చేస్తూ ఆకర్మలను పరమాత్మసమర్పిత పుష్పములుగా భావన చేశావనుకో. అప్పుడు "కర్మలైతే చేస్తున్నాను. మరి ఎందుకు చేస్తున్నాను? ఈఈ ఫలితాల కోసం కదా! అవి లభిస్తాయో? లేదో మరి?" .... అనే కర్మఫలాసక్తి, కర్మ ఫలాసంగం (Attachment for the results) నీకు ఉండదు. కర్మ ఫలముల పట్ల సక్తత (Attachment) లేకుండా కర్మలను చేస్తూ ఉంటే ..... అప్పుడు నీవు 'అకర్మిష్టుడు' అవుతావు. కర్మ నీకిక బంధం అవదు.

(4) **నిత్య తృప్తో** : కర్మలు నిర్వర్తించటం అనివార్యం కదా! వాటిని నిర్వర్తిస్తూ ఉన్నప్పుడే ఒకానొక నిత్యతృప్తిని (A continuous state of satisfaction) అభ్యాసవశంగా అలవరచుకొన్నవాడు తన తృప్తిస్థితికై ఇక కర్మ ఫలముల వరకు వేచి ఉండవలసిన పనేమున్నది? ఆతడు కర్మలు చేయనివాడే అవుతాడు. అనగా కర్మబంధములు ఆతనికి ఉండవు.

(5) **నిరాశ్రయః** : ఎవడైతే కర్మలు నిర్వర్తిస్తూ కూడా దేనినీ ఆశ్రయించక, ఆ కర్మ ఫలములపై ఆధారపడినవాడు కాకుండా ఉంటాడో ..... అట్టివాడు కర్మరాహిత్యత్వము ఆస్వాదిస్తూ ఆత్మదృష్టిని అలవరచుకో గలుగుతాడు.

(6) **నిరాశీ** : దేనినో ఆశించి కర్మలు చేసేవాడు ఆ కర్మసంబంధమైన ఆసక్తి – అనురక్తులచే, కర్మఫలములచే, కర్మ ప్రయోజనములచే పరిమితుడు – నిబద్ధుడు అవుతాడు. అట్లా కాకుండా, అంతరంగమునందు ఆశ–నిరాశాదులను తొలగించుకొని "దేహం ప్రసాదించి – సంరక్షిస్తున్న పరమాత్మకు కృతజ్ఞతా పూర్వకంగా ఈ ఈ కర్మలు నిర్వర్తిస్తున్నాను" .... అని భావన చేసేవారికి "ఆశలు–నిరాశలు" అనేదోషం హృదయములో చిగురించదు. అట్టివారు కర్మ దోషములచే స్పృశించబడరు.

(7) **యత చిత్తాత్మా** : ఈ మనస్సు ఏదేదో కోరుకుంటూ ఎటెటో అనుక్షణం పరుగులు తీస్తూ ఉంటోంది కదా! ఎందుచేత? మృగాలు "మృగతృష్ణ"లో జలం ఉంటుందని భ్రమించి పరుగులు తీయటం వంటిదే – "ఏదో కావాలి – రావాలి" అని ఈ మనస్సు తపన కలిగి ఉండటం సుమా! అటువంటి మనస్సును పరిపరి విధాలుగా కర్మలు ప్రయోజనముల వైపుగా ప్రసరించకుండా చూచుకొనేవానికి

కర్మల దోషాలు అంటవు. చిత్తమును అదుపులో కలిగి ఉంచుకున్నవాడు "యతచిత్తాత్ముడు".

(8) **త్యక్త్వ సర్వ పరిగ్రహః** : సకల విధములైన భోగసామాగ్రిని మనస్సుతో త్యజించి ఉంటాడు. "ఈ వస్తు సముదాయము – ఈ బంధములు, ఈ సంబంధ బాంధవ్యములు నావికావు. పరమాత్మవి. పరమాత్మ స్వరూపములు" అను భావనతో 'నావి' అనే భ్రమను తొలగించుకొని ఉంటాడు. అందుచేత కర్మలకు సంబంధించిన పాప–దోషములు అతనిని తాకవు.

(9) **శరీరం కేవలం కర్మ కుర్వన్** : తాను వేరుగా ఉండి ఈ శరీరమును ఇంద్రియములను ఆయా కర్మల వ్యవహారములలో నియమిస్తూ ఉంటాడు. వాటి వాటి విషయములలో తాను తాదాత్మ్యము పొందడు. పనిమనిషి పనిచేస్తూఉంటే యజమాని ఆయా పనులలో తాను ప్రవేశించి వాటి యందు సంలగ్నుడౌతాడా? తనను తాను "నేను యజమానిని" అని మరచిపోతాడా? లేదుకదా! జ్ఞానకర్మయోగి కూడా ఇంద్రియ – ఇంద్రియ విషయములను నియమిస్తూ, తానుమాత్రము వాటిచేత నియమితుడు కాక, అప్రమేయుడై ఉంటాడు.

(10) **యదృచ్ఛాలాభ సంతుష్టుడు** : "పొందాలి – కావాలి" అనే ఆవేశమునకు లోను కాకుండా ఏదేది ఎంత వరకు లభిస్తుందో .... అద్దానితో సంతోషమును పొందినవాడై ఉంటాడు. "ఇది ఇంతవరకే నాకు లభించటం కూడా ఈ జగత్ రచయిత అగు పరమాత్మయొక్క సదుద్దేశ్యం. *గురువు శిష్యునికి ఎట్టి శిక్షణతో చదువునేర్పించాలో గురువుకు తెలుసునని శిష్యుడు భావిస్తాడు కదా! ఈ జగత్ గురువగు పరమాత్మ పాఠ్యాంశముయొక్క అంతర్విభాగమే ఈ కష్ట–సుఖాలు, ఈ ప్రాప్తాప్రాప్తాలుగూడా!*" .... అని గ్రహించిఉంటాడు. అందుచేత "పొందాను – పొందలేకపోయాను (possessed - did not possess) " అనే విషయాలు గొప్ప విషయాలుగా భావించడు. మంచి విద్యార్థికి చదువు ముఖ్యం గాని మంచి–మంచి వసతులు కాదు కదా! ఇవి గ్రహించి ఆతడు బంధరహితుడై ఉంటాడు.

(11) **ద్వంద్వాతీతో** : జ్ఞానకర్మయోగి ఈ ప్రపంచంలో తారసపడే కష్ట–సుఖములకు, ఆపద–సంపదలకు, దూషణ – భూషణములకు, తిరస్కార – పురస్కారములకు అతీతుడై వాటిని "నిర్విషయపూర్వక ప్రజ్ఞ"తో దర్శిస్తూ ఉంటాడు. వాటిచే నిబద్ధితుడు కానట్టి ప్రజ్ఞను సముపార్జించుకొని ఉంటాడు.

(12) **విమత్సరః** : "నేను ఇంతటి వాడను కదా! నాముందు వాళ్ళు – వీళ్ళు ఎందుకు పనికిపస్తారు?" .... ఇటువంటి మత్సరపూరితమైన భావాలు తొలగించుకొని ఉంటాడు. సర్వులకు సర్వశక్తియుక్తులు భగవత్ ప్రసాదితము, భగవత్ సంకల్పమే కాని "ఈ కాలు – చేయి నేను నిర్మాణం చేసుకున్నాను" అని ఎవరనగలరు? ఈ జగత్ నాటకంలో ఏ పాత్ర ఏమిటో – ఎంతవరకో – ఎందుకో చరాచర సృష్టికర్తకే తెలుసు. మనం తినే పదార్థాలు జీర్ణమయ్యే విధానం – తత్ పరికరాలు మనం నిర్మించుకున్నవి కావు. సర్వజీవుల హావ–భావాలు, శక్తి యుక్తులు జగత్ నిర్మాతవే కాని, అవి మనవి ఎట్లా అవుతాయి?

- మత్సరము ఉన్న చోట కర్మ బంధం అవుతుంది.
- మత్సరము లేనిచోట నిర్వర్తించబడే కర్మ ముక్తి మార్గంగా రూపుదిద్దుకుంటుంది.

(13) **సమ సంగస్య–ముక్తస్య** : ఒక ఇష్టం లేనిపని చేయవలసి వచ్చినా, (లేక) ఒక ఇష్టంఉన్నపని చేయలేకపోతున్నాకూడా జ్ఞానకర్మయోగి తన సమత్వం కోల్పోడు.

- ఇది చెయ్యవలసివచ్చిందే ....? అని గాని,
- అది చెయ్యలేకపోతున్నానే ....? అనిగాని,

ఆతడు దిగులు, వేసట పొందడు. సంగము (Involvement) ముక్తము (Withdrawl from an Act) ఒకే తీరుగా దర్శిస్తూ ప్రశాంత స్థితిని అనుక్షణికంగా ఆస్వాదిస్తూ ఉంటాడు.

(14) **జ్ఞాన – అవస్థిత చేతసః** : ఆతడు నిత్య అనిత్యములు ఏమిటో గ్రహిస్తూ, పరమాత్మకు కృతజ్ఞతా పూర్వకంగా, సేవా పూర్వకంగా సద్భావనతో కూడిన

బుద్ధితో స్వకర్మలు నిర్వర్తిస్తూ ఉంటాడు. వివేకము – జ్ఞానము ప్రవృద్ధ పరచుకుంటూ కర్మలను నిర్వహిస్తూ ఉంటాడు.

(15) **యజ్ఞాయ ఆచరతః కర్మః** : "ఈ సమగ్రమైన కార్యక్రమంలో ఈ నా పాత్ర నిర్వర్తిస్తున్నాను" అని గ్రహించి జ్ఞానకర్మయోగి కర్మ నిర్వర్తిస్తున్నాడు. సూర్యచంద్ర వాయు – వర్ష – భూ – అగ్ని తత్వాలు జగత్ యజ్ఞ కార్యక్రమములను యజ్ఞభావంతో నిర్వర్తిస్తున్నట్లే యోగి తన ధర్మములను కూడా యజ్ఞ భావితుడై ఆచరిస్తూ ఉంటాడు.

ఈ విధంగా జ్ఞానసమన్వితంగా కర్మలను నిర్వర్తిస్తూ ఉంటే .... అప్పుడు ఆ యోగి సర్వ కర్మబంధములనుండి విముక్తుడు అగుచున్నాడు.

జ్ఞానకర్మ నిష్ఠులు ఉపాసన పూర్వకంగా కర్మలు నిర్వర్తిస్తున్నారు. అట్టి కర్మయోగులు యజ్ఞకర్మోపాసనను సమకూర్చుకుంటూ ఉంటారు. విధి – విధానములను అనుసరించి వివిధరకములైన యజ్ఞ కర్మోపాసనలను క్రోడీకరించి జ్ఞానపరిపుష్టికై ఇక్కడ వివరిస్తాను. విను.

## వివిధ కర్మయజ్ఞోపాసకులు

I. బ్రహ్మకర్మసమాధినిష్ఠ
II. దైవయజ్ఞోపాసన
III. సంయమ యజ్ఞోపాసన
IV. ఇంద్రియ యజ్ఞోపాసన
V. మనోనిగ్రహోపాసన
VI. ద్రవ్యయజ్ఞోపాసన
VII. తపోయజ్ఞోపాసన
VIII. స్వాధ్యాయ యజ్ఞో పాసన
IX. ప్రాణ – అపాన యజ్ఞోపాసన
X. జ్ఞాన యజ్ఞో పాసన

వీటి గురించి వివరిస్తున్నాను. విను.

**I. బ్రహ్మ యజ్ఞోపాసన :**

**"కర్మ ప్రవృత్తి దృష్ట్యా :**

1. స్వకర్మనిరతిచే సమర్పించబడే సేవ

2. కర్మ నిర్వర్తించటానికి పరికరాలు

3. కర్మ నిర్వర్తించగలిగే సామర్థ్యము

4. కర్మ నిర్వర్తిస్తున్నప్పటి శ్రమ

5. కర్మ నిర్వర్తించే కర్త (జీవుడు)

6. ఆ కర్మ యొక్క ప్రయోజనము – ఫలము

ఈ ఆరుకూడా బ్రహ్మమే – పరమాత్మ స్వరూపమే" అను దృష్టి – అవగాహనలతో సర్వము పరమాత్మ ప్రదర్శన చమత్కారంగా దర్శిస్తూ – ఉపాసిస్తూ, కర్మ నిర్వర్తించటము 'బ్రహ్మకర్మ నిష్ఠ'.

**అగ్ని కార్యముూతో క□డూన యజ్ఞము దృష్ట్యా చూచినప్పుడు ......**

–"సర్వము యజ్ఞపురుషుడగు పరమాత్మస్వరూపంగా ...దర్శించటమే అది.

| | | | |
|---|---|---|---|
| 1. | అర్పణం | = | అర్పించబడే విధానము |
| 2. | హవిష్షు | = | హోమద్రవ్యములు |
| 3. | బ్రహ్మణా | = | యజ్ఞంనిర్వర్తిస్తున్న "యజ్ఞకర్త" |
| 4. | అగ్ని | = | యజ్ఞములో ప్రజ్వలించే అగ్ని |
| 5. | ఆహూతం | = | ఆ యజ్ఞంలో హోమం చేయబడేది |
| 6. | బ్రహ్మ కర్మ సమాధినా | | |

ఆగంతవ్యమ్ = బ్రహ్మకర్మ సమాధి దీక్ష యొక్క ఫలము

ఇవన్నీ బ్రహ్మమే!"

**దానం దృష్ట్య ........,**

– "దానం ఇచ్చేవాడు – ఇవ్వబడే ద్రవ్యం – పుచ్చుకునేవాడు – ద్రవ్య ప్రయోజనములు – దానము యొక్క అంతిమ ఫలం అంతా కూడా .... పరమాత్మ స్వరూపమే!"

**జీవితం దృష్ట్య ........,**

– "జీవించే జీవుడు ... జీవితమునకు కావలసిన పరికరములు – అద్దానికి

సంబంధించిన సంబంధ అనుబంధములు – జీవిత సంఘటనలు – జీవితము యొక్క అంతిమ ప్రయోజనం – అంతా భగవత్ స్వరూపమే !"

..... అని తలచేవానికి సర్వము బ్రహ్మమయమై అనుభవమౌతుంది. అట్టి అవగాహనకై సాధన నిర్వర్తించే వాడు. **"బ్రహ్మ యజ్ఞోపాసకుడు – బ్రహ్మకర్మ నిష్ఠుడు"** అని చెప్పబడుచున్నాడు.

II. **దేవతార్చనాయజ్ఞం** : ఈ శరీరం – దీనిలోని వివిధ ఇంద్రియములు – వాటివాటి శక్తులు (కంటికి చూపు – చెవులకు వినికిడి – చర్మమునకు స్పర్శ – ముక్కుకు సువాసన - నాలుకకు రుచి - పొట్టకు జీర్ణశక్తి - ఆహారంలో రసశక్తి) .... అన్నీ కూడా దైవప్రసాదమేగాని, మానవ కల్పితం కాదు కదా! "అట్టి అధి – దేవతాప్రాసాదితంగా పొందబడే ఈ దేహంతో 'దైవోపాసన' అత్యంతావస్యకం" అని గుర్తించి కొందరు యోగులు "పూజ – ఉపాసన – నామస్మరణ" ఇటువంటి అర్చనను నిర్వర్తిస్తున్నారు. తద్వారా జీవితమును సాఫల్యము చేసుకొంటున్నారు. దేవతోపాసనను పరిపుష్టిపరచుకొంటున్నారు.

III. **బ్రహ్మాగ్ని యజ్ఞము** : ఆత్మ యజ్ఞనిష్ఠులగు మరికొందరు యోగులు "ఈ జగత్తంతా పరమాత్మ – జ్యోతి స్వరూపమే" .... అని భావించి లోకోపకరమైన కర్మలు నిర్వర్తిస్తూ ఆ కర్మలు 'బ్రహ్మము' అనే తత్వానికి సమర్పిస్తున్నారు. "సహజీవుల సేవయే నా ఉపాసన" .... అని ఉద్దేశిస్తూ సంఘసేవా కార్యములు నిర్వర్తిస్తున్నారు. నిరాకార బ్రహ్మమే ఈ సాకార జగత్తుగా అగుచున్నదని ఉపాసిస్తున్నారు. బ్రహ్మాగ్ని యజ్ఞం నిర్వర్తిస్తున్నారు.

IV. **సంయమాగ్ని యజ్ఞం** : మరికొందరు యోగులు శబ్దము – స్పర్శ మొదలైన ఇంద్రియములను ఉపాసన – ధ్యానములందు నియమించి "సంయమము (Self-Control) అనే అగ్నియందు ఇంద్రియములనే కట్టెలను వ్రేల్చుచున్నారు.

V. **ఇంద్రియాగ్ని యజ్ఞం** : ఇంకొందరు "మౌనము – తపస్సు" మొదలైనవి నిర్వర్తిస్తూ "ఈ శబ్దము – స్పర్శ – రూపము – రసము – గంధము" మొదలైనవి

ఇంద్రియ విషయములనుండి మనస్సును విరమింపజేస్తూ ఇంద్రియ యజ్ఞం నిర్వర్తిస్తున్నారు.

VI. **ఆత్మ సంయమయోగాగ్ని యజ్ఞం** : ఇక మరికొందరు యోగులు సర్వ ఇంద్రియ కర్మలతో "అంతా ఆత్మతత్త్వ ప్రదర్శనమే కదా!" .... అనే భావనాభ్యాసము నిర్వర్తిస్తున్నారు. "ప్రాణ – మనో– ఇంద్రియములు కదలుతూ దృశ్యంలో ప్రవర్తిస్తున్నాయి. వాటిని కదిలిస్తున్న దేది? ఆత్మయే కదా! ఆ ఆత్మయే అన్ని దేహాలలో వేంచేసి ప్రాణ – మనో – ఇంద్రియములను కదిలిస్తోంది. కనుక సర్వ దేహములలోని ఆత్మనే నేను ఉపాసిస్తున్నాను" .... అనే గ్రాహ్యముతో ఉపాసన కొనసాగిస్తున్నారు. "సర్వ ఇంద్రియ కర్మలు – ప్రాణ కర్మలు ఆత్మ యొక్క విన్యాసమే"..... అని దర్శిస్తూ ఇంద్రియ – మనో కర్మలను "ఆత్మ సంయోగము" అనే అగ్నిలో వ్రేల్చుచున్నారు. మనస్సును ఆత్మయందు సంయమింపజేసి రమిస్తున్నారు.

VII. **ద్రవ్య యజ్ఞం** : కొందరు తమ సంపదలను అనేక జీవులకు సమర్పిస్తూ ద్రవ్య యజ్ఞం నిర్వర్తిస్తున్నారు. జీవతృప్తిని పరమాత్మోపాసన పరంగా నిర్వర్తిస్తున్నారు.

VIII. **తపోయజ్ఞం** : తపనయే తపస్సు. సర్వాత్మకుడగు పరమాత్మ పట్ల 'తపన' ద్వారా తపస్సు నిర్వర్తిస్తున్నారు. ఏకాంతంగా ధ్యానయోగం ఆశ్రయిస్తున్నారు.

IX. **యోగయజ్ఞం** : మరికొందరు "సమాధి" మొదలైన యోగ సాధనలను ఆశ్రయిస్తున్నారు.

X. **స్వాధ్యాయ యజ్ఞం** : సంగీతము – సాహిత్యము – స్తోత్రము గ్రంధపఠనములతో కొందరు యోగులు భగవదోపాసన కొనసాగిస్తున్నారు.

XI. **ప్రాణాయామ యజ్ఞం** : మరికొందరు ప్రాణాయామ పరాయణలై

ప్రాణము (Inward moving of Air) ను 'అపానము' అనే అగ్నిలో వ్రేలుస్తున్నారు.

అపానము (outward moving of Air) ను 'ప్రాణము' అనే అగ్నిలో ప్రేలుస్తున్నారు.

ఈ విధంగా ప్రాణ – అపానములగతిని అనుసరిస్తూ ప్రాణాయామ సాధన ద్వారా మనస్సును పరిశుద్ధం చేసుకొని "ఆత్మాఽహమ్" భావన వైపుగా ప్రయాణిస్తున్నారు.

XII. **ప్రాణ–ప్రాణ యజ్ఞం** : మరికొందరు యోగులు ప్రాణములను సమిధగా 'ప్రాణము' అనే అగ్నియందే సమర్పిస్తున్నారు. వ్యక్తిగతమైన ప్రాణములను 'సప్రాణము' అనబడే విశ్వాంతర్గత ప్రాణంలో లయింపజేసి 'ఈ విశ్వము' అనే సమిష్ఠి దేహమునకు అంతర్గత ప్రాణ తత్వం వహిస్తున్నారు. విశ్వరూపులై ప్రకాసిస్తున్నారు.

☆☆☆

ఓ అర్జునా! ఇప్పుడు మనం చెప్పుకున్న వివిధ యోగులంతా యజ్ఞవిదులు. విశ్వయజ్ఞతత్వమును గ్రహించినవారే సుమా! వారంతా యజ్ఞపరాయణులై తమ యొక్క మానసిక ఋగ్మతలను తొలగించుకుంటున్నారు. ఆత్మావలోకనమునకు ప్రతిబంధకములన్నిటిని ఏరిపారవేసుకొంటున్నారు.

అట్టి యజ్ఞసాధనంగా జీవితాన్ని మలచుకొని, తద్వారా ..... ఆ యోగ సాధకులంతా యజ్ఞఫలంగా తమయొక్క అమృతాత్మస్వరూపమును సుస్పష్టంగాను, ఘనీభూతమైన అనునిత్యానుభవంగాను మలచుకొంటున్నారు. సనాతన మగు పరబ్రహ్మ స్వస్వరూపమును పునఃగా ప్రతిష్ఠించుకుంటున్నారు.

ఓ కురువంశజులలో శ్రేష్టుడా! అర్జునా! ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తు చేస్తున్నాను. నీ ద్వారా సర్వజీవులందరికీ కూడా గుర్తు చేస్తున్నాను.

ఇప్పుడు మనం చెప్పుకొన్న వివిధ యజ్ఞములలో ఏదో ఒకటి శ్రద్ధ – ఆసక్తులతో ఆచరించేవారి జీవితము మాత్రమే సద్వినియోగమగుచున్నది. ఇక, అట్టి యజ్ఞ ఉపాసనకు సంసిద్ధులు కానివారు ఇహంలోగాని – పరలోకంలోగాని

(whether outwardly or inwardly) సుఖముగా ఉండలేరు సుమా! జీవితము యొక్క ఉత్తమమైన ప్రయోజనం పొందటం లేదు.

ఈ విధంగా మనం ఇప్పటివరకూ సంక్షిప్తంగా చెప్పుకొని ఉన్న వివిధ యజ్ఞ విధానములన్నీ వేద- వేదాంగ- పురాణ – ఇతి హాసాదుల ద్వారా విజ్ఞులగు మహనీయులు ఆత్మ – అవగాహన యొక్క ఉన్నతి కొరకై లోకంలో ప్రవచించటం – ప్రబోధించటం జరుగుతోంది.

అయితే ......,

మనం చెప్పుకొన్న యజ్ఞములన్నిటిలో దాగియున్న ఏకైక అంశము ఏమిటి?"

*"ప్రయత్నం"*

ప్రయత్నపూర్వకమైన కర్మల నిర్వహణ చేతనే ఆ అన్ని యజ్ఞ విధానములు నిర్వర్తించబడ గలుగుచున్నాయి. అనగా, ప్రయత్న పూర్వకమైన కర్మలు నిర్వర్తించటం చేతనే ఆయా వివిధ యజ్ఞములను, యజ్ఞవిదులు నిర్వర్తిస్తున్నారు. అందుచేతనే "కర్మను నిర్వర్తించు – త్యజించకు" అని గుర్తుచేస్తున్నాను.

## జ్ఞాన యజ్ఞం

ఓ అర్జునా! వివిధ యజ్ఞములున్నాయని, వివిధ యోగులు వాటిని ఆత్మ శుద్ధికై ఉపాసిస్తూ కర్మయోగమార్గంలో కర్మలు ఆశ్రయిస్తున్నారని అనకున్నాము కదా! అయితే, ..... అన్ని యజ్ఞములకన్నా "నిత్యా నిత్యముల వివేకము – ఆత్మను సర్వే – సర్వత్రా సర్వ స్వరూపంగా అర్థం చేసుకొని ఆస్వాదించటం" ..... అను జ్ఞానయజ్ఞం ఉత్తమోత్తమమైనదిగా ప్రకటిస్తున్నాను. "ఈ జీవాత్మగా ఉన్నదే పరమాత్మ – ఈ జీవుడే శివుడు. శివుడే ఈ జీవుడు, నరుడే నారాయణుడు" అని నిర్ద్వంద్వంగా నిరూపించే సమాచారమే జ్ఞాన యజ్ఞం. సర్వ ప్రయత్నముల ఫలశ్రుతి – అంతిమ ఫలము ఆత్మజ్ఞానమే! కనుక సర్వకర్మలు ఆత్మ జ్ఞానముతో పరిసమాప్తమౌతాయి. స్వప్న ద్రష్ట యొక్క "ఊహ"యే స్వప్నంలో

స్వప్నాంతర్గత విశేషాలుగా ప్రదర్శితమగుచున్నట్లు – ద్రష్టయే దృశ్యరూప జగత్తుగా పరికల్పించుకొని వినోదిస్తున్నాడని, ఈ ద్రష్టయే అఖండాత్మస్వరూపమగు శివతత్త్వమని గ్రహించటమే జ్ఞానయజ్ఞం.

*గురూపదేశం :*

అటువంటి ఆత్మ జ్ఞానం (మమాత్మా సర్వభూతాత్మా ..... అనే అఖండాత్మ సాక్షాత్కార స్థితి) లభించేది ఎట్లా?

*శ్లో॥ తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।*
*ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినః తత్త్వదర్శినః ॥*

నీ యొక్క ఆత్మ ఎట్టిదో ఆత్మజ్ఞులగు మహనీయులు సంపూర్ణంగా గ్రహించిన వారై ఉన్నారు. అట్టి మహనీయులను సమీపించి వారిని శరణాగతిచే ఆశ్రయించు. "అయ్యా! మీరే నాకు దిక్కు! నా ఆత్మ ఎట్టిదో నాకు విశదపరచండి" అని విన్నవించుకోవాలి. నీకున్న సందేహాలేమిటో తెలియజేయాలి. వారు నీ శరణాగతికి, పట్టుదలకు సంతోషించినవారై నీకు ఆత్మ జ్ఞానం నిర్వచిస్తూ ప్రవచిస్తారు. వారితో చక్కగా అనుమానాలు వ్యక్తీకరించి, వారి వాక్య సారములు గ్రోలుటచేతనే నీవు ఆత్మ జ్ఞానివి కాగలవు.

- ఎందుచేత ఈ జన్మల చేత కర్మల చేత వాస్తవానికి ఎటువంటి బంధమూ నీకు లేదో,
- ఏఏ విచారణ చేత ఈ కనబడే సర్వము నీ యొక్క ఆత్మ స్వరూపమే అయిఉన్నదని నీవు గ్రహిస్తావో, ఆత్మదృష్టితో సందర్శిస్తావో,....
- ఏది తెలుసుకొన్న తరువాత "నేను బద్ధుడను. దేహము – జీవుడుగా దిగజారినవాడను" .... అనే మోహము మొదలంట్లా తొలగుతుందో.....
- తదితర జీవులంతా ఏ సదసద్విమర్శచే నీ ఆత్మ స్వరూపులుగా నీకు అనుభూతమగుచున్నారో ...."

**అట్టి నిత్య సత్యమగు నీ ఆత్మ యొక్క మహిమను విశదపరుస్తారు.** వారు బోధించే ఆత్మ తత్వ సమాచారం చేత

- ఏ సత్యము - నిత్యము అగు నీ ఆత్మ యందే ఈ లోకాలన్నీ ఉన్నాయిగాని, ..... నీవు ఈ లోకాలలో ఒక దేహముగానో - జీవుడుగానో ఉన్నావనటం ఆత్యంతికమైన సత్యం కాదో .....,
- ఏ నీ అమృతాత్మయందు మృత్యువు ఒక చిన్న చమత్కారమేగాని, నీ ఆత్మ స్వరూపం మృత్యువుకు విషయమయిఉండుటయే లేదో ...,
- ఏ ప్రబోధముచే ఒక అద్దము (mirror) లోని దృశ్యంలాగా ఈ జగత్తంతా నీ మనోదర్పణంలోని ప్రతిబింబమాత్రమేనని, ప్రతిబింబిస్తున్న దృశ్యముచే దర్పణము మార్పు చేర్పులు పొందనట్లు మనస్సులో ప్రతిబింబించే విషయాలచే మనస్సు మార్పు చెందుచున్నదనటం హాస్యాస్పదమో .....

అట్టి ఆత్మ జ్ఞానం పొంది సర్వమోహములు అప్పటికప్పుడే తొలగించుకుంటావు. దేహరూపం నుండి విడివడి, సర్వజగత్ రూపుడవుగా, జగత్-అతీతమగు ఆత్మ స్వరూపంగా ప్రకాశిస్తావు.

*జ్ఞానప్లవం :*

ఓ అర్జునా! ఒకడు అతి తీవ్రంగా ప్రవహిస్తున్న నదిని దాటాలంటే ఏమి చెయ్యాలి? ఒక నావను సంపాదిస్తే సురక్షితంగా ఆవలి ఒడ్డు చేరగలడు గదా! అట్లాగే జన్మ - జన్మల "అజ్ఞాన-దైన్య- ఆవేశ- క్రోధ - లోభ - మాత్సర్య - కామ - స్వార్థ" చింతనలనే దురభ్యాసములు అంతరంగమునుండి దృశ్యము వైపుగా ప్రసరిస్తూ ఉండటం చేత "ఆత్మతత్త్వానుభవం" అనే ఆవలివడ్డు చేరే ఉపాయం కనిపించక ఈ జీవుడు అనేక ఉపాధి పరంపరలుగా మ్రగ్గుచున్నాడు. కనుక ఈ జీవుడు వర్తమాన, మానవ దేహమును - ఇక్కడి నియమిత స్వధర్మములను ఒకానొక అవకాశంగా గమనించి 'జ్ఞానము' అనే నావను పునర్నిర్మించుకొని, ఆవలివడ్డు అగు "ఆత్మ స్వరూపంగా దృశ్యమును ఆస్వాదించగలగటం" అనే స్థానం చేరాలి.

"నేను దోషములు కలవాడినే? – తప్పులనేకం చేస్తున్నానే?" ..... అని దిగులు చెందనే వద్దు. పాపులందరిలోని అత్యంత గర్హనీయమైవారందరిలోనూ అగ్రగణ్యుడుకూడా 'జ్ఞానము' అనే నావను అధిరోహించి అజ్ఞాననదీజలమును దాటి వేయగలడు సుమా!

## జ్ఞానాగ్నిదగ్ధ కర్మాణః :

అనేక కట్టెలు గుట్టలుగుట్టలుగా పడిఉండ వచ్చుగాక! అయితే ఏం? ఒక్క అగ్ని కణం తెచ్చి ఆ కట్టెలను సమూలంగా, సమగ్రంగా, సామూహికంగా తగలబెట్టి భస్మం చేయవచ్చు కదా! అట్లాగే అనేక అజ్ఞానాభ్యాస పరంపరలు ఈ జీవుని చుట్టుముట్టి ఉండవచ్చుగాక! దిగులు పడవలసిన పనిలేదు. 'జ్ఞానము' అనే నిప్పురవ్వచే వాటినన్నిటినీ భస్మీ భూతం చేసి వేయవచ్చు. (త్రిగుణములను జ్ఞానాగ్నిచే భస్మం చేసి అలంకారంగా నుదుటిపై ధరించిన పరమశివుని వలె) సకల కర్మ పరంపరా వ్యవహారములను జ్ఞానాగ్నిచే భస్మం చేసి అకర్మస్వరూపమగు ఆత్మ స్వరూపమును (కర్మలు నిర్వర్తిస్తూనే) అవధరించవచ్చు.

*శ్లో॥ నహి జ్ఞానేన సదృశం పవిత్రం ఇహ విద్యతే,*
*తత్ స్వయం యోగ సంసిద్ధః కాలేన ఆత్మని విందతి ॥*

ఓ అర్జునా ! 'జ్ఞానము'తో సమానమైన పవిత్రమైనది మరింకేదీ ఎక్కడా లేనే లేదు. అయితే, అత్యంత పవిత్రమైన ఆత్మజ్ఞానం లభించేది ఎట్లా? అందుకు మార్గం ఏమిటి?

(1) బ్రహ్మ యజ్ఞం
(2) దేవతార్చన యజ్ఞం
(3) బ్రహ్మాగ్ని యజ్ఞం
(4) సంయమాగ్ని యజ్ఞం
(5) ఇంద్రియాగ్ని యజ్ఞం
(6) ఆత్మ సంయమ యోగాగ్ని యజ్ఞం
(7) ద్రవ్య యజ్ఞం
(8) తపోయజ్ఞం
(9) యోగ యజ్ఞం
(10) స్వాధ్యా యజ్ఞం
(11) ప్రాణాయామయజ్ఞం
(12) ప్రాణ ప్రాణ యజ్ఞం

ఇటువంటి ఒక్కటో, రెండో, కొన్నియో, అన్నీయో కలగలుపుకుంటూ చేసే ప్రయత్నం చేతనే ఈ జీవుని యొక్క బుద్ధి తన దోషములను తొలగించుకొని అప్పుడు ఆత్మదృష్టిని ప్రవృద్ధ పరచుకుంటుంది. ఈ విధంగా ఎవరు యోగసంసిద్ధుడై ప్రయత్నములను కొనసాగిస్తూ ఉంటారో .... అట్టివారి హృదయంలో ఆత్మజ్ఞానపుష్పం తనంతట తానే సరిఅయిన కాలంలో వికసిస్తోంది.

ఆత్మజ్ఞానవమే ఏ జీవుడైనా ఆశ్రయించవలసినది, ఏ జీవుని విషయంలోనైనా – ఉద్ధరించగలిగేదీ కూడా! శ్రద్ధ, పట్టుదల, ఆత్మ నమ్మకము, గురువాక్య – శాస్త్ర వాక్య పరిశీలనము, సాధన, నిర్మలమైన అవగాహన పెంపొందించుకోవాలి. అన్నిటికంటే ముఖ్యం శ్రద్ధ.

"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" – శ్రద్ధ గలవానికే జ్ఞానం లభిస్తుంది. శ్రద్ధ దృశ్యంలో ఉంటే దృశ్య వ్యవహారాలే నిత్యము కొనసాగుతూ ఉంటాయి. తత్పరమైన – ఆత్మ జ్ఞాన సంబంధమైన శ్రద్ధచే ఆత్మజ్ఞానం లభిస్తోంది. ఇంద్రియములను జగత్ విషయములవైపునుంచి మరల్చి వివిధ యజ్ఞరూపములైన ప్రయత్న యోగమునందు నియమిస్తూ వస్తే, అప్పుడు ఆత్మ జ్ఞానమునకు అర్హుడవవుతావు. ఆత్మజ్ఞానం సంపాదించుకోవటంచేత అవిచ్ఛిన్నమగు పరమశాంతిని స్వభావసిద్ధంగా సముపార్జించుకోగలవు.

ఇక.....

- "అజ్ఞానవిశేషాలే మృదుమధురంగా ఆస్వాదించటం" కొనసాగించేవారు,
- శ్రద్ధ – పట్టుదల ఆశ్రయించనివారు,
- సంశయములను తొలగించుకోవటానికి సిద్ధపడనివారు,

.... వీరి గురించి ఏం చెప్పను? వారు అవకాశములన్నీ వృధా చేసుకొని అజ్ఞానాగ్నుల వైపుగా ప్రయాణిస్తూ తమకు తామే ద్రోహం చేసుకొంటున్నారు. మరల మరల అల్ప దృష్టుల వైపుగా ప్రయాణములను శ్రమపడుతూ మరీ కొనసాగిస్తున్నారు. వారికి ఇక్కడ గాని మరొక చోటగాని, ఇహంలోగాని,

పరంలోగాని, దృశ్యము నందుగాని, అంతరంగమునందుగాని సుఖము – శాంతి లభించటమే లేదు.

సంశయాత్మునకు (తన స్వరూపం గురించి తనకే తెలియక, తెలుసుకోవటాని ప్రయత్నించనివానికి) దుఃఖమిశ్రితంగాని ఆనందం (Happyness sans all worries) లభించేది ఎట్లా ? **న సుఖమ్ సంశయాత్మనః ॥**

అందుచేత ఓ అర్జునా !

1) **యోగః సన్యస్త కర్మాణమ్** : కర్మయోగివై కర్మలను అధిగమించు. జ్ఞాన యోగ సాధనల సహాయంతో సర్వకర్మలు సన్యసించివేయి. కర్మ గురించిన సర్వ బంధములు త్రెంచివేయి! కర్మలకు అతీతత్వం సముపార్జించుకో!.

2) **జ్ఞానః సంచ్ఛిన్న సంశయః** : నిత్యానిత్య వివేకముతో కూడిన ఆత్మజ్ఞాన సముపార్జనచే "అఖండమగు ఆత్మయే నాస్వరూపం" అను స్థితికి సంబంధించిన సర్వ సంశయములను తొలగించుకో.

3) **ఆత్మవంతమ్** : "ఈ దేహ – మనో – బుద్ధి – చిత్త – జీవాత్మలు నా స్వరూపము కాదు. వేద – వేదాంగ – వేదాంత శాస్త్ర ప్రతిపాదితమైన 'ఓం' కార సంజ్ఞారూపమగు ఆత్మ స్వరూపమే నా వాస్తవ స్వరూపం" ..... అను ఆత్మవంతమగు స్థితిని సముపార్జించుకో.

అప్పుడు ఈఈ అనివార్యంగా చేయవలసియున్న కర్మలు నిన్ను కించిత్ కూడా నిబద్ధించవు. బద్ధునిగా చేయలేవు.

ఓ అర్జునా! ఆత్మ జ్ఞానం ఎక్కడ ఉన్నది? ప్రతిజీవుని స్వస్వరూపము ఆత్మయేకదా! కనుక ప్రతి హృదయంలోను ఆత్మ జ్ఞానం జ్వాజ్వల్యమానంగా ప్రకాశిస్తూనే ఉన్నది. అయితే ఆ ఆత్మజ్ఞానం స్వయం కల్పితమైన అజ్ఞానముచే ఆవరించబడి ఉండటంచేత స్వబుద్ధికి అనుభవం కావటం లేదు. జ్ఞానమునకు అజ్ఞానమే అడ్డుగోడగా నిలచి ఉంటోంది.

*జ్ఞాన – అసి (జ్ఞానఖడ్గం) :*

కాబట్టి అర్జునా! "యజ్ఞ కర్మ" అనే ప్రయత్నములచే 'జ్ఞానము' అనే ఖడ్గమును ధరించినవాడవై నీ హృదయములో సంశయముల రూపంగా ప్రవృద్ధమై యున్న అజ్ఞాన వృక్షమును మొదలంట్లా నరికివేయి.

- హృదయములోనే జ్ఞానము ఉన్నది.
- అది కామ-క్రోధ-మోహ-లోభములచే కప్పబడినది.
- అనేక జన్మలు అజ్ఞానపూర్వకంగా గడచిపోతున్నాయి సుమా!
- జీవితాన్ని శాస్త్ర ప్రబోధానుసారం యజ్ఞయోగమయం చేయి.
- జ్ఞానము కొరకై మహనీయులను ఆశ్రయించు.
- సర్వ సంశయములు తొలగించుకొని జన్మ – కర్మలతో కూడిన సకల జగత్ దృశ్యములను ఆత్మ స్వరూపంగా గ్రహించి ఆత్మజ్ఞుడవు కమ్ము.

  అట్టి ప్రయత్నములో ఉద్యమించటానికై జాగృతువు కమ్ము.

*ఓ భారతా! ఉత్తిష్ఠ! ఉత్తిష్ఠ!*

*ఇతి భాగవద్గీతా ..... జ్ఞానయోగ పుష్పః*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

★★★



**శ్లో॥ యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవతే ।**
**ఆద్యంతవంతః! కౌంతేయ! న తేషు రమతే బుధః ॥**

కౌంతేయ! యే సంస్పర్శజాః బోగాః తే హి దుఃఖయోనయః ఏవ ।
ఆద్యంత వంతః! బుదాః తేషు న రమతే ॥

"ఓ కౌంతేయ! ఈ ఇంద్రియములు విషయాల సంస్పర్శ చే పొందే భోగానుభవాలన్నీ దుఃఖమునకు (Towards some worries) దారితీసేవే!" అని ఎఱిగియున్న బుధులు (తెలివితేటలు కలవారు) ఈ ఇంద్రియభోగములలో బుద్ధిని ఏమాత్రం ఉంచరు.

# 5.

# కర్మసన్యాస యోగ పుష్పం

**అర్జునుడు** : స్వామీ! శ్రీ కృష్ణా! మీరు మరల మరల కర్మ యోగ – కర్మ సన్యాసములను సమ్మిళితం చేసి చెప్పుచున్నట్లుగా నాకు అనిపిస్తోంది.

కర్మయోగం (నిష్కామ కర్మ)ను ఆశ్రయించి కర్మలన్నీ సన్యసించమంటున్నారు.

"....... కర్మల ఆశ్రయిస్తూ తద్వారా కర్మలు వదలివేయి" అని బోధిస్తున్నారు. (యోగః సన్యస్త కర్మాణం)

....... "కర్మ సన్యాసం" .... అని అంటూనే 'కర్మయోగం ద్వారా" అని కర్మలను మరల మరల ప్రోత్సహిస్తున్నారే! ఇంతకీ నాకు ఇప్పుడు కర్మ నిర్వహణ శుభప్రదమా? కర్మ సన్యాసమే శుభప్రదమా? 'కర్మ యోగోపాసన' తర్వాత కర్మలను సన్యసించే బదులు ఇప్పటికిప్పుడే కర్మలన్నీ సన్యసించి కర్మ బంధములను తొలగించుకోవచ్చును కదా! ఇంతకీ కర్మ వదలాలో, ఆశ్రయించాలో సునిశ్చితంగా ఏదో ఒక్కటి ఆజ్ఞాపించండి. నేను అందుకు సంసిద్ధుడనై ఉన్నాను మహాత్మా!

**శ్రీకృష్ణ భగవానుడు** : ఓ అర్జునా! కర్మ సన్యాసము - కర్మ యోగము ....ఈ రెండు మార్గాలు శుభప్రదమేనయ్యా! అందులో ఒకటి సిద్ధాంతీకరించి రెండవదానిని ఖండించటం నా ఉద్దేశ్యం ఏ మాత్రం కాదు.

అయితే, నా అభిప్రాయంలో కర్మలు సన్యసించి ఏకాంతంగా ఎక్కడో కూర్చోవటం కంటే కర్మలు యోగబుద్ధితో నిర్వర్తించటమే సులభము. ఒకే చోటికి చేర్చగల రెండు రహదారులున్నప్పుడు అందులో సులభ మార్గమునే ఎన్నుకుంటాం గాని, కష్టతరమైన మార్గం ఎంచుకోకపోవటం లోక ప్రసిద్ధమైన విషయమే కదా! అది అట్లా ఉంచి ....

"యోగః సన్యస్త కర్మాణం" ..... అను వాక్యంలో కర్మయోగముతో కర్మలు సన్యసించటమనే విషయంలో, .... 'సన్యాసము' అనగా ఏమో వివరిస్తాను. విను.

☆☆☆

ఎవ్వడైతే కర్మలు నిర్వహిస్తున్నా (లేక) కర్మలు వదలి ఏకాంతము ఆశ్రయించినా ..... ఏది ఏమైనా, హృదయములో, "ఈ దృశ్యం ఇట్లా ఉన్నదెందుకు?" అనబడే ద్వేషముగాని "ఇది ఇట్లాగే ఉండాలి" అనే ఆకాంక్ష గాని ఎప్పుడైతే ఏ మాత్రం ఉండవో ...... అట్టివాడే! నిత్య సన్యాసి..... అని గ్రహించు. నీవు ఏవో కొన్నికర్మలు వదలి 'సన్యాసి'వి కావటం సరిపోదు. నిత్య సన్యాసివి కావాలి. ఎవరైతే 'కర్మలన్యాసము వేరు - సన్యాసము వేరు' అనే ద్వంద్వ స్థితిని తమయొక్క అవగాహనచే అధిగమించి ఉంటారో .... అట్టివారు అతి సులభంగా కర్మ బంధములను తొలగించుకున్నవారు అగుచున్నారు.

ఇంకొక విషయం

"(1) సాంఖ్యమార్గం లేక విచారణ మార్గం (2) కర్మయోగ మార్గం ..... ఇవి రెండూ వేరు వేరు" - అని తెలిసీ తెలియని చిన్న పిల్లవాళ్ళు అనవచ్చుగాక! నిత్యానిత్య వివేకి అయిన శాస్త్ర-జ్ఞాన పండితులు మాత్రం అవి వేరువేరైనవిగా చూడరు. ఒకదానిలో రెండవది ఉండనే ఉంటుంది. కర్మను

యోగ – త్యాగ బుద్ధితో నిర్వర్తిస్తేనే అది కర్మయోగం కదా! అది త్యాగబుద్ధి, సమర్పణ బుద్ధి, విచారణ లేకుండా ఎట్లా సిద్ధిస్తుంది? కాబట్టి వివేకముతో కూడిన జ్ఞానము ప్రయత్న రూపములగు కర్మల యొక్క ప్రయోజనంగానే సిద్ధిస్తోంది. కర్మలు యోగబుద్ధితో నిర్వర్తిస్తే అప్పుడది మనోపరిశుద్ధతచే వివేకముతో కూడిన విచారణకు మార్గం సుగమం చేస్తోంది. కనుక కర్మ యోగి యొక్క (మరియు) విచారణ శీలుని యొక్క లక్ష్య స్థానం ఒక్కటే! ఉభయములు ఒకే ప్రయోజనానికి ఉద్దేశ్యించబడి ఉన్నాయి.

- సాంఖ్యము (విచారణ మార్గం) ఏ స్థానానికి చేరుస్తోందో ....,
- కర్మయోగము (సమర్పిత బుద్ధితో కర్మలు నిర్వర్తించటం) అదే స్థానానికి దారి తీస్తోంది."

*అని మరొక్కసారి ప్రకటిస్తున్నాను.*

"ఇప్పుడే కర్మలు సన్యసించి 'ఆత్మ విచారణ' కు ఉపక్రమించవచ్చుకదా?" అని అంటావా? "సిద్ధ సిద్ధో సమోభూత్వా సమత్వమ్" – "ఏది ఎట్లా సిద్ధించినా, లేక, సిద్ధించకున్నా కూడా సమరసభావన – స్థితి కలిగిఉండటం" అనే స్థితికి చేరటం కర్మలు సన్యసించే మార్గంగా చూస్తే అది అనేకులకు కష్టతరము – దుఃఖప్రదమైనది అవుతుంది.

కర్మలు నిర్వర్తిస్తూ కర్మయోగివై సర్వప్రాపంచక విశేషముల పట్ల ఒకానొక మౌనస్థితి (ఏది ఎట్లా ఉన్నా కూడా ఒక్కటే – అనే స్థితి) లేక అతీతస్థితి సంపాదించుకున్నావా .... అప్పుడు పరబ్రహ్మత్వమును (దృశ్యమంతా నా ఆత్మ స్వరూపమే – అనే అనుభూతిస్థితికి) అతి త్వరగా జేరుకోగలవు.

అందుచేత కర్మలు నిర్వర్తించు. అయితే సంయోగ – వియోగాతీతుడవై, యోగివై కర్మలు చేయి. అట్టి అప్పటి నీచే నిర్వర్తించే కర్మల ద్వారా ....

- నీ బుద్ధిని రాగ–ద్వేషభావములనుండి విశుద్ధం చేయి.

- ఇంద్రియ విషయములు నీ ప్రజ్ఞపై చేస్తున్న దండయాత్రను గమనించి "కర్మలను యోగ బుద్ధితో ఆశ్రయించటం" ద్వారా ఇంద్రియములను జయించు.
- ఇంద్రియములను స్వాధీన పరచుకొని తద్వారా పరిపరి పోకడలకు పోతున్నట్టి మనస్సును అరికట్టు.
- సర్వజీవులను నీ ఆత్మస్వరూపంగా దర్శించగల అభ్యాసము – ప్రజ్ఞ – సంస్థితులను సంపాదించుకో.

అట్టి కర్మయోగంతో కర్మ బంధములను త్రెంచివేసే "కర్మ సన్యాస యోగ స్థితి" సంపాదించుకున్నప్పుడు ఇక ఆ యోగి తన యొక్క తదితరుల యొక్క – నిర్వర్తించబడుచున్న కర్మలచే గాని, తన – తదితరుల యొక్క త్యజించబడిన కర్మలచేత గాని బద్ధుడు కాడు.

ఇంద్రియ – ఇంద్రియ విషయములను అధికమించుచున్న యోగి ఈ ఇంద్రియ విషయమాత్ర జగత్తును, ***ఇందలి తన – తదితరూ శరీరమూతో సహా స్వప్నంలోని విశేషాలను చూస్తున్నట్లుగా సందర్శించగలిగినవాడై ఉంటాడు.***

- ఈ దేహములు పాంచభౌతిక నిర్మాణమై ప్రవర్తిస్తున్నాయి. "నేను వీటికి అతీతమగు ఆత్మ స్వరూపుడను కదా!" అని గ్రహించి ఉంటున్నాడు.

## నైవ కించిత్ కరోమి!

"నేను సర్వ ఇంద్రియ వ్యవహారములచే స్పర్శించబడక యథాతథంగా సర్వదా వెలుగొందుచున్నాను" అను ఆత్మావలోకనస్థితిని ఆస్వాదిస్తున్నాడు.

- ఈ కళ్ళు చూస్తున్నాయి. చెవులు వింటున్నాయి.
- ఈ దేహము స్పర్శానుభవం కలిగి ఉంటుంది.
- ఈ కాళ్ళు సంచారములు సలుపుచున్నాయి.
- ఈ నోరు తింటోంది. ఈ ముక్కు గాలి పీలుస్తోంది.
- ఈ మనస్సు జాగ్రత్–స్వప్న–సుషుప్తులు పొందుతోంది.

- ఈ బుద్ధి ఆయా దృశ్య విశేషములను స్వీకరిస్తోంది. త్యజిస్తోంది.
- ఈ కళ్ళు మూసుకొంటున్నాయి. తెరచుకొంటున్నాయి.
- ఆయా ఇంద్రియములు ఆయా ఇంద్రియ విషయములను ప్రదర్శిస్తున్నాయి.

ఇక నేనో .... వాటి యొక్క సాక్షిని, అతీతుడను, వాటి వాటి విషయములకు ప్రమేయము లేని వాణ్ణి"

అనే "విషయ సన్యాస - ఆత్మ న్యాస" ధారణను కర్మసన్యాసయోగి వహించినవాడై ఉంటున్నాడు. అట్టి ఇంద్రియ విషయాతీత - కేవల సాక్షి స్థితియగు "స్వస్వరూపాత్మ స్థానం" ఆస్వాదించగలగటానికి, కర్మల దోషం మనుస్సును స్పర్శించకుండా ఉండగల స్థితికి మార్గం ఏమిటి? చెపుతాను. విను.

ఎవరైతే తాను చేస్తున్న సర్వకర్మలు సర్వాత్మకుడగు పరమాత్మను సేవిస్తున్న భావంతో సర్వాంతర్యామికి సమర్పణ చేస్తూ, ఎట్టి సంగము (ఆసక్తి,) మనస్సులో రూపుదిద్దుకోకుండా చూచుకుంటూ ఉంటాడో .... అట్టి కర్మ సన్యాస యోగిని కర్మలలోని దోషములు (బంధము - మమకారము - ఆశ - భయము - లోభము - మోహము మొదలైనవి) ఏ మాత్రం అంటవు. పద్మము నీళ్ళలోనే ఉంటుంది. కాని ఆ పద్మము యొక్క పూరెక్కలు నీటిని పీల్చవు కదా! అట్లాగే, సన్యాసయోగి ఈ జగత్ విషయముల మధ్య ఉండికూడా, వాటిని పుంఖాను పుంఖములుగా పొందుతూకూడా, వాటి యందు బంధితుడుగాని, సంబంధితుడుగాని కాడు. వాటిని స్వీకరించడు. ఆతని దృష్టి పథము కర్మ-కర్మ ఫలములకంటే సమున్నతమై ఉంటుంది.

అట్టి కర్మసన్యాస యోగి ఈ దేహంతోను, మనస్సుతోను, బుద్ధితోను, ఇంద్రియములతోను చేసే కర్మలన్నీ సంగరహితుడై (sans any relatedness or attachment) "ఈఈ కర్మల ద్వారా సర్వాత్మకుడగు పరమాత్మను ఉపాసిస్తున్నాను" అను భావనతో, మనస్సును పరిశుద్ధ పరచుకొనే పరికర రూపములుగా ఉద్దేశ్యించి

నిర్వర్తిస్తున్నాడు.

కర్మ యోగి, కర్మసంగి - ఇరువురు కర్మలు నిర్వర్తిస్తున్నారు.

అయితే .....,

***యుక్తుడు-కర్మయోగి→*** కర్మ ఫలములను పరమాత్మకు సమర్పిస్తూ, - వాటిని త్యజించి హృదయంలో పరమశాంతిని ఆశ్రయించి ఉంటున్నాడు.

***అయుక్తుడు - కర్మ సంగి →*** 'ఏదో పొందాలి' అనే తపనను ప్రవృద్ధ పరచుకొంటూ, 'కోరికలు' అనే వలలో చిక్కుకొని కర్మబంధములలో తగులు కుంటున్నాడు.

కర్మయోగి (లేక) కర్మసన్యాసయోగి తన యొక్క మనస్సుచే సర్వ కర్మలను, వాటి ప్రయోజనములను త్యజించి ఈ 9 ద్వారములు గల దేహ గృహంలో ప్రశాంత చిత్తంతో దేనికీ కర్తృత్వం - భోక్తృత్వం - కారణత్వం వహించక, సుఖ స్వరూపుడై ఉంటున్నాడు. కర్మ సంగియో? "**అన్నిటికీ నేనే కారణం. నేను పొందాలి. ఇవి తొలగాలి. ఇది ఇట్లా ఉండాలి. అది అట్లా కాక□డదు**" అను భావనలను పెంపొందించుకొని కర్మబద్ధుడుగా అనేక దేహముల ఆగమన - నిష్క్రమణములను చర్వితచర్వణంగా పొందుచున్నాడు. అనుభవిస్తున్నాడు.

జగత్ రచయిత ప్రతి జీవుని పాత్రను జగదంతర్గతంగా నడిపిస్తూ ఉన్నాడు. జీవుల ప్రవృత్తులకు కూడా తానే కారణమై ఉన్నాడు. అయితే "ఆయా కర్మలకు నేనే కర్తను. నేనే భోక్తను. నేనే కారణమును".... అను భ్రమ మాత్రం ఈ జీవుడు తనకు తానే కల్పించుకొంటున్నాడు. ఈ జీవుడు ఆత్మస్వరూపుడే అయిఉండి కూడా, తన స్వరూప జ్ఞానమును అజ్ఞానం ఆవరించటం చేత ఈ దృశ్య జగత్తులో జరిగే జన్మ - జీవన్ - మరణాదిగా గల విశేషములచే మోహము చెందినవాడై ఉంటున్నాడి. ఎవ్వడైతే తమ అంతరంగంలో గల అజ్ఞానమును 'ఆత్మ జ్ఞానము' అనే ప్రయత్నముచే మొదలంట్లా నశింపజేసుకుంటాడో అట్టివాడు "ఈ జన్మ-జీవన్-మరణ-తదంతర్గత సర్వకర్మలచే నేను బద్ధుడను కాను"....

అని గ్రహించుచున్నాడు. ఆకాశంలో సూర్యుడు ప్రకాశిస్తున్నప్పటికీ మేఘాలు ఆవరించటం చేత సూర్య కాంతి కనిపించక పోవచ్చు గాక! కానీ ఆమేఘాలు తొలగగానే, .... సూర్య ప్రకాశం మరల యథాతథంగా సందర్శించబడుచున్నది కదా! అట్లాగే జ్ఞానవాయు ఝంఝా మారుతం చేత అజ్ఞాన మేఘాలు తొలుగగా, అప్పుడు "స్వాత్మసూర్యప్రకాశం" ఈజీవునికి సుసందర్శనమవగలదు.

- ఎవరి బుద్ధి అయితే సర్వాత్మకమగు ఆత్మ తత్త్వము వైపుగా నడుపబడుతూ నిలుపబడి ఉంటోందో ........,
- మనస్సు యొక్క మననము ఆత్మజ్ఞానసమాచారంతో పరిపుష్టమౌతూ ఉంటోందో ........,
- ఎవరి శ్రద్ధ – నిష్ఠ దృశ్యజగత్తు నుండి సర్వాత్మకుడగు పరమాత్మ వైపుగా అనుసంధానం చేయబడుచున్నదో ........,
- ఏవరి పారాయణమంతా "ఆత్మతత్త్వము" వైపుగా నడుపబడుతూ ఉంటుందో....,

అట్టివాడు ఆత్మ జ్ఞానముచే సర్వదోషములు తొలగించుకొన్నవాడై పునరావృత్తి దోషము లేనట్టి సర్వాత్మత్వం ఆస్వాదించు స్థితికి, స్థానమునకు చేరుచున్నాడు.

అట్టి కర్మసన్యాస యోగ స్థితి సంపాదించుకొని దృశ్యమంతా స్వాత్మ స్వరూపంగా ఆస్వాదించు కర్మసన్యాసాత్మయోగి యొక్క సందర్శనము 'సమదర్శనము' అనే అమృతతత్వముతో కూడు కొని ఉంటుంది.

ఓ అర్జునా! నిత్యానిత్య వివేకియగు పండితుడు (one who has an expertise in perceiving) యొక్క సందర్శనం 'సమదర్శనం' పుణికి పుచ్చుకుంటోంది.

- "విద్య–వినయము పుణికి పుచ్చుకొన్న ఒక బ్రహ్మజ్ఞాని యందు
- ఒక ఆవు యందు – ఒక ఏనుగు యందు

- ఒక కుక్క యందు - ఆ కుక్క మాంసము తినేవాని యందు”

**సమదర్శనం సముపార్జించుకున్నవాడే పండితుడు.** ఒకే ఆత్మను ఆతడు సర్వదా–అన్నిటా సందర్శిస్తున్నాడు.

భేద దృష్టి ఆత్మ జ్ఞానము యొక్క అల్పత్వము చేతనే ఏర్పడి ఉంటోంది. అట్టి అల్పత్వము చేత ‘సర్గము’ అనే సాంసారిక దృష్టి ప్రబలుతోంది.

ఎవ్వరి మనస్సైతే...,

- “సమరస భావన” యందు సుస్థిరపడుతుందో .....
- ‘‘సర్వము నిర్దోషము–సమము’’ అగు బ్రహ్మమే... సర్వత్రా సందర్శిస్తోందో....

అట్టి మనస్సు పరబ్రహ్మమునందు సుస్థిరత సముపార్జించుకొని ఉన్నట్లు.

అట్టి సుస్థిర బ్రాహ్మీ దృష్టిగల మననము (మనస్సు) సంపాదించుకున్నవాడు...,

.... ప్రియమైన వాటిని చూచి పొంగిపోడు.

.... అప్రియమైన వాటిని చూచి క్రుంగిపోడు.

..... మూఢత్వము లేనట్టి సుస్థిర బుద్ధిని ప్రవృద్ధం చేసుకొని ఉంటాడు.

అట్టి బ్రహ్మవేత్త బ్రహ్మమే తానై ప్రకాశిస్తున్నాడు.

ఓ అర్జునా! అట్టి వాడు “బ్రహ్మయుక్తాత్ముడు” అని పిలువబడుచున్నాడు. ఈ శబ్ద - స్పర్శ - రూపాది బాహ్యము నుండి సమీపించే విషయాల పట్ల ఆసక్తి (Inquisitiveness, attachment, relatedness) అంతరంగమునందు రహితం చేసుకుంటున్నాడు. అంతరంగమునందు అంతరంగముచే ఆత్మ సందర్శనం చేస్తూ ఆనందానుభూతిని పరిపుష్టం చేసుకుంటాడేగాని, - ‘దృశ్యంలో ఏదో పొందాననో, పొందలేదనో, - సుఖదుఃఖ నిర్వచనాలు చేసుకోడు. జగత్తంతా తన ఆత్మ స్వరూపంగాను, జగత్తును తన ఆత్మ యందు సందర్శిస్తూ ఉన్నట్టి బ్రహ్మయుక్తాత్ముని సుఖం అక్షయ రూపం దాల్చుచున్నది.

ఓ కౌంతేయా! ఇక్కడ కొంత కొంత మంది తమతమ ఆశయములుగా పొంది ఉన్నట్టి "ఇంద్రియ సంస్పర్శ"చే తారసబడే భోగములు (The experiences of pleasures out of matters in this world), వాస్తవానికి, అనేక ఆదుర్దాలకు – దుఃఖాలకు కారణ భూతములు సుమా! ఇవన్నీ దుఃఖకరములు మాత్రమే! ఎందుకంటావా? రథంలో ప్రయాణిస్తున్న ప్రయాణీకునికి మార్గ మధ్యంలో రహదారికి ప్రక్కగా గల వృక్షాలు – దృశ్యాలు – తదితర విశేషాలు అనుక్షణం రావటం – గతించి పోవటం జరుగుతుంది కదా! అట్లాగే ఈ జగత్ కూడా (జ – జనించటం : గత్ – గతించటం) జరుగుతూ ఉంటుంది? విజ్ఞుడైనవాడు వీటిని నమ్మి ఎట్లా ఉండగలడు? "న తేషు రమతే బుధః." వివేకము కలవారు ఇట్టి అనిత్య దృశ్యపరంపరాసహిత జగత్తునందు రమించరు! మరి? మార్పు–చేర్పులు లేనట్టి ఆత్మ యందే రమిస్తారు.

కనుక అర్జునా! ఎవ్వరైతే తమయందు సమావేశమగుచున్నట్టి, కామ – క్రోధములను, దృశ్యవ్యవహార పరంపరావేశమును శరీరము నేల కూలటానికి మునుముందుగానే నిరోధించి ఉండగలుగుతారో ......,

– ఆతడే యోగి! ఆతడే సన్యాసి! ఆతడే సుఖి!

ఎవ్వడైతే తన అంతరాత్మ యందే సుఖిస్తూ, అంతరాత్మయందే రమిస్తూ, 'ఆత్మ' అను అంతర్జ్యోతిని దర్శిస్తూ, అంతరమునందే ఈదేహ – దృశ్యజగత్తును ఆస్వాదిస్తూ ఉంటాడో, ఆ యోగి బ్రహ్మతత్త్వమును, అధిరోహించి బ్రహ్మభూతుడై ప్రకాసిస్తున్నాడు.

అట్టి బ్రహ్మభూతుడు....,

– సర్వ సందేహములను నివృత్తి చేసుకున్నవాడై,

– బుద్ధి యొక్క దోషములను తొలగించుకొన్నవాడై,

– సర్వభూత జాలమును తన ఆత్మయందు, తన ఆత్మ స్వరూపంగా దర్శిస్తూ బ్రహ్మ నిర్వాణ స్థితిని ఆస్వాదిస్తున్నాడు.

సర్వ కామ – క్రోధములను తొలగించుకొన్నవాడు, చిత్తమునందలి భేద దృష్టి వ్యవహారమును జయించినవాడు, పరమాత్మ యొక్క అనన్య స్వరూపం ఎఱిగినవాడు అగు జ్ఞాని (లేక) యోగి తన చుట్టూ అంతటా అద్వితీయ బ్రహ్మమే సర్వదా, సర్వే – సర్వత్రా సందర్శించగలడు.

*ఈ ఈ దృశ్య సంబంధామైన బాహ్యజగత్వ్యవహారమూ బయటనే వదలి,*

*తన దృష్టిని–చూపును అంతర్ముతం చేసి,*

*భ్రూమధ్యంలో దృష్టినంతా నిలిపి ఉంచి,*

*నాసికయందు ఇచ్చ వచ్చినట్లు సంచరించే ప్రాణ – అపానమూను సమత్వ స్థితికి తెచ్చి ఉంచి,*

*ఇంద్రియమనో బుద్ధూను తన అధీనంలోకి తెచ్చుకొని,*

*జగత్సర్వ విషయమూ పట్ల మౌనం వహించినవాడై, కామ – క్రోధామూను దరి జేరనీయనివాడై మోక్ష పరాయణుడై*

*యోగాభ్యాసం చేసే యోగి సర్వదా ... సర్వత్రా ముక్తుడే!* ఆతనిని ప్రాపంచిక బంధములు ఏ మాత్రం సమీపించలేవు సుమా!

నాయనా, అర్జునా! సర్వ యజ్ఞ – తపస్సుల భోక్తగాను, సర్వలోకములకు కారణ కారణుడగు మహేశ్వరునిగా, సర్వ భూతముల పరిపోషణ – శ్రేయోభిలాషిగాను నన్ను అర్థం చేసుకుంటూ – ఆరాధించుచూ రాగా .... నీవు పరమశాంతి స్వరూపమగు ఆత్మ సాక్షాత్కారం సముపార్జించుకోగలవు సుమా!

కనుక సర్వకర్మ – కర్మఫలములను, సర్వ వ్యవహారములను, సంఘటనలను నాకు సమర్పించి ప్రశాంతచిత్తుడవై సర్వదా వెలుగొందు! సర్వే – సర్వత్రా "స్వస్వరూపాత్మ"గా సందర్శించు. ఆస్వాదించు!

*ఇతి భాగవద్గీతా ..... కర్మ యోగ పుష్పః*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

★★★

**శ్లో॥ అసంశయం, మహాబాహో! మనో దుర్నిగ్రహం చలమ్ ।**
**అభ్యాసేన తు కౌంతేయ! వైరాగ్యేణచ గృహ్యతే ॥**

మహాబాహో! మనో దుర్నిగ్రహం చలమ్! అసంశయం ।
తు కౌంతేయ! అభ్యాసేన – వైరాగ్యేన చ గృహ్యతే ॥

ఓ మహాబాహో! ఈ చంచల మనస్సు వశం కావటం కష్టంతో కూడుకున్న వ్యవహారమే! అయితే అభ్యాస – వైరాగ్యాల సహాయంతో అద్దానిని వశపరచుకోవచ్చు.

# 6.

# ఆత్మ సంయమయోగ పుష్పం

**శ్రీ కృష్ణభాగవానుడు:** ఓ అర్జునా! "కర్మసన్యాసి", "కర్మయోగి" అను రెండు శబ్దాలు నాచే ఉపయోగించబడుచున్నాయి కదా! వాటి పరమార్థం ఏమిటో విను.

"కర్మసన్యాసి" → సర్వకర్మలకు – వాటియొక్క ఫలములకు అతీతుడై ఉంటున్నవాడు. సమర్పన చేసినవాడై ఉన్నవాడు. సర్వ ఇంద్రియ వ్యవహారములను తనకు వేరుగా సమన్వయించుకొని సందర్శించువాడు. (ఇంద్రయాణి ఇంద్రియార్థేషు వర్తంత – ఇతి ధారయన్)

"కర్మయోగి" → తనయొక్క విద్యుక్త – నియోజిత ధర్మములను (One's own duties & Functions)ను యోగసాధనగా నిర్వర్తిస్తున్నవాడు. తనయొక్క సర్వకర్మ సంకల్పములను పూజా పుష్పములుగా మలచి సర్వాత్మకునకు సమర్పించువాడు.

అట్టి కర్మసన్యాసి – కర్మయోగి కూడా కర్మఫలముల పట్ల అనాశ్రితులై (As unattached) ఉంటారు కదా! కనుక కర్మఫలములను ఆశ్రయించక (being unattached to worldly results of what one is doing) ఎవ్వరు కర్మలు నిర్వర్తిస్తున్నారో.... అట్టివారే కర్మ సన్యాసులు. వారే కర్మయోగులు కూడా! ఎందుకంటే "ఇది కావాలి – అది పొందాలి" అనే సంకల్పములను త్యజించకుండా ఎవ్వడైనా కర్మసంగస్థితి నుండి కర్మయోగస్థితి పొందలేడుకదా! (సిద్ధసిద్ధో సమోభూత్వా సమత్వమ్ యోగముచ్యతే). అనేక జీవులు అభ్యాసవశం చేతనే కర్మఫలములపట్ల ఆశ – నిరాశ – దురాశ – వేదన మొదలైనవన్నీ ప్రవృద్ధం చేసుకొనినవారై తద్వారా కర్మబద్ధులై ఉంటున్నారు. అట్టివారు సంయోగ – వియోగములకు అతీతము – నిశ్చలము అగు యోగస్థితిని ఆస్వాదించలేక పోతున్నారు. వారి మనస్సు ఎక్కడా నిలకడ కలిగి ఉండటం లేదు. చంచలమైన మనస్సు కారణంగా అట్టి జీవులకు ఎక్కడా శాంతి – ఆత్మత్వము అనుభూతం కావటం లేదు. అద్దానియొక్క ఛాయకూడా ఎరుకకు రావటం లేదు.

## ఆరురుక్షువు – కర్మల ఆశ్రయం

అయితే ఒకానొకడు ........,

*"ఓహో! నా మనసూ – ఆలోచనలు బాగా ఎక్కడా స్థిరత్వం పొందక అతిచంచలంగా ఉంటున్నాయి కదా! అవి చంచలత్వం త్యజించేది ఎట్లా?"*...

అనే ప్రశ్నకు వస్తున్నాడు. అట్టివానిని "ఆరురుక్షువు – ముముక్షువు" అని పిలుస్తున్నారు. అట్టి మననశీలుడు – విచారణపరుడు అగు ఆరురుక్షువుకు ప్రయత్నరూపకంగా 'కర్మలు' అనే అవకాశం సృష్టికర్త ప్రసాదిస్తున్నారు. కనుక నిశ్చలయోగ సాధకునకు ఉపాయం ఒకనికి తనకు విధించబడిన కర్మలే (స్వధర్మములే) అయి ఉన్నాయి. 'ప్రయత్నం' యొక్క బహిర్గతరూపం కర్మయే కదా!

## యోగారూఢుడు – శమము

క్రమంగా బుద్ధి నిశ్చలమై చాంచల్యమును త్యజించగలిగిన తదుపరి,

ఇక ఆతనికి కర్మలనుండి ఉపశమనం (శమము) ఉపాయాలుగా శాస్త్రములు ప్రవచనం చేస్తున్నాయి.

ఓ అర్జునా! ఈ విధంగా (1) కర్మల ఆశ్రయము (2) కర్మల శమము అనే రెండు విధివిధానాలు ఆరురుక్షువుకు, యోగారూఢునకు శాస్త్రములు బోధిస్తున్నాయి. శాస్త్రములు బోధించే రెండు మార్గాలు సమన్వయించుకొని సరి అయిరీతిలో సరి అయిన అవగాహనతో, సరి అయిన సమయానుకూలంగా శాస్త్ర సాధకుడు ఆశ్రయించాలి.

**యోగారూఢుడు** : యోగసాధకునికి తనకు నియమించబడిన కర్మలే (స్వధర్మములే) సాధనోపాయములని చెప్పుకున్నాం కదా! యోగస్థితికి చేరినట్టి యోగా రూఢునికి కర్మలనుండి ఉపశమనము ఉపాయమై ఉన్నదని కూడా అనుకున్నాం కదా! ఇప్పుడు యోగారూఢుని గురించి మరికొంత నిర్వచిస్తున్నాను. విను.

ఎప్పుడైతే ఒకని యొక్క బుద్ధి శబ్ద – స్పర్శ రూప – రస – గంధములనబడే ఇంద్రియార్ధములందుగాని, వాటిని అనుభవముగా పొందే ఇంద్రియములందుగాని, ప్రాపంచిక సర్వదృశ్య విషయములందుగాని తన్మయం కాకుండా, వాటినుండి వేరైన స్థితిని ఆస్వాదిస్తూ ఉంటుందో... అట్టివాడు 'యోగారూఢుడు'... అని చెప్పబడుచున్నాడు.

కర్మయోగము, కర్మసన్యాసము ... ఈరెండిటిలో ఏది ఆశ్రయించినప్పటికీ ఏదిఎట్లైనా..... ఆయా మార్గములలో నిన్ను నీవు ఉద్ధరించుకోవటం ముఖ్యం.

*శ్లో॥ ఉద్ధరేత్ ఆత్మన్ ఆత్మానమ్, న ఆత్మానమ్ అవసాదయేత్ ।*
*ఆత్మైవహి ఆత్మనో బంధాు, ఆత్మైవ రిపుః ఆత్మనః ॥*

ఓ పార్థా! ప్రాపంచక సంఘటనలతో తన్మయమైన నీ మనో–బుద్ధులను సరి అయిన అవగాహనతో ఆయా ప్రాపంచిక విషయములనుండి విడదీసి నిన్ను నీవు ఆత్మసాక్షాత్కార స్థితికి తరలించాలి. ఈ జగత్తు – శాస్త్రములు –

గురువులు అందుకు నీకు సహకరించగల ఉపకరణములవంటివారు. ఉపకరణమును ఎట్లా ఉపయోగించుకోవాలో... నీకు నీవే గ్రహించి... తద్వారా నిన్ను నీవే సముద్ధరించుకోవాలి సుమా! అంతేగాని అల్ప - స్వల్పకాలిక - స్వప్నపూర్వక జగత్ విషయములచే తన్మయుడవై, భ్రమలను ప్రవృద్ధపరచుకొని నిన్ను నీవు అల్పస్థితి - గతులకు ఈడ్చుకోకూడదు.

*ప్రాపంచక సంకల్పములకు అతీతమైన ఆత్మోన్నత స్థితిని సుస్థిర పరచుకోవటమే జీవితాశయం.*

నీ విచక్షణయే - నీ మనస్సే సాధనామార్గంలో నీకు ఉపకరించి, నిన్ను జగత్తును అధిగమింపజేసి, జగత్తులకు ఆధారభూతస్వరూపమగు ఆత్మను స్ఫురింపజేయగల బంధువు, శ్రేయోభిలాషి!

ఆ నీ మనోబుద్ధులే నిన్ను ప్రాపంచక - ఇంద్రియ విషయములవైపు, సంఘటనలవైపు నడిపించి నిన్ను వాటిచే నిబద్ధుని చేయగల శత్రువు కూడా!

ఎవ్వరి బుద్ధి (లేక) తెలివి (లేక, మనో-బుద్ధులు) దృశ్య సంఘటనలను విచక్షణ - విశ్లేషణలతో జయించే సానుకూల్యతకు సహకరించగలదో.... అది వారికి శ్రేయోభిలాషి, బంధువు. ఎప్పుడెప్పుడు నీయొక్క తెలివితేటలు ఆత్మజ్ఞానమును వదలి ప్రాపంచక విషయములవైపుగా నిన్ను నెట్టుకుంటూ పోతున్నాయో .... అవి నీకు శత్రువుగా పరిణమిస్తున్నాయని గ్రహించు. అనగా, అవి నిన్ను నిమ్నగతులవైపుగా అధోస్థితులకుకూడా కొనిపోగలవు.

కనుక ఇప్పుడు నీవు నీ బుద్ధికి పదునుపెట్టి, నీ సమున్నతికి అది నీకు సహకరించేటట్లుగా తీర్చిదిద్దుకో.

*సంయోగ - వియోగములచే స్పర్శించబడని యోగస్థితిని సముపార్జించుకోవాలి.*

**యోగస్థితుని లక్షణాలు :**

- యోగి "జ్ఞానము (Theoritical Aspects), విజ్ఞానము (Practical

Aspects)"లను సముపార్జించుకొని సర్వ ప్రాపంచక అసంతృప్తులను స్వభావతః జయించివేసి...... తృప్తాత్ముడై ఉంటాడు.

- ఈ జగత్తునంతా తనకు అభిన్నమైన స్వరూపంగా దర్శిస్తూ ఉంటాడు. తనయందు సర్వరూపములను, తన స్వరూపమునందే సర్వజగత్తును సందర్శిస్తూ ఆస్వాదిస్తూ ఉంటాడు. కూటస్థుడై ఉంటాడు.
- ఇంద్రియ – మనో – బుద్ధులను అధిగమించిన దృష్టితో ఈ ఇంద్రియములకు తాను సేవకుడుగాకాక,.... ఇంద్రియములన్నీ తన సేవకులుగా తీర్చుకొని ఉంటాడు. విజితేంద్రియుడై ఉంటాడు.
- ఎల్లవేళలా యోగస్థితిని ఆశ్రయించి, సంయోగ – వియోగములను అధిగమించి ఉంటాడు.
- ఆతని దృష్టికి మట్టి – రాయి – బంగారము ఒకేతీరుగా కనిపిస్తాయి. ఆతడు సర్వ ఆకర్షణ – వికర్షణలు అధిగమించినవాడై ఉంటాడు..

**సమబుద్ధి :**

ఓ పార్థా! తనయొక్క బుద్ధిబలంచేత ఎవ్వరికైతే తన యొక్క శ్రేయోభిలాషి ***– స్నేహితుడు – శత్రువు – కేవలు పరిచితులు – ద్వేషించేవారు – సంబంధీకులు – సోదరులు – పాపులు*** ... వీరందరూ ''మమాత్మస్వరూపులే''గా అనుభూతమౌతారో, వారివారియందు ఏర్పడే తనయొక్క భేద భావనను స్వప్న మాత్రంగా – కల్పిత మాత్రంగా అవగాహన కలిగిఉంటాడో,.... అట్టి యోగ సిద్ధి పొందిన యోగి తదితర తరగతుల యోగులకంటే పరమోన్నతుడు.

అయితే, అటువంటి సర్వసమదర్శన పూర్వకమగు ఆత్మదృష్టిని, జగదతీత దృష్టిని నీయొక్క మనో – బుద్ధులు సముపార్జించుకోవటం ఎట్లా?

"ఇదంతా నా ఆత్మ స్వరూపమే" అను అనుభూతి కలిగి ఉండటమే, ఆత్మదృష్టి, లేక బ్రాహ్మీస్థితి కదా! అటువంటి బ్రాహ్మీస్థితి ఆస్వాదించాలంటే,

- ముందుగా ప్రాపంచక దృష్టులన్నీ ఉపశమించాలి.

– పరిమితమగు రూప – గుణములను అధిగమించివేసిన ఆత్మావగాహన స్థితి – ఆత్మ సందర్శన స్థితి క్రమంగా సుస్థీకరించుకోవాలి.

**ధ్యానయోగ సాధన:**

ఓ అర్జునా! 'ధ్యానము' అనే అభ్యాసం నీవు బుద్ధి చాంచల్యమును తొలగించుకొని, బుద్ధి నిశ్చల – నిశ్చయస్థితిని సంపాదించుకోవటానికి ఉపకరించగలదు. అట్టి ధ్యానయోగం అభ్యసించేది ఎట్లాగో చెప్పుచున్నాను. విను.

☆☆☆

ధ్యాన యోగసాధనకు ఉపక్రమించేవాడు ఆయా దృశ్య విషయములపై ఈగవలె వ్రాలుచున్నతన చిత్తమును (లేక మనో బుద్ధులను) మునుముందుగా కొంచం కొంచెం ఉపశమింపజేసి, ఏకాంతం – నిర్విషయత్వం అభ్యసించటం ప్రారంభిస్తున్నాడు. విషయములతో సమావేశములను క్రమక్రమంగా దూరీకరిస్తూ 'ఏకాకి' అయి 'నేను – పరమాత్మమయ ఈ జగత్తు (My self in relation to God)' అను స్థితిని సుస్థిరీకుంచుకుంటూ ఉంటాడు. మనస్సును మెట్టు – మెట్టుగా వశం చేసుకోనారంభిస్తాడు. "ఏదో కావాలి – ఇంకేదో పొందాలి" ఇటువంటి దృశ్య జగత్ సంబంధమైన 'ఆశించే స్వభావం' పరిత్యజిస్తూ వస్తాడు. ఇక్కడ దేనినీ స్వీకరించనివాడై ఉంటాడు. నీళ్లలో పడవ ఉండవచ్చుగాక! పడవలోకి నీళ్లు ప్రవేసిస్తాయా? లేదుకదా! ప్రపంచంలో ఉంటూనే ప్రపంచమును – అద్దాని సంబంధ – సంఘటనా స్రవంతి హృదయంలో ప్రవేశించనీయడు. ఇటువంటి జగత్ – అప్రమేయత్వం అవధరిస్తూ ఇక ధ్యానయోగసాధనకు ఉపక్రమించసాగుచున్నాడు.

## ధ్యానయోగం

ఇప్పుడు ధ్యానయోగం కొన్నివిషయాలు ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. విను.

'ధ్యానము'నకు రెండు ముఖ్యమైన ప్రారంభాంగములు ఉన్నాయి.

(1) శుచి అయిన ప్రదేశం. (A place of serenity)

(2) స్థిరమైన ఆసనం (A posture that keeps one to be physically unmoved.)

ముందుగా మనస్సుకు "నేను సంసిద్ధమగుచున్న ఈ ధ్యానయోగ ధారణ అత్యంత ప్రాముఖ్యమైనది. ఉత్కృష్టమైనది. అతి పవిత్రమైనది".... అని అనిపించాలి కదా! అందుచేత ధ్యానమునకు ఉపక్రమించే చోటు 'శుచి'గాను, సాత్వికమైన భావాలు ప్రోత్సహించేదిగాను, దీర్ఘకాల ధ్యానానికి అనువుగాను ఉండాలి.

ఇక ఆసనం ఈ దేహమునకు స్థిరత్వాన్ని అందించగల సానుకూల్యత కలిగి ఉండాలి.

ఏ ప్రదేశంలో ధ్యానానికి ఉపక్రమిస్తావో.. ఆచోట దర్భపరచి, ఆపై మృగచర్మం – వస్త్రము పరచుకోవాలి. స్థానం మరీ ఎత్తుగాను – మరీ పల్లముగాను కాకుండా చూచుకోవాలి. ఆ ఆసనముపై ఆసీనుడవై ఇక మనస్సును ఏకాగ్రం చేయాలి.

మామూలుగా మనస్సు పరిపరి విధాల పరుగులు తీస్తూ ఉండటం, ఒక విషయంనుండి మరొక విషయం ఆశ్రయిస్తూ ఉండటం జరుగుతూ ఉంటుంది కదా! ఇప్పుడు అది ఎక్కడో... ఒక్కచోట.. ఏకాగ్రత్వం (constancy at one point) సంపాదించుకోవాలి. అందుకుగాను ముందుగా ఎవరికివారికి తమను సుదీర్ఘకాలం నిశ్చలంగా ఉండటానికి సానుకూల్యమయ్యే "స్థిరాసనం" అభ్యాసం చేయాలి. (శరీరానికి ఒరిపిడి – వ్యానవాయు అవిరోధ ప్రసరణల దృష్ట్యా ఒక్కొక్క దేహానికి ఒక్కొక్క ఆసనం సానుకూల్యం అవుతుంది).

అట్టి శుచి అయిన స్థలంలో స్థిరాసనంతో ఆసీనుడై చిత్తము – ఇంద్రియముల చేష్టలను తన వశం చేసుకోవాలి. మనస్సును ఏకైకలక్ష్యంవైపుగా నియమించాలి.

అప్పుడిక యోగమును అభ్యసించాలి.

యోగము యొక్క ఆశయము "అంతఃకరణమును శుద్ధి పరచుకోవటం" ... అని గమనించబడుగాక!

యోగోపాసన చేస్తూ ఉన్నప్పుడు దేహమును – శిరమును – కంఠమును సమానంగాను, నిశారుగాను, కదలికలు లేకుండాను ధారణ చేయాలి. చూపును తనయొక్క ముక్కుయొక్క ఉపరితలంపై నిలపాలి. దృష్టి ఆదిక్కు – ఈదిక్కూ పోకుండా నాసికకు అగ్రభాగంపై నిలపాలి. అప్పుడు వచ్చే ఆలోచనలనన్నిటినీ "బ్రహ్మచర్యవ్రతం'తో పవిత్రం చేయాలి. అనగా, జ్ఞాపకానికి వస్తున్న సర్వరూపనామ – దృశ్యాదులన్నీ "అంతా బ్రహ్మమేకదా!" అనే మననమునందు లయింపజేయాలి. అట్టివాడే బ్రహ్మచర్య వ్రతుడు. ఆశించేస్వభావములను, భయపడే స్వభావములకు క్రమక్రమంగా వర్జిస్తూ అంతరంగమును ప్రశాంతమయం చేసుకుంటూ యోగసాధనను కొనసాగించాలి.

మనస్సుయొక్క చాంచల్యమును క్రమంగా నిరోధిస్తూ మనస్సును హృదయమునందే నిలిపి ఉంచి సర్వాంతర్యామియగు పరమాత్మను ఉపాసించాలి.

జాగరూకతతో 'నిద్ర – మత్తు' దరిజేరకుండా శ్రద్ధ – ఉత్సాహములను పరిపోషించుకుంటూ యోగమును అభ్యసించాలి.

మనస్సును సర్వతత్త్వ స్వరూపుడనగు నాయందే నిలిపి, నన్నే పారాయణం చేస్తూ యోగమును నిర్వర్తించాలి.

ఈ ప్రకారంగా మనస్సును వశంచేసుకొని సర్వాత్మకుడనగు నన్నే ఉద్దేశిస్తూ, చిత్తమును నాయందే లగ్నంచేస్తూ యోగమును అభ్యసిస్తూ ఉండగా క్రమంగా అట్టియోగి పరమశాంతస్థానమగు నిర్వాణ స్థితిని సంపాదించుకుంటున్నాడు.

⋆⋆⋆

'యోగసాధన' కొనసాగటానికి వీలుగా యోగసాధకులకు సానుకూల్యం కాగల కొన్ని సూచనలు చెప్పుచున్నాను. విను.

**ఆహారం – ఇంద్రియ విషయాలు** : అతిగా ఆహారం – ఇంద్రియవిషయాలు ఆశ్రయించేవారికి యోగస్థితి పొందటం కష్టతరం. అట్లాగే ఇంద్రియ విషయ – ఆహారుదులు మరీ స్వల్పమైతే కూడా యోగసాధన కుదరదు. మనసు అలసత్వం ఆశ్రయించి ధృతి – ఉత్సాహములను కోల్పోతాయి!

**జాగ్రత్ – నిద్రలు** : అతిగా నిద్రను ఆశ్రయించే వానికి మనస్సు మందగించటంచేత యోగసాధనకు తగినంతగా సానుకూలం కాదు. అట్లాగే 'నిద్ర లేమి' అత్యధికమైతే కూడా చిత్తము హృదయంలో ఏకాగ్రత్వం సంతరించుకోజాలదు. ఆహారము – విహారము – కర్మలు – చేష్టలు అతిగాగాని, అల్పంగాగాని కాకుండా, యుక్తంగా ఉండేటట్లు చూచుకోవాలి. అప్పుడు యోగసాధన కుంటుపడకుండా కొనసాగగలదు.

## యోగస్థితి/స్థానం

యోగసాధన కొనసాగిస్తున్న యోగోపాసకుడు ఒకానొక మహత్తరమగు యోగస్థానమును సముపార్జించుకుంటున్నాడు. ఆతని చిత్తము యోగాభ్యాసఫలితంగా తనకు వశమై ఉంటుంది. దృశ్యమును – దృశ్యాంతర్గతమగు సర్వజీవులను స్వస్వరూప పరమాత్మతత్వంగా, పరమాత్మ స్వరూపంగా అనుక్షణికంగా సందర్శించటంలో సుస్థిరత్వం సముపార్జించుకొంటోంది. "ఏదో పొందాలి. అప్పటికిగాని ఆత్మస్థితి సంపాదించవీలుకాదు".... అనే భ్రమ – విభ్రమములు తొలగుతాయి. అట్టివాడు 'ఆత్మయోగి'గా చెప్పబడుచున్నాడు.

"సర్వము పరమాత్మ స్వరూపమేకదా, నాతో సహా!"... అను ఒకానొక నిశ్చలతత్వానికి ఆతడు చేరుచున్నాడు. గాలి వీచని చోట దీపం ఎట్లా ఉంటుంది? నిశ్చలంగా – ఏకరీతిగా ప్రకాశిస్తూ ఉంటుంది కదా! "ఇది వేరు – వారువేరు – నాది – ఇది జ్ఞానము – అది అజ్ఞానము" ఇటువంటి భేద భావనలు త్యజించి ఆయోగి యొక్క చిత్తము పరమాత్మైకభావనచే నిశ్చలమగుచున్నది.

యోగి తన చిత్తమును స్వాధీనపరచుకొని స్వయమాత్మస్వరూపి అయి ప్రకాశిస్తున్నాడు.

యోగసాధన కొనసాగుచుండగా,... ఆ యోగి దృశ్యమును స్వస్వరూపానంద స్వరూపంగా సందర్శించుచున్నాడు. యోగస్థితి సంపాదించిన యోగి సంయోగము (getting) వియోగము (missing) – లకు అతీతస్థితితో కూడిన నిశ్చలస్థితిని స్వానుభవంగా స్వభావసిద్ధం చేసుకుంటున్నాడు.

అట్టి నిశ్చలానందముతోకూడిన ఆత్మసందర్శన స్థితికి చేరిన యోగి యొక్క విశేషణాలు చెప్పుచున్నాను. విను.

⋆⋆⋆

ఏ దశలో (లేక) స్థితియందైతే...,

- చిత్తము యోగసాధనాక్రమంగా ఉపశాంతి పొందినదై చాంచల్యమును మొదలంట్లా త్యజించినదై ఉంటోందో...,
- ఆతడు ఆత్మచే ఆత్మసందర్శనం చేస్తూ ఆత్మచేత సంతృప్తి పొందినవాడై ఉంటాడో...,

  (ఆత్మ స్వరూపము సర్వదా వెన్నంటియే ఉండినదికదా... అను తృప్తిని బుద్ధి తనకుతానై పెంపొందించుకొని ఉంటుందో...)
- బుద్ధి ఇక్కడి ఇంద్రియములను – ఇంద్రియ విషయములను దాటివేసి, ఆయా విషయములకు సంబంధించని ఆత్మానందమును పొందినదై అహేతుక ఆనందమును ఆస్వాదిస్తూ ఉంటుందో...,
- ఏ స్థితిలో ఆయోగి పరమాత్మ స్వరూపమునుండి కించిత్ కూడా విచలితుడు కాడో..., (జగత్తును జగదీశ్వర ప్రదర్శనంగా చూడటంలో విచలితము కాదో...)
- ఏ దశ లభించిన తరువాత, ఇక అంతకుమించి మరింకేదో – ఎన్నటికో – ఎప్పటికో – ఎచ్చటనో పొందవలసినదంటూ ఏదీ మిగిలయున్నట్టి భావన శేషించదో.....,

– ఏ స్థితిలోఅయితే ఈ ప్రాపంచికంగా కనిపించే దుఃఖములు(worries) ఏమాత్రం దరిజేరలేవో... బాధించలేవో, సమీపించనేలేవో...,

అట్టి స్థితికి యోగసాధకుడు స్వభావసిద్ధంగా జేరుచున్నాడు. అట్టి మార్గమే 'యోగసాధనం'. సుఖ - దుఃఖ సంయోగ–వియోగములచే స్పృశించబడజాలని అట్టి స్థితిని యోగాభ్యాసం చేత 'యోగి' అనునిత్యంగా ఆస్వాదిస్తున్నాడు.

అసలు, 'నిర్మలము – నిత్యము – సత్యము – అప్రమేయము'... అగు ఆత్మయే స్వరూపముగా గల ఈ జీవునికి బంధం ఎక్కడినుండి వస్తోంది? దృశ్యసంపర్కముచేతనేకదా! అయితే ఆత్మస్వరూపమును ఏమరచటానికి, దృశ్యతాదాప్యముచే అనేక జన్మ – కర్మ – దుఃఖ పరంపరలచే నిబద్ధుడు అవటానికి కారణం? బాహ్యనుండి ఎవ్వరైనా బంధం కల్పిస్తున్నారా? లేనేలేదు. తనయొక్క దృశ్యమునకు సంబంధించిన ఆలోచనలే కదా! ఆలోచనలు ఎవరివి? తనవేకదా! తన నుండి బయల్వెడలుచున్నట్టి ఆలోచనలచే తనే నిబద్ధుడవటం ఎంత హస్యాస్పదం? కానీ, ఇక్కడ జరుగుచున్న అదే సుమా! ఈ జీవుడు తన సంకల్పముల నుండి తానే ఆశ – నిరాశ – దురాశ – పేరాశ – మొదలైనవి ఆశ్రయించటం, హుతాసుడవటం... ఇవన్నీ జరుగుతోంది. ఇక యోగియో? తన సంకల్పముల నుండియే కామములు (Desires, expectations, wishes etc) బయల్వెడలుచున్నాయని గమనిస్తున్నాడు. తన సంకల్పములనుండి పొగవలె బయల్వెడలుచున్న సర్వ కామములను మొదలంట్లా నిశ్శేషంగా త్యజించినవాడై ఉంటున్నాడు. ఆతడు దీర్ఘకాలంగా నిర్వర్తించిన యోగాభ్యాసముతో సుతీక్షణమైన తన బుద్ధిబలంతో మనస్సు ఇంద్రియములను - వాటి వాటి విషయములను చక్కగా నిరోధించినవాడై, ఉంటాడు. ఇంద్రియములను తన ఆజ్ఞావర్తులుగా తీర్చిదిద్దుకొని ఉంటాడు. (He organises sense organs. He is not organised by them).

అయితే, ఈ ఇంద్రియాలు, వాటివాటి విషయ సముదాయాలు అభ్యాసవశంగా బలవత్తరమై ఉంటాయికదా! ఇప్పుడు నీ బుద్ధిని ప్రేరేపించాలి.

ఉత్సాహపరచాలి. ధైర్య – సాహసాలతో కూడిన బుద్ధిలో నీచిత్తము ఎక్కడెక్కడ ఆత్మదృష్టిని కోల్పోవుచున్నదో సునిశితంగా పరిశీలించాలి. గమనించాలి. నెమ్మది – నెమ్మదిగా, "ఇది నా ఆత్మ స్వరూపమే కదా!"... అని మననాన్ని ప్రవృద్ధం చేయాలి. తద్వ్యతిరిక్తమైన భావావేశమును ఉపశమింప జేసుకోవాలి.

*ఆత్మసంస్థం మనః కృత్వా*
*న కించిదపి చింతయేత్ ॥*

మనస్సును ఆత్మయందు సంస్థాపింపజేయాలి. "మనస్సుకు తోచుచున్నదంతా ఆత్మస్వరూపమే" అనే రసముతో మనస్సును నింపివేయాలి. ఇక మరి దేనికొరకూ – దేనిగురించీ విచారించనేవద్దు.

ఎక్కడెక్కడ ఏదేది ఆత్మ స్వరూపంగా (As form of one's own self) అనిపించక ఈ మనస్సు చంచలము – అస్థిరము పొందుతోందో ... అక్కడక్కడ మనస్సును అభ్యాసయుక్తంగా చేస్తూ అనునయంగా, (In a positive way) ఆత్మమయం చేసివేయాలి. ఎవని మనస్సైతే శాంతము – కల్మషరహితము – రజోగుణ రహితము అగుచూ పరబ్రహ్మత్వము సంతరించుకుంటూ ఉంటుందో...... అట్టి మనస్సు కలవాడు పరమోత్తమము, అకృత్రిమము, తెంపులేనట్టిది అగు ఆనందమును అనుభవించుచున్నాడు.

దోషదృష్టులు తొలగించుకొన్న యోగి పరమాత్మయందు సర్వ ధ్యాసలు సంలగ్నం చేసుకొన్నవాడై, క్రమంగా పరబ్రహ్మస్వరూపప్రాప్తి యొక్క అవధులు లేని ఆనందమును అనుభవించుచున్నాడు.

## ఆత్మానందం

- "నా ఆత్మయే సర్వ జీవులలోనూ ఆత్మగా ఉండి సర్వదా ప్రకాశించుచున్నది."
- "ఈ సర్వజీవులుగా ఉన్నది నా ఆత్మయందే"...

అనునట్టి అనుసంధానంతో యోగయుక్తాత్ముడు ఈ దృశ్య జగత్తును ఆస్వాదిస్తున్నాడు.

***ఆతడు సర్వత్రా, సర్వదా, సమదర్శియై ఆత్మనే సందర్శిస్తున్నాడు.***

ఓ అర్జునా! ఏయోగి అయితే సర్వాంతర్యామియగు నన్ను సర్వరూపస్థుడుగాను, అందరిలోను సర్వదా వేంచేసియున్నవాడుగాను సందర్శిస్తూ ఉంటాడో... అట్టివాడు క్రొత్తగా నన్ను ప్రత్యక్షం చేసుకొనవలసినదేముంటుంది? ప్రయత్నముల అనంతరంగా పొందవలసినదేమున్నది? ఆ యోగి సర్వమునందూ నన్ను, నాయందే సర్వమును సందర్శిస్తూ ఉంటాడు. **అందుచేత ఆ ఆత్మయోగికి నేను కనబడుతూనే ఉంటాను. నాకు ఆతడు కనిపిస్తూనే ఉంటారు.** సర్వభూత జాలములతో ఏకస్థుడనైన నన్ను సర్వదా ఉపాసనాపూర్వకంగా దర్శించే ఆ ఆత్మయోగి ఎప్పుడు – ఎక్కడ – ఎచ్చట – ఏరీతిగా వర్తిస్తున్నప్పటికీ నన్నే సర్వదా అనువర్తిస్తూ ఉంటాడు. ***సర్వసహదేహులను నా స్వరూపంగా చూస్తూ ఆస్వాదిస్తున్నాడు.***

ఓ అర్జునా! సుఖ – దుఃఖ, ఇష్ట – అయిష్ట, సానుకూల్య – ప్రాతికూల్య సందర్భములన్నిటిలోను సర్వదా – సర్వేసర్వత్రా నన్నే సందర్శిస్తూ ఆస్వాదించే ఆ ఆత్మయోగి సర్వ తదితరయోగులలో సమున్నతుడు సుమా!

**అర్జునుడు** : స్వామీ! శ్రీకృష్ణా! మీరు చెప్పుచున్నట్లు సర్వ సందర్భములు (సుఖ – దుఃఖాదులు, శత్రు – మిత్రులు మొదలైనవన్నీ సందర్భపడుచున్నప్పుడెల్లా) "అంతయూ నా ఆత్మ స్వరూపమే" అను నిశ్చయమును కలిగియుండగల "ఆత్మయోగం" సాధ్యమేనంటారా? మీరు చెప్పే సమరస ఆత్మీభావన... ఇక, నా విషయానికి వస్తే... చంచల చిత్తముగల నాకు అగుపించటం లేదు. అనుభవానికి సుసాధ్యమని అనిపించటంలేదు. స్థిరమైన ఆత్మదృష్టితో నేను ఈ జగత్తును, శత్రు – మిత్రులతో సమన్వితమై కనబడే సహజీవులను సందర్శించలేక పోతున్నాను. స్వామీ! నా మనస్సు అనేక చాంచల్యపరంపరలకు లోనైఉంటోందేగాని "అంతాకుడా మమాత్మ స్వరూపమే" అనే నిశ్చలబుద్ధిని

ఆశ్రయించటంలేదు. ఈ మనస్సు తన చాంచల్యముతో నన్ను ఎంతగానో కలతబెట్టుటలో అత్యంత ప్రావీణ్యత చూపుతోంది. గాలిని ఎవరనై అరచేతులమధ్య నిలిపి ఉంచగలరా? అట్లాగే ఈ మనస్సును స్థిరము - నిశ్చలము అగు ఆత్మస్వరూప సందర్శన స్థితి - అవగాహనలకు సానుకూల్యంగా నిలుపలేనేమోనని నాగురించి నాకు అనిపిస్తోంది.

**శ్రీకృష్ణుడు** : ఔను. నీవు చెప్పినది వాస్తవమే! ఈ మనస్సు "అంతా నా ఆత్మ స్వరూపమే"... అనే స్థితి యందు సుస్తిరీకరించటం సులభమైన విషయం కాదనునది ఒప్పుకుంటున్నాను. అయితే అట్టి చంచలమైన మనస్సును సుస్థిరస్థితికి తెచ్చి ఉంచటానికి నీవు ఉపాయాలు ఆశ్రయించాలి కదా? అందుకు రెండు ముఖ్యమైన ఉపాయాలు చెప్పుచున్నాను. విను.

(1) **అభ్యాసము** (Practice): "స్వప్నాంతర్గతమైనదంతా స్వప్నద్రష్టస్వరూపమేకదా! అట్లాగే నాతో సహా సర్వ జీవులు ఆత్మస్వరూపమే"... అనే అభ్యాసం ఆశ్రయించాలి. అభ్యాసంచేత దృష్టి దృఢము - పవిత్రము కాగలదు. (Practice makes it possible). "అంతా పరమాత్మ స్వరూపమే"... అని అనుకుంటూ ఉండటం అభ్యాసం. ఇక అనిపించటమో.... ఆ అభ్యాసముయొక్క అంతిమ ప్రయోజనమై యున్నది.

(2) **వైరాగ్యము** (Non-attachment): ఈ కనబడే సర్వ దృశ్య విశేషములపట్లా, త్రిగుణ ప్రదర్శనములపట్ల, సర్వలోక - లోకాంతర వ్యవహార సరళిపట్ల అనురాగం తొలగించుకోవాలి. (లేక) "సర్వత్రా అనురాగం" అను మార్గంలో విరాగం పెంపొందిచుకోవాలి.

ఈ విధంగా అభ్యాస - వైరాగ్యముల ప్రభావం చేత యోగి "ఆత్మోపమ్యే వ సర్వత్రా"... అనబడు అద్వితీయ సందర్శనం చేయటం సుసాధ్యమేనని ప్రకటిస్తున్నాను.

అయితే....,

మనస్సు పరిపరి విధములైన భావనలతో కూడుకొనినదై ఉంటోంది

కదా! అట్టి మనస్సును కొంచం కొంచం వశం చేసుకొని, అద్దానితో అభ్యాస - వైరాగ్యాలు సాధన పూర్వకంగా నిర్వర్తింపచేయాలి సుమా! అట్లా మనస్సును వశం చేసుకోకుండా కేవలం యోగాభ్యాసం మాత్రమే ఆశ్రయిస్తానంటే, .... అది ఆత్మస్వరూప సందర్శనమునకు దారి తీయటం దుర్లభమేనని నా ఉద్దేశ్యం కూడా! ఏ యోగి అయితే... మనస్సు వశం చేసుకొంటూ యోగసాధనను కొనసాగిస్తాడో... ఆతడు "నాతోకూడా సర్వము ఆత్మయే" అనే ఆత్మానందాస్వాదనను తప్పక త్వరితంగా సొంతం చేసుకోగలడు.

☆☆☆

**అర్జునుడు** : హే భగవాన్! శ్రీకృష్ణా! ఇప్పుడు నాకు ఒక సందేహం వస్తోంది.

మీరు చెప్పినట్లుగా మేము శుచిప్రదేశంలో స్థిరాసనంతో ఆత్మశుద్ధికై యోగసాధనాపూర్వకంగా నాశికాగ్రం పై మనస్సును ఏకాగ్రం చేస్తూ యోగమును అభ్యసిస్తున్నామనుకోండి. యోగమునందు శ్రద్ధ కలిగి ఉన్నప్పటికీ ఏ కారణంచేతనో యోగసంసిద్ధి పొందటానికి మునుముందే మా మనస్సు అట్టి ప్రయత్నము నుండి చలిస్తేనో? యోగసాధనను మనోచాంచల్యకారణంగా కొనసాగించలేక విరమించినప్పుడు గతి ఏమి కానున్నది? ఒకవేళ అట్టివాడు 'జ్ఞానము' మొదలైన తదితరమార్గములు ప్రారంభమే చేయనివాడై, తాను ఆశ్రయించిన యోగసాధనా మార్గము కొనసాగించలేనివాడై - చివరికి ఉభయ భ్రష్టుడు కాదుకదా! ఛిన్నమైన మేఘం ఆకాశంలో గాలికి ఎటో కొట్టుకు పోతున్నట్లు మేము అప్రతిష్టులమై, ఆశ్రయములన్నీ పోగొట్టుకున్నవారమై నాశనము పొందముకదా?

ఎందుకంటే,.....

యోగసాధనామార్గంలో ఏకాగ్రత ప్రాప్తించేవరకు మా సాధన ఏవేవో కారణాలచేత కొనసాగకపోవచ్చును కదా! స్వామీ! "యోగమార్గంలో చ్యుతి పొంది సాధనను కొనసాగించలేని మా గతి ఏమికానున్నదో?"... అని మాలో అనేకులు యోగమార్గమును ఆశ్రయించటమే లేదు. అందుకే ఈ నా సందేహం

మొదలంట్లా తొలగాలి! తొలగితేనే కదా... మేము "ధ్యాసను నిలపటం - నియమించటం".... అనే శాస్త్రప్రవచిత మార్గాన్ని ఆశ్రయించగలిగేది? పైగా, అటువంటి నా ఈ సందేహాన్ని మీరు కాకుండా... ఇక ఎవ్వరు తొలగించగలరు చెప్పండి?

అందుచేత నా ఈ సందేహం మీరు ఆమూలాగ్రంగా పరిశీలించి దయచేసి తొలగించమని ప్రార్థిస్తున్నాను.

**శ్రీకృష్ణభగవాన్** : ఓ అర్జునా! ఎవ్వరైతే బుద్ధిని ఏకాగ్రంచేసే మార్గంగా యోగసాధనకు ఉపక్రమిస్తున్నారో,... వారికి - "యోగ సాధనకు పరాకాష్ఠయగు ఆత్మసంయమం పొందకుండానే మధ్యలో ఆగిపోతామేమో? సాధననుండి చ్యుతి పొందటంచే ఉభయ భ్రష్టత్వం పొందుతామేమో...." అనే అనుమానం ఏ మాత్రం కలిగి ఉండనఖర్లేదు ....." అని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తున్నాను.

ఎందుచేతనంటావా?

మనస్సును ఏకాగ్రం - నిశ్చలం చేయటమే ఆశయంగా కలిగియుండి, యోగసాధన ప్రారంభించినట్టివానికి ఈలోకమునందుగాని, తాను దేహానంతరం ప్రవేశించబోయే ఆయా పరలోకములందుగాని ప్రయోజనకారకమే అవుతుందిగాని,... ఆ సాధకుడు ఇక్కడ - అక్కడ కూడా 'నష్టబోవటం' అనే ప్రసక్తియే లేదు. యోగసాధన ఎంతెంతవరకు కొనసాగితే అంతంతవరకు శుభప్రదమే అవుతుంది. యోగసాధనవలన దుర్గతి కలగటమనే మాటయే ఉండదు. అది ఎట్లో చెపుతాను, విను.

ఒకవేళ యోగసాధనకు ఉపక్రమించిన నీవు కొంతసాధన తరువాత ఏవో కారణాలచేత ఆ సాధనను కొనసాగించకపోవటమో, అద్దానినుండి చలించటమో జరిగిందనుకో! ఆవిధంగా ఎందుకు చలించటం జరిగింది? పూర్వ వాసనల ప్రభావం చేత 'శ్రద్ధ' కొనసాగక పోయినందువలననే సుమా! అయితే ఆమాత్రం చేత ఆ యోగసాధకుడు కోల్పోవుచున్నదేమీ లేదు. కళ్యాణప్రదమగు యోగసాధన దుర్గతికి ఏమాత్రం దారితీయదు సుమా! అయితే పూర్వాభ్యాసాలు

ముందుకు వచ్చి నిలచి ఆతని యోగసాధనను ఏమరచేటట్లు చేయవచ్చు. అట్టి వానిని యోగభ్రష్టుడు (one who got distracted from the practice of yoga) అని చెపుతారు. యోగభ్రష్టుడు తాను సాధననుండి చ్యుతి (లేక) చాంచల్యము పొందుచున్నప్పటికీ ఏ యోగమార్గ స్థితిని ఎంతవరకూ పొందాడో, ....అది అంతవరకూ ఆతని పట్ల పదిలంగానే ఉంటుంది.

అట్టి యోగ సాధకుడు మొట్టమొదటి ప్రయోజనంగా పుణ్యాత్ములు పొందే పుణ్యలోకాలు పొంది వాటి సత్ఫలితాలను అనుభవిస్తున్నాడు. మరల యోగ సాధన కొనసాగించటానికి సానుకూల్యమగు వాతావరణములలో దేహములు పొందుచున్నాడు. అనగా, శుచి – ధనసమృద్ధి – యోగ సాధనములు గల ఇళ్లలో జన్మలు పొంది యోగసాధన మరల కొనసాగించటానికి అవకాశములను సముపార్జించుకొంటున్నాడు.

'యోగసాధన' మరింతగా నిర్వర్తించియున్నవారైతే, వారు యోగుల కుటుంబాలలో జన్మించి యోగము యొక్క పరాకాష్ఠయగు "మనో–బుద్ధుల సందర్శనమంతాకూడా ఆత్మయే"... అను 'ఆత్మసంయమయోగం' సముపార్జించు కొంటున్నారు. అటువంటి యోగుల స్థానాలలో జన్మించటం యోగసాధనయొక్క మహత్తరమగు పరిపుష్టిచేతనే సాధ్యం. అంతేగాని తేలికగా లభించేదికాదు.

(ఉదాహరణకు

నాలుగవ వంతు యోగస్థితిని సంపాదించినలవారు – పుణ్యలోకాలు పొంది సుఖించి, మరల తదుపరి జన్మలలో యోగసాధనకు ఉపక్రమిస్తున్నారు.

సగము యోగస్థితి సంపాదించినవారు – జ్ఞానాభ్యాసానికి అర్హులగుచున్నారు.

ముప్పావు వంతు యోగస్థితి సంపాదించినవారు – యోగులతో సాంగత్యం పొంది తమ యోగసాధన మహత్తరం చేసుకుంటున్నారు.)

యోగసాధన నుండి చలనం పొందినయోగి పుణ్యలోకముల అనుభవం

తరువాత "శుచి - శ్రీమంతము (సమృద్ధి)" గల గృహంలో జన్మిస్తాడని అనుకున్నాం కదా! అప్పుడు ఆతడు పూర్వ దేహంతో నిర్వర్తించియున్న యోగసాధనచే ఏ స్థితి చేరియున్నాడో... ఆ స్థితి తన సంసిద్ధతతోసహా వెంటనంటియే ఉంటుంది. ఆతని బుద్ధియొక్క సంయోగంచే మరల ఆతని బుద్ధియోగ సాధనకు ప్రోత్సాహం పొందుతోంది. *అనగా, ఏదో సందర్భాుం ఆతనిని యోగసాధనను కొనసాగించటానికి ఉపక్రమింప జేస్తోంది.* మరల ఆతడు యోగసాధన కొనసాగిస్తున్నాడు. ఇతఃపూర్వపు అభ్యాసమే మరల యోగసాధనకు ఆతనిని ఆకర్షిస్తోంది సుమా! మరల మరల ఆతడు కామ్య కర్మల స్థితినుండి యోగాభ్యాసానికి వచ్చి అద్దానిని కొనసాగిస్తున్నాడు. ఆతడు యోగ సాధనకు ఉపక్రమిస్తూ - ఉపక్రమిస్తూ క్రమక్రమంగా బుద్ధిలోని కామ్యకర్మలకు సంబంధించిన దోషములను తొలగించుకొంటున్నాడు. ఈ విధంగా అనేకానేక జన్మలలో యోగసాధన కొనసాగిస్తూ ఆత్మసంయమయోగస్థితిని సంపాదించుకుంటున్నాడు. యోగమునకు పరాకాష్ఠయగు "సర్వము తన ఆత్మస్వరూపంగా సందర్శించటం, ఆస్వాదించటం"... అనే మహత్తర స్థితిపొంది ఆనందిస్తున్నాడు.

## ఆత్మసంయమయోగి

ఏదో కోరి తపస్సు చేసేవాడికన్నా ఏకాగ్రతతోకూడిన ధ్యాన - యోగి గొప్పవాడు. ఎందుకంటే తపస్వి ఏదో ఆసిస్తున్నాడు కదా! అది పొందగానే తపస్సును విరమిస్తున్నాడు. యోగసాధకుడో,.... మనస్సును ఆత్మానందంవైపు నడిపిస్తున్నాడాయె!

అంతేకాదు. యోగి జ్ఞాని కన్నాకూడా గొప్పవాడగుచున్నాడు సుమా! జ్ఞాని నిత్యానిత్య, ఆత్మ-అనాత్మా, అంతరంగ విశేష పరిశీలన చేస్తూ సమాచారం సంపాదిస్తున్నాడు. మంచిదే! తాను ఆత్మయే అయి సర్వము తన ఆత్మ స్వరూపంగా ఆస్వాదించాలికదా! తెలుసుకొని ఆగిపోతే ఎట్లా? అందుచేతే జ్ఞానికన్నాకూడా "**ఆత్మసంయమయోగి**" గొప్పవాడగుచున్నాడు. అధికుడగుచున్నాడు.

వేద - వేదాంతాలలోని యజ్ఞయాగాదుల ఆయా కర్మలయందు నిష్ఠ కలవానికన్నాకూడా... ఆత్మసంయమయోగి అధికుడగుచున్నాడు. కర్మిష్ఠుడై, వాటిని సమర్పించి సర్వము ఆత్మగా సందర్శిస్తే కదా... ఆత్మానందం లభించేది?

అందుచేత అర్జునా! నీవు ఆత్మసంయమయోగివి అగుదువుగాక!

యోగులందరిలో కూడా... ఏయోగి అయితే సర్వాంతర్యామియగు నన్ను శ్రద్ధగా ఉపాశిస్తూ అంతరాత్మతో అంతరాత్మయగు నన్ను భజిస్తున్నాడో... అట్టి "సర్వాంతర్యామి ఉపాసన" చేస్తున్నవాడు పరమశ్రేష్ఠుడు.

సర్వము పరమాత్మగా దర్శిస్తూ ఆస్వాదించేవాడు యోగము యొక్క పరాకాష్ఠకు చేరినవాడని నా అభిప్రాయం.

*ఇతి భాగవద్గీతా... ఆత్మసంయమ యోగ పుష్పః*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

★★★

శ్లో॥ వేదాహం సమతీతాని, వర్తమానిని చ, అర్జున !
భవిష్యాని చ భూతాని! మాం తు వేద న కశ్చన ॥

అర్జున! (ఇదం) భూతాని సమతీతాని – వర్తమానాని –
భవిష్యాని చ వేదా౭హమ్! తు, మాం న కశ్చన వేద ॥

అర్జునా! ఈ జీవుని యొక్క దేహముయొక్క ప్రారంభానికి ముందు – వర్తమానం – దేహపతనానంతరస్థితి నాకు తెలుసు. అయితే, దేహధారియగు ఈ జీవులు నన్ను గురించి తెలుసుకోవటం లేదే!

# 7.

# విజ్ఞానయోగ పుష్పం

**శ్రీకృష్ణభగవానుడు** : ఓ పార్థా! ఇప్పటివరకు ధ్యానయోగాభ్యాసం గురించి కొన్నికొన్ని విషయాలు చెప్పాను కదా!

ఇప్పుడిక పరమాత్మనగు నాయందు ఆసక్తితో కూడిన మనస్సుతో నన్నే ఆశ్రయిస్తూ యోగసాధన కొనసాగించే యోగులు సర్వాంతర్యామినగు నన్ను ఏతీరుగా..., ఏమని తెలుసుకొంటారో.... అద్దానిని ఇప్పుడు చెప్పుచున్నాను. విను.

శాస్త్రములు ఆత్మ గురించి ప్రబోధిస్తున్నాయి. అట్టి సమాచారమే జ్ఞానము. ఆ జ్ఞానము అనుభవరూపంగా పరిణమించటాన్ని 'విజ్ఞానం' అంటాం. అట్టి విజ్ఞానముతో కూడుకున్న జ్ఞానముచే, ఏదైతే తెలుసుకుంటున్నారో, ఏది తెలుసుకున్న తరువాత ఇక తెలుసుకోవలసినదేదీ ఉండదో...., అట్టి "విజ్ఞానయోగం" ఇప్పుడు సవివరణపూర్వకంగా చెప్పుచున్నాను. మట్టిని గురించి తెలుసుకొన్న తరువాత ఇక మట్టి బొమ్మలు ఎన్నిటిగురించైనా... తెలుసుకోవలసినదేముంటుంది? బంగారం గురించి తెలిస్తే ఆభరణములు

ఒక్కొక్కటిగా తెలుసుకోవలసినది ఏముంటుంది? జలంగురించి తెలిసిన తరువాత ఇక ఒక్కొక్క తరంగంలో పరిశీలించి గ్రహించవలసినదేమీ మిగలదుకదా! అట్లాగే, .... ఈవిజ్ఞానయోగం గ్రహిస్తే ఇక తెలుసుకొనవలసినదేమీ ఉండదు సుమా!

మరొక్క విషయం! జగత్తులో అనేక విశేషాలు కనిపిస్తున్నాయి. వాటి గురించిన అనేక విజ్ఞానవిశేషాలు తెలుసుకోవచ్చు. చెప్పుకోవచ్చు. అయితే,... జ్ఞానవిజ్ఞాన పూర్వకమైన ఆత్మజ్ఞానం అన్ని విజ్ఞానములకంటే మహత్తరము, అత్యంత ప్రభావవంతము, శుభప్రదము అయి ఉన్నది. అయితే, అట్టి విజ్ఞాన యోగోపాసనను, విజ్ఞాన సముపార్జనను, విజ్ఞాన దృష్టిని పరిపుష్టి చేసుకొని తద్వారా దేహ – జీవిత – జగత్‌దృశ్యములను పరిశీలించటానికి – పరిశోధించటానికి – అర్థం చేసుకోవటానికి అనేకులు ఏమాత్రం ప్రయత్నించటమే లేదు. వేలాదిమందిలో ఎవ్వరో ఒక్కొక్కడు విజ్ఞానదృష్టితోకూడిన పరిశీలనకై సంసిద్ధుడగుచున్నారు. అట్లా పరిశీలించాలనుకున్న వాళ్లలో కూడా వేలాదిమందిలో ఒక్కొక్కరు తుదిరవరకు పరిశీలన కొనసాగించి సంపూర్ణంగా తెలుసుకుంటున్నారు. అందుచేత ఈ విజ్ఞాన పూర్వకమైన జ్ఞానపరిశీలనము నీముందు ఉంచుచున్నాను. ఈ దృశ్యము – దృశ్యమునకు ఆవల ఉన్న ద్రష్టను గురించిన విజ్ఞానం వివరిస్తున్నాను.

⋆⋆⋆

ప్రతి జీవునికి సంబంధించి "ద్రష్ట – అష్టవిధ ప్రకృతి" అను రెండు విశేషాలు ఇక్కడ సమావేశమై ఉన్నాయి.

## అష్టవిధ ప్రకృతి

**ఈ దేహం :** 1. భూమి (solid) 2. ఆపః/జలము (Liquid) 3. అనలము/అగ్ని (Heat) 4. వాయువు/గాలి (Vapour) 5. ఖం/ఆకాశము (Space) అనే 5 తత్వాలు వివిధ పాళ్లలో కలయిక పొందటం చేత ఈ భౌతిక దేహం తయారవుతోంది

ఈ అయిదు కాకుండా అంతర్గతంగా ఆలోచనలు (మనస్సు), విచక్షణ

(బుద్ధి Analytical feature), 'నాది'– అనే అనుకుంటున్న తత్వం (అహంకారం)... ఇవన్నీ కలిపి 'అష్టవిధ ప్రకృతి' అని చెప్పబడింది.

అయితే,

"నేనెవ్వరు ?" అన్న ప్రశ్నకు సమాధానంలో ఈ అష్టవిధ ప్రకృతి ఒక విభాగం మాత్రమే.

'నేను – నాది' అనుకునేదేదైతే సర్వదా మనందరిలో మునుముందుగానే వేంచేసియున్నదో.... అదియే ఆత్మ – జీవాత్మ – పరమాత్మ – అని శాస్త్రములచే వ్యవహరించబడుచున్నది.

ఆత్మయే అష్టవిధ ప్రకృతిని ఒక ఆభరణమువలె, ఉపకరణమువలె ధరించినదై ఉంటోంది.

ఓ అర్జునా! సర్వజీవులలోను అంతరాత్మయే (లేక) పరమాత్మయే నా స్వరూపం. ప్రకృతి నాయొక్క అనుభూతి. ఈ అష్టవిధ ప్రకృతి 'నాది' కావచ్చునేమో గాని, 'నేను' కాదు. ఆభరణం ధరించే వాడు ఆభరణస్వరూపుడు కాదు కదా! (ప్రతి జీవుడు అట్టి అష్టవిధ ప్రకృతికి ఆవలగల కృష్ణ చైతన్య స్వరూపుడే!).

పరమాత్మస్వరూపుడనగు నేను నా హృదయ(లేక) భావనా గర్భమునందు ఈ నాకు కనబడుచున్న సర్వభూతజాలమును ఉపధరిస్తున్నాను. (What all being seen is held in my heart through my thoughts). నాలోని భావనలచే ఈ జగత్తులు ప్రదర్శించబడుచున్నాయి. 'భావన' లయించినప్పుడు జగత్తులుకూడా లయిస్తున్నాయి. కనుక, జగత్తుల దృశ్య – అదృశ్యములకు కారణ భూతుడను నేనే! నా అనుభూతినుండే జగదనుభవాలన్నీ ప్రకటితమగుచున్నాయి.

ఓ ధనుంజయా! ఈ దేహాలు – దృశ్యజగత్తులు మొదలైనవన్నీ నా భావనారాయణత్వం నుండి ఉద్భవించి లయిస్తున్నాయి సుమా! నానుండి బయల్వెడలినవన్నీ నా స్వరూపమేకదా! స్వప్నద్రష్ట రూపమునకు వేరుగా స్వప్నము కించిత్ కూడా లేదుకదా! అట్లాగే సత్స్వరూపుడనగు నాకు వేరుగా ఎక్కడా ఏదీ కించిత్‌కూడా ఉండి ఉండలేదు. ఉండదు. ప్రతిజీవునిలోని ఆత్మ నా స్వరూపమే!

ప్రతి జీవుడు ఆత్మస్వరూపుడే! ఆత్మ అనిర్వచనీయము - అనిర్దేశ్యము - అంతటా విస్తరించియున్నది. కనుక అద్దాని తత్త్వాన్ని అర్థం చేసుకునేందుకు వీలుగా కొన్ని దృష్టాంతాల సహాయంతో వివరిస్తున్నాను.

ఒక పూలదండలో ఏముంటుంది? అనేక పూలు, వాటిని కలుపుచూ ముడివేయబడిన దారం కదా! పూదండలో పూలు కనిపిస్తాయి. దారం కనిపించదు. కానీ దారమే కదా, ... పూలన్నిటినీ కలిపి ఉంచేది? అట్లాగే ఈ సర్వపాంచభౌతిక దేహ- మనో - బుద్ధి - అహంకారాదులందు తదితతర దృశ్యసమాచారములందు ఆత్మయే విస్తరించి ఆధారభూతమై వెలుగొందుచున్నది. అంతయు ఆత్మస్వరూపమే! ఆత్మస్వరూపుడనగు నేనే!

జలంలో రసతత్వం (రుచి) దాగి ఉన్నది. జలమును కళ్లతో చూడగలం. రుచిని చూడలేంకదా! అట్లాగే ఈ సర్వమునందు ఆత్మయే అంతర్గతంగా వేంచేసి ఉన్నది.

తేజో రూపములలైనట్టి సూర్య -- చంద్రులతో తేజస్సు ఏర్పడియున్నది ఆ తేజస్సే సూర్య - చంద్రాది సర్వ ప్రకాశిత వస్తువుల రూపవిశేషం కదా! అట్లాగే ఆత్మయే దేహ - దృశ్య - మనో - బుద్ధి - అహంకారరూపములుగా - తేజోమయంగా ప్రకాశింపజేస్తోంది.

జలంలో రస స్వరూపంగా, సూర్య-చంద్ర-నక్షత్ర-అగ్ని మొదలైన వాటిలో తేజస్సుగా ఉన్నది నేనే.

'వేదము' అనగా శబ్దార్థం 'తెలియబడేది' అని. తెలియబడేదానికి ఆవల (వేదాంతము)... వేదస్వరూపుడగు 'తెలుసుకొనువాడు' ఉన్నాడు కదా! అట్టి వేదపురుషుడు (Knower behind knowing)ను వేదములు 'ఓం' అనే 'సంజ్ఞ'తో ప్రవచిస్తూ... అద్దానిని సంబోధిస్తూ బోధిస్తున్నాయి. అనగా ఆత్మస్వరూపుడగు జీవునికి ఆత్మతత్వం తెలియజెప్పటమే వేదముల అంతర్గత రహస్యం. ఆత్మయే సర్వ దృశ్యవ్యవహారముల అంతర్లీన గానం. ఆత్మయే 'ఓం' అను సంజ్ఞగా చెప్పబడుతోంది.

శబ్దతత్వం ప్రసరింపజేయటం అనే చమత్కారం ఆకాశంలో అంతర్లీనమై ఉన్నట్లు, దృశ్యములు ధారణ చేయటం - ప్రదర్శించటం మొదలైనదంతా ఆత్మయొక్క విలక్షణ లక్షణం.

సర్వజీవులలో దాగిఉండిఉన్న పురుషాకారము నేనే! సర్వాంతర్యామియగు నేనే...., పురుషకారం (Ability to do some thing) రూపంలో ఉన్నాను.

భూమిలో పవిత్ర గంధ స్వరూపమై, మొక్కలకు - పూలకు - తదితర సర్వ పదార్థములకు సువాసనగా విస్తరిస్తూ ఉన్నది కూడా నేనే!

- బ్రహ్మజ్ఞానము - భక్తి - యోగము - కర్మనిష్ఠగల యోగి పుంగవులలో తేజోరూపముతో (వర్చస్సు రూపంగా) విరాజిల్లుచున్నది నేనే!
- సర్వజీవులలో ఉజ్జీవనతత్వమై దేహములను క్రియాశీలకం చేస్తున్నాను.
- తపోధనులలోని తపస్సు - ధ్యానముల నిష్టాస్వరూపుడనై ప్రకాశించుచున్నాను.
- సర్వజీవరాసులయొక్క బీజము నేనే! నా నుండియే ప్రథమాంకురము రూపుదిద్దుకుంటున్నది. నా బీజతత్వం నుండే సర్వజీవుల దేహాలు నిర్మాణమై దృశ్యంగా వర్ధిల్లుచున్నాయి.
- బుద్ధిమంతులలోని తెలివితేటల రూపంలో సూక్ష్మ గ్రాహ్యమునకు ప్రత్యుత్సాహ పరస్తున్నది నా సర్వాంతర్యామిత్వమే!
- సుందర రూపాలలోని సౌందర్యము, సమాలోచనపరులలోని ఆలోచనా స్రవంతిని, శాస్త్రవేత్తలలోని శాస్త్రపాటవాన్ని నేనే! ఈ విధంగా నేనే తేజోవంతులలో తేజస్సుగా విరాజిల్లుచున్నది.
- బలవంతులలో, పట్టుదలకలవారిలో కామము - రాగము ప్రక్కన ఉంచితే, ... అప్పటివారి పట్టుదలగా ప్రదర్శితమగుచున్నది కూడా సర్వాత్మ స్వరూపుడనగు నేనే!

అట్లాగే ధర్మమునకు విరుద్ధంగాని జీవులలోని కామమును కూడా నేనే!

ఓ అర్జునా! ఈ జీవునినుండి ప్రదర్శితమగుచున్న భావాలు (1) సాత్వికము (2) రాజసికము (3) తామసికము.... అని మూడు విధాలుగా విభజించబడుచున్నాయి. అయితే భావాలు వేరు. జీవునిలోని ఆత్మస్వరూపుడనగు నేను వేరు. *భావనలు వేరు - భావించువాడు వేరుకదా!*... ఆయా సాత్విక - రాజసిక - తామసిక భావాలు సర్వాంతర్యామియగు ఆత్మచేతనే కలుగుచున్నాయి. అయితే భావనలు ప్రదర్శించువాడు భావనలుగా మారటం లేదు తాను యథాతథరూపుడై భావనలకు స్థానభూతమై మాత్రమే ఉన్నాడు. కథ చెప్పుచున్నవాడు కథలోని విభాగమా? కాదుకదా!

జలంలోంచే తరంగాలు బయల్వెడలుచున్నప్పటికీ "జలం మారి పోయి తరంగాలుగా అగుచున్నది" అనేది యుక్తియుక్తవాక్యం కాదు కదా! జలము సర్వదా రూపరహితం! తరంగానికో... ఆకారం ఉన్నది. జలానికి వేరుగా తరంగం ఎక్కడ ఉన్నది? అట్లాగే... భావాలు ఆత్మవలననే ప్రకటించబడుచున్నప్పటికీ... ఆత్మయందు భావాదులు లేవు. భావములందు ఆత్మలేదు. నవలారచయిత వలననే నవలలోని పాత్రలు ప్రదర్శితమగుచున్నాయి. కాని రచయితలో పాత్రలు ఉన్నాయని, (లేక) రచయిత తన రచనలోని ఒకానొక పాత్ర అని అందామా? లేదు కదా! నేను భావాలలో లేను. భావాలు నాయందు లేవు.

**మోహితుడు :**

త్రిగుణ భావముల సంయోగ వియోగములచే ప్రదర్శితమగుచున్న జగత్ దృశ్యముచే మోహితుడగువాడు "నేనే ఈ సర్వమునందు అస్మదాత్మ స్వరూపముచే పూర్ణం చేస్తూ ఉన్నాను".... అనే విషయం గమనించలేకపోవుచున్నాడు. "నేనే ... ఈ దృశ్యమునకు వేరై, అవ్యయమై ఈ దేహాదులకు కేవల సాక్షినై, సర్వదేహములలోను సర్వ త్రిగుణచమత్కారములకు ఆవల అస్పృశ్యుడనై వెలుగొందుచున్నాను"... అను ఆత్మత్వమును ఆస్వాదించలేకపోవుచున్నాడు.

ఓ అర్జునా! అలౌకికం - అత్యద్భుతం - పరమాత్మ కల్పితం అగు

త్రిగుణమయమైన నా మాయ బహు చమత్కారమైనది. ఈ నా త్రిగుణాత్మకమైన మాయను దాటివేయటం సులభం కాదు సుమా! దురత్యయం! అయితే, "ఈ కనబడే ప్రతి ఒక్కరు పరమాత్మ స్వరూపులేకదా! ఈ గుణములకు (whether I am liking or not liking)... అతీతమై పరమాత్మస్వరూపం – మమాత్మ స్వరూపం ఈ ఒక్కొక్కరిలో – అందరిలో వేంచేసియుండి, పూదండలోని దారంలాగా అంతర్లీనంగా ప్రకాశిస్తోందికదా" ... అనే మననము – ధ్యాస – దృష్టి – భావనలచే ఉపాసించేవారు ఈ మాయనుండి తరిస్తున్నారు. గుణములకు అతీతమైన పరమాత్మదృష్టిచే ఈ జగత్తును – సహజీవులను – సకల సంఘటనలను సందర్శిస్తూ 'ఆత్మసందర్శనం' అనురూపంగా ఉపాసించేవారు మాయను దాటివేస్తున్నారు. మాయకు ఆవలగా ఏ తమ ఆత్మస్వరూపం సర్వే – సర్వత్రా సర్వదా ఏర్పడియే ఉన్నదో ... అద్దానిని తనతో సహా అందరిలోను – అందరుగాను ఆస్వాదిస్తున్నారు. ఆత్మజ్ఞులు – ఆత్మానందానుభవులు అగుచున్నారు.

☆☆☆

ఓ అర్జునా! ఈ జీవులు రెండు విధములుగా ఉంటున్నారు.

1) దుష్కృతులు

2) సుకృతులు.

(i) ఆర్తులు, (ii) జిజ్ఞాసులు,

(iii) అర్థార్థులు, (iv) జ్ఞానులు

వారి గురించి విను.

**1) దుష్కృతూలు** : వీరు పరమాత్మ – సర్వాంతర్యామియగు నన్ను ఉపాసించే దృష్టిని ఆశ్రయించటమే లేదు. దుష్కృత్యములను కొనసాగిస్తూ మూఢత్వముతో జీవితములను కొనసాగిస్తున్నారు. కోపము – ఉద్వేగము – తప్పులెంచటం – ద్వేషము – ఆధిపత్యము – అవమానించటం – దూషించటం – దుర్గుణములు ఆపాదించటం... ఇటువంటివి అభ్యసిస్తూ రోజులు వెళ్లపుచ్చుచున్నారేగాని

"మమాత్మస్వరూపమే వీరంతా కదా!" ... అనే భావనను ఆశ్రయించటం లేదు. "నా ఆత్మనే నేను ద్వేషిస్తున్నాను - దూషిస్తున్నాను".... ఇటువంటి జ్ఞానం వారు గమనించటం లేదు. వీరు మానవ జాతిలో అధములుగా ఎంచబడుచున్నారు. ఎందుకంటే వారు ఉపాసనా పూర్వకంగా జీవితమును సద్వినియోగపరచుకోవటం లేదుకదా!

2) **సుకృతులు**: పరమాత్మను ఉపాసించే సుకృతులను 4 విధములుగా విభజించవచ్చు.

(i). **ఆర్తులు** : వీరు వీరికి వచ్చే కష్ట - నష్టములనుండి ఉపశాంతిని కోరినవారై పరమాత్మను ఉపాసిస్తున్నారు. మంచిదే! ఏదో కారణంచేత పరమాత్మను ఆశ్రయిస్తున్నారు కదా! అయితే...., ఆ కష్ట - నష్టములు తొలగగానే మరల పరమాత్మను ఎంతో కొంత ఏమరచటం జరుగుతూ వస్తోంది.

(ii). **జిజ్ఞాసువులు** : మరికొందరు - "*పరమాత్మ గురించి తెలుసుకోవాలి. ఎవ్వరేమంటున్నారో శ్లోకార్థపూర్వకంగా అర్థంచేసుకోవాలి. అవన్నీ ఎవరికైనా చెప్పి 'జ్ఞానులము' అని అనిపించుకోవాలి. మేము చెప్పుచుండగా అనేకులు వినాలి*".. ఇటువంటి జిజ్ఞాస కలిగినవారై పరమాత్మ గుణతత్వాన్ని పఠిస్తున్నారు. ఉపాసిస్తున్నారు. సంభాషిస్తున్నారు. అయితే జిజ్ఞాసకు అంతేమున్నది. *అది ఈ దృశ్యమంత అనంతం.* దృశ్యమునకు ఆవల గల ద్రష్ట యొక్క తత్వము ఎట్టిదో ఆస్వాదించనంతవరకు జిజ్ఞాస కొనసాగుతూనే ఉంటుంది. ఒక విధంగా జిజ్ఞాస బంధమే అగుచున్నది.

(iii). **అర్థార్థి** : మరికొందరు సుకృతులు ఉత్తమ ప్రతిష్ఠ - సంపద - కళాప్రావీణ్యత - సమృద్ధి... ఇటువంటి విశేషాలు అర్థించినవారై పరమాత్మను కొలుస్తున్నారు. సంపదలకై వారు పరమాత్మను ఉపాసిస్తున్నారు.

(iv). **జ్ఞాని** : ఈ మహనీయుడు ఈ జగత్తంతా కూడా (తన దేహ మనో - బుద్ధి - అహంకారాదులతోసహా) పరమాత్మ యొక్క స్వరూపమేనని ఎఱిగి సర్వము పరమాత్మతత్వంగా, తత్వాంతర్గతంగా ఉపాసిస్తున్నాడు.

ఈ విధమైన ఆర్త - జిజ్ఞాస - అర్థార్థి - జ్ఞాన ఉపాసకులలో జ్ఞాని అధికంగా అనునిత్యోపాసకుడై ఉంటున్నాడు. ఆతనిలో ఏకభక్తి అత్యధికమై ఉంటోంది. ఆతడు పరమాత్మకొరకై జగత్తుతో ఉంటాడు. "జగద్విషయములకొరకై పరమాత్మను ఉపాసించుట" - అను స్థితిని అధిగమించివేసి ఉంటాడు. ఓ అర్జునా! సర్వాత్మకుడనగు నాకు భక్తులందరిలోకి జ్ఞానభక్తుడంటే మరీ ఇష్టం. అట్లాగే జ్ఞానికి నేనే పరమప్రీతి పాత్రుడను.

మనం చెప్పుకున్న ఆర్త - జిజ్ఞాస - అర్థార్థి - జ్ఞానులు నలుగురు ధన్యులే! ఎందుకంటే వారు నలుగురు భగవదోపాసన నిర్వర్తిస్తున్నారు. భక్తిని ప్రవృద్ధం చేసుకొంటున్నారు. నలుగురు సుకృతులే! నలుగురు తమతమ మనో-బుద్ధులను పవిత్రం చేసుకొంటున్నారు. అయితే జ్ఞాని ప్రాపంచికమైన ఏ ప్రయోజనం ఉద్దేశించకుండానే, స్వభావసిద్ధంగా పరమాత్మయొక్క నిత్య - సత్య - అప్రమేయ - అఖండ తత్వాన్ని పరమార్థయుక్తంగా ఆశ్రయిస్తున్నాడు. ఆతనికి పరమాత్మయే సాధన - సాధ్యము కూడా! మరింకేదీ ఆతని ఆశయం కాదు. ఆతడు సర్వదా భగవత్ యోగానందమునందు ఓలలాడుచున్నాడు. అందుచేత **"నేనే జ్ఞాని" "జ్ఞానియే నేను"**. మా ఉభయులకు భేదమే లేదు. "తత్వమ్ - సోఽహమ్ - త్వమేవాహమ్" అను మూడు వాక్యముల అర్థమును అనుక్షణికంగా జ్ఞాని ఆస్వాదిస్తున్నాడు సుమా!

ఆర్తుడై - జిజ్ఞాసువు అయి - అర్థార్థియై నన్ను ఉపాసిస్తూ... కొంత కాలానికి ఆ సాధకుడు జ్ఞానిగా తనను తాను తీర్చిదిద్దుకొంటున్నాడు. అనేక జన్మల ఉపాసన ప్రయోజనంగా ఆతడు సర్వతత్వస్వరూపుడను - సర్వాంతర్యామిని అగును నన్ను సందర్శిస్తూ ఉపాసిస్తున్నాడు. (వాసనాత్ వాసుదేవస్య వాసితంతే జగత్రయమ్). "పరమేశ్వరుడే సర్వే సర్వత్రా సర్వగుణ - దేహ - దృశ్య ప్రదర్శనంగా అగుపిస్తున్నాడు. ఇదంతా వాసుదేవమయమే! నా వాసుదేవత్వమే ఇదంతా!" .... అని గ్రహిస్తున్నాడు. అట్టి ఆత్మసాక్షాత్కార సంపన్నులు ఎక్కడోగాని నీకు లభించరు సుమా!

ఆర్త - జిజ్ఞాస - అర్థార్థుల గురించి మరికొంత చెప్పుచున్నాను. విను.

## సకామపూర్వక దేవతోపాసన

ఈ జీవులు ఏదేదో జగత్‌సంబంధమైన సంపద - క్షేమాదులు పొందవలెనని ఉబలాటపడుచూ, .... ఉపాసిస్తున్నారు కదా! వారు ఆయా - తమతమ హృదయాంతర్గతమైన కోరికలను దృష్టిలో పెట్టుకొని "ఈ జగత్తువేరు - నా ఉపాసనాదైవం వేరు" అనేరూపంగా అన్యదేవతోపాసన చేస్తున్నారు. వారివారి స్వభావములచే ప్రేరితులై అన్య దేవతోపాసనకు ఉపక్రమిస్తున్నారేగాని అనన్యతత్వమును ఇంకనూ ఆశ్రయించటంలేదు.

ఎవరెవరు ఏఏ దేవతా స్వరూపమును ఏఏ ప్రయోజనము కొరకై శ్రద్ధతో అర్చించాలని తీవ్రముగా ఉద్దేశ్యిస్తున్నారో... ఆ దేవతయందు శ్రద్ధను నేను ఆ ఉపాస్యపరునకు ప్రసాదిస్తున్నాను. అట్లు ఆయా ఉద్దేశ్యములలో పూజించేవారికి వారు కోరుకుంటున్న ఆయా ప్రయోజనములను నేనే అందింపజేస్తున్నాను. ఎవరు ఏ దేవతను ఏ ఆశయము (లేక ఉద్దేశ్యము)తో ఉపాసిస్తున్నారో... వారు ఆ ప్రయోజనమును ఆ నా దేవతారూపం నుండి పొందుచున్నారు.

అయితే...,

అల్పమైన మేధస్సుచే అల్పమైన ఆకాంక్షలు - దృశ్యసంబంధమైన ఆశయములు కలిగిఉన్నవారు, అల్పము - కాలానుగతము అగు ఫలములను పొందటం జరుగుతోంది. అనగా, - దృశ్యప్రయోజనము ఆశించి దేవతలను ఉపాసించేవారు అద్దానికి ప్రయోజనంగా దృశ్యసంబంధమైన ప్రయోజనములనే పొందుచున్నారు. ఇక నా భక్తులు... నన్నే కోరుకొని ఉపాసించినవారై నన్నే పొందుచున్నారు సుమా!

## నిష్కామపూర్వక - అవ్యక్తాత్మోపాసన

- నేను అవ్యక్తాత్మస్వరూపుడను.
- ఈ జగత్తో,..... అవ్యక్తాత్ముడనగు నా యొక్క ప్రదర్శనా విన్యాసం.

- ఈ నామరూపాత్మక సృష్టికి – జన్మకర్మలకు మునుముందే ఏర్పడిఉన్న సత్ స్వరూపుడను.
- సర్వమునకు అంతర్యామిని. అప్రమేయ స్వరూపుడను.
- దేశ – కాలములకు అప్రమేయుడను కాని దేశ కాలముల నియామకుడను. ఆధారభూతుడను.
- దేహ – మనో – ఇంద్రియములకు అవిషయుడను. కానీ వాటికి ఆధారం నేనే.
- అవ్యక్తుడను. అయితే ఈ దృశ్యమంతా నా వ్యక్తీకరణమే! (All this is my manifestation, where as, I am prior to this manifestation)

☆☆☆

అట్టి అవ్యక్తతత్వమగు నన్ను 'వ్యక్తుడు' అని అల్పమేధస్సుగల జనులు అనుకోవటం జరుగుతోంది. "ఎందులో ఈ దృశ్యమంతా వ్యక్తమౌతోందో... అట్టి నాస్వరూపం అవ్యక్తం"... అని ఉత్తమ బుద్ధిగలవారు గమనిస్తున్నారు. ఇక అల్పబుద్ధి కలవారో..., నా యొక్క అవ్యక్తము – పరమోత్తమము అగు పరతత్వమును గమనించటం లేదు. వ్యక్తీకరించబడే సర్వమునకు వ్యక్తీకరించే నేను మునుముందుగానే ఉన్నాను. కదిలే దేహాలను కదిలించే చైతన్యమును.

ఓ అర్జునా! 'యోగమాయ' అను దృశ్యతత్వసమన్వితమైన నాయొక్క పరరూపం అందరికీ గోచర మగుటలేదు. నాయోగమాయారూపములగు దేహ – జగత్తులే నేనని అనేకులు అనుకుంటున్నారు. దృశ్యవ్యవహారములచే మోహం చెందువారు నేను జన్మరహితుడనని, అవ్యయమగు (మార్పు – చేర్పులు లేని) కేవల స్వాత్మస్వరూపమని సందర్శించ లేకపోతున్నారు. తనయొక్క ఆత్మయే నేనని గమనించటం లేదు. సర్వదేహములలోని 'దేహి' స్వరూపుడనుగా వారు నన్ను గుర్తించటం లేదు.

☆☆☆

ఈ జీవులందరియొక్క

(1) దేహమునకు మునుముందు స్వరూపము,

(2) దేహము ధరిస్తున్నప్పటి స్వరూపము,

(3) దేహానంతర స్వరూపమును

నేను ఎఱిగియే ఉన్నాను.

ఈ త్రికాలములందు నా ఆత్మయే వారి స్వరూపమై ఉన్నది కదా! అయితే సర్వాంతర్యామి – ఆత్మానంద స్వరూపము – పరము – శాశ్వతము – అప్రమేయము అగు నన్ను గుర్తించలేక పోతున్నారు. ఎందుకంటే ***తెలుసుకొనునదే నేనై ఉండగా... తెలియబడేదాని ద్వారా ఎట్లా తెలియబడతాను?***

"సర్వజీవులలోని ఆత్మస్వరూపము నేనే!" "అవ్యక్తము – శాశ్వతము" అగు ఆత్మ స్వరూపుడను. "ఈ దృశ్యమంతా నాయందే నా స్వరూపమైయున్నది"... అని అనేకులు సందర్శించటం లేదు.

ఎందుచేతనంటావా?

"ఇష్టము – అయిష్టము – ఇచ్ఛ – ద్వేషము" అనే ద్వంద్వములచే ఈ జీవులలో అనేకులు మోహము పొందుచున్నారు. అందుచేత వారు ఆత్మతత్వమును గ్రహించలేకున్నారు.

అయితే....,

ఏ ఏ జీవులైతే తమయొక్క పుణ్యకర్మలచేత తమయందలి పాపదృష్టులను తొలగించుకుంటారో, దృఢవ్రతులై ద్వంద్వమోహము నుండి తమను తాము ఉద్ధరించుకోవటానికి సంసిద్ధులై యత్నిస్తున్నారో... అట్టివారు "సర్వాంతర్యామి – స్వస్వరూపము – అఖండాత్మ స్వరూపము" అగు నన్ను సమీపించి స్వస్వరూపాత్మనగు నాపై దృష్టిని నిలుపుకొంటున్నారు. ఆస్వాదిస్తున్నారు.

ఓ అర్జునా! అతిదీర్ఘ కాలంగా కొనసాగుచున్న జన్మ – జరా – మరణముల చక్రమునుండి విడివడుటకై, ఎవ్వడైతే నిశ్చలము – అప్రమేయము

అగు నన్ను ఎప్పుడు ఆశ్రయించి ఉపాసిస్తాడో, .... అట్టివాడు అప్పుడు పరబ్రహ్మము - అధ్యాత్మము - సర్వము - సర్వకర్మలకు అతీతము స్వస్వరూపమునకు అద్వితీయము అగు నన్ను తెలుసుకొని సంపూర్ణత్వమునకు అనుభవయోగ్యుడుగా అగుచున్నాడు.

అట్టివాడు ఈ వర్తమాన దేహపర్యంతము – దేహత్యాజ్య సమయంలో కూడా అధిభూతుడను, అధిదైవమును, అధియజ్ఞ స్వరూపుడను అగు నన్ను యుక్తియుక్తంగా ఎఱిగినవాడై – నన్నే చేరుచున్నాడు. నాయందు ప్రవేశించి – ప్రకాశించి తానే నేనుగా అగుచున్నాడు. సర్వాత్మ స్వరూపుడై శాశ్వతాత్మానందం పొందుచున్నాడు.

*ఇతి భాగవద్గీతా... విజ్ఞానయోగ పుష్పః*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

★★★



శ్లో॥ అనన్యచేతాః సతతం యోమాం స్మరతి నిత్యశః
తస్య అహం సులభః, పార్థ! నిత్యయుక్తస్య యోగినః ॥

పార్థ! యః అనన్య చేతాః నిత్యశః సతతం మాం స్మరతి,
తస్య నిత్యయుక్తస్య యోగినః అహం సులభః !

ఓ పార్థా! ఎవ్వరైతే అనన్య చిత్తులై ఎల్లప్పుడు స్మరిస్తూ ఉంటారో, అట్టి నిత్య యుక్తులగు యోగులకు నేను సులభంగా లభిస్తున్నాను.

# 8.

# అక్షరపరబ్రహ్మ యోగ పుష్పం

అర్జునుడు : హే మహాత్మా! శ్రీకృష్ణా!

*"భక్తి – జ్ఞాన – కర్మయోగులు తమయొక్క పుణ్య కర్మలచే పాపదృష్టులను త్యజించి ద్వంద్వమోహమునుండు వినిర్ముక్తులై దృఢవ్రతశీలురై నన్నే ఆరాధిస్తూ – ఉపాసిస్తూ ఉంటారు. జరామరణములనుండు విముక్తి పొందటానికై వారు నన్ను ఆశ్రయించి తద్వారా బ్రహ్మమును అధ్యాత్మమును, కర్మతత్వమును ఎరిగిన వారగుచున్నారు."*

– అని మీరు అనియున్న ఈ సందర్భంగా "బ్రహ్మము' మొదలైన 7 శాస్త్రప్రవచిత 'శబ్దార్థ విశేషాలు నాకు బోధించవలసినదిగా ప్రార్థిస్తున్నాను.

(సామాన్య పరిభాషలో "బ్రహ్మము" సాధనానంతరం అనుభూతమయ్యేదని, 'అధ్యాత్మము' అంటే జీవుడు అని, 'కర్మ' అనగా చేస్తున్నపని అని, 'అధిదైవం' అనగా శివుడో – విష్ణువో – అల్లాయో – యహోవా (ఇష్టదైవం) అని, యజ్ఞము అంటే అగ్నికార్యము అని, జ్ఞేయము అంటే ... ఎక్కడో ఏర్పడిఉన్న ఏదో తెలుసుకోవటం అని – లోకరీతిగా అనుకుంటూ ఉంటారు. ఆశబ్దముల

యొక్క తత్వశాస్త్రార్థాలు అర్జునుడు అగుచున్నారు.)

ఓ పురుషోత్తమా! శ్రీకృష్ణా! ఇప్పటిదాకా మీరు "నేను - నా ప్రకృతి" అను విభాగం చేసి జీవుని గురించి నిర్వచించారు కదా! ఈ సందర్భంగా, మిమ్ములను కొన్ని అధ్యాత్మశాస్త్ర ప్రవచితములగు శబ్దార్థ విశేషాలు విశ్లేషించి చెప్పవలసినదిగా... అభ్యర్థన చేస్తున్నాను.

1. "బ్రహ్మము" అనగా ఏమిటి?
2. "అధ్యాత్మము" అని దేనిని పిలుస్తున్నారు.
3. "కర్మ" అనగా విశేషార్థమేమిటి?
4. "అధిభూతం" అని ఏది చెప్పబడుతోంది?
5. "అధిదైవం" అను శబ్దం ఎద్దానిని ఉద్దేశ్యిస్తోంది?
6. "అధియజ్ఞం" అని దేనిని పిలుస్తున్నారు. "ఈ దేహంలో అధి యజ్ఞుడు ఉంటాడు" అని అంటూ ఉంటారు కదా? ఈ శరీరంలో ఆతని ఉనికి ఏది? ఎట్టిది?
7. యోగచిత్తులైన మహనీయులు నియతాత్ములై పయనిస్తున్నప్పుడు (ఈ జగత్తులోని సర్వ వ్యవహారములు త్యజించి వెళ్ళుచున్న సమయంలో - అంత్యకాలంలో) ఎద్దానిని ఎఱుగుచూ ప్రయాణశీలురగుచున్నారు?

**శ్రీకృష్ణుడు** : నీ వడిగిన శబ్దాలకు అర్థాలు తత్వశాస్త్రానుసారం చెపుతాను. విను.

**1) బ్రహ్మము (అక్షరం బ్రహ్మపరమం)** : ఓ అర్జునా! ఈ కనబడే సర్వదృశ్య వ్యవహారములు మార్పుచెందేవీ, గమనశీలముకదా! అయితే ఈ జీవుని స్వస్వరూపంగా వెలుగొందుచున్నట్టి "కేవలీ తత్వము" మార్పు - చేర్పులకు సంబంధించనిదై, అక్షరమై, సర్వములో విభాగంకాకుండా (సర్వమునకు వేరై) వెలుగొందుచున్నది. అది జన్మ - జీవిత సంఘటన - జర - మరణ - మరణానంతర స్థితిగతులచే మార్పు చేర్పులు చెందటమే లేదు. అట్టి జీవుని

యొక్క అక్షర - పర స్వరూపము "బ్రహ్మము" అను శబ్దముతో చెప్పబడుతోంది. పిపీలికాది బ్రహ్మ పర్యంతం సర్వజీవులు ఆ "అక్షర పరబ్రహ్మము" అనునదే తమ వాస్తవ స్వరూపంగా కలిగి ఉన్నారు. గుణములచేతగాని, స్థితిగతుల చేతగాని అయ్యది స్పృశించబడేది కాదు. అద్దానిని పాప - పుణ్య, సుఖ - దుఃఖ, జ్ఞాన - అజ్ఞాన, జీవన్ - మరణ, భూత - భవిష్యత్ విశేషాలు స్పృశించవు.

అట్టి ప్రతిఒక్క జీవునియొక్క మార్పు - చేర్పులచే స్పృశించబడని స్వస్వరూప తత్వమే బ్రహ్మము.

బ్రహ్మము పొందబడేది కాదు. అది ఎల్లప్పుడు ప్రతిఒక్కరిచే సర్వదా పొందబడియే ఉన్నది. "మన ఆలోచనల ద్వారా ఆలోచనలు చేయువానిని సంపాదించుకొందాము"..... అని అనం కదా! ఆలోచనలు చేయువాడు సర్వదా ఆలోచనలకు మునుముందుగానే ఉంటాడు. ఆలోచనలలో జన్మ - కర్మలు ఉన్నాయి. అట్టి సర్వ ఆలోచనలకు మునుముందుగా ఉన్నదే పరబ్రహ్మము.

అట్టి నిత్యసత్యము - వాస్తవ స్వరూపము - కేవలము - నిశ్చలము అగు అక్షర తత్వము 'బ్రహ్మము' అను శబ్దముచే ఉద్దేశించబడుతోంది. అది ఈ సర్వమునకు సర్వదా వేఱై - పరమైయున్నది. ***అట్టి నిర్గుణ - నిరాకార స్వస్వరూప సర్వరూప - కేవలీ - చైతన్యమే బ్రహ్మము.*** అద్దాని సమక్షంలో ఈ జన్మ-కర్మ సర్వచమత్కారాలు స్వయంకల్పితమై లీల - క్రీడగా గోచరిస్తున్నాయి.

**2) అధ్యాత్మము (స్వభావో అధ్యాత్మముచ్యతే)** : అట్టి అక్షర పరబ్రహ్మము ఈ దేహ - మనో- బుద్ధి - అహంకారములను ఉపకరణచమత్కార మాత్రంగా కలిగి ఉంటోంది. బ్రహ్మమే స్వభావసిద్ధంగా జగత్తులను కల్పించటం - దేహములను ఆశ్రయించటం - జ్ఞానాజ్ఞానాలను సేవించటం... మొదలైన ఏకానేక విశేషాలు కల్పించుకొని ఆస్వాదిస్తోంది. ఒకడు నిదురించి, ఆ నిదురలో స్వభావసిద్ధంగా స్వప్న - స్వప్నాంతర్గత విశేషాలు కల్పించుకొని ఆస్వాదిస్తున్నాడు చూచావా? బ్రహ్మము కూడా జగత్తులను కల్పించుకొని అద్దానియందు వ్యష్టి - సమష్టి తత్వములను ఆస్వాదిస్తోంది.

- అట్టి "నిర్గుణ బ్రహ్మముయొక్క సగుణ (గుణసహిత) దృశ్య చమత్కారాస్వాదనయే"... స్వభావము.
- గుణములకు ముందే ఉన్న బ్రహ్మము గుణవిశేషములను స్వయంగా రచించుకొని ఆస్వాదించటం... అనే స్వభావచమత్కారమును తత్వశాస్త్రజ్ఞులు "అధ్యాత్మము" అని పిలుస్తున్నారు.
- ఒక వ్యక్తి -- ఆతని స్వభావము వేరువేరు కాదు కదా! అట్లాగే బ్రహ్మము – స్వభావము వేరువేరు కాదు. (ఇట్టి తత్వమే అర్ధనారీశ్వర తత్వం).

బ్రహ్మమే జగత్తు. బ్రహ్మమే జీవులు. ఎందుకంటే బ్రహ్మము సర్వదా యథా తథం కదా!

బ్రహ్మముయొక్క "ఇది ఇట్లు ఉండుగాక" అను చమత్కారమే ఈ దేహపరంపరలు, జగత్ దృశ్యములు కూడా!

**3) కర్మ (భూతభావ ఉద్భావకరో విసర్గ కర్మసంగితః)** : సామాన్యార్థంలో 'కర్మ' అనగా ఒకడు నిర్వర్తిస్తున్న పని – కార్యక్రమము. కర్మలు – ఫలాలు – కర్మచే జన్మలు ఇవన్నీ ... కర్మగా చెప్పుచూ ఉంటారు.

**విశేషార్థం** : అక్షరము – పరము – ప్రతిఒక్కజీవుని నిజస్వరూపం అయినట్టి బ్రహ్మము తనయొక్క స్వభావము (అధ్యాత్మము) అనబడే స్వయంకల్పిత చమత్కారం చేత భూతభావన ప్రారంభించటం – కొనసాగించటం – ఉపసంహరించటం చేస్తోంది. అనగా పంచభూతాత్మికమైన రూప – నామ – వ్యష్టి – సమిష్టి చమత్కారం నిర్వర్తిస్తోంది. మరొకప్పుడు ఈ దృశ్య చమత్కారాన్ని ఉపసంహరించుకోవటం నిర్వర్తిస్తోంది.

ఆ విధంగా 'స్వభావము' అనే ఉపకరణంతో నామరూపత్మకత్వం, దృశ్య భావనారచన, ఆ కల్పనయందు ప్రకాశించటం, అద్దానినుండి ఉపసంహరించటం బ్రహ్మముయొక్క కార్యక్రమ చమత్కారం. అద్దానిని 'కర్మ' అనే సంజ్ఞతో పిలుస్తున్నారు.

ఈ జీవుడు స్వయంగా పరబ్రహ్మస్వరూపమే! కనుక కర్మ – స్వభామములకు ఆవల వెలుగొందే పరబ్రహ్మ స్వరూపము సర్వదా స్వభావసిద్ధంగా సర్వదా ఏర్పడియే ఉన్నది. అట్టి సర్వదా – సర్వత్రా ఏర్పడియున్న బ్రహ్మము 'స్వభావము' అనే అధ్యాత్మమును అవధరించి "దృశ్యాంగీకర సంజ్ఞ"తో కనిపిస్తోంది. అట్టి "జీవ భావం (భూత భావం) అంగీకరించి – ఆస్వాదించటము"ను 'కర్మ' అను సంజ్ఞతో చెప్పుచున్నారు.

**4) అధిభూతం – క్షరోభావః** : ఏఏ విశేషాలైన ఒకానొకప్పుడు జనించి మరొకప్పటికి నశిస్తాయో... అట్టి క్షరోభావ చమత్కారముల విన్యాసము 'అధిభూతం' అని పిలువబడుతోంది. ఏదైతే అనివార్యంగా కాలక్రమేణా నాశనశీలమో... అదంతా 'అధిభూతము' అను శబ్దముచే ఉద్దేశ్యించబడుతోంది.

- దేహాలు → వస్తున్నాయి – ఉంటున్నాయి – పోతున్నాయి.
- జన్మలు → వస్తున్నాయి – ఉంటున్నాయి – పోతున్నాయి.
- ఆలోచనలు
- జ్ఞాన అజ్ఞానాలు
- మంచి – చెడులు
- గుణాలు
- జాగ్రత్ స్వప్న సుషుప్తులు

→ ఇవన్నీ వస్తున్నాయి – ఉంటున్నాయి – పోతున్నాయి.

వీటన్నిటికి ఆధారం భూతభావ "ఉద్భవ – విసర్గ" రూపమైన 'కర్మ' అనబడునదే! కర్మకు ఆధారం స్వభావం (లేక) అధ్యాత్మం. అద్దానికి ఆధారం పరబ్రహ్మము.

గతించిపోయే స్వభావం కలవన్నీ 'అధిభూతం' అంటారు.

ఒక దర్పణం (అద్దం) లో ఒకానొకడు ఒక నిముషంలో ఒక ఎఱ్ఱ చొక్కా వేసుకొన్న వాని ప్రతిబింబం చూచాడనుకో. 'అద్దంలో ఎఱ్ఱచొక్కా వాడు ఉండును''... అని సిద్ధాంతీకరిస్తే అది హాస్యాస్పదం కదా! అద్దంలో

ప్రతిబింబించేదంతా దృశ్యం తొలగగానే (లేక) అద్దం యొక్క కోణం (Angle) మారిస్తే – మారిపోతుంది. అయితే అద్దంలో 'ప్రతిబింబించటం' అను ప్రక్రియ శాశ్వతం. ఒకానొక ప్రతిబింబమో... అది క్షరం. అట్లాగే బ్రహ్మము – స్వభావము (దర్పణము – ప్రతిబింబించటం వలె) శాశ్వతం. ఆ స్వభావము యొక్క ఒక అనుభూతి, ఒక అనుభవం క్షరం మాత్రమే!

**5) అధ్యాదైవతం:(పురుషశ్చ అధిదేవతం):** ప్రతిజీవుడు – ఆలోచనలు చేయువాడు, కర్మలు నిర్వర్తించువాడు, సమయ – సందర్భములను అనుభవములుగా పొందుచున్నవాడు ... అయి ఉన్నాడు కదా! అదియే జీవునియొక్క పురుషకారము. పురుషకారము నిర్వర్తించే తత్వమే పురుషుడు. అతడే అధిదైవం

ఆతడే కల్పనలకు కర్త – భోక్త.

→ ఇంద్రియములను ఉపయోగించటం – ఇంద్రియ విషయములను ఆస్వాదించటం.

→ దేహములను పొందటం – ఆ దేహములలోని ఇంద్రియములను పనిచేయించటం.

→ ఆలోచనలు చేయుటం – ఆ ఆలోచనలను అనుభవములుగా అనుభూతం పొందటం.

→ 'సంస్కారపరంపరల కట్టెలమోపు'ను మోస్తూ దేహపరంపరలలో విహరించటం.

... ఇవన్నీ నిర్వర్తిస్తున్న విభాగం పురుషుడు పురుషకారము – Functional feature – ప్రదర్శిస్తున్నవాడు.

(జీవుని అంతర్గత పురుషకారం తత్వశాస్త్రంలో 'అధిదైవతము' అని చెప్పబడుచున్నది [It is micro - level function]. జగత్తును నడిపిస్తున్న పురుషకారము [Macro level fucntion] కూడా అధిదైవతమే)

**6. అధియజ్ఞం** : జీవులందరిలో వేంచేసియున్న 'నేను' అనునదే 'అధియజ్ఞం'. (The Microself and Macroself is the prime function of Brahman)

ఓ అర్జునా! దేహములు పొందినవారిలో శ్రేష్ఠుడా! ఈ జగత్తులోని జీవులు – వారి జీవనవిధానాలు... అన్నీ కలిపి బ్రహ్మము నిర్వర్తించే యజ్ఞముగా దర్శించు. దేహములలోని జీవుడియొక్క ఉనికియే (అత్ర అహమేవ) 'అధి యజ్ఞం' అను శబ్దముచే చెప్పబడుతోంది. సర్వజీవులలోని అంతర్యామియొక్క జీవ – దేహ ప్రదర్శనమే అధియజ్ఞం.

9) ప్రయాణకాలం :

*శ్లో ॥ అంతకాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కళేవరమ్*
*యఃప్రయాతి, స మద్భావమ్ యాతి । నాస్తి అత్ర సంశయః ॥*

ఓ అర్జునా! ప్రతి దేహికి కాలక్రమేణా ఏదో ఒక సమయంలో ఈ దేహమును త్యజిస్తున్న సందర్భం అనివార్యం కదా! అభ్యాసవశంచేత దేహి ఈ దేహమునకు సంబంధించిన సంబంధ – బాంధవ్య – సంఘటన – వ్యవహార – సందర్భములే గుర్తుకు వస్తూ ఉంటాయి. అయితే దేహం అధిభూత విభాగం కదా! అనగా,... క్షరో భావాంతర్గతం. అనుక్షణం ఈ దేహం మార్పులు చెందేది కనుక, దేహ సంబంధమైన సర్వవిశేషాలు మార్పు చెందుతూనే ఉంటాయి. దేహం కొనసాగుచున్నప్పుడు కూడా ఈ మార్పు – చేర్పులు కాలప్రవాహంగా అనివార్యం.

ఎవ్వరైతే (1) ఒక ఆలోచన నుండి మరొక ఆలోచనకు ప్రయాణిస్తున్నప్పుడు, (2) దేహం త్యజిస్తున్నప్పుడు ... "సర్వాంతర్యామి – సర్వతత్వ స్వరూపము – అనునిత్యంగా అప్రమేయము – స్వస్వరూపమునకు అభిన్నము"... అగు నా స్వరూపం స్మరిస్తూ ఉంటారో... వారు అప్రమేయ – సర్వాంతర్యామినగు నా భావనను తప్పక పొందుతారు. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు.

ఎందుచేతనంటే....,

ఎవ్వరు ఏ భావన జీవితకాలమంతా అధికాధికంగా అభ్యాసం చేస్తూవస్తారో... వారు దేహపతనానంతరం అట్టి సంబంధమైన భావనలే

కొనసాగిస్తూ ఉంటారు కాబట్టి, తదనుకూలమై ప్రవాహ పతితదేహాలను పొందటం కొనసాగిస్తూనే ఉంటారు. భావముల అభ్యాసమును అనుసరించే భూత - వర్తమాన - భవిష్యత్ దేహములను ఈ జీవుడు నిర్మించుకోవటం (ఆశ్రయించటం) కొనసాగిస్తున్నాడని గమనించు. ఎవ్వరు ఏ భావములు అభ్యసిస్తూ ఉంటే, వారు ఆ భావములే తాముగా అనుభవం పొందుతూ ఉంటారు.

కనుక, ఓ అర్జునా! సర్వకాల - సర్వావస్థలయందు సర్వాంతర్యామి - బ్రహ్మమే స్వరూపముగా గల నన్ను అనుక్షణికంగా స్మరిస్తూనే 'స్వధర్మము' అయినట్టి యుద్ధ ధర్మం నిర్వర్తించు. "సర్వము పరబ్రహ్మ స్వరూపమే కదా!" అని భావిస్తూ నీ మనోబుద్ధులను నాకు సమర్పించు. అనగా, "నావిగా నాకు అనుభూతమయ్యే ఈ మనో - బుద్ధులు సర్వతత్వస్వరూపుడగు పరమాత్మవే!" అని భావనచేస్తూ నీకు నియమితమైన కార్యములను ధర్మబద్ధుడవై నిర్వర్తించు. అప్పుడు నేను సర్వదోషముల నుండి మొదలంట్లా నిన్ను సముద్ధరిస్తాను. ఇందులో నీవు సందేహించవలసినదేదీ లేదు.

అయితే...,

నీయొక్క మనోబుద్ధులకు - "సర్వజీవులు, సర్వ కర్మ వ్యవహారములు సర్వాంతర్యామి యొక్క విన్యాస చమత్కారమే" - అని గోచరించేది ఎట్లా! అనిపించేది ఎట్లా? అందుకు ఉపాయం అభ్యాసమే! **"సర్వము సర్వాంతర్యామి** ***యొక్క ప్రదర్శనమే" .... అని అన్నివేళలా అనుకోవటం అభ్యసించు.***

***అనుకోవటం అభ్యాసం. అనిపించటం అందుకు ప్రయోజనం.***

## అభ్యాసయోగయుక్తేన :

అభ్యాసయోగుడవై నీ ఇంద్రియ - మనో - బుద్ధులు, అట్లాగే,.... తదితర సర్వులమనో - బుద్ధి - ఇంద్రియగోచరములు పరబ్రహ్మము యొక్క చమత్కారవేకదా''.... అను ధారణను సునిశ్చితం చేసుకో! అట్టి సునిశ్చియముయొక్క బలముకొరకై చిన్న - చిన్న సందర్భములనుకూడా సమన్వయించుకొనే ప్రయత్నంలో ఉండు. అభ్యాసయోగయుక్తుడవై ఉండు.

## చేతసా నాఽన్యగామినా...!

"సర్వజీవులతో కూడిన ఈ దృశ్యమంతా కుడా పరమాత్మకు అభిన్నమైనది" అను బుద్ధిని పెంపొందించుకుంటూ,.... తదితర అన్యత్వమును క్రమక్రమంగా త్యజిస్తూ... అట్టి అనుచింతన – అనన్య చింతనలచే (పరమాత్మకు అన్యమైనదేదీ లేదుకదా... అను భావనా బలిమిచే) పరమపురుషత్వమును ఈ జీవుడు తప్పక పొందగలడు.

## అనన్య చింతన – అనుచింతన దేనిగురించి?

సర్వజ్ఞుడు – అనాది – సర్వనియామకుడు – పరమాణువు కంటేకూడా అతి సూక్ష్ముడు – సర్వమును పరిపోషణ చేయువాడు – సూర్యునివలె స్వయంప్రకాశకుడు – అవిద్యకు ఆవలి గట్టువంటివాడు – సర్వ స్వరూపుడు – అగు పరమాత్మను భావనచేస్తూ ఎవడు ఉపాసిస్తాడో... అట్టివాడు ఆ "పరమపురుష యోగస్థితి"ని సముపార్జించుకుంటున్నాడు.

అందుకు సాధనలు "భక్తి – యోగము" మొదలైనవి.

భక్తియొక్క అభ్యాసముచేతనో (లేక) యోగాభ్యాసంచేతనో పరిపరి విధములుగా పోతున్న మనస్సును నిశ్చలం చేయాలి. మనోబుద్ధులను భ్రూమధ్యంగా ఏకాగ్రం చేయటం అభ్యసిస్తే అవి తమచంచలత్వాన్ని క్రమ క్రమంగా త్యజించి స్వాధీనంకాగలవు.

## ప్రయాణకాలే....!

**జీవుడు నిత్య ప్రయాణీకుడు...**

- ఒక ఆలోచన నుండి ----> మరొక ఆలోచనవైపుగా...,
- ఒక భావన నుండి ----> మరొక భావనవైపుగా,
- ఒక సందర్భం నుండి ----> మరొక సందర్భానికి
- జాగ్రత్ నుండి ----> స్వప్నానికి;

– స్వప్నం నుండి ----> సుషుప్తికి

– సుషుప్తి నుండి ----> జాగ్రత్‌కూ

– ఒక దేహం నుండి ----> మరొకదేహానికి

ఈ విధంగా ప్రయాణించు సందర్భములలో పూర్వ-తత్ పూర్వవిషయాలను – ముందుముందటి ఆశల పరంపరలను కొంచం –కొంచం నిశ్శబ్దింపజేస్తూ, ధ్యాసను అంతర్గతం చేస్తూ ఉండగా ఈ జీవుడు "దేహత్వం"... అనే స్థితినుండి ''పరమ పురుషత్వము'' అను మహోన్నత స్థితిని సముపార్జించుకోగలుగుతాడు. తన అప్రమేయ బ్రాహ్మీ స్వస్వరూపమును – తన యొక్క స్వభావమును – దృశ్య భావనయొక్క స్వీకార – ఉపసంహారములను వేరువేరుచేసి దర్శించగలుగుతాడు. ఒకడు సర్వాంతర్గత – సర్వస్వరూపం – సర్వాతీత పరమాత్మత్వమే సర్వదా అనుచింతన చేయుచుండగా "తానే అది"గా సంతరించుకోగలుగుతాడు.

ఓ అర్జునా ! ఏ "సర్వాంతర్యామి – స్వస్వరూప పరమాత్మ తత్వమును..,

- వేదవేత్తలు 'అక్షర పరబ్రహ్మము'గా బోధించి చెప్పుచున్నారో.,
- ఏ మహనీయులు ఈ సర్వమును రాగరహితంగా చూస్తూ ఎద్దానియందు ప్రవేశించినవారై ఆ సంస్థానమును అనునిత్య నివాసం చేసుకుంటున్నారో
- ఎద్దానిని సముపార్జించాలనే ఇచ్ఛచే బ్రహ్మచర్యులై ఉపాసిస్తున్నారో

**అట్టి పదము (State) గురించి ఇక్కడ సంగ్రహంగా (in Nut-shell) ఉదహరిస్తున్నాను. విను.**

⋆⋆⋆

**ఇంద్రియములు సర్వదా దృశ్యానుభవమును పొందుచుండగా మనోబుద్ధులు వాటి తదాప్యములో లీనమగుచూ ఉన్నాయి కదా!**

*అయితే ....... యోగసాధనాపరులు :*

ఈ ఇంద్రియద్వారములను సంయమనం చేసి "ఇదంతా నా ఆత్మస్వరూపమే"... అను భావనలో లీనం చేస్తూ ప్రయత్నపరులై యోగధారణకు ఉపక్రమిస్తున్నారు.

- యోగధారణతో మనోహృదయములను ఇంద్రియాతీత స్థానమైనట్టి మస్తకస్థానము (Fore face) నందు ప్రాణశక్తిచే ఏకాగ్రపరుస్తున్నారు.
- ఏకాగ్రతగా (With Concentration) ప్రాణములను మస్తకస్థానంలో స్థాపిస్తున్నారు. యోగమును 'ధారన' చేయటం అభ్యసిస్తున్నారు.
- క్రమంగా అక్షరము (క్షరము - మార్పులేనిది), ఏకము (అనేకముగా కానిది) అగు 'ఓం' సంజ్ఞార్థమైన పరమాత్మను ఉచ్ఛరిసస్తూ పరమాత్మభావనను పెంపొందించుకుంటున్నారు.
- సగుణ - నిర్గుణ ప్రదర్శనము - అతీతముఅగు నన్నే అనుస్మరిస్తున్నారు.
- అట్టి అనుస్మరణచే "నేను దేహమును. దేహపరిమితుడను. దేహముచే మార్పు చేర్పులు చెందువాడను. దేహమున నాకు సంబంధించినది. నేను ఈ దేహమునకు సంబంధించినవాడను"... అను దేహభావం క్రమక్రమంగా త్యజించివేస్తున్నారు.

ఆ విధంగా దేహభావం త్యజించినవారై క్రమంగా సర్వకర్త - సర్వభోక్త - సర్వస్రష్టనగు నా స్వరూపమును తాము సంతరించుకొంటున్నారు. ఉత్తమోత్తమ స్థానమును (పరమగతిని) పొందినవారై ఉంటున్నారు.

ఓ అర్జునా! "అట్టి సర్వాంతర్యామి - సర్వకర్త స్థానం సులభమా?" అని అడుగుతావా? ఎవ్వరైతే "ఇదంతా పరమాత్మయొక్క మాయా చమత్కారమే!"... అను అనన్యచింతనను ఆశ్రయిస్తూ సర్వ తత్వస్వరూపుడనగు నన్నే నిత్యమూ అనుస్మరిస్తూ నిత్యయుక్తితో యోగాభ్యాసం కొనసాగిస్తూ ఉంటారో, అట్టి వారికి వారి ప్రయత్నఫలంగా అది తప్పక సులభమై అనుభవం కాగలదు.

ఓ పార్థా! ప్రపంచంలో అనేక విషయాలకొరకై అనేకానేకమంది జీవులు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. కొద్దిమంది ఈ జగత్తులు ఎద్దానియందైతే భావనామాత్రంచేత అనుభూతమగుచున్నాయో... అట్టి పరమాత్మయందు స్థానము – భావన – సర్వాతీతత్వముకొరకు ప్రయత్నిస్తున్నారు.





ఓ అర్జునా! మహత్తరము – పరమోత్కృష్టము అగు “సర్వాంతర్యామిత్వము – సర్వతత్త్వ స్వరూపము”... అయినట్టి నాయొక్క స్థానము సముపార్జించుకొన్న తరువాత ఇక ఆ మహనీయులు దుఃఖాలయము (places with series of worries) అశాశ్వతము (places where nothing is permanent) అయినట్టి పునర్జన్మ పరంపరావ్యవహారమును పొందుటలేదు.

ఎందుకంటావా?

బ్రహ్మలోకం నుండి – భూలోకం వరకు ‘ఉపాధులు పొందటం’ అనే జన్మ కర్మపరంపరావ్యవహారం పునరావృత్తిదోషం కలిగి ఉంటోంది. అనగా ఈ దృశ్య – వ్యవహారమంతా జన్మలు పొందటం, పొందిన జన్మకర్మ వ్యవహారములనే మరల మరల పొందుతూ ఉండటం ‘అనే దోషం’ వెంటనంటి ఉంటోంది.

నన్ను ఆశ్రయించినవారు జన్మల అతీతత్వం – అతీతస్థానం సముపార్జించుకొని ఉండగలుగుచున్నారు.



1. జన్మాంతర్గత దృశ్యం యొక్క విశేష ఆశ్రయం

2. జన్మాతీత సర్వాంతర్యామిత్వం యొక్క ఆశ్రయం

ఈ విధంగా మొదటిది (దృశ్య - జన్మపరంపరాశ్రయం) అనేక దుఃఖములలో (Blended with multifarious worries) కూడుకొన్నదైయున్నది. ఇక, నన్నుఆశ్రయించావా, నాస్థానం ఆశ్రయించటం చేత పునరావృత్తి దోషభూయిష్టమైన జన్మపరంపరాచక్రము నుండి విడవడినవాడగుచున్నావు.

## కాలతత్వజ్ఞానం

బ్రహ్మము నుండి దృశ్య రచన బయల్వెడలుతోంది. మాయచే బయల్వెడలే దృశ్యరచనాచమత్క ృతి వేయియుగాల నిడివిగల "***బ్రహ్మయొక్క పగలు***" దృశ్య ఉపసంహార చమత్క ృతితో కూడిన వేయి యుగముల నిడివిగల "***బ్రహ్మయొక్క రాత్రి***"గా గమనిస్తున్నారు. కాల తత్వజ్ఞానం గల యోగులు ప్రతి జీవుని అంతర్గతంగా ప్రవర్తిస్తున్న "బ్రహ్మయొక్క పగలు" - "బ్రహ్మయొక్క రాత్రి"... ని గమనిస్తున్నారు.

అవ్యక్తంలోంచి వ్యక్తం ప్రభవించి పరిఢవిల్లడం |----→ బ్రహ్మయొక్క పగలు.

వ్యక్తం అయినదంతా అవ్యక్తంలో లీనం కావటం |----→ బ్రహ్మయొక్క రాత్రి

ఈ విధంగా పరబ్రహ్మమే స్వస్వరూపంగా గల ఈ జీవుని స్వస్వరూపంనుండి వ్యక్త - అవ్యక్తాలు ప్రదర్శితమౌతూ జన్మపరంపరల అనుస్మరణ - జన్మరాహిత్య స్థితుల ప్రవర్తిస్తున్నాయని కాలగమనయోగం గమనించిన యోగులు గుర్తిస్తున్నారు.

ఈ విధంగా... ఈ జీవునిపట్ల

వ్యక్తము → జన్మపరంపరల చమత్కారము
[Involvement in Perceptions]

అవ్యక్తము → జన్మలనుండి ఉపసంహారం
[Withdrawl from Perceptions]

ఈ రెండు కాలగతిచే ప్రదర్శితమగుచు ఉపసంహారం పొందుచూ ఉన్నాయి.

అయితే....,

ఈ జీవుని వాస్తవ స్వరూపం ఆత్మయే! భావనచే వ్యక్తము - భావనా రాహిత్యముచే అవ్యక్తము రూపుదిద్దుకుంటున్నాయికదా! భావనకు ఆవల ఈ జీవుని వాస్తవరూపం సదా పరబ్రహ్మ - నిర్వికార - భావాభావాతీతమై వెలుగొందుతోంది. అట్టి భావాతీత - భావనారాయణరూపం (భావములను ప్రదర్శిస్తూ - భావనలకు మునుముందే వేంచేసియున్న రూపం - సర్వము వ్యక్తీకరిస్తున్న అవ్యక్తము) ఈ జన్మ - కర్మల వ్యవహారరీతులకు, కాలగమన చమత్కారమునకు అప్రమేయమై కేవల సాక్షి అయి ప్రకాశిస్తోంది.

*అహోరాత్రములు - భావ - అభావములు :*

భావనాసామ్రాజ్యంలో → భూతగ్రామ రూపమైన ఈ దేహములు, తత్సంబంధితమైన దృశ్యరూపభావనాదేహ పరంపరలు మరల మరల ప్రకటనమగుచు 'బ్రహ్మరాత్రి' సమయంలో అభావస్థానంలో విలీనమగుచున్నాయి.

*పరఃతస్మాత్ భావ - అభావ అన్యో :*

భావాభావములకు నాంది స్థానమైన ఆత్మ వ్యక్తావ్యక్తములకు అప్రమేయమై, అతీతమై, కేవల ఉత్ప్రేరణాచమత్కార సామర్థ్యమై వెలుగొందుతోంది.

అట్టి పరతత్వమైన స్వస్వరూపస్థానం ఈ ఉపాధుల - ఉపాధి పరంపరల వ్యక్త - అవ్యక్త సుదీర్ఘ సహస్రయుగ పర్యంత వ్యవహార - వ్యవహార రాహిత్యములచే స్పృశించబడక నిరుపమానమై వెలుగొందుతోంది.

అట్టి వ్యక్తావ్యక్త ఆనంద స్వస్వరూపము ఈ ఉపాధుల వినాశనముచే నశించేదికాదు. ఉపాధుల ప్రభవముచే ఉత్పన్నమయ్యేది కాదు.

ఓ అర్జునా! అట్టి కాలాతీత – దృశ్యాతీత – అవ్యక్తానంద ఆత్మస్థానమును గమనించి – ఆశ్రయించి – స్వస్థానంగా నిర్దుష్టపరుచుకొన్న మహనీయులు నా స్థానము పొందినవారై ప్రశాంత – ఆనందములను ఆస్వాదిస్తున్నారు. మహనీయులు అద్దాని “అవ్యక్తము – అక్షరము”... అని గానం చేస్తూ లోకాలకు ప్రవచిస్తున్నారు. అట్టి స్థానం సముపార్జిస్తూ ఈ దృశ్యమును సందర్శించువారికి ఇక ‘చ్యుతి’ అనేది ఉండదు. అట్టి నా అచ్యుత – పరంధామం నేను నీకు బోధిస్తూ గుర్తు చేస్తున్నాను.

అట్టి అక్షర – అవ్యక్త – పరంధామ – అచ్యుత – స్వస్థానం సముపార్జించుకోవటానికి మార్గము ఏమిటంటావా? అనన్యమైన భక్తియే! “ఇదంతా అవ్యక్త – అక్షర పరబ్రహ్మము యొక్క చమత్కార ప్రదర్శనమే”... అను ప్రేమభావం పెంపొందించుకోవటంచేత ఈ సర్వజీవులలోను ఏ ఆత్మ ప్రసరించియున్నదో – ఈ సర్వము ఏ ఆత్మయందు ప్రకటనమగుచున్నదో అట్టి సర్వాంతర్యామి – సర్వ తత్వ స్వరూపము అగు స్వస్వరూపం”.. అనే స్థానం ప్రాప్తించగలదు.

## శుక్ల – కృష్ణ గతులు – జీవబాటసారులు

*శుక్లగతి* ***(State of no - Avocation) :***

ద్వితీయభావం నుండి – (ఈ జగదృశ్యము నానుండి వేరు...
అను భావం నుండి)
↓
అద్వితీయభావం (‘ఈ జగత్తు నా స్వరూపము’ అను భావము వైపుగా)
ప్రయాణించటం → “శుక్లగతి” అని కాలయోగ శాస్త్రజ్ఞులు
పిలుస్తున్నారు.

***కృష్ణగతి (State of Avocation) :***

అద్వితీయము నుండి దృశ్యరచనాభావం వైపు ప్రయాణించటం – 'కృష్ణగతి' అని చెప్పబడుతోంది.

1) శుక్లగతి అగు అనావృత్తియోగం [Path towards state of No Avocation]

2) కృష్ణగతి అగు ఆవృత్తి యోగం [Path towards state of Avocation]

ఈ రెండు సంజ్ఞాపూర్వకంగా ఎలా చెప్పబడుచున్నాయో,.... విను

## శుక్లగతి

(దేవయానం – నిష్కామకర్మయోగం – అనావృత్తియోగం – అభావరూపమగు ఆత్మభావనానుభవస్థానం) :

**అగ్ని :** అగ్ని వలె అది నిత్యజ్వాజ్వల్యమానం.

**సూర్యజ్యోతి :** వెలుతురు వలె అది స్వస్వరూప ప్రకాశకం.

**అహః :** పగలువలె సర్వము సుస్పష్టంచేసేది.

**శక్లం :** శుక్లపక్ష చంద్రునివలె వ్యక్తిత్వమును సువిస్థారపరచేది.

**ఉత్తరాయనం :** జగత్‌విషయాలకు అతీతత్వము ప్రతిపాదించునది.

**సూర్యస్థానం :** జ్ఞానమునకు ప్రవృద్ధత కల్పించేది.

బ్రహ్మజ్ఞానము ప్రవృద్ధపరచుకొంటున్న మహనీయులు క్రమంగా ఈ శుక్లగతి (దేవయానం) లో ప్రయాణిస్తూ వ్యక్తావ్యక్తాతీత స్వస్వరూపము దిశగా జన్మా–జన్మాంతర ప్రయాణం కొనసాగిస్తూ ఒకానొకప్పుడు జన్మరాహిత్యస్థానం ఆస్వాదిస్తున్నారు.

"జన్మ – కర్మ రహితమగు సర్వాంతర్యామి యగు ఆత్మయయే నేను."

అని పరిగ్రహిస్తున్నారు. ఆత్మసాక్షాత్కారం అవధరిస్తున్నారు.

## కృష్ణగతి

పితృయానం : సకామకర్మ మార్గం: ఆవృత్తియోగం

ఈ కృష్ణగతిని సందర్శించు కాలయోగజ్ఞులు ఈ విధంగా సంజ్ఞాపూర్వకంగా చెప్పుచున్నారు.

1. **ధూమం :** అగ్నియొక్క అవశేషమైన ధూళి వలె ఘనీభూతము, సారరహితము.
2. **రాత్రి :** అంధకారం వలె అనేక అజ్ఞాన విశేషాల పట్ల ప్రవృత్తితోకూడినది.
3. **కృష్ణం :** కృష్ణపక్ష చంద్రుడు రోజు రోజుకు కాంతిని కోల్పోతున్నట్లుగా... ఆత్మావలోకమునకు దూరదూరముగా (సంకల్పసమూహరూపంగా) గొనిపోవునది.
4. **దక్షిణాయనం:** ఆత్మభావననుండి దృశ్య పరంపరాభావనలోనికి ప్రయాణాం చేయించేది.
5. **చంద్రస్థానం :** మనోభూములకు (చంద్రజ్యోతి) తరలించేది.

చేసే ప్రయాణం (లేక సాధన) ఒక్కటే అయినా,... మొదటిది అకామం. రెండది సకామం.

**శుక్లగతి :**భావాతీత ఆత్మవైపు ప్రయాణం పునరావృత్తి రహితమైనది.

**కృష్ణగతి :** భావసమృద్ధ స్థితి–గతులకు తరలించేది. చక్రభ్రమణమువలె పునరావృత్తి దోషం కలిగి ఉంటోంది.

ఈ జీవులలో కొందరు శుక్లగతిలోను మరికొందరు కృష్ణగతిలోను ప్రయాణిస్తున్నారు.

యోగి ఎప్పుడైతే ఈ శుక్ల – కృష్ణ గతులతోకూడిన ప్రయాణములను

అర్థంచేసికొని ఉంటాడో... అట్టివాడు ఈ దృశ్య తదాప్యము పొందడు. మోహం దరిజేరనీయడు. ఎందుకంటే ఈ శుక్ల – కృష్ణగతి బాటసారులంతా ఈ స్థితిగతులకు అప్రమేయమైనట్టి అఖండాత్మచమత్కారమే!

కాబట్టి అర్జునా!

బద్ధకము – అశ్రద్ధ వదులు. శుక్ల – కృష్ణ ప్రయాణమార్గాలు గమనించు. సర్వకాల – సర్వ అవస్థలయందు యోగమార్గం ఆశ్రయించు. యోగివైయుండు. సర్వజీవుల అంతర్యామియగు పరమాత్మను సందర్శించు.

వేదాధ్యయనం, యజ్ఞకార్యములు, తపస్సు, దానము, ధర్మము ఇవన్నీ నీయోగమార్గంలో ఉపకరణములుగా ఉపయోగించుకో. ఇదంతా ఎందుకు ప్రవచించబడి మానవాళికి అందింపబడుచున్నాయో గ్రహించి వీటికి అతీతుడవై యోగులు పొందుతున్న 'ఆత్మాఽహమ్' స్థానమును సముపార్జించుకో.

*ఇతి భగవద్గీతా... అక్షర ప్రరబ్రహ్మ యోగ పుష్పః*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

★★★



శ్లో॥ అనన్యాః చింతయంతః మామ్ యే జనాః పర్యుపాసతే ।
తేషామ్ నిత్యాభియుక్తానామ్ యోగక్షేమం వహామి అహమ్ ॥

యే జనాః అనన్యాః మామ్ చింతయంతః పర్యుపాసతే,
తేషామ్ నిత్య అభియుక్తానామ్ యోగక్షేమం అహమ్ వహామి ॥

ఏ జనులైతే అనన్య చింతనతో నన్ను పర్యుపాసిస్తూ ఉంటారో ..... వారి యోగక్షేమములు నేనే వహిస్తాను!

# 9.

# రాజ విద్యా రాజగుహ్య యోగ పుష్పం

**శ్రీ కృష్ణుడు** : ఓ అర్జునా! అసూయ–దోషదృష్టి లేనట్టివాడవు – నా భక్తుడవు అగు నీకు విజ్ఞాన సహితమైన జ్ఞానవిశేషాలు చెప్పుచున్నాను. 'అతిరహస్యము' అయినట్టి ఇప్పుడు నాచే చెప్పబడబోయే ఆత్మతత్త్వవిశేషాలు అశుభము నుండి జీవుని సముద్ధరించగల విశేషములు సుమా!

ఇప్పుడు ఈ చెప్పబడబోయే విషయం "రాజవిద్య (King of Educations)" అని, "రాజగుహ్యము (Secret of all Secrets)" అని చెప్పబడుతోంది. ఇది అతి పవిత్రము – పరమోత్తమము అయినది. ఈ విషయం ఇప్పుడు ఇక్కడే అనుభవైకవేద్యము. అనగా, "ఎప్పటికో ఎన్నటికో లభించేది"... కాదు! ఈ చెప్పబోయే సమాచారం అనుసంధానం చేయటం అత్యంత సులభం, సుఖప్రదం కూడా!

అంతేకాదు. నేను చెప్పబోయేది ఆత్మతత్త్వ లక్షణము. ఆత్మ ధర్మము (A natural feature). అట్టి ధర్మము (స్వభావలక్షణం – స్వభావసిద్ధము) అయినట్టి నాయొక్క విలక్షణము విని, గ్రహించి, అనువర్తించటంపట్ల శ్రద్ధ లేని జీవుడు

నన్ను పొందలేక, దిక్కుతోచక ఈ పునరావృత్తి దోష – మృత్యుదోష సహితమైన సుదీర్ఘ సంసార మహారణ్యంలో సంచారాలు చేయవలసివస్తోందని ఈ సందర్భంలో గుర్తు చేస్తున్నాను.

ఇక ఆ మహత్తర ధర్మరూప పరమసత్య విశేషం విను. ఇది ప్రతి జీవుని స్వస్వరూపమునకు సంబంధించిన అతిరహస్యమగు నిర్దుష్ఠ – పరమ సత్యము.

⋆⋆⋆

(1) **మయాతతమ్ ఇదం సర్వమ్ జగత్ – అవ్యక్తమూర్తినా!**

అవ్యక్తమూర్తి స్వరూపుడనగు నాచేతనే ఇదంతా ప్రసరించబడినదై విస్తరించబడినదై యున్నది.

[ప్రతిజీవుడు తాను సందర్శించే అనుభూత జగత్తంతా తన యొక్క అవ్యక్తమూర్తిత్వముచే ప్రసరించబడినదైయున్నాడు.]

(ఉదాహరణకు...,

ఒకడు స్వప్నం చూస్తున్నాడనుకుందాం. స్వప్న ద్రష్ట స్వప్నంలో విభాగం కాదు కదా! కాబట్టి ఆతడు స్వప్నంలో ఆవిర్భవించటం లేదు. కనుక స్వప్నదృశ్యము దృష్ట్యా అవ్యక్తము. కానీ స్వప్నం స్వప్న ద్రష్టయొక్క ఊహారూపమే కదా! స్వప్నమంతా నిండి ఉన్నది స్వప్న ద్రష్టరూపమే కదా! అట్లాగే ప్రతి ద్రష్ట తాను దర్శించేదంతా తనయొక్క అవ్యక్త రూపముచే ప్రసరించబడినదైయున్నాడు. ఈ విధంగా ప్రతి జీవుడు తన స్వస్వరూపమునకు అభేదమైన జగత్తును భేదరూపంగా మాయచే దర్శిస్తున్నాడు.)

(2) **మత్‌స్థాని సర్వభూతాని** :

ఈ కనబడే జగదంతర్గతమగు త్రిమూర్త్యాదిగా ఒక సూక్ష్మజీవి వరకుగల జగత్ జీవులంతా నాయందే ఉన్నారు.

[ప్రతి జీవుడు తాను అనుభూతీకరించుకుంటున్న తదితర

జీవజాలమంతా తన ఆత్మయందే, "ఆత్మను" మనస్సుచే తనకు వేరైనట్లు దర్శిస్తున్నాడు. వాస్తవానికి ఈదృశ్యమంతా తన ఆత్మయందే నెలకొని ఉన్నది. "నిజాంతర్గతం పశ్యన్ ఆత్మని మాయయా బహిరివోద్భూతం, యదా నిద్రయా" అని ఆదిశంకరులు అన్నట్లు, మనస్సు తన ఆత్మను జగత్తుగా ప్రతిబింబ చేసుకుంటోంది.]

(3) **న చ అహమ్ తేషు అవస్థితః :**

ఓ అర్జునా! ఇదంతా నా యందే ఉన్నది. అంతేగాని, ఈ దృశ్యంలో నేను లేను.

పరమాత్మ దృశ్యాంతర్గతమైన ఒక వస్తువువో, జీవుడోకాదు. పరమాత్మయందే ఇవన్నీ ఉన్నాయి. ప్రతి జీవుడు పరమాత్మ స్వరూపుడే! ఆత్మయందే సర్వము ఉన్నది. అంతేగాని, వీటన్నిటియందు ఆత్మ చిక్కుకోలేదు.

స్వప్న ద్రష్టలోనే స్వప్నం ఉన్నది. అంతేగాని స్వప్నద్రష్ట స్వప్నాంతర్గతమైన ఒకానొక విభాగం కాదుకదా! ఒకవేళ స్వప్నద్రష్ట స్వప్నంలోని విభాగమైతే (లేక) స్వప్నంలో కనబడే రూపనామములందు ఉన్నవాడైతే, స్వప్నం నశించినపుడు స్వప్నద్రష్టకూడా నశిస్తాడు కదా? అట్లా జరుగుతోందా? లేదు. నవలారచయిత నవలలోని కొన్నిపేజీలా? సంఘటనలా? నవల ముగియగానే రచయిత ముగింపు పొందుతాడా? లేదే!

కనుక, ఈ జగత్తు ఉండవచ్చుగాక! అనేక దేహాలతో అనేక జగత్తుల ప్రవేశ-నిష్క్రమణములు జరగవచ్చుగాక! ఒకానొకప్పుడు నశించవచ్చుగాక! ప్రతి ఒక్కని పరమాత్మ స్వరూపమునకు వచ్చే లోటు ఏమీలేదు. ఎందుకంటే ఆతడు జగత్తులో ఏదోఒకరూపంగాగాని, కొన్ని రూపాలుగాగాని మారటం లేదు. ఆత్మయందు జగత్తు ఉన్నదేగాని, జనించి - గతించే జగత్తువ్యవహారంలో ఆత్మ చిక్కుకొని లేదు.

(4) న చ మస్థాని భూతాని! పస్యమేయోగమైశ్వరమ్!

ఓ అర్జునా! "నిర్మల – నిర్విషయ – సర్వాతీత" పరమాత్మ స్వరూపుడనగు నాయందు ఈ జీవజాల జగత్తులేదు. చూచావా! నా యొక్క ఆత్మయోగస్థానం సర్వమునకు అతీతమై, నిర్గుణమై, అప్రమేయమైయున్నది.

[– ప్రతిజీవుడు కేవలాత్మస్వరుపుడే!

– తాను దర్శిస్తున్న జాగ్రత్ – స్వప్న జగత్తులు స్వయంకల్పిత భావనా – స్రవంతియే!

– అంతేగాని, ఈతడు జాగ్రత్–స్వప్నములు అంతర్విభాగం కాదు. ఆతనిలో జగత్తులు లేవు.

– నవలలో కనిపించే పాత్రలు రచయితలో లేవు. రచయిత నవలలోని పాత్రకాదు.

– జగత్‌ద్రష్ట (లేక) జగత్ సాక్షియగు జీవునిలో జగత్తులు లేవు. జగత్తులలో జీవుడు లేడు. ఇట్టి అవగాహన యోగైశ్వర్యం.]

ఈ విధంగా ప్రతి జీవుని ఆత్మ అప్రమేయం, నిర్మలం!

**–భూతభృత్** : ఈ తదితరజీవులుగా భ్రమచే అనిపించిదంతా ధారణచేస్తూ జగత్తుయొక్క ఉనికిని ప్రసాదిస్తున్నది స్వస్వరూపాత్మయే!

**–నచ భూతస్థో** : అట్టి స్వస్వరూపాత్మ దృశ్యధారణ చేస్తున్నప్పటికీ దృశ్యాంతర్గతమైన నామరూపములలో లేదు. అంతటికీ అతీతంగా విడిగానే ఉన్నది. 'ఊహలు' నిర్వర్తించేవాడు ఊహలకు అతీతంగానే ఉన్నాడుగాని, ఆతడు ఊహలుగా అవటం లేదుకదా! (One from whom ideas are coming out is neither becoming as ideas nor he is in the ideas. He is always away and ever placed as unconfined and unbounded by his ideas)

**మామాత్మా భూత భావనః**

ఈ జగత్ దృశ్యము – జగదంతర్గత తదితర జీవజాలము నాయొక్క

"భూతజాలభాన" యొక్క ఒకానొక ప్రకటనావిశేషము మాత్రమే!

ప్రతిజీవుడు తాను చూస్తున్న జగత్తు తనయొక్క భావనాసాగరం నుండి భూత భావనను ప్రవృత్తం చేస్తున్నాడు. అనగా 'భూతజాల భావన' నుండి దృశ్యజగత్తును తనయందే పొందుచున్నవాడై, తనకు వేరైనట్లుగా అనుభవము మాత్రం పొందుచున్నాడు,

అద్వితీయమగు స్వస్వరూపాత్మయే తన స్వస్వరూపమును మనోవిలాసంగా "జగత్తు - జగత్ విషయములు - జగత్ జీవులు".... గా సందర్శిస్తున్నది.

ఓ అర్జునా! "ఆత్మయందు జగత్తులు - దృశ్యములు - తదితర జీవులు" మొదలైనదంతా ఆత్మకు అభిన్నము. one's own self is being experienced by one as if all world else".. అనే ఆత్మసాక్షాత్కార సిద్ధాంతమును అర్థం చేసుకోవటానికి వీలుగా ఒక దృష్టాంతం చెపుతాను. విను.

"ఆకాశము (space)"... అనే పంచభూతాత్మక తత్వంనుండి వాయువు బయల్వెడలుతోంది. మహత్తరమైన ఆ వాయువు - వాయుతరంగాలు ఆకాశమునందు సుదీర్ఘసంచారాలు చేస్తున్నప్పటికీ, వాయువు ఆకాశంతోగాని, ఆకాశం వాయువుతోగాని తమేకం - మమేకం అవవుకదా! వాయువు ఆకాశంగా మారుతోందా? లేదు. ఆకాశం వాయువుగా రూపుదిద్దుకొంటోందా? లేదే? అట్లాగే, ఆత్మయందు జన్మ - జన్మాంతర్గత తదితరదృశ్య - జీవాదులు వాయుతరంగాలవలె సంచలనం సాగిస్తున్నప్పటికీ ఆత్మ అప్రమేయం. ఆత్మస్వరూపుడనగు నాయందు దృశ్య - దేహ - తదితర సంబంధిత జీవ పరంపరలు నాచే ఉపధారణంగా (Holding) నిర్వర్తించబడుచున్నాయి. నేను సర్వదృశ్యసంఘటన - వ్యవహారాదులకు వేరై, నాయందు వాటిని ధరిస్తున్నాను. సర్వభూతజాలం నాయందే ఉనికిని కలిగి ఉన్నది. ఈ భూతజాలమంతా నాయొక్క ప్రకృతి (లేక, స్వభావము) చే పొందబడుచున్నదై ఉన్నది.

జగత్తంతా నా సంకల్ప (లేక) భావనా చమత్కారమే!

నాయందు "భావనా కల్పన" ఉదయించగానే ........... భావనాంతర్గత జగత్‌దృశ్యాలన్నీ పరిఢవిల్లుచున్నాయి. అట్టి "భావనాకల్పన" యొక్క ఉపసంహారముచే జగత్‌దృశ్యాలన్నీ నాయొక్క ప్రకృతియందే లయిస్తున్నాయి.

ఈ విధంగా నానుంచి నా యొక్క ప్రకృతి స్వరూపమై, భావనాకల్పన యొక్క ప్రవృత్తి – నివృత్తుల (blossoming of ideas and withdrawl of ideas) ఉభయ సందర్భములకు వేరై ఆత్మస్వరూపుడనగు నేను వెలుగొందుచున్నాను.

అట్టి ప్రకృతి సంబంధమైన ప్రవృత్తి – నివృత్తి ధర్మములచే నిబంధించబడనివాడనై స్పృశించబడనివాడనై, వాటి బంధ – సంబంధము లేనివాడనై వాటికి ఆవల ఏక – అఖండత్వములను వహించి ఉంటున్నాను. ఆయా ప్రవృత్తి ధర్మముచే బంధముగాని, నివృత్తి ధర్మముచే బంధవిముక్తిగాని నాకు లేవు. ఆ రెండిటి సందర్భములలో ఉదాశీనుడనై, కేవలసాక్షినై స్వయం ప్రకాశముతో ప్రకాశిస్తూ ఉన్నాను.

***ఆత్మస్వరూపుడనగు నేను దేహమూచే ఏర్పడువాడను – దేహపతనమూచే నశించువాడను కాను.*** మరి? దేహములే నాయొక్క సంకల్పానుసారం, నాయొక్క అధ్యక్షతచే ఏర్పడుచున్నాయి. ఈ చరాచరప్రకృతి నాయొక్క అధ్యక్షతచే ప్రవర్తిస్తోంది. ఈ జగత్ (జ= జనించటం; గత్= గతించటం అను) కదలికకు కారణం నేనే!

ఓ అర్జునా! నా పరస్వరూపం ఈ చరాచర ప్రకృతికి కేవలసాక్షియై, ప్రకృతియొక్క వివర్తన – అనువర్తనలకు ఆధారమైయున్నది. ఈ "భౌతిక దేహ తాదాప్యము" అనే అజ్ఞానం ఆశ్రయించినట్టి మూఢులు నా పరస్వరూపం సందర్శించటం లేదు. "ఈతడు శరీరముగా – గుణములుగా వివర్తం పొందాడు. పరివర్తనం పొందాడు"... అని భావిస్తున్నారు. "ఈ పంచభూత జనితదేహంచే నేను నిబద్ధుడు" అని భ్రమిస్తున్నారేగాని, "నేను పంచభూతనియామకమగు పరమాత్మ స్వరూపుడు కదా" ....... అని గమనించలేకపోతున్నారు.

ప్రతి జీవుడు మమాత్మస్వరూపపుడే!

"నేను ఈ పంచభూతదేహం - ఇంద్రియ విషయ దృశ్యములచే సుఖ - దుఃఖితుడను కదా"... అని ఈ దేహధారులలో అనేకులు తమస్వరూపముగురించి తామే భ్రమ చెందుచున్నారు. "ఈ ప్రకృతిగతమైన పాంచభౌతిక దేహాదులకు - దృశ్యభావాదులకు నేను నియామకుడను. అంతేగాని, అవి నన్ను నియమించటం లేదు".... అని తమయొక్క సర్వనియామక ఆత్మసామ్రాజ్యం గమనించి ఆస్వాదించటం లేదు. ఎందుచేత? విను. చెపుతాను.

**మోఘాశ :** అనేక మంది "ఈ త్రిలోక దృశ్యజగత్తులలో ఏవేవో లోకాలు - దేహాలు పొందితేగాని నేను పొందవలసినది పొందినట్లుకాదు"... అని ఏవేవో స్థితిగతులకై ఆశిస్తున్నారు. "ఆనందము నా నిర్వచనమే కదా"... అనునది గమనించటం లేదు.

**మోఘకర్మానో :** "ఏదో చేయాలి? ఇంకేదో పొందాలి" అనుకుంటూ దృష్టినంతా ఎక్కడో భవిష్యత్తువైపుగా ఏవేవో కార్యక్రమ వ్యవహారముల వైపుగా కదిలిస్తున్నాడు. "నేను సర్వజగత్ నియామకము - ధారణకర్త - అప్రమేయము అగు ఆత్మనుకదా".... అనునది గమనించటం లేదు.

**మోఘజ్ఞానం :** "ఇది చేయకపోతే ఎట్లా? అది పొందకపోతే ఏంకుదురుతుంది? ఇప్పుడు సరే! మరొకప్పటి మాటేమిటంట? వీరు మంచివారు. వారు చెడువారు. ఇది మంచిది. అది మంచిది కాదు"...ఇట్లా కొన్నికొన్ని నిర్వచనములు - అనేక పొరపాట్లతో కూడిన అభిప్రాయములు - అవగాహనలు పెంపొందించుకొని దేహపరంపరలు కొనసాగిస్తున్నారు.

ఈ దోషపూరితమైన ఆశలు - కర్మలు - జ్ఞానములతో బుద్ధి అనుక్షణం పరిపరి విధాలుగా చంచలము పొందటం జరుగుతోంది. క్రమంగా మూర్ఖత్వము - దుష్టభావములు - మోహము కొనసాగించే స్వభావమును ఆశ్రయిస్తూ.... తన ప్రకృతిచే తానే నిబద్ధుడు అగుచున్నాడు.

ఓ అర్జునా! నేను ప్రకృతికి - ప్రకృతి గుణములకు ఆవల పరమాత్మరూపంగా సర్వజీవులయందు సర్వదా వేంచేసియున్నాను. అట్టి

సర్వాంతర్యామినగు నన్ను - రాక్షస - ఆసురీ ప్రకృతి స్వభావమగు రాగము - ద్వేషము - ఆవేశము - దుర్భావములు - హింసాప్రవృత్తి - భయావేశము వంటి గుణములచే మోహమును ఆశ్రయించువారు - గాంచుటలేదు. గమనించటం లేదు.

అయితే పార్థా! దైవీ ప్రకృతియగు ప్రేమ - దాక్షిణ్యము - సహనము - సేవాభావము వంటి గుణములను పరిపోషించుకొన్నవారు "ఈ కనబడే సహజీవులు పరమాత్మ యొక్క ప్రదర్శనా చమత్కారమే" అను రూపముతో కూడిన అనన్య మనస్సును సముపార్జించుకొంటున్నారు. **అట్టి అనన్య మనసుచే సర్వసహజీవులను పరమాత్మ విన్యాసంగా ఉపాసిస్తూ "మహాత్ముడను - సర్వాంతర్యామిని" అగు నన్ను తెలుసుకొని ఆస్వాదిస్తున్నారు.** అట్టి దృఢ నిశ్చయము పెంపొందించుకొన్నట్టి నా భక్తులు సర్వగుణసంపన్నునిగా నన్నే స్తుతిస్తూ నిత్యోపాసనయందు దృఢవ్రతులై నాకు నమస్కరిస్తూ సర్వాంతర్యామి - సర్వతత్వ స్వరూపుడు - సర్వజీవుల స్వస్వరూపాత్మగా నన్ను ఆరాధిస్తున్నారు.

మరికొందరు 'జ్ఞానయజ్ఞము' ద్వారా "నిర్గుణ-నిరాకార బ్రహ్మము"ను అభేదదృష్టితో - సమత్వసందర్శన బుద్ధితో ఉపాసిస్తున్నారు.

ఇంకొందరు పరమాత్మను ఏకము - అనేకము - విశ్వరూపము - విశ్వాంతర్యామి - విశ్వాంతర్గతుడు - విశ్వేసుడుగా, భేదాభేదరూపుడుగా దర్శిస్తూ భక్తి భావన ప్రవృద్ధపరచుకొంటున్నారు.

ఓ అర్జునా! వేదమంత్ర - తంత్ర ప్రతిపాదితమగుచున్న క్రతువు - యజ్ఞము - పితృసమర్పితమగు పిండము - ఆహారరూపమగు ఓషధము - అగ్నిలో వేయబడే నేయి (ఆజ్యము) - ఆ నేయిచే ప్రజ్వలించే అగ్ని - హోమక్రియ - యజ్ఞఫలం ఇవన్నీ కూడా నేనే! కర్మస్థానమైన సంస్థ, కర్మసేవా పరికరాలు - క్రియావ్యవహారం, కర్మయొక్క విధి విధానము - నిర్వర్తించే క్రియ - కర్మ చేయువాడు - కర్మఫలం - అంతా 'నేనే!' (The organisation, the systems and procedures, the instruments with which services are rendered, the acts

and services, the co-persons and the results - see every thing as Goldly and as God - Manifestation)

అంతేకాదు. ఈ జగుత్తుయొక్క "పరిపోషకుడు" అగు తండ్రిని నేను. ప్రేమ – పరిపోషణ జీవులకు అందిస్తున్న జగన్మాతను (ప్రకృతి) కూడా నేనే! ఈ జగత్తు యొక్క ధారణ నిర్వర్తించే 'ధాత'ను నేనే. ఋగ్వేదం – యజుర్వేదం – సామవేదం సంజ్ఞాపూర్వకంగా సర్వాంతర్యామి పరంగా ఉపయోగిస్తున్న 'ఓంకారం' నా స్వరూపమే! అనగా, సర్వభావాంతర్గత స్వరూపమగు ఓంకార స్వరూపుడను నేనే!

అంతేకాదు. మార్గము – మార్గాంతర పరిపోషకుడు – సర్వయజమాని – సర్వమునకు కేవలసాక్షి – శరణాగతియగు పరంధామం – సర్వుల హృదయరూపము – సర్వము ప్రభవించి లయించే స్థానము, సర్వులయొక్క సూక్ష్మరూపము – సర్వమునకు అవ్యయమగు బీజము నేనే సుమా!

సర్వకర్మలు వాటి ఫలములు నన్నే చేరుచున్నాయి. వాటి ప్రతిఫలములు నానుండే బయల్వెడులుచున్నాయి. సూర్యరూపంలో జలం స్వీకరించి వర్షరూపంలో తిరిగి లభించినట్లుగా, సర్వమునకు స్వీకార కర్తను – ప్రదానకర్తను నేనే! మృత్యువు నారూపమే! నేనే సర్వజీవులలో అమృతరూపంగా సర్వదా సర్వేసర్వత్రా వేంచేసియున్నాను. సత్ – అసత్‌లు, (జీవునిలోని మార్పుచెందనిది – మార్పు చెందునది...) ఇదంతా నా సంప్రదర్శనమే!

## సకామోపాసన

వేదప్రవచితము, త్రిగుణాత్మకము, త్రైవిద్యాసంబంధము అయిన యజ్ఞములతో నాయొక్క "ఇంద్రుడు" (అల్లా – యహోవా – శివుడు – విష్ణువు ఇత్యాది) మొదలైన దేవతారూపములను కొందరు సకామంగా ఉపాసిస్తున్నారు. అట్టి యజ్ఞయాగసమన్వితమైన దేవతారాధనచేత పుణ్యం సంపాదించుకొనుచూ, పాపసంబంధమైన ఇతఃపూర్వపు కర్మలదోషములను తొలగించుకొన్నవారై స్వర్గాదిలోకాలు చేరి దేవలోక భోగములను అనుభవించుచున్నారు.

అట్టి యజ్ఞయాగ సమన్విత ఉపాసనలనచే స్వర్గలోకంలో ఆయా భోగాలు అనుభవిస్తూ ఉండగా వారి పుణ్యఫలసంపద కొంతకాలం తరువాత క్షీణించగా తిరిగి మానవలోకంలో జన్మలు పొందుచున్నారు. మరల, ఈ లోకంలో యజ్ఞయాగాది త్రై విద్య (త్రిగుణాత్మకమైన ఉపాసన)ను స్వర్గలోకభోగములకొరకై ఆశించి నిర్వర్తించి, మరల స్వర్గలోకం చేరుచున్నారు. ఈ విధంగా త్రిగుణాత్మమకమైన "యజ్ఞయాగాదులు నిర్వర్తించు ఉపాసకులు (సకాములు) స్వర్గలోకం జేరటం – దేవలోక భోగములు అనుభవించటం – యజ్ఞఫలం చెల్లిపోవటం – మరల మానవలోకం ప్రవేశించటం – మరల త్రైవిద్యాయజ్ఞ కర్మలు నిర్వర్తించటం – యజ్ఞఫలానుభవం కొరకై మరల స్వర్గలోకంచేరటం" కామ్యకర్మ వర్తనులు నిర్వర్తిస్తున్నారు. ఈ విధంగా కామ్యకర్మలు నిర్వర్తించే ఉపాసకులు (Those who adopt functions of yoga for fulfilment of desires) స్వర్గ – మర్త్యలోకాల మధ్య రాక – పోకలు నిరంతరంగా కొనసాగిస్తున్నారు. వీరు దృశ్యాంతర్గత విషయాలకొరకై పరమాత్మను ఆశ్రయిస్తున్నవారగుచున్నారు.

*నిష్కామోపాసన :*

ఇక మరి కొందరు నా దేవతా రూపములు (అనగా, సకామోపాసనలను)– తత్ దేవలోక భోగములు అతిక్రమించినవారై "సర్వము పరమాత్మ స్వరూపమే కదా! ఇక మరొకచోట మరకొటేదో పొందవలసినది ఏముంటుంది?" అని గ్రహించినవారై, అనన్యచింతనతో సర్వతత్వాత్మకుడనగు నన్ను ఆశ్రయిస్తున్నారు. "సర్వాత్మకుడగు పరమాత్మయే సర్వ చరాచర జగత్తుగా, అస్మత్ ఆత్మరూపంగా ప్రదర్శన మగుచున్నారు కదా!" అని అనన్యోపాసన అభ్యసిస్తున్నారు.

*శ్లో ॥ అనన్యాత్ చింతయంతో మామ్ యే జనాః పర్యుపాసతే,*
*తేషామ్ నిత్యాభియుక్తానామ్ యోగక్షేమం వహామ్యహమ్ ।*

"ఏ వో దృశ్య – ఇంద్రియ విషయమఫలములు పొందాలి" అను ఆకాంక్షలను అధిమించి "సర్వం పరబ్రహ్మరూపమేవ" అను అనన్యచింతనను

(పరమాత్మ కొరకై పరమాత్మచింతనను) ఉపాసనాపూర్వకంగా కొనసాగించేవారి "యోగక్షేమములు" సర్వతత్వ స్వరూపుడనగు నేను వహిస్తున్నాను. ***కోరికలతో ఉపాసించేవారికి కోరికలు ఉపాసనా దేవతారూపంగా తీర్చటం, కోరికలు లేకుండా ఉపాసించే వారి (అకామకాములు) యోగక్షేమములు నేనే నిర్వర్తించటం నా స్వభావమైయున్నది.***

నన్ను స్వస్వరూపంగా సర్వతత్వ స్వరూపుడుగా, ససర్వజగత్ స్వరూపుడుగా ఉపాసించటం విధిపూర్వకం (As per the finest truth) సుమా!

అర్జునా! అన్య దేవతా ఉపాసన (కామకాములు) శ్రద్ధతో నిర్వర్తించేవారు కూడా ఆయా నాయొక్క దేవతారూపములద్వారా నన్నే ఉపాసిస్తున్నారు. అయితే, అవిధిపూర్వకంగా ఉపాసిస్తున్నారు. ఎందుచేతనంటే... సర్వయజ్ఞముల యొక్క భోక్త (Receiver)ను, వాటియొక్క ఫలప్రదాత (Giver)ను నేనే! ***ఫలమును కోరుకొనే బదులు ఫలప్రదాతయగు నన్నే ఆశ్రయిస్తే... అడిగినవారికి అడిగినది, అడగనివారికి కావలసినది ఇస్తాను.*** ఎవ్వరు ఏ దేవతారూపమును ఆశ్రయించినా అది నన్నేజేరుతోంది. ఆ ప్రయోజనం నానుంచే ప్రసాదించబడుతోంది. సర్వకర్మల భోక్త – ప్రభువు అయిన నా యొక్క సర్వతత్వస్వరూపమును ఎరుగనట్టివారు పరమ పురుషార్ధమును (పరతత్వమగు స్వస్వరూపానంద స్థితిని) పొందలేకపోతున్నారు. కర్మఫల పరిమితత్వమునకు లోనగుచున్నారు.

– సకామోపాసనపూర్వకంగా ఇంద్రాది దేవతలను ఆరాధించు సంకల్పంతో యజ్ఞయాగాది కర్మలను ఫలాకాంక్షతో నిర్వర్తించేవారు దేవభోగ ప్రదాతలగు ఇంద్రాది దేవతలను పొందుచున్నారు.

– సకాములై పిత్రుదేవతలను ఉపాశ్రయించే వారు పిత్రుదేవతా లోకములను పొందుచున్నారు.

– సకామంగా భూతాత్మతత్వములను ఉపాసించేవారు భూతలోకములు చేరుచున్నారు.

- వీరంతా ఆయాలోకపాలకులను చేరి కాలక్రమేనా... అవి నశించినప్పుడు అవన్నీ కోల్పోవుచున్నారు.

అఖండము – అప్రమేయము – నిత్యము – అనంతము – కేవలసాక్షి అగు నన్ను ఆరాధించినవారు.. తత్ లక్షణ విలక్షణమగు నన్నే పొందుచున్నారు.

ఓ అర్జునా! ఇక సర్వాంతర్యామినగు నన్ను ఉపాసించటం ఎట్లా అంటావా? విను.

"అనన్యమైన భక్తి"తో నాస్థానము చేరవచ్చుసుమా!

ఇక నాకు సమర్పించవలసిన దంటావా?

*శ్లో ॥ పత్రం, పుష్పం, ఫలం, తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి*
*తదహం భక్త్యుపహృతమ్ అశ్నామి ప్రయతాత్మనః ।*

నాకు భక్తి – ప్రేమ ప్రధానం. ఒక ఆకుగాని, పువ్వుగాని, ఫలముగాని, జలముగాని నాకు భక్తితో, ప్రేమగా సమర్పిస్తేచాలు. ఆ భక్తితో – ప్రేమతో సమర్పించినది నేను ప్రేమగా స్వీకరిస్తాను. అనగా పెద్దపెద్ద కార్యక్రమములతో కూడిన శ్రమావ్యవహారములే కావాలని నేను కోరుకోనుసుమా! కాబట్టి నన్ను ఉపాసించటం అతి సులభం.

- నీవు ఏమేమి నిర్వర్తిస్తూ ఉన్నావో,
- ఏదేది స్వీకరిస్తున్నావో,
- ఏదేది సమర్పిస్తున్నావో,
- ఏదేది దానం చేస్తున్నావో...,

అదంతా నాకు ప్రేమగా సమర్పించు.

ఈ విధంగా సర్వకర్మలను – సర్వ కర్మఫలములను సమర్పిస్తూ సన్యాసయోగయుక్తాత్ముడవై ఉండుము. అప్పుడు నీవు నిర్వర్తించే సర్వకర్మల శుభ – అశుభ ద్వంద్వము నుండి విడివడినవాడవై అఖండాత్ముడనగు నన్ను

జేరగలవు. నాయనా! ఫల్గుణా! సర్వాంతర్యామినగు నాకు సర్వ జీవులు సమానులేకాని, ఇందులో నాకు ప్రియమైనవారుగాని, అప్రియమైన వారుగాని లేరు. అయితే ఎవరైతే అనన్యభావనతో సర్వాంతర్గతుడునగు నన్ను ఉపాసిస్తారో.... అట్టివారు నా సామీప్యముగా ఉన్నారు. వారి సామీప్యముగా నేను ఉన్నాను. *అనన్యోపాసకులు (పరమాత్మను జగత్తుకు - స్వస్వరూపానికి అన్యం కానట్లుగా గ్రహించి ఉపాసించువారు)* నన్ను సర్వే - సర్వత్రా *దర్శిస్తున్నారు. అదేరీతిగా వారు సదా నాకనుచూపులోనే ఉంటారుకుడా!*

ఒకానొకడు దురాచారపరుడు అయి ఉండవచ్చుగాక! అయినదేమే అయినది. ఇక ఇప్పటినుంచైనా సరే, "సర్వము పరమాత్మ చైతన్యస్వరూపమే కదా!"..... అనుకొని సర్వులను పరమాత్మయొక్క స్వరూప చమత్కారంగా భావిచటం ప్రారంభించితే... ఇక ఆతడు సాధువులతో సమానుడే! సమ్యక్ వ్యవసి (సాధనాతత్పరుడు - యోగసాధకుడు)తో సమానుడే! ఇక అతి త్వరలో - ఆత్మదర్శనము - సర్వాంతర్యామిత్వము - సర్వతత్వస్వరూపము ఆస్వాదించగలడు. "అంతా, అన్నిటా, సర్వదా వేంచేసియున్న ఆత్మయే నా ధర్మము" - అనే స్వాత్మానందముచే "ఆత్మధర్మాత్ముడుగా" తప్పక ప్రకాశించగలడు.

అందుచేత నిరుత్సాహము, తాత్సారము ఎందుకు?

*శ్లో ॥ కౌంతేయ! పతిజానీహి! న మే భక్తః ప్రణశ్యతి ॥*

ఓ కౌంతేయ! నా యొక్క ప్రతిజ్ఞ - అనుశాశనము - నిర్ణయం విను. "*నాభక్తునకు దుస్థితి కలుగటం అన్న ప్రసక్తే లేదు. భక్తుడు సర్వదా సుస్థితియే పొందగలడు!*"

"మావి అల్పజన్మలు. మేము పాపయోనులం. స్త్రీ - వైశ్య - సూద్రులం. మాకు మోక్షార్హత లేదేమో?" అని ఎవ్వరూ కించిత్‌కూడా నిరుత్సాహ పడవలసినదే లేదు. ఎవ్వరైనా సరే, వారి వారి స్వకర్మలన్నీ సర్వాంతర్యామియొక్క ఉపాసనగా ఉద్దేశ్యించెదురుగాక! అది అనన్యమైన భక్తి చింతనలు కాగలవు. అట్టి భక్తి ప్రవత్తులను ఆశ్రయిస్తే వారు తప్పక అఖండ - అప్రమేయ -

స్వయమాత్మస్థానమగు నన్ను తప్పక జేరగలరు. పరమోత్తమగతిని సముపార్జించుకోగలరు. ఇక యజ్ఞయాగ నిర్వాహకులగు బ్రహ్మోపాసక - శాస్త్రోపాసక-దైవోపాసకులగు బ్రాహ్మణ జన్మల - భక్తుల - రాజర్షుల గురించి వేరే చెప్పేదేమున్నది? ఓ అర్జునా! "ఈ లోకంలో ఏదో పొందనేలేదే? ఇంతవరకే పొందామే? ఈ స్థితిగతులు ఈవిధంగా పొందామేం?"... అని దుఃఖిస్తూ ఆయుష్షును ఎందుకు వృధా పరచుకోవాలి? ఈ జగత్తులో పొందటం - పొందకపోవటం - ఇదంతా అనిత్యం. పైగా, శాశ్వతసుఖం ప్రసాదించగలిగినదేదీ ఇక్కడ లేదు సుమా!

అందుచేత ఓ అర్జునా!

సర్వాంతర్యామిని - సర్వతత్త్వస్వరూపుడను అగు నన్ను నీ మనసంతా నింపుకో!

నాకు భక్తుడవై ఉండు.

వ్యక్తావ్యక్త స్వరూపుడనగు నాకు నమస్కరించు.

శరణువేడు.

పరమాత్మోపాసకుడవై సమర్పణ బుద్ధితో కర్మలు నిర్వర్తిస్తూ యోగివై ఉండు.

అప్పుడు నేను నిన్ను తప్పక సముద్ధరిస్తాను.

*ఇతి భాగవద్గీతా... రాజవిద్యా రాజగుహ్య యోగ పుష్పః*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

★★★

శ్లో॥ అహమ్ ఆత్మా, గుడాకేశ! సర్వభూత ఆశయ స్థితః ।
అహమ్ ఆదించ – మధ్యంచ భూతానామ్ అంతయేవ చ ॥

గుడాకేశ! అహమ్ సర్వభూతాశయ స్థితః ఆత్మా ।
అహమేవ భూతానామ్ ఆదించ – మధ్యంచ–అంతమేవ చ ॥

అర్జునా! సకల జీవుల ఆశయముల ఉత్పన్న స్థానమైన అంతరంగాత్మను నేనే! అంతేకాదు. సకల జీవుల యొక్క మొదలు – మధ్య – చివర కూడా నేనే అయి ఉన్నాను.

# 10.

# విభూతియోగ పుష్పం

**శ్రీ కృష్ణభగవాన్** : ఓ మహాబాహో! అర్జునా! నాయీ పరమతత్వార్థ ప్రదర్శితమగు మహావాక్యములను మరల మరికొంత విశేషణాపూర్వకంగా వివరించి చెపుతాను. ఈ వాక్యములు నీమీదగల ప్రీతిచే నీకు హితం కలిగించే ఉద్దేశ్యంతో చెప్పటం జరుగుతోంది సుమా!

★★★

పరమాత్మ స్వరూపుడనైన నాయొక్క ప్రభవము (The point of commencement)... (ఆత్మయొక్క ప్రారంభస్థానము) ఏమిటో దేవతలకు – మహర్షులకు కూడా తెలియదు.

**దేవతలు** : సృష్టి – జీవరాసుల యొక్క నిర్మాణ – కార్యక్రమ – పరిరక్షణలో పాల్గొనే అశరీర తత్వస్వరూపులు.

**మహర్షులు** : ఆత్మయొక్క తత్వమును సందర్శించి – పఠించి – గానంచేస్తూ శాస్త్రపాఠ్యాంశాలరూపంగా తదితర జనులకు ప్రబోధిస్తున్న మహనీయులు.

వారిరువురికన్నా మునుముందే సర్వాత్మతత్వస్వరూపుడనగు నేను వేంచేసియే ఉన్నాను.

ఆత్మ స్వరూపుడనై సర్వజీవుల యందు వెలుగొందుచున్న నేను జన్మరహితుడనని, అనాది (No begining) అని, లోకనియామకుడనని ఎవ్వరు అసమ్మూఢులై గ్రహిస్తారో.... వారు సర్వదోషములనుండి – పాపదృష్టులనుండి విడివడినవారగుచున్నారు.

ఓ అర్జునా! ప్రతి జీవునియందు ఆత్మగా వేంచేసియున్న నావలననే బుద్ధి – జ్ఞానము – సమ్మోహము (Ilusion) – అసమ్మోహము (Clarity) – క్షమ – సత్యము – ఇంద్రియవిషయ వ్యాపకము – ఇంద్రియనిగ్రహము – మనోవ్యాపారము – మనోనిగ్రహము – సుఖభావము – దుఃఖభావము – భావ–అభావములు – భయము – అభయము మొదలైనవన్నీ ఎర్పడటం జరుగుతోంది. అవన్నీ అంతరాత్మస్వరూపుడనగు నాయొక్క సంకల్ప – వికల్ప ప్రభావమే ఈ జీవుల యందు అహింస – సమత – తుష్టి – తపస్సు – దానం – యశస్సు – అయశస్సు –... మొదలైన సమాంతర – వ్యతిరిక్తభావాలన్నీ ఏర్పడుచున్నాయి. ఇవన్నీ భావనాతరంగములు! జలతరంగాలకు ఉత్పత్తిస్థానం ఏమిటి? జలమేకదా! భావనా తరంగములకు ఉత్పతిస్థానం నేనే! భావాలన్నీ భావములకావల ఉన్న ఆత్మతత్వము యొక్క చమత్కారమే! "నాయొక్క విభూతులే ఈ చరాచర సృష్టి జగత్తు" అని నన్ను తత్వతః గమనించిన తత్వవేత్తలు మనోచంచల్యములేనట్టి యోగముచే (అవికంపమనస్కులై) గమనిస్తున్నారు. సర్వేసర్వత్రా నా విభూతులేనని ఉపాసిస్తున్నారు. ఈ కనబడేదంతా నా విభూతియే సుమా!

సర్వజీవుల ఉత్పత్తికి స్థానం నేనే! అందరు ప్రభవిస్తున్నది – ప్రవర్తిస్తున్నదీ నాయందే! నావలననే! ఆత్మప్రజ్ఞానుసంధానము కలిగియున్నట్టి – ఈ మహత్తర సత్యమును ఎఱిగినట్టి ఆత్మజ్ఞులు తమ చిత్తమును నాయందే నిలిపి ఉంచుచున్నారు. (They are placing their entire interest in me). వారి చిత్త – ప్రాణములు (Interest and Energies) నాయందు నిలిపి సర్వాంతర్యామియగు

నా తత్వమును అభివర్ణిస్తూ పరస్పరం బోధించుకుంటున్నారు. సంభాషించుకుంటున్నారు. అనునిత్యంగా పరతత్వ అఖండ – అప్రమేయ – నిత్య – సత్య ఆనందాది నా భగవత్ గుణములు ఒకరితో మరొకరు అభివర్ణించుకుంటూ, గానం చేస్తూ చెప్పుకొని ఆనందిస్తున్నారు. ఆ విధంగా ఎవ్వరైతే సతతయుక్తులై, (ఎల్లప్పుడు పరమాత్మ ధ్యానపరులై) నాగురించి ప్రసంగ – కీర్తన – ధ్యాన – సంభాషణాపరులై ప్రీతిపూర్వకంగా మననము నిర్వర్తిస్తూ ఉంటారో,... అట్టివారికి నేను 'బుద్ధియోగము' అనే ఉపకరణమును ప్రసాదిస్తూ ఉంటాను. అట్టి 'ఉత్తమబుద్ధి' అనే వాహనమును ఉపయోగించుకొని పరమానంద స్వరూపుడగు నన్ను వారు సముపార్జించుకుంటున్నారు. వారి హృదయములోని అజ్ఞానాంధకారము "జ్ఞానము" అనే – నేను వెలిగిస్తున్న దీపముయొక్క – వెలుగుచే పటాపంచలు అవటం జరుగుతోంది.

**అర్జునుడు** : హే పరబ్రహ్మో! హే పరంధామా! పవిత్రము – పరమము అగు హే భగవాన్! ఈ చరాచర సృష్టి తమయందు ప్రభవిస్తున్నట్టి ఓ శాశ్వత దివ్యపరమపురుషా! జన్మాదులకు మునుముందే సర్వదా ప్రకాసించే ఆదిదేవా! సర్వలోకములకు విభూ! స్వామీ! "మీరు పరబ్రహ్మము – పరంధామము – పరమ పవిత్రము అగు పరమాత్మ స్వరూపులు – శాశ్వత దివ్యపురుషులు – జన్మకర్మలకు అతీతులు – ఆదిదేవులు – సర్వమునకు విభువు – నియామకులు" అని మహర్షులు చెప్పుచుండగా విన్నాను. మహర్షి నారదులు మీ విలక్షణలక్షణములు – విభూతులు గానం చేస్తూ ఉండటం విని ఆస్వాదించాను. లోక కళ్యామూర్తులగు వ్యాసమహర్షి మీతత్త్వమును ప్రవచిస్తూ ఉండగా విన్నాను. ఆహాc! ఈ రోజు ఎంతటి సుదినం! మీ మహిమాన్విత పరబ్రహ్మతత్వం మీరే స్వయంగా చెప్పుచుండగా వింటున్నాను. ఔను స్వామీ! మీరు మీ అనంత దివ్య ఆత్మానంద స్వరూపం గురించి పరమసత్యమే చెప్పుచున్నారు – అని నాకు పూర్ణ విశ్వాసము కలిగింది. హే కేశవా! సర్వాంతర్యామియగు మీ వ్యక్తిత్వము దేవ – దానవులు కూడా గ్రహించలేకపోతున్నారు! ఇక నేను ఎంతటివాడను!

మిమ్ములను మరెవ్వరు తెలుసుకోగలరు? హే పురుషోత్తమా! మిమ్ములను మీరే స్వయంగా (ఆత్మచే ఆత్మను) తెలుసుకోగలరు! ఈ జీవజాలమంతా మీ యొక్క భావనామాత్రం చేత ఏర్పడి ఉంటోంది. ఈ లోక - జీవాదులన్నిటికీ ఈశ్వరుడు మీరు! దేవతలకే దేవదేవా! హే జగత్‌పతీ! మిమ్ములను అర్థం చేసుకోవటం - సందర్శించటం - ఆస్వాదించటం భక్తి - ప్రపత్తులచేతనే సుసాధ్యం! అట్టి భక్తి - ప్రవృద్ధికై మీ విశేషమైన విభూతులను ఆశ్రయించటమే ఉపాయం.

ఏఏ మీ విశేషభూతులు ఈ స్వర్గ - మర్త్య - పాతాళ త్రిలోకములు వ్యాపించి ఉన్నాయో.... అవి సమగ్రంగా మేము గ్రహించటం అత్యవసరం కదా!

'అట్టి మీ విస్తార విభూతులు? (Model Manifestations) మీ నోట వినటం ఎంతటి సదవకాశం! మీ ఏ విభూతిని పరిచింతన చేసుకొంటూ భక్తి యోగమును మేము పరిపుష్టం చేసుకోగలమో..., ఏఏ భావములతో చింతన చేస్తూ మేము సర్వాంతర్యామివగు మీదరి చేరగలమో ప్రవచించ ప్రార్థన!

ఓ జనార్దనా! మీ ఆత్మవిభూతులు ఉపాసకులకు మార్గదర్శకాలు!

కొన్నికొన్ని విభూతులు మీరు ఇప్పటికే చెప్పి ఉన్నారు. అయితే అమృత వాక్కులగు మీ విభూతులు ఇంతవరకు ఎంతగా మరలమరల చూస్తున్నప్పటికీ, వింటున్నప్పటికీ, ఇంకా ఇంకా వినాలని, భక్తి - ప్రపత్తుల పరిపుష్టికై వినియోగించుకోవాలని అనిపిస్తోందేగాని, 'ఇకచాలులే' అని తృప్తి కలుగటం లేదు సుమా!

**శ్రీకృష్ణభగవానుడు** : నాయనా! అర్జునా! ఉపాసనకు సదుపయోగంకాగల నాయొక్క విభూతులు అనంతం. ఆత్మశుభముకొరకై ప్రధానమైన కొన్ని ఆత్మవిభూతులను ఈ సందర్భంలో చెప్పుతాను, విను. నేను చెప్పబోవుచున్న నా **విభూతులు నా స్వరూపముగా ఉపాసన చేయవచ్చు. అవి నీ ఆరాధనా**

*విదారానమునకు సహకరించుగాక!* అవి మార్గదర్శకాలు – మార్గాన్వేషణ ప్రేరకాలు కాగలవు.

☆☆☆

ఓ గుడాకేశా! అర్జునా! సర్వ జీవజాలములలోని ఆశ – ఆశయములకు ఉత్పత్తి స్థానమగు ఆత్మను (The 'SELF' of every body) నేనే!

"ప్రతిజీవుని యొక్క మొదలు – మధ్య – అంతము నా ప్రదర్శన చమత్కారమే" అను సందర్శనం నాయొక్క విభూతి సందర్శనమే! (Please develop comprehension that the begining, the continuity and the end of every being is in All-pervading God)

ద్వాదశాదిత్యులలో నేను విష్ణువును. సూర్యుని ద్వాదశకళలలో సర్వరక్షణ తత్త్వమగు విష్ణుకళ నేనే!

లోకమునకు ప్రకాశమును ప్రసాదించే తత్త్వములలో కిరణప్రదాతయగు సూర్యగోళము యొక్క తేజోవిశేషం నాదే!

'మరుత్త' అనే వాయుదేవతా తత్త్వములలో మరీచి వాయుతత్త్వమును (వాయు తరంగములు జగత్తులలోను – దేహములలోని నర–నరములలో ప్రసరింపజేసే ఉత్తేజ – చలన తత్త్వాధిపతి)ని నేనే!

ఆకాశములో కనిపించే జ్యోతిష సముదాయములో మనోజ్ఞము – మహామనోరూప సంజ్ఞయగు చంద్రగోళాహంకారం నేనే!

- వేద – వేదాంత స్వరూపమగు పరమాత్మయొక్క విశేష విభవములను, చమత్కృతులను, విభూతులను గానం చేస్తున్న సామవేదం నా ఆనందస్వరూపం.
- దేవతలలో దేవతాప్రభువగు ఇంద్రుడను!
- సర్వ దేహములలో క్రియాశీలకమై ఉంటున్న ఇంద్రియములలో మనస్సు నారూపమే! (మనస్సు విషయములకన్నా ముందే ఉండి, దృశ్యరహిత

దర్పణంలాగా ఒకవైపు విషయములను ప్రతిబింబిస్తూ, - మరొకవైపు విషయములకు ప్రమేయంలేనట్టిదై ఉంటోంది.)

- ఈ దేహధారులగు సర్వ జీవులలోని బుద్ధి నేనే!
- ఏకాదశరుద్రులలో శంకరభగవానుడను నేనే!
- అష్టవసువులలో అగ్నిస్వరూపుడగు పావకుడను!
- శిఖరములలో మేరు పర్వతమును!
- పురోహితులలో ప్రప్రధముడు - శ్రేష్ఠుడు - దేవతలగురువు అగు బృహస్పతిని!
- సేనాధిపతులలో దేవసేనాధిపతియగు కుమారస్వామిని (స్కంధుడను)!
- సరస్సులలో సప్తసముద్రాలు నేనే!
- మహర్షులలో భృగుమహర్షిని!
- అర్ధవంతమైన అక్షరములలో ఏకమక్షరం అయినట్టి 'ఓం' యొక్క తత్త్వార్థం నా స్వరూపమే!
- యజ్ఞములలో జపయజ్ఞమును!
- స్థావరములలో హిమాలయ పర్వతమును!
- వృక్షములన్నిటిలోను అశ్వత్థ వృక్షమును!
- దేవ ఋషులలో నారదమహర్షిని!
- గంధర్వులలో చిత్రరధుడను!
- సిద్ధులలో కపిలమునిని!
- అశ్వములలో సముద్రమధన సమయంలో జన్మించిన ఉచ్చైశ్రవశ అశ్వం నేనే.

- శ్రేష్ఠమైన ఏనుగులలో (దిగ్గజములలో) ఐరావతమును!
- మానవులలో నరాధిపుడు (రాజు)ను.
- ఆయుధములలో వజ్రమును!
- ధేనువులలో (ఆవులలో) కామధేనువును!
- ప్రజోత్పత్తికారకుడగు మన్మధుడను!
- సర్పములలో వాసుకిని!
- అనేక తలలు ఉండే నాగులలో ఆది శేషుడను!
- జల చరముల ప్రభువగు వరుణుడను!
- పిత్రుదేవతలలో అధిపతియగు అర్యముడను!
- దండించువారిలో యముడను!
- మృగములలో మృగ్రేందమగు సింహమును!
- పక్షులలో గరుత్మంతుడను!
- శస్త్రాస్త్రధారులలో శ్రీరామచంద్రుడను!
- గమన స్వభావులలో వాయువును!
- జలచరములలో మొసలిని!
- ప్రవాహలక్షణ సమన్వితములగు నదులలో గంగానదిని!
- ఈ సృష్టించబడిన సర్వసృష్టి యొక్క ఆది – మధ్య – అంతమును నేనే!
- సర్వ విద్యలలో అధ్యాత్మవిద్యను!
- వాదములలో తత్త్వనిర్ణయవాదమును!
- అక్షరములలో 'శివస్వరూపము' అనబడు 'అ' అక్షరమును!

- సామాసములలో ద్వంద్వ సామాసము (లక్ష్మీనారాయణులు - పార్వతీపరమేశ్వరులు మొదలైనవి) నేను!
- అక్షయ స్వరూపమగు కాలమును (Time factor) నేనే!
- ఊర్ధ్వ - అధోముఖములతో సహా సర్వదిక్ముఖములు నేను.
- ఏ మృత్యువు భూతకాలమును మ్రింగివేయటం - భవిష్యత్కాలమును ఉద్భవింపజేయటం నిర్వర్తిస్తోందో.... అట్టి మృత్యుదేవతను నేనే!
- జీవులయొక్క కీర్తి - సిరి - వాక్ సంపద - నారీ పాణిగ్రహణ సంపద నేనే!
- ప్రతి జీవునిలోని జ్ఞాపకము - మేధాశక్తి - ధైర్యము - క్షమాగుణము నేనే!
- సామగానములలో బృహత్ సామగానమును!
- ఛందస్సులలో గాయత్రీ ఛందస్సును!
- మాసములలో వసంతఋతువును!
- వంచనతో కూడిన ఆటలలో జూదమును!
- తేజోవంతులలోని తేజస్సు నారూపమే!
- జయము - పరిశ్రమ... నా రూపములే!
- సాత్వికజనులలోని సాత్వికత నేనే!
- వృష్ణివంశజులలో వాసుదేవుడను (శ్రీకృష్ణుడను) నేను!
- పంచపాండవులలో అర్జునుడను నేనే! (త్వమేవాఽహమ్)
- మునీశ్వర సంఘలో వ్యాసమహర్షిని!
- విద్వాంసులలో శుక్రాచార్యుడను!

శిక్షించువారిలో 'శిక్ష' నాప్రదర్శనమే! సర్వశిక్షకుడగు యముడను నేనే!

- "జయించాలి" అనుకొనేవారిలోని నీతి రూపము (principles and practices) నేనే!
- రహస్యములకు సంబంధించిన 'మౌనము' నేనే!
- జ్ఞానవంతులలోని జ్ఞానము నా స్వరూపమే! వారిలోని జ్ఞానము నేనే!
- ప్రతి ఒక్క జీవుని యొక్క ఆదిబీజము నాయందే ఏర్పడినదై ఉన్నది.

ఓ అర్జునా! ఈ స్థావరజంగమముల సమాస్తములో నాకు వేరైనదంటూ ఎక్కడా ఏదీ లేదు. ఉదహరణకు, స్వప్నద్రష్టకు వేరుగా స్వప్నంలో ఏ ఒక్క చిన్నవస్తువు ఉండదు కదా! సర్వము అస్మత్ కల్పనా చమత్కారమే!

- ఎక్కడెక్కడైతే ఏదేది సంపత్తి – కాంతియుక్తము – రమ్యము – కళ్యాణకారకము అయిఉంటుందో అదంతా నా తేజస్సుయొక్క అంశచేతనే సంభవిస్తోందని గ్రహించు.

ఓ అర్జునా! ఈ విధంగా నా విభూతులు అనంతము. అట్టి అనంత తేజో విశేషాలలో కొన్నిటిని నీయొక్క ప్రశ్నకు సమాధానంగా అభివర్ణించి చెప్పాను.

అయినా ఇన్నిన్ని మాటలెందుకు! ఒక్క విశేషవాక్యం చెపుతాను. విను.

*"ఈ కనబడే చరాచర జగత్తంతా క□డా నాయొక్క ఒకానొక అంశముయొక్క స్వాల్పవిబాూగమునందు ఏర్పడానదై యున్నది."*

*ఈ జగత్తంతా కుడా నా అంశలోని ఒకానొక స్వాల్పచమత్కారం మాత్రమే!*

*ఇతి బాగవద్గీతా... విబాూతి యోగ పుష్పః*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

★★★

శ్లో॥ త్వమక్షరం పరమం వేదితవ్యం, త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।
త్వమవ్యయః శాశ్వత ధర్మగోప్తా సనాతస్త్వం పురుషో మతోమే ॥

త్వమ్ ..... వేదితవ్యం పరమమ్ అక్షరమ్ ।
త్వమ్ అస్య విశ్వస్య పరమ్ నిధానమ్ ।
త్వమ్ శాశ్వత ధర్మగోప్తా । త్వమ్ అవ్యయః పురుషః (ఇతి) మే మతః॥

తెలుసుకొనవలసిన "అక్షర బ్రహ్మము", సమస్త జగత్తుకు ఆశ్రయస్వరూపులు, అనాది ధర్మరక్షకులు, నాశరహిత సనాతనపురుషులు మీరే అయి ఉన్నారు.

11

# విశ్వరూప సందర్శన యోగ పుష్పం

**అర్జునుడు** : హే పరంధామా! శ్రీకృష్ణా! నాపై అత్యంత అనుగ్రహించే తత్వజ్ఞాన పూర్వకమైన మహత్తర వాక్యామృతం ప్రసాదించారు. పరమార్ధ శోభితము - అతి రహస్యము - అధ్యాత్మము అగు విశేషాలు ప్రవచనం చేశారు. అధ్యాత్మ శాస్త్ర వాక్యసారంగా ప్రకటించబడిన - మహత్తర జీవిత సారాంశము - జీవుని నిర్వచనము అయిన మీ వాక్యములను వినినంత మాత్రం చేతనే నా మోహమంతా పటాపంచలయిపోయింది. ఈ దృశ్యము - ఇందలి జీవజాలమంతా కూడా మీయందే ఏ విధంగా సృష్టి - స్థితి - లయము పొందుచున్నాయో, మీ అప్రమేయ మహాత్మ్య ఆత్మతత్వము, శాశ్వతానంద స్వతత్వము ఎట్టిదో - అదంతా మీ అమృత వాక్కుల ద్వారా ఇప్పుడు నేను విన్నాను.

హే పరమేశ్వరా! మీరు "మయాతతమ్ ఇదమ్ సర్వము జగత్ అవ్యక్త మూర్తినా - మస్థాని సర్వభూతాని - న చ మస్థాని భూతాని"... అను వర్ణనచే ఏ మీ మహాత్మ్యమును విశదీకరించారో, మీ వేరువేరైన - ఏకస్థమైన విభూతులను అభివర్ణించారో... అవన్నీ పరమ సత్యముగా నేను గ్రహించాను. గమనిస్తున్నాను.

అయితే స్వామీ! మీరు అభౌతిక – పరస్వరూపులు కదా!

మీరు దేవకీ – వసుదేవులకు ఆనందములను ప్రసాదించటానికి, 'శ్రీకృష్ణ రాయబారము సందర్భంగాను, యశోదామాతకు శాంతిని ప్రసాదించటానికి ...... మొదలైన కొన్ని సందర్భాలలో విశ్వరూపం ప్రదర్శించారని విన్నాను. ఈ భౌతిక రూపమునకు పరమై, జగత్ అంతర్గత – జగదతీత – జగత్ అప్రమేయ – జగత్ ఆధార విశ్వరూపం సందర్శించాలని నాకు వేడుక కలుగుతోంది.

ఒక వేళ మీ విశ్వరూపమును సందర్శించగల సామర్థ్యము – అధికారము నాకు ఉన్నదని, మీరు భావిస్తే, – మీ అవ్యయుమగు కేవలాత్మానందరూపం సందర్శించే అనుగ్రహమును ప్రసాదించండి. హే యోగీశ్వరా! విశ్వరూపసందర్శన భాగ్యమును అనుగ్రహించండి.

**శ్రీకృష్ణ భాగవానుడు** : అర్జునా! తథాస్తు! నానావిధములైన వర్ణనములతో, ఆకృతులతో వందల వేల రూపములను చమత్కారంగా అవధరించియున్న నా దివ్యరూపమును సందర్శించెదవు గాక! ద్వాదశ ఆదిత్యులను – అష్టవసువులను – ఏకాదశ రుద్రులను – అశ్వినీ దేవతలను – నవమరుద్గణములను – ఇంకా ఎన్నెన్నో నీవు చూచి – విని ఉన్నవి, చూడని – విననివి అగు అనేకానేక విశేషాలను స్వరూపాంతర్గత చమత్కారంగా కలిగియున్న నా అప్రమేయ విశ్వాంతర్గత – విశ్వాతీత ఆత్మరూపమును సందర్శించు! ఈ స్థావర – జంగమాత్మక దృశ్యజగత్తంతా ఎందులో భావనానుసారంగా ప్రతిబింబిస్తోందో... అట్టి నా ఆత్మదేహమునందు ఇంకా ఏమేమి చూడవేడుక కలదో.... అదంతా చూడవచ్చు.

అయితే, భౌతిక నేత్రములు భౌతిక దృశ్యమునకు పరిమితమై ఉంటాయి. దివ్యమగు ఆత్మదేహం సందర్శించే సామర్థ్యము నీ భౌతిక నేత్రములకు లేదు. అందుచేత దివ్యమగు విజ్ఞతా చక్షువులు (sharp perceptive ability of

common sense) (లేక) జ్ఞాన నేత్రములు ప్రసాదిస్తున్నాను. నా యొక్క ఆత్మయోగైశ్వర్యమును ఇప్పుడు సందర్శించు.

☆☆☆

**సంజయుడు** : ఓ ధృతరాష్ట్రమహారాజా! మహాయోగేశ్వరులగు ఆ శ్రీ హరి అప్పుడు అర్జునునకు పరము – మహత్తరము – దృశ్యాతీతము – సర్వధారణా సమన్వితము అగు ఆత్మైశ్వర్య విశ్వరూపమును ప్రదర్శించి చూపారు.

అర్జునునకు ఆ కృష్ణభగవానుని విశ్వ–విశ్వాంతర తత్వరూపములో అనేకముఖాలు, కళ్లు, దివ్యమైన ఆభరణధారులు, అనేక ఆయుధములు ధరించిన అసంఖ్యాకజీవులు, దివ్యమాలాంబరధారులు, దివ్యగంధములను అలంకరించుకున్న వారు అగుపించారు. ఆ దివ్యరూపం విశ్వమంతా ప్రసరించి ఆక్రమించియున్నదై కనిపించింది. ఆ విశ్వరూపములో అనేక ఆశ్చర్య దృశ్య పరంపరలు ప్రదర్శితమవటం అర్జునుడు సందర్శించసాగాడు.

ఆ విశ్వరూపము వేలాది సూర్యుల తేజస్సు ఒక్కచోట సమావేశమైట్లుగా మహాతేజో విరాజితమై కనిపించింది. అనేకవిధ ప్రకృతులు – స్వభావాలు – ఏకరూపంలో ఏకైక పరతత్వము యొక్క బహువిధ ప్రదర్శనా చమత్కారంగా అర్జునుడు సందర్శించసాగాడు.

ఆనంద–ఆశ్చర్య – విస్మయములతో అర్జునుడు పులకాంకితుడయ్యాడు. దేదీప్యమానంగా విశ్వమంతా ఆక్రమించ వెలుగొందుచున్న విశ్వ – విరాట్ రూపమును చూస్తున్న అర్జునుడు శ్రద్ధాభక్తులతో సాష్టాంగదండప్రణామములు మరలమరల సమర్పించాడు.

చేతులు జోడించి నమస్కరిస్తూ ఇట్లా స్తోత్రం చేయసాగాడు.

☆☆☆

**అర్జునుడు** : ఓ దేవదేవా! పరాత్పరా! మీ ఈ విశ్వ – విశ్వాంతరాళ – విశ్వరూపంలో అనేకమంది దేవతలు, జీవసంఘ సమూహాలు, బ్రహ్మాదేవుడు,

శివుడు, సకల ఋషులు, దివ్యసర్ప సమూహములు నాకు అగుపిస్తున్నారు. అసంఖ్యాకమగు చేతులు, పొట్టలు, ముఖములు కనిపిస్తున్నాయి. మీ విశ్వరూపం అనంతరూపమై విరాజిల్లుచున్నది. మీ మొదలు ఏమిటో – మధ్య ఏమిటో – చివర ఏమిటో నాకేమీ అంతు పట్టటమే లేదే!

హే స్వామీ! అనేక కాంతులు వెదజల్లే కిరీటములు – గదలు – శంఖములు – చక్రములు ధరించినవారై, అగ్ని – సూర్యులవలె తేజోమయస్వరూపులై ఊహకందని విధంగా సర్వజగత్తులను ఉత్తేజపరుస్తూ, చైతన్యస్వరూపులై వెలుగొందున్నట్లుగా మీరునాకు అగుపిస్తున్నారు. అన్నివైపులా కాంతులు వెదజల్లుతూ జగత్ దృశ్య – దర్శనకారకులై, జగత్‌దర్శకులై, జగత్ అతీతులై, జగత్తులకు అప్రమేయులై, జగత్‌సాక్షిగా మీరు వెలుగొందుచున్నారు

హే పరమపురుషా! జనించటం – గతించటం స్వభావంగా కలిగియుండి ఈ జగత్తులకు ఆవల – జగత్తుకు ఆధారులై ప్రకాసిస్తున్నారు. మార్పు – చేర్పులకు సంబంధించని అక్షర స్వరూపులు మీరు. సర్వదేహాలలోని అక్షరపరబ్రహ్మము మీరే! – సర్వదేహాలలో వేంచేసి ఉండి సర్వమును ఎఱుగుచున్నది మీరే! ఈ జగత్తులన్నీ మీ స్వరూపమును ఆశ్రయించి ఉనికిని ప్రదర్శిస్తున్నాయి. ప్రతి జీవుని యొక్క శాశ్వత ధర్మముగా – ఆత్మస్వరూపంగా సర్వదా వెలుగొందుచున్నది మీరే! ఈ దృశ్య వ్యవహారమంతటికీ మునుముందుగా వేంచేసియున్న సనాతన పురుషులు – సనాతన పుషకారము మీరే!

హే తేజోమయ స్వరూపా! మీరు ఆది – మధ్య – అంతములనేవి లేనివారై వెలుగొందుచున్నారు. సర్వ దేహములయొక్క చేతులు – చేతలు మీవే! సూర్య – చంద్రులు చక్షువులుగా ధారణ చేస్తున్న మహత్తర ఆత్మస్వరూపులు మీరు. స్వామీ! జ్వలిస్తున్న అగ్నిశిఖలవలె ముఖము కలిగియున్న మీరు ఈ విశ్వములోని అణువణువు అనుక్షణం ఉత్తేజితం చేస్తున్నారు. ప్రజ్వలింపజేస్తున్నారు. ప్రకాశింపజేస్తున్నారు. ఆకాశం – భూమి – మధ్య – ఆకాశభూముల అంతరం లోను, ఎనిమిది దిక్కులందు వ్యాపించి – విస్తరిల్లి ప్రకాశిస్తున్న చైతన్యం మీరే! మీ సముత్సాహ – పరమానంద స్వరూపమే సర్వే

సర్వత్రా విరాజిల్లుతోంది. హే మహాత్మా! అద్భుతమైన మీ తేజోమయ - ప్రత్యుత్సాహమయ - సర్వవ్యాపక - సర్వోత్తేజిత - విశ్వాంతర్గత - విశ్వరూపం సందర్శిస్తున్నప్పుడు ఈ ముల్లోకజీవులు భయమును పొందుచున్నారు స్వామీ!

ఆహా! ఏమి ఆశ్చర్యం!

హే మంగళస్వరూపా! ఒకవైపు అనేక దేవతా సమూహములు మీ ఉగ్ర - విశ్వాంతరాళ - జ్వాజ్వల్యమాన - ప్రళయాగ్ని సదృశ తేజోరూపంలోకి ప్రవేశించి క్షణాలలో మటుమాయమగుచున్నాయి. ఇంకొకచోట మరి కొందరు... మీ ఉగ్రరూపం చూచి భయకంపితులై సాష్టాంగదండప్రణామములు సమర్పించుకొంటున్నారు. వేరొకచోట మహర్షి - సిద్ధ సంఘములు లేచి నిలుచుని తన్మయులగుచు భక్తిపారవస్యంతో స్వస్థివచనాలు బిగ్గరగా పలుకుచున్నారు. మీ గుణసంపదను అనేక స్తోత్రములతో స్తుతిస్తూ, కీర్తిస్తూ సామగానం చేస్తున్నారు. శాంతి ప్రవచనాలు చెప్పుచున్నారు.

హే మహాత్మా! విశ్వ - విశ్వాంతరాళాలలో సముత్సాహ - సముత్తేజ - పరమానంద స్వరూపంగా జ్వాజ్వల్యమానంగా వెలుగొందుచున్న మీ చైతన్యానంద రూపం సందర్శిస్తూ ఏకాదశరుద్రులు, ద్వాదశ ఆదిత్యులు, అష్టవసువులు, సిద్ధులు, సాధ్యులు, విశ్వేదేవతలు, అశ్వనీకుమారులు, మరుత్తులు, పిత్రుదేవతలు, యక్షులు, కిన్నెరులు, గంధర్వులు, అసురులు, సిద్ధులు - వీరంతా సంఘ సంఘములుగా (In Groups and Multi Groups) నిలబడి చూస్తూ ఆశ్చర్యచకితులగుచున్నారు.

హే ప్రభూ! అసంఖ్యాక ముఖములు - కన్నులు - దృష్టులు - పాదములు - నడతలు - తొడలు - కోఱలు - నోళ్లతో కూడిన మీ విరాట్ మహత్ స్వరూపం చూచి లోక - లోకాంతర దేవతలే భయమును చెందుచున్నారు. ఇక నాకు భయం కలగటం గురించి నేను మీకు చెప్పుకోవలసినదేమున్నది?

హే విశ్వాంతరాళా! ఆకాశమును స్పృశిస్తూ - ఆకాశమును మ్రింగివేస్తూ - సర్వ దిక్కులందూ - దిక్దిశాంతములందు ప్రకాశిస్తూ అనేక

వర్ణములతో కూడినదై....., ప్రజ్వలిస్తున్న అసంఖ్యాక విశాల నేత్రములను ధరించినదై........, తెరచియున్న అనేక నోరులతో ప్రదర్శితమగుచున్న మీ విశ్వరూపము చూస్తూ ఉంటే నాకు ఇప్పుడు చెప్పలేనంత భయం కలుగుతోంది. స్వామీ! నా అల్పబుద్ధి, నాకున్న కొద్దిపాటి ధైర్యము – ఆ భయమును ఏమాత్రం కూడా ఎదుర్కోలేకపోతున్నాయి.

నాకు ధైర్యం ఏమాత్రం కలగటం లేదు. ప్రభూ!

నాకు శాంతి కలగటం లేదు స్వామీ! మహాత్మన్!

భయంకరమైన కోరలతో అంతటా – అన్నిటా కాలస్వరూపమై అగ్ని శిఖలవలె ప్రజ్వలిస్తున్న మీ ఆత్మతత్వస్వరూపమును సందర్శిస్తున్న నేను ఏ దిక్కు ఎక్కడో – ఎటువైపో ఏమాత్రం గుర్తించలేకపోతున్నాను. హే విరాట్ స్వరూపమా! నాకు దిక్కుతోటంలేదు. భయం వేస్తోంది. మనస్సు శాంతిని కోల్పోతోంది! సుఖం కలగటంలేదు! ఓ దేవదేవా! లోకాశ్రయా! మీరు నాపట్ల ప్రసన్నులవండి! ప్రభో! ప్రసన్నులుకండి!

హే భగవాన్! భయంకరమైన కోఱలతో అగ్నిజ్వాలలతో ప్రజ్వలిస్తున్న మీ ముఖంలోనికి ధృతరాష్ట్ర పుత్రులగు కౌరవసోదరులు, వైరి పక్షంలోని అనేకమంది రాజుల సమూహములు, భీష్మాచార్యులు, ద్రోణాచార్యులు, కర్ణుడు, మా వైపుగల అనేకమంది యోధాగ్రేసరులు అతివేగంగా, ఆపటానికి శక్యం కాకుండా మీలో ప్రవేశిస్తున్నారు.

కొందరి శిరస్సులు ముక్కలైపోయి మీ భయంకర కోరలందు చిక్కుకొని చూర్ణం అయిపోతూ ఉండటం నాకు కనిపిస్తోంది.

హే మహాతేజస్వీ! నదులలోని జలం సముద్రము వైపునకు అభిముఖమై అతి వేగంగా ప్రవహించి – ప్రవహించి చివరకు సముద్రజలంలో కలిసిపోతోంది చూచారా! ఆ విధంగా అనేక మంది రాజవీరులంతా ప్రజ్వలించుచున్న మీ ముఖాగ్ని వైపుకు అభిముఖులై ప్రవేశిస్తున్నారు. ఏ విధంగా అయితే మిడతల దండు మోహావేశంతో మండుచున్న అగ్నిగుండంలో ప్రవేశించి మలమల మాడి

నశిస్తాయో,... అసంఖ్యాక జనసమూహములు అగ్ని తేజస్సుతో వెలుగొందే మీ ముఖమునందు మహామోహావేశంతో తమ వినాశనముకొరకే ప్రవేశిస్తున్నాయి. ఓ మహావిష్ణూ! మండుచున్న ఆ నోళ్లతో లోకములలోని అసంఖ్యాక దేహాలన్నీ మ్రింగుతూ మీరు నాకు కనిపిస్తున్నారు. అన్నివైపులనుండి తరలి బయల్వెడలుచున్న మీ అసంఖ్యాక నాలుకలతో ఈ దృశ్యంలో కనబడే దేహాలన్నీ నాకి వేస్తున్నారు. మ్రింగివేస్తున్నారు. చప్పరించి వేస్తున్నారే! ఈ జగత్తులన్నీ మీ ప్రచండకాంతితో కూడిన తేజస్సుచే దహించివేయబడుచున్నాయే! ఎవరు మీరు?

హే సర్వసంహారకా! లయస్వరూప తేజో విభవముతోకూడియున్న స్వామీ! ఇంతకీ మీరెవరో నేను ఏమాత్రం తెలుసుకోలేక పోతున్నాను. మీరు చేస్తున్నదేమిటి? ఎందుకు చేస్తున్నారు? ఏమిటి మీ స్వభావం?

ఇంత భయంకరంగా ఈ అసంఖ్యాక దేహ సమూహాలు అతిత్వరగా ప్రవేశిస్తూ ఉండగా, వీటిని మ్రింగివేస్తున్నట్టి భయంకరాకారులైన మీయొక్క స్వరూప-స్వభావాలు, మొదలు-చివరలు ఏమిటో తెలుసుకోవాలనుకుంటున్నాను.

అసలు మీరెవరు? మీ ప్రవృత్తి ఏమిటి? మీరు చేస్తున్న కార్యమేమిటి? మీ తత్వమేమిటో తెలుసుకోవాలని అభిలాష పొందుచున్నాను. స్వామీ! అనుగ్రహించండి! నా నమస్కారము స్వీకరించండి! నా పట్ల ప్రసన్నులు అవండి!

⋆⋆⋆

**శ్రీ భగవానుడు** : ఓ అర్జునా! ఈ లోకముల ఉత్పత్తికి పరిపోషణకు - ఉపసంహారమునకు కర్త - ఆధారభూతము అయినట్టి కాలమే స్వరూపముగా కలవాడను! కాలః కాలస్వరూపుడను! కాలనియామకుడను!

*ఇప్పుడు ఇక్కడా యుద్ధరంగంలో ప్రవేశించియున్నట్టి ఈ లోకజనూను సంహారరూపంగా ఉపసంహరించే ప్రవృత్తిని ధారణ చేసినవాడను.*

అందుచేత ఈ దేహములన్నీ నాకాలగర్భంలోకి నెట్టి వేసే ప్రత్యుత్సాహమును అవధరించి యున్న నన్ను ఏదీ ఆపలేదు. నీవు యుద్ధము

చేయనని నిశ్చయించుకున్నాకూడా, ఇక్కడ మిగులగలవారు ఎవ్వరూ ఉండరు. అందరిని మ్రింగివేయటానికి ముసు ముందుగానే సంసిద్ధుడనై ఉన్నాను!

కాలస్వరూపుడనై నేను వీరందరినీ ఇప్పటికే ఎప్పుడో మ్రింగివేసియున్నాను.

ఓ సవ్యసాచీ! వీరిని సంహరించటానికి నీవు నిమిత్తమాత్రుడివి మాత్రమే! వీరి సంహారమునకు అసలు కారణం ఉపసంహారమునందు ప్రవృత్తుడనైయున్న కాల స్వరూపుడనగు నేనే! అందుచేత, "అయ్యో! నేను వీరిని సంహరిస్తున్నానే!".. అనే భ్రమను వదలు.

ఉతిష్ఠ! శత్రువులను సంహరించి కీర్తిని రాజ్యమును గడించు. నీ కర్తవ్యం నీవు నిర్వర్తించు. ఇక్కడ యుద్ధభూమిలో నిలుచున్న ఆచార్య ద్రోణుడు, భీష్ముడు, జయద్రధుడు, కర్ణుడు మొదలైన వారందరూ నాచే ఇప్పటికే సంహరించబడి యున్నారు. ఇక, ఇందులో నీవు వ్యధ చెందవలసినదేమున్నది? సర్వవ్యధలు త్యజించి నిశ్చింతగా నీ ధర్మమును నీవు నిర్వర్తించు. యుద్ధమునందు విజయం చేబూని విజయుడవై ప్రకాశించు.

☆☆☆

**శ్రీ సంజయుడు** : ఓ ధ్రుతరాష్ట్ర మహారాజా! ఆ అర్జునుడు శ్రీకృష్ణుడు పలికిన కర్తవ్యపరాయణ సమన్వితమైన వాక్యాలు శ్రద్ధగా విన్నాడు. రెండు చేతులు జోడించి స్వామికి మరల మరల నమస్కారములు సమర్పించాడు. భయముతో కూడుకొనిన గద్గదస్వరంతో ఈ విధంగా స్తోత్రం సమర్పించసాగాడు.

☆☆☆

**అర్జునుడు** : హే మహాత్మా! ఈ జగత్తుయొక్క అణువణువు మీ మహత్తర చైతన్య తత్త్వమును సంకీర్తనం చేస్తున్నది. మీ మహిమను గానం చేస్తూ జగత్తులు సంతోషమును పొందుచున్నాయి. సాత్విక స్వభావులగు జీవులు మీమహిమను సందర్శిస్తూ ఆనందిస్తూ ఉంటే, ఇక దుష్ట - రాక్షస ప్రవృత్తిని సంతరించుకొనియున్న జీవులు, మిమ్ములను చూచి భయమునకు లోను

అయినవారై నలుదిక్కులకు పరుగులు పెట్టుచున్నారు. సిద్ధ సంఘములంతా నిలబడి మీకు నమస్కరిస్తూ స్తోత్రాలు సమర్పిస్తున్నారు. స్వామీ! వారు మిమ్ములను స్థుతించటంలో ఆశ్చర్యం ఏమున్నది? ఓ అనంతా! దేవదేవా! జగత్తంతా ఆక్రమించుకొన్న జగదాధారా! మీరు సత్తు - అసత్తులకు అతీతమైన అక్షర స్వరూపులు. సృష్టికి సారభూతులు. సృష్టికర్తయగు బ్రహ్మను సృష్టించినవారు. అట్టి మీకు అందరు నమస్కరించటం సహజమేకదా!

హే భగవాన్! మీరు దేవతలకు మహర్షులకు మునుముందే ఉన్నట్టి ఆదిదేవులు! దేవాదిదేవులు! ఈ సమస్తజగత్తు మీ యొక్క ఆధారంచేతనే ఉనికిని పొందినదై ఉంటోంది. జగత్తుకు ముందే ఉన్న పురాణ పురుషులు. అసలు ఈ విశ్వరూపంగా విస్తరించియున్నది మీరే! అనంతరూపులై విశ్వముగా సాక్షాత్కరిస్తున్నది మీరే!

ఈ జగత్తుకు ఆధారభూతంగా కనిపించే వాయువు, యముడు, అగ్ని, వరుణుడు, చంద్రుడు, ప్రజాపతి మొదలైనవారంతా మీ స్వరూప విన్యాసమే! ప్రజాపతిగా, బ్రహ్మదేవునిగా వేంచేసి ఉంటున్నది మీరే! సృష్టి - స్థితి - లయ మీ లీల! మీ క్రీడ! మీ ఆనందవిన్యాసం!

స్వామీ! మీకు నమస్కారం! రెండు నమస్కారాలు! వేలవేల నమస్కారాలు! మరల మరల ఇంకా ఇంకా మీకు నమస్కరిస్తున్నాను! హే మహాత్మా! అనంతగుణ గంభీరులు, ఆది మధ్యాంత రహితులు, ఈ జగత్తుకు ఆధారము - ఉత్తేజము - జగత్ స్వరూపము అయి ఉన్నవారు మీరే! జగత్తుకు అతీతులు అగు మిమ్ములను ఇంతవరకూ "ఈతడు నా సఖుడు - మన కృష్ణుడేకదా - మన బావయే కదా!" అని భావించాను. మీయొక్క మహిమను ఎఱుగక, "హే కృష్ణా! హే యాదవా! హే సఖా!" అంటూ ప్రణయంగానో, ప్రమాదంగానో, ప్రమోదంగానో పిలుస్తూ వచ్చాను. ఏఏ అపహాస్యాలతో అనగూడని విధంగా అన్నానో, విహారంలోనో - శయ్య - ఆసన - భోజన సమయాలలోనో మనిద్దరం ఒంటరిగా ఉన్నప్పుడో.... మరికొంత మంది సమక్షంలోనో ఎగతాళిగా సంభాషించి ఉన్నానో.... అందుకు క్షమాపణలు కోరుకుంటున్నాను. నన్ను క్షమించమని ప్రార్ధన చేస్తున్నాను. హే

అప్రమేయా! నా తప్పులన్నీ మన్నించెదరుగాక!

మీరు ఏమిటో, ఎంతటివారో, ఏమై ఉన్నారో ఇప్పుడు చూచాయగా తెలుసుకుంటున్నాను. ఈ చరాచర సృష్టికంతటికీ మీరే తండ్రి, సంరక్షకులు. పూజలు సమర్పించబడవలసిన వారందరికంటే పూజనీయులు మీరే! గురువులకే గురువులై మా స్వరూపాన్ని గుర్తుచేసే సద్గురువులు మీరు! మహోన్నతమైనవాటిలో వెలుగొందే మహిమాన్వితులు! ఈ సృష్టిలో మీతో సమానమైనది మరింకేదీ లేదు. మీకు సాటి అయినవారు లేరు. ఇక మీకంటే అధికులు లేరని చెప్పేదేమున్నది? ముల్లోకములలోని అప్రతిహత ప్రభావులు మీరే! మిమ్ములను అడ్డగించకలిగేది ఎదిరించగలిగినది ఎక్కడా ఏదీ లేదు!

కాబట్టి ఈ దేహ – కర – చరణములతో మీకు సాష్టాంగ దండ ప్రణామములు చేసి నన్ను నేను పవిత్రునిగా చేసుకొంటున్నాను. హే విశ్వేశ్వరా! హే సర్వేశ్వరా! నా ఈ నమస్కారములు స్వీకరించి నాపై ప్రసన్నులు కండి! ఓ దేవదేవా! తండ్రి తనకుమారుని తప్పులు మన్నించినట్లు, స్నేహితుడు తన మిత్రుని లోపములు భరించినట్లు, ప్రియుడు తన ప్రియురాలియొక్క అపరాధములు సహించిట్లు మీరు నా తప్పులను మన్నించండి! మీరు ఉదార స్వభావులు! దాసోఽహమ్! దాసదాసోఽహమ్! క్షమోస్మి!

మీ విశ్వ – విశ్వాంతర్గత – విశ్వాతీత – నిర్వికల్ప – నిరాకార – సర్వస్వరూపమును నేను ఇతః పూర్వం చూచి ఉండలేదు. అందుచేత మీ ఈ విశ్వరూపము యొక్క సందర్శనంచేత హర్షముచే పులకిత శరీరుడను అగుచున్నాను. నామనస్సంతా అంతులేని భయంతో నిండి మహావ్యాకులత పొందుతోంది. అందుచేత చతుర్భుజములతో సుదర్శనధారులై చిరునవ్వుతో కనిపించే మీ ప్రకృతి సిద్ధమగు భౌతిక రూపసందర్శనం తిరిగి ప్రసాదించండి. ఓ దేవదేవా! నాపై ప్రసన్నత చూపండి. హే మహాత్మా! మహోగ్రమై ఈవిశ్వ – విశ్వాంతరాళములను అవధరిస్తున్న మీ విశ్వరూప సందర్శం నేను భరింపజాలకున్నాను. హే శ్రీకృష్ణా! కిరీటము ధరించి, చేతులకు గద – చక్రముల అలంకరించిన చతుర్భుజములతో ప్రశాంతమైన చిరునగువుతో నాకు

అగుపించండి. ఓ విశ్వమూర్తీ! సహస్రబాహూ! మీయొక్క సౌమ్యము - శాంతములతో కూడిన "ప్రకృతి - అంతర్గతరూపం నాకిప్పుడు తిరిగి అనుగ్రహించండి!

☆☆☆

**శ్రీ భగవానుడు** : ఓ అర్జునా! నా యొక్క పర స్వరూపమమైన విశ్వరూపం నా ఆత్మయోగం చేత నీపై కలిగిన ప్రసన్నతకు చిహ్నంగా సందర్శింపజేస్తున్నాను. తేజోమయం ఆద్యంతరహితం అయినట్టి ఈ నా విశ్వరూపమును ఇతఃపూర్వం ఎవ్వరూ దర్శించయుండ లేదు.

ఓ కురుప్రవీరా! ఇట్టి స్వకీయాత్మయొక్క విశ్వరూప సందర్శనం వేదపారాయణంచేతగాని, యజ్ఞయాగాది క్రతువులచేతగాని, దానధర్మాది క్రియలచేతగాని, ఉగ్రమైన తపస్సుచేతగాని ఈ మానవలోకంలో నీవుగాక వేరెవ్వరూ దర్శించలేరు.

ఓ అర్జునా! అన్ని వ్యధలు త్యజించు. విమూఢభావాలన్నీ వదిలివేయి! ఈ ఘోరమగు విశ్వరూప సందర్శనం చేత నీకు ఏర్పడిన భయాలన్నీ తొలగుగాక! నీవు కోరినట్లు చక్ర - గదాధారియగు ప్రకృతిసిద్ధమగు చతుర్భుజరూపం మరల సందర్శించెదవు గాక!

**సంజయుడు**: ఓ ధృతారాష్ట్ర మహారాజా! విశ్వరూపమును ప్రదర్శిస్తున్న ఆ వాసుదేవుడు అర్జునునితో ఆ విధంగా పలికారు. ప్రకృతి సిద్ధమగు చతుర్భుజరూపం ప్రదర్శించారు. సౌమ్యమూర్తి అయి అర్జునుని స్పృశించి, లాలించి సర్వభయములు తొలగించారు.

☆☆☆

**అర్జునుడు** : హే భగవాన్! శ్రీకృష్ణా! ప్రశాంతములతో కూడిన ప్రకృతి నిర్మితమగు మీయొక్క సౌమ్య మానవరూపం చూచి నేను స్థిరచిత్తుడనయ్యాను. ఇప్పుడు నేను తిరిగి నా స్వాభావిక స్థితిని పొందాను. శాంతమనస్కుడనయ్యాను.

☆☆☆

**శ్రీ కృష్ణుడు** : ఓ అర్జునా! నాయొక్క ఏ విశ్వరూపము సందర్శించావో, అది బహుదుర్లభం సుమా! దేవతలుకూడా ఈ రూపమును నిత్యసందర్శన ఆకాంక్షను కలిగినవారై ఉంటారు.

పరమాత్మను విశ్వరూపంగా, విశ్వాధారరూపంగా, విశ్వాతీత తేజోమయ రూపంగా, సకల జగత్ ఉత్తేజోత్సాహ రూపంగా, సర్వాంతర్యామిగా, సర్వాధారంగా, సర్వాప్రమేయంగా దర్శించటం ఎట్లా? ఎట్లాగో చెపుతాను విను.

నాయొక్క ఇట్టి విశ్వరూపం వేదాధ్యయనంచేతగాని, తపోదానాది తదితర ప్రయత్నములచేతగాని లభించేది కాదు. ఈ విశ్వరూపం ఏకానేక ప్రయత్నములచే లభ్యమయ్యేదికాదు.

అయితే అందుకు సులభమైన ఉపాయం ఉన్నది.

*"ఇదంతా పరమాత్మ స్వరూపమే – పరమాత్మమయమే కదా!"* అను *అనన్యభక్తి యొక్క ఆధిక్యతచే – విశ్వరూపమును సందర్శించటం తప్పక సుసాధ్యమే.* పరమాత్మనగు నాపట్ల పెంపొందిన అనన్య భక్తియే అందుకు సుమార్గం కూడా!

భక్తియొక్క ప్రవృద్ధిచే "ఇదంతా పరమాత్మయొక్క విన్యాస చమత్కారమే" అనే జ్ఞానం ప్రవృద్ధమౌతుంది.

అట్టి జ్ఞానం (సర్వంఖల్విదం బ్రహ్మ – అను అవగాహన) క్రమంగా "జగత్తంతా పరమాత్మయే" ... అనే దృష్టిని పటిష్ట పరుస్తుంది. పెంపొందిస్తుంది. విశ్వమంతా భగవత్ ప్రేమ స్వరూపంగా అనుభవమౌతుంది.

అప్పుడాతడు ఆ అనన్యభక్తి – ఆత్మజ్ఞానము – ఆత్మసాక్షాత్కరములచే విశ్వరూపమునందు ప్రవేసితుడై విశ్వమే తన రూపంగాను, తన ఆత్మయే విశ్వాధారమైనది – అప్రమేయమైనదిగాను సందర్శిస్తూ ఆస్వాదించగలడు.

అందుకుగాను అతిసులభమగు ఒకానొక విధి – విధానం నీముందు, సర్వజనులను ఉద్దేశించి ప్రవచిస్తున్నాను. విను.

1. **మత్‌కర్మకృత్** : సర్వకర్మలు సర్వాత్మకుడనగు నాకొరకై ఉద్దేశ్యించి నిర్వర్తించు.

2. **మత్‌పరమో** : సర్వాత్మకుడనగు నన్నే నీ బృహత్ లక్ష్యంగా కలిగియుండు. మహదాశయుడువై, మహాశయుడవై నీస్వధర్మములు నిర్వర్తించు.

3. **సంగవర్జితః** : సర్వ సంగములు (All Attachments to worldly matters incidents and persons) మనస్సునుండి మనస్సుద్వారా త్యజించు.

4. **మద్భక్తః** : విశ్వప్రేమద్వారా విశ్వేశ్వర ప్రేమను అలవరచుకో.

5. **నిర్వైరః** : సర్వతదితర జీవులపట్ల మనస్సులోని వైషమ్యమును తొలగించుకో.

6. **సర్వభూతేసు యః స మామేతి** : సర్వ సహజీవులలో సర్వదా సమస్వరూపమై వేంచేసియున్న శ్రీకృష్ణ చైతన్య తత్వమును ఉపాసించు. ఆస్వాదించు.

అప్పుడు ఈ దేహాత్మభావమును అధిగమించి జన్మ కర్మరహితమగు విశ్వాత్మ భావమును సముపార్జించుకోగలవు.

*ఇతి భాగవద్గీతా... విశ్వరూప సందర్శన యోగ పుష్పః*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

★★★

శ్లో॥ శ్రేయో హి 'జ్ఞానమ్' అభ్యాసాత్, జ్ఞానాత్ 'ధ్యానం' విశిష్యతే
ధ్యానాత్ 'కర్మఫలత్యాగః', త్యాగాత్ 'శాంతిః' అనంతరం ॥
– అభ్యాసాత్ జ్ఞానమ్ శ్రేయః। జ్ఞానాత్ ధ్యానమ్ విశిష్యతే।
ధ్యానాత్ కర్మఫలత్యాగః (విశిష్యతే)।
హి, త్యాగాత్ అనంతరమ్ శాంతిః సముపార్జతే ॥

అభ్యాసం కంటే కూడా జ్ఞానం గొప్పది. జ్ఞానము కంటే ధ్యానము గొప్పది. ధ్యానముకంటే కర్మఫలత్యాగము మరింత గొప్పది. త్యాగముచే శాంతి లభిస్తోంది.

# 12

# భక్తియోగ పుష్పం

**అర్జునుడు** : హే భగవాన్! మీరు అనుగ్రహించిన విశ్వరూపసందర్శనముచే మీయొక్క అవ్యక్త – అక్షర – సర్వాంతర్యామి – సర్వాతీత – కేవలీ స్వస్వరూపం వీక్షించగలిగాను. అట్టి మీ విశ్వాంతర్గత విశ్వాతీత విశ్వరూపమును మహర్షి – సిద్ధ సంఘములు స్వస్థిగానములతో స్తోత్ర – ఉపాసన – ప్రపత్తులు సమర్పించటం విశ్వరూప సందర్శన సమయంలో నేను చూడటం జరిగింది.

అయితే, అనేకానేకమంది మీయొక్క ప్రత్యక్షము – వ్యక్తము – లౌకికము – ప్రేమాస్పదము – అవతారమూర్తిత్వము – శంఖ – చక్రధారణ సమన్వితము అగు ప్రకృతిసిద్ధ రూపమును ఉపాసిస్తున్నారు. మీ లీలలు గానం చేస్తున్నారు. పూజ – రూప – భావనలతో భక్తి – ప్రపత్తులు సమర్పిస్తున్నారు. (గోపికలు మీ ఈ సౌమ్యరూపము చూచి తరిస్తున్నారు.)

ఇప్పుడు ఒక విషయం మిమ్ములను అడుగ తలుస్తున్నాను.

ఎవ్వరైతే మీ ఈ భౌతిక నామ - రూప - గుణ సమన్వితమై ప్రకృతిసిద్ధమైన సౌమ్య - భౌతిక రూపమును భక్తి - గాన - ప్రపత్తులతో పూజ - అర్చన మొదలైనవి సమర్పిస్తూ అనునిత్యమైన నిష్ఠతో ఉపాసిస్తున్నారో ... వారి భక్తియోగం గొప్పదా? లేక..., మీయొక్క విశ్వమంతా స్వరూపముగాగలది, ఒకనామ - రూపములచే పరిమితముగానిది, నామరూపములన్నిటికీ ఆధారమై 'ఇది' అని వాక్కుతో నిర్వచించజాలనిది, అవ్యక్తము..... అగు నిరాకార బ్రహ్మమును ఉపాసించువారి భక్తియోగం ఉన్నతమైనదా?

సాకార - నిరాకార ఉపాసనల విషయమై సాకారోపాసకులు గొప్పవారా? నిరాకారోపాసకులు గొప్పవారా?

**శ్రీ కృష్ణుడు** : ఓ అర్జునా! ఎవ్వరైతే ఈ ప్రకృతి సిద్ధము - సాకారము అగు భౌతికం రూపమును ఏకాగ్రచిత్తముతో - మనసంతా నిలిపి ఉత్తమమైన శ్రద్ధతో అనన్యంగా ఉపాసిస్తారో... వారి ఉపాసన సులభము - ఉత్తమము అని నా అభిప్రాయం.

అయితే, ఎవ్వరైతే "అక్షరము (Changeless), అనిర్దేశ్యము (Cannot be defined by Terminologies), అవ్యక్తము (That which manifests all else while itself being unmanifested), సర్వత్రగము (సర్వ వ్యాపకము - That which is extending itself as all these forms), అచింత్యము (ఆలోచనలకు - ఊహలకు మనస్సుకు కూడా అందనిది), కూటస్థము (సర్వ సమయములందు యథాతథము). - అచలము (It has no movement from place to place), ధ్రువము (constant) అగు పరబ్రహ్మ తత్త్వమును అనునిత్యంగా ఉపాసిస్తున్నారో... వారు కూడా నన్నే పొందుచున్నారు. అట్టివారు ఈ ఇంద్రియ విషయములను నియమించినవారై అధిగమించినవారై, సర్వే సర్వత్రా ఆత్మబుద్ధి - అద్వితీయ బ్రహ్మ భావమును పెంపొందించుకొనుచుండగా, వారుకూడా నన్ను చేరుచున్నారు సుమా!

సాకార బ్రహ్మోపాసకులు – నిరాకార బ్రహ్మోపాసకులు పొందుచున్న స్థానం–స్థితి ఒక్కటే అయి ఉన్నది.

కానీ, ఒక్కవిషయం! సాకార బ్రహ్మోపాసన (భగవంతుని నామ – గుణ – రూపాత్మకంగా అనునిత్యంగా ఉపాసించటం) నిర్వర్తించే యోగుల మార్గము సులభము అని నా అభిప్రాయం ప్రకటించాను కదా! ఎందుచేతనంటావా? "నాకు దేహం – నామ రూపములు – ఆకారము ఉన్నాయి"... అను సంస్కారము కలవారికి సాకారబ్రహ్మోపాసనయే సులభం. నామ రూపాత్మక జగత్తులో "నేను – తదితరులు సాకారులము" అను స్వభావముగలవారికి నిరాకార – నిర్గుణ పరబ్రహ్మోపాసన అనేక క్లేశములతో కూడినదై ఉంటుంది. *ఉభయమార్గములు ఒకే ప్రయోజనమును కలుగజేస్తున్న సందర్భంలో సులభమైన మార్గం ఎన్నుకోవటం లోకన్యాయంకదా!* కష్టములతో కూడిన మార్గములో ప్రయాణించటం ప్రసిద్ధమైన విషయం కాదుకదా! దేహధారులకు అవ్యక్తబ్రహ్మోపాసన క్లేసములతోకూడినది, కష్టసాధ్యము కూడా!

దేహమున్నంతవరకు దేహపరిపోషణ – దేహదార్ఢ్యముకొరకై కర్మలు అనివార్యంకదా! దృశ్యజగత్తును తిరస్కరిస్తూ "నిర్గుణ పరబ్రహ్మఉపాసన" అనే శ్రమతోకూడిన ప్రయత్నము యొక్క అవస్యకత్వం (inevitability) ఏమున్నది చెప్పు? ఎవ్వరైతే సర్వకర్మలు "నా ఇష్టదైవమును ఉపాసించే ప్రయత్నంలో అంతర్భాగంగా నిర్వర్తిస్తున్నాను" అను భావన – సంకల్పములతో నిర్వర్తిస్తారో... అట్టి కర్మలు వారికి ప్రతిబంధకములు కాకపోగా, అవి సాధనలుగా రూపుదిద్దుకుంటున్నాయి. అందుచేత అర్జునా! ఎవ్వరైతే వారివారి సర్వ కర్మలు నాకు సమర్పిస్తూ, నన్ను ఉద్దేశిస్తూ నన్ను పొందవలెననే ఆశయంతో నిర్వర్తిస్తూ ఉంటారో, "సర్వ కర్మలు – సాధనములు – వాటి ప్రయోజనములు ఇష్టదైవరూపమే" .. అను ధ్యానంతో ఉపాసనా పూర్వకంగా అనువర్తిస్తారో,... *వారి రక్షణ భారం నేను వహిస్తున్నాను. సాకారోపాసన నిరాకారంలోకి లయిస్తోంది. నిరాకారం జగదాకారోపాసనగా పరిణమిస్తోంది.*

ఓ ఫల్గుణా! ఈ జీవుడు జన్మ పరంపరలు పొందుచున్నాడు. కనబడే దృశ్యంలో పరిభ్రమిస్తున్నాడు. తదాత్మ్యము చెందుచున్నాడు. ఇంతలోనే మృత్యువు సమీపించగానే "అయ్యో! ఏవేవో పోగొట్టుకొంటున్నానేమో? ఈ ధన జన-వ్యవహారములు సంగతేమిటిరా?" అని అనుకుంటూ ఉండగా అనివార్యమగు దేహపతనం ఈ జీవుని పట్ల జరుగుతోంది. అనేక ఆశలు - భావాలు - దుఃఖాలు - వేదనలు - నమ్మకములు - భ్రమ - కామ - క్రోధ - లోభములు మూటకట్టుకొని దేహం త్యజించిన ఈ జీవుడు మరల **మరొక *దేహం ఆశ్రయించి సంస్కారపరంపరలు మూట విప్పుచున్నాడు.*** ఈ విధంగా జన్మ - మృత్యు - పునర్జన్మ పరంపరావ్యవహారములు జనించి - గతించిపోతూ ఉండగా సాగర తరంగములలో చిక్కిన కొయ్యముక్కవలె ఈ జీవుడు ఆ జన్మ - కర్మలలో దిక్కుతోచక చిక్కుకుంటున్నాడు. అందుచేత, ఎవరైనాసరే సర్వకర్మలు నాకు సమర్పిస్తూ - నన్ను ఉద్దేశిస్తూ అనన్యయోగంతో... (అంతా పరమేశ్వర చమత్కారమే! సుప్రదర్శనమే!" - అను అవగాహనతో) ఉపాసిస్తూ ఉంటారో, నేను ఆ ఉపాసకుణ్ణి మృత్యుసంసారగమునుండి త్వరితగతిగా సముద్ధరిస్తున్నాను సుమా!

అందుచేత అర్జునా! ఉపాసన చేబూనిన జనులను ప్రోత్సాహపరుస్తూ, వారి సముద్ధరణ మార్గమును అభివర్ణిస్తూ ఇక్కడ కొన్ని విశేషాలు భక్తిమార్గ విశేషాలు (Qualities of Celestial love)గా చెప్పుచున్నాను. నిరుత్సాహము - తాత్సారములను అధిగమించి నేను సూచిస్తున్న మార్గమును అనుసరించి ఈ మృత్యు సంసార దుఃఖములను (Worries of Series of Births and Deaths) అధిగమించవలసినదిగా ప్రేమాస్పదుడనై ప్రబోధిస్తున్నాను. విను.

☆☆☆

*(1) అంతరంగ నివేదన :*

ఓ అర్జునా! *నీ మనసంతా నాపై నిలుపు. సుస్థిరంగా ఉంచు. బుద్ధిని నాపై లగ్నం చేయి. ఇకప్పుడు నీవు నాయందే ఉంటావు.* మనస్సు - బుద్ధి

నాపై నిలిపావా, నావిశ్వరూపమును నీవు స్వభావ సిద్ధంగా దర్శించగలవు. ఈ సంసారము నిన్ను స్పృశించదు. నా అఖండానందమయ స్వరూపం ఆస్వాదించగలవు. ఇందులో సందేహమునకు తావులేదు సుమా!

*(2) అభ్యాసయోగం :*

ఒకవేళ "మనస్సు - బుద్ధి" నాయందు స్థిరంగా నీవు నిలుపలేకపోతున్నావా? అట్లా అయితే ఒక ఉపాయం చెపుతాను, విను. జరిగిందేమో జరిగిపోయింది. జరిగిపోయిన దానిగురించి విచారించకు. *ఇప్పుడు భక్తి - జ్ఞాన - యోగాది మార్గములలో బుద్ధి నిశ్చలంకాగల శాస్త్ర ప్రవచిత - ప్రబోధితమైన యజ్ఞ - యాగ - క్రతు - నియమాలకు అభ్యాసములకు ఉపక్రమించు. ఏఏ అభ్యాసాలచే నీ బుద్ధి అపరిపక్వంగాను, మనసుచంచలముగాను అగుచున్నాయో గమనించి శాస్త్రప్రవచనానుసారం ఉత్తమ అభ్యాసాలను ఆశ్రయించు.* నన్ను పొందాలనే ఇచ్ఛను ప్రవృద్ధం చేసుకో. క్రమంగా నీ మనస్సునాపై నిలుస్తుంది. బుద్ధి సుస్థిరం పొందుతుంది.

*(3) భాగవదోపాసన :*

ఒకవేళ శాస్త్రార్థ ప్రతిపాదితమైన అభ్యాసాలు ఉపక్రమించటానికి కూడా నీకు కుదరటంలేదా? అప్పుడు *భగవత్ సంబంధమైన కార్యక్రమములతో నిన్ను నీవు నియమించుకో. నోటితో స్తోత్రాలు, కళ్లతో భగవత్ - భాగవత సందర్శనాలు - గురుసేవ మొదలైన కార్యక్రమములు నిర్వర్తించనారంభించు.*

*(4) స్వకర్మ పుష్ప సమర్పణ :*

భగవత్ ఉపాసన సంబంధమైన కార్యక్రమమును నిర్వర్తించటానికి కూడా సమర్థత పొందలేక పోతున్నావా? అయితే మరొక ఉపాయం. నీవు ఏఏ *కర్మలు అనివార్యంగా నిర్వర్తించ వలసివస్తోందో అవన్నీ నాకు సమర్పించు. "ఓ సర్వాంతర్యామీ! నేను చేస్తున్న ఈ లోకసంబంధమైన కార్యక్రమములన్నీ - కర్మలన్నీ క□డా కర్మయోగ పుష్పములై మీ పాదాలు చేరునుగాక"* అని భావన

చేసి అప్పుడు నీవు చేయవలసియున్న నియమిత – అనివార్య కార్యక్రమములకు ఉపక్రమించు.

ఓ అర్జునా! కేవలం చేతులు – కాళ్లతో చేసే కర్మలకంటే బుద్ధి నియామకమగు వివేకముతోకూడిన జ్ఞానం గొప్పది. ఆత్మ – అనాత్మ, నిత్య–అనిత్య, దృశ్య–ద్రష్ట, దేహి–దేహముల – (ఇట్టి) విభాగముల విచారణ కర్మలకంటే శ్రేయోదాయకం.

అయితే, జ్ఞానం కంటే 'ధ్యానం' అధికమైనది. కేవలం శాస్త్రవిచారణ – శాస్త్ర పాండిత్యము సరిపోదుకదా! ***ధ్యాసయే ధ్యానం.*** సర్వము ఆత్మస్వరూపంగా సందర్శించగల ధ్యాస ప్రవృద్ధం కావాలి అందుచేత జ్ఞానంకంటే ధ్యాస (ధ్యానం) ఉత్తమం.

'ధ్యానం' కన్నా కూడా 'కర్మఫల త్యాగం' మరికొంత ఉత్తమం. సర్వకర్మలు భగవత్ సేవా భావంగా సమర్పితబుద్ధితో నిర్వర్తించటం మరింత శ్రేయోదాయకం, సులభంకూడా! సర్వము పరమాత్మమయంగా భావన చేసి నిర్వర్తించటం "కర్మఫలత్యాగం" అవుతుంది.

## భక్తియోగ లక్షణాలు (The Characteristic Features of Celestial Love):

ఓ అర్జునా! భక్తియోగంతో నన్ను ఆశ్రయించే వారు నాకు అత్యంత యిష్టులు అగుచున్నారు సుమా! అందుచేత ఇప్పుడు భక్తియోగలక్షణాలు వివరిస్తున్నాను. ఈ లక్షణాలు పెంపొందించుకొనేవారంటే నాకు ప్రియము. వారు పరమానంద స్వరూపుడనగు నాకు క్రమక్రమంగా దగ్గిరగుచున్నారు.

1. **అద్వేష్టా సర్వభూతానామ్** : "సర్వము పరమాత్మస్వరూపము అయి ఉన్నది కదా"... అను భావనను ప్రవృద్ధపరచుకొని, తద్వారా ద్వేషభావాలు పొలత్రోలివేసుకోవాలి. ద్వేషభావాలు పరమాత్మకు ఈ జీవుని దూరం చేస్తున్నాయి. "సంగతులు – సంఘటనలు – సందర్భములు – సమయోచితములు – సాంగత్యములు – సంయోగములు – వియోగములు – సంక్లేశములు – అంతా

పరమాత్మచమత్కారమే"... అను ప్రత్యాహార భావనలచే ద్వేషం తొలగుతూ వస్తోంది. తద్వారా పరమాత్మ యొక్క సామీప్యత సుగమమౌతోంది.

2. **మైత్రః** : సర్వదేహాలు ప్రకృతిచే ప్రసాదించబడి పరిపోషించ బడుచున్నాయి. ఇది గుర్తెరిగి సహజీవులపట్ల స్నేహభావమును పెంపొందించుకో. అప్పుడు సర్వాంతర్యామి యొక్క సామీప్యత సంపాదించుకో గలవు. సర్వము పరమాత్మస్వరూపంగా – స్వభావంగా – చమత్కారంగా దర్శించటానికి స్నేహభావాలు ఉపకరణాలు అవుతాయి. ద్వేషభావాలు అపకరణాలు అగుచున్నాయి. క్రమంగా స్వభావసిద్ధమైన స్నేహభావ సంస్కారాలు "సర్వము పరమాత్మయే" అను విశ్వరూపసందర్శనం సులభం చేస్తున్నాయి.

3. **కరుణయేవ** : సహజీవులపట్ల అవ్యాజమైన కరుణను (Kindness) హృదయంలోను – దృష్టిలోను – సంభాషణలోను – ప్రవర్తనయందు పరిపుష్టి చేసుకోవటంచేత ఈ విశ్వము క్రమంగా ప్రియాతిప్రియమైన పరమాత్మ ప్రదర్శనంగా అవగాహన అవగలదు.

4. **నిర్మమో** : "నాది" అని అనుకుంటే, – ఆ 'నా' అనుకున్నదంతా బంధమౌతుంది. "సర్వము పరమాత్మ యొక్క దివ్యకళామయము".. అని అనుకుంటే బంధంతొలగుతుంది. జగత్తు పరమాత్మ స్వరూపంగా సాక్షాత్కరిస్తుంది. ఈ దేహము – అద్దాని నిర్మాణము – భౌతిక తత్వాలు మొదలైనవన్నీ ఈ జీవుడు తన లౌకిక తెలివి తేటలతో తయారుచేసుకున్నది కాదుకదా! కనుక అంతా పరమాత్మవే! ఇది గ్రహిస్తూ – క్రమంగా మమకారం తగ్గుముఖం పట్టుచుండగా ఆనందమయమగు పరమాత్మస్థానం సులభతరమౌతోంది.

5. **సమ 'దుఃఖ –సుఖమ్'** : సుఖదుఃఖాలు మనోబుద్ధుల స్వకీయ నిర్వచనాలు. నాటకం చూస్తూ అందులోని సుఖ – దుఃఖ భావాలు

తాను పొంది అనుభవించటం - మననం చేయటం ఎటువంటిదో, జీవితంలోని సుఖ -దుఃఖాలకు సమత్వం కోల్పోవటం - మననం చేయటం అటువంటిది. "సుఖ దుఃఖాలు అందరికీ ఉంటాయి. అవన్నీ జీవిత పాఠశాలయొక్క పాఠ్యాంశాలు మాత్రమే! కనుక సుస్వాగతం"... అను భావనచే సమత్వాన్ని కాపాడుకొన్నవారు జగత్తును పరమాత్మగా సందర్శించటానికి అర్హులగుచున్నారు.

6. **క్షమీ** : సహజీవుల తప్పులెన్నటం, దూషించటం మొదలైనవి అనేక మనోభ్రమలకు కారణమై పరమాత్మ సందర్శనమును మరింత దూర - దూరం చేయగలదు. *"పరమాత్మా! క్షమించు" అని వేడుకొనువాడు తాను క్షమాగుణం కలిగి ఉండాలి కదా?*

7. **యోగీ** : సంయోగ - వియోగములకు అతీతత్వము వహించినవాడవై యుండు. ఈ జగత్తులో అనుకున్నవి - అనుకోనివి జరిగినా - జరుగకపోయినా యోగి సర్వదా ప్రశాంతచిత్తుడై ఉంటాడు.

8. **సతతం సంతుష్టః** : అర్జునా! సర్వదా సంతోషము - సంతృప్తిలకు కారణాలను ఆశ్రయించి ఉండు. "పరమాత్మా! ఇవి ఇవి నాకు ప్రసాదించావు. సంతోషము" అను భావనను అభ్యాసపూర్వకంగా అలవరచుకోవాలేగాని, "ఇది ఇంతేనా? ఇంకా ఏమీ లేదా? అయ్యో?"... అను అసంతృప్తిని దరిచేయనీయకూడదు.

9. **యతాత్మా** : మనస్సును - ఇంద్రియములను నియమించి నిగ్రహం అభ్యసించు. ఇంద్రియ నిగ్రహము లేనివానిక అల్పవిషయాలుకూడా బాధిస్తాయి.

10. **దృఢః నిశ్చయః** : శాస్త్ర వాక్య - శాస్త్ర ప్రవచిత సాధనములందు, అనుభవజ్ఞులగు గురువుల ఉద్దేశ్యములందు, స్వాత్మస్వరూపంపై దృఢమైన విశ్వాసము - నిశ్చయము పెంపొందించుకుంటూ ఉండాలి.

11. **మయ్యర్పిత మనోబుద్ధి** : నీ మనస్సు – బుద్ధి సర్వాధార స్వరూపుడను అగు నాకు సమర్పించినవాడవై ఉండు. "ఈ మనోబుద్ధులు కూడా పరమాత్మ విన్యాసమే కదా!"... అను అవగాహన కలిగినవాడవై ఉండు.

12. **నోద్విజతేలోకే** : ఎవరైతే తదితర జీవులకు క్షోభ – బాధ కలిగించరో,... అట్టివాడు తదితర జీవులను పరమాత్మ స్వరూపంగా ఆస్వాదించటానికి, ఆత్మసాక్షాత్కారమునకు ముందుకు అడుగులు వేయగలుగుతాడు. కనుక ఇతరులను మాటలతో – చేతలతో ఉద్వేగ ఆవేశాలు కలిగించటం బాధించుటం – భయపెట్టటం మొదలైనవి త్యజిస్తూరావాలి.

13. **యః లోకాత్ న ఉద్విజతే** : ఎవ్వడైతే ఇతరులను చూచి, వారి వ్యవహార – అనువర్తనములను జూచి తాను వ్యథ చెందడో, అట్టివాడు శ్రీకృష్ణ చైతన్యతత్వాన్ని ఆస్వాదించగలడు. తదితర జీవుల వర్తనములు మాయా బద్ధములు అయి ఉండటం చూచి తాను ఆశ్చర్యపడవలసినదేమున్నది? జ్ఞానులను చూచి ఆశ్చర్యపడతాం. పాఠశాలలో తక్కువ శ్రద్ధగలవారే అధికంగా ఉండటం లోకరీతియే కదా! అధికులలో అజ్ఞానం ఉండటంలో ఆశ్చర్యమేమున్నది? అందుచేత పరమాత్మకు ప్రియం కావాలనుకొనేవాడు లోకాన్ని చూచి ఉద్వేగపడడు. అట్టివాడు నాకు ప్రియమగుచున్నాడు.

14. **యః హర్ష – అమర్ష – భయ – ఉద్వేగైః ముక్తో** : ఎవ్వడైతే భూషణ – దూషణ – భయ – ఉద్వేగములను (Over appreciation - Hatred - Fear - Emotion) తగ్గించుకొనే ప్రయత్నంలో ఉంటాడో, అట్టివాడు సత్యవస్తు దర్శనమునకు సంసిద్ధతను పెంపొందించుకొనువాడై ఉండగలడు. అట్టివాడు నాకు ఇష్టుడు.

15. **అనపేక్ష** : ఈ ప్రాపంచక వస్తు – సంఘటన – వ్యవహారాదులపై 'ఆకాంక్ష – ఆపేక్ష' లేనివాడవై సర్వము చరాచరసృష్టికర్తయొక్క సృష్టి

చమత్కారంగా, పరమాత్మకు చెందినదిగా దర్శించేవాడు నాకు ఇష్టుడు అగుచున్నాడు.

16. **ఉదాసీనో** : చేయవలసినది చేయి. జరుగవలసినది జరుగుతూ ఉంటుంది. ప్రశాంతచిత్తుడవై చూస్తూ ఉండు. సర్వము జగన్నాటక సూత్రధారినగు నా వినోద రచనయే అయి ఉండగా ఆదుర్దా - ఆవేదనలు ఎందుకు? సర్వత్రా సమబుద్ధితో పరమాత్మ విన్యాసంగా చూచేవాడు పరమాత్మత్వాన్ని దర్శించగల పవిత్రదృష్టిని సముపార్జించుకుంటున్నాడు.

17. **గతవ్యధః** : దేనికీ 'వ్యత' చెందకు (Get rid of all worries). వారి గురించి - వీరి గురించి వ్యధచెందుతూ మనో బుద్ధులను వ్యధతో నింపటం వృధా ప్రయాస - కాలయాపన కదా! అందుచేత మనోబుద్ధులను 'వ్యధ' అనే నిమ్నమార్గము నుండి మరల్చు. ఉత్సాహము - సంతోషము - ధృతిలను అలవరచు.

18. **సర్వారంభపరిత్యాగి** : సర్వకార్యములను నిర్వర్తిస్తూనే, వాటి ప్రయోజనములపట్ల అభిలాష - ఫలానుభవావేశము లేకుండా ప్రశాంతచిత్తుడవై మహదాశయంతో, సమర్పితభావంతో కర్మయోగివై కర్మలు చేయి. కర్మలు నిర్వర్తిస్తూ కర్మరహితుడవై - కర్మాతీతుడవై ఉండు. సర్వ సంబంధములు కలిగి ఉంటూనే అప్రమేయత్వం ఆస్వాదిస్తూ ఉండు. అట్టివాడు నాకు ప్రియం కలిగిస్తున్నాడు.

19. **యో న హృష్యతి : న ద్వేష్టి : న శోచతి : న కాంక్షతి**: ఎవ్వడైతే దేనికీ హర్షించడో, దేనినీ ద్వేషించడో, దేనికీ దుఃఖము - వ్యధ పొందడో, దేనినీ కాంక్షించడో అట్టివాడు నాకు ఇష్టుడగుచున్నాడు.

20. **శుభాశుభ పరిత్యాగీ** : ఎవ్వరైతే ఈ ప్రపంచములోని శుభ - అశుభములకు బద్ధుడవక, వాటికి అతీతుడై సమత్వమును అధిరోహించినవాడై ఉంటాడో,.... అట్టి వాడు నాకు ఇష్టుడు.

21. **సమః శత్రేచ - మిత్రేచ** : "నాపట్ల శత్రుత్వము - మిత్రత్వము వహించినవారిరువురు పరమాత్మస్వరూపులే"... అను అవగాహన - అభిప్రాయము పెంపొందించుకొన్నవారు నాకు ఇష్టులు.

22. **తదాా మానవమానయోః** : జీవితములో సందర్భపడే గౌరవము - అవమానము ఒకేతీరుగా స్వీకరింస్తూ సమత్వము అవధరించువారు పరమాత్మకు ప్రియులు అగుచున్నారు.

23. **సమః శీతోష్ణ సుఖదుఃఖేషు** : శీత - ఉష్ణములను, సుఖ-దుఃఖములను సమానంగా స్వీకరించువాడు ఆత్మతత్త్వాస్వాదనకు అర్హతను అధికం చేసుకుంటున్నాడు.

24. **సంగవివర్జితః** : దేనితోనూ సంగము (Attachment) కలిగియుండనివాడు పరతత్వమును సులభంగా అభ్యసించ గలుగుచున్నాడు. ఆతడు, "నేను ఈ జగత్తుకు సంబంధించినవాడను కాను. జగత్తు నాకు సంబంధించినది కాదు." అని గ్రహించియుండి, సంగరహితుడై ఈ జగత్తులో చరిస్తూ ఉంటాడు.

25. **తుల్యో నిందా-స్తుతి** : ఈ దృశ్య జగత్తులో సంప్రాప్తిస్తున్న నిందా - స్తుతులను పొగడ్త - తెగడ్తలను ఈ ప్రపంచానికే వదలివేసి ఉంటున్నవాడు పరమాత్మ సందర్శనముపై ధ్యాస నిలుపుకో గలుగుచున్నాడు.

26. **మౌని** : ప్రాపంచక సర్వ విషయముల గురించి, సమాచారముల గురించి మౌనం వహించియున్నవాడు దీనికి అతీతుడు కాగలడు. "ఇవన్నీ ఇట్లా ఉండటం సహజమే" అను భావనచే వాటిపట్ల మౌనం వహించినవాడు అగుచున్నాడు. "సరే! కానీ! ఏది ఎట్లైతే ఏమి విశేషం!" అను అవగాహన కలవాడు "మౌనాభ్యాసి" అగుచున్నాడు. అట్టివాడు "ముని" అని పిలువబడుచున్నాడు.

27. **సంతుష్టో** : సంతోషమును – సంతృప్తిని అలవాటు చేసుకొని యున్నవాడు.

28. **అనికేతః** : నివసించుచున్న స్థానముపై – ప్రదేశముపై మమతారహితుడై యున్నవాడు.

29. **స్థిరమతిః** : పరమాత్మపట్ల స్థిరమైన బుద్ధిని పెంపొందించుకున్నవాడు.

ఓ అర్జునా! ఇప్పుడు నేను చెప్పిన లక్షణములతో కూడిన స్వభావమును పర్యుపాసిస్తూ నాపట్ల భక్తి – శ్రద్ధలను పెంపొందించుకుంటున్నవాడు నాకు ఎంతో ప్రియుడు అగుచున్నాడు.

*అట్టి భక్తునకు నేను అత్యంత సమీపుడనై ఉంటాను.*

*ఇతి భగవద్గీతా... భక్తియోగ పుష్పః*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

★★★

శ్లో॥ సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్ ।
వినశ్యత్సు అవినశ్యంతం యఃపశ్యతి స పశ్యతి ॥

యః వినశ్యత్సు సర్వేషు భూతేషు → పరమేశ్వరమ్ ....
అవినశ్యంతమ్ – సమమ్ తిష్ఠంతమ్ పశ్యతి
సః స(త్) (సత్యం) పశ్యతి ॥

ఈ కనబడే వినాశవంతమగు దేహాలలో సర్వదా సమముగా అవినాశవంతమై వేంచేసియున్న పరమేశ్వరుని ఎవరైతే దర్శిస్తూ ఉంటారో, ....వారే సత్యమును సందర్శించుచున్నవారగుచున్నారు.

# 13.

# క్షేత్ర – క్షేత్రజ్ఞ విభాగయోగ పుష్పం

**అర్జునుడు** : హే కేశవా! ఇప్పుడు కొన్ని ద్వంద్వపదజాలరూపమైన అధ్యాత్మశాస్త్ర ప్రవచిత శబ్దార్థాలు మీ వద్ద విని తెలుసుకోవాలనుకుంటున్నాను.

1. **ప్రకృతి ...... పురుషుడు**
2. **క్షేత్రము...... క్షేత్రజ్ఞుడు**
3. **జ్ఞానము..... జ్ఞేయము**

ఇవి వివరించమని ప్రార్థిస్తున్నాను.

**శ్రీకృష్ణుడు** : కౌంతేయా! చెప్పుచున్నాను. విను. ఈ శరీరమును 'క్షేత్రము' అని పిలుస్తున్నారు. ఈ శరీరమునందు ఉండిఉన్నదై, "ఏదైతే" – తెలుసుకొంటోందో... ఆ తెలుసుకొనే తత్వము 'క్షేత్రజ్ఞుడు' (That which is knowing) అని చెప్పబడుతోంది. అనగా ....,

1. తెలియబడుచున్నది + 2. తెలుసుకొనుచున్నది

క్షేత్రము + క్షేత్రజ్ఞుడు

ఓ అర్జునా! ఇంతవరకు "నన్ను గ్రహించు. నన్ను ఆశ్రయించు. నన్ను శరణువేడు. నన్ను సందర్శించు"...ఇత్యాదిగా చెప్పుచున్నాను కదా!

→ ఈ సర్వదేహములు క్షేత్రములు!

→ ఈ సర్వక్షేత్రములలోని క్షేత్రజ్ఞుడను నేనే!

"ఇది నేను - ఇది నా పొలము" అని యజమాని చెప్పుకుంటాడుగాని, "ఈ పొలమే నేను" అని అనడుగదా! అట్లాగే "క్షేత్రము - క్షేత్రజ్ఞుడు" అనబడు రెండిటినీ వేదాంతశాస్త్రవేత్తలు విభజించి నిర్వచించి చెప్పుచున్నారు. 'జ్ఞానము' అనగా ఈ క్షేత్రము - క్షేత్రజ్ఞులను వేరు - వేరు చేసి చూపుతూ ప్రబోధించే శాస్త్రప్రవచనం! అదియే వేదాంతసారం!

ఇప్పుడు ఈ క్షేత్రము ఎట్టిదో ఎట్లా కనబడుచున్నదో, ఏఏ ఆకార - వికారములు కలిగియున్నదో, ఏమై ఉన్నదో, ఎట్టి ప్రభావము కలిగియున్నదో మునుముందుగా సంక్షిప్తంగా చెప్పుచున్నాను.

అనేకమంది ఋషులు ఈ క్షేత్రము - క్షేత్రజ్ఞుల గురించి, క్షేత్రము యొక్క నిర్వచన - ప్రభావాదులగురించి ఎంతగానో గానం చేస్తు మనందరికీ గుర్తు చేస్తున్నారు. వేదములలో అనేక విభాగములందు అనేక రీతులుగా ఇది వివరించబడింది. బ్రహ్మసూత్రములు హేతుబద్ధంగా యుక్తియుక్తంగా ఈ క్షేత్ర - క్షేత్రజ్ఞ విభాగములను విశదీకరించింది. ఇక విను చెపుతాను.

**క్షేత్రము :**

"ఈ శరీరమే క్షేత్రము" అని చెప్పియున్నాను కదా! అయితే 'క్షేత్రము' అంటే ఈ కనబడే కాళ్లు - చేతులు - ముఖమేనా? కాదు.

1. **మహాభూతాని** : భూమి (Solid) - జలము (Liquid) - వాయువు (Vapour) - అగ్ని (Heat) - ఆకాశము (Space) ఈ ఐదు ఆయా పాళ్లకలయికచే ఈ భౌతిక శరీరం రూపుదిద్దుకుంటోంది. ఇది 'క్షేత్రము'

అనబడుదానిలో మొట్టమొదటగా కళ్లకు కనిపించే విభాగము (The property of 'Matter').

2. **అహంకారో** : ప్రతి శరీరంలోను 'నాది – నాది" అను శబ్దార్థంగా అనుక్షణం అనుభూతమగుచున్నదగు "అహంకారము" ఈ క్షేత్రములో కనబడే రెండవ విశేషము (Property of 'I').

3. **బుద్ధి** : ప్రతి దేహంలో తెలివి (Intellectual) అనబడే విచక్షణావిభాగం ఉన్నది. ఇది విశేషణం – నిర్ణయము నిర్వర్తిస్తూ ఉండే విభాగం. (The property that differentiates things and takes decisions).

4. **అవ్యక్తము** : ఏ విభాగమైతే ఈ శరీరమును ఉజ్జీవింపజేస్తూ అహంకారము – బుద్ధులను ప్రదర్శిస్తూ అట్టి ప్రదర్శనకు మునుముందే వేంచేసియున్నదో – అది అవ్యక్తము. (That which manifests while itself is remaining as un-manifested The "MANIFESTOR" of the "MANIFESTED").

**అవ్యక్తము** = తాను వ్యక్తముకాకుండా తదితరం వ్యక్తీకరించుచున్నట్టిది. ఉదా॥ ప్రేమ వ్యక్తీకరించుచు, అద్దానికి వేరుగా ఈజీవుని అంతర్విభాగంగా ఉన్నట్టిది (ప్రదర్శించుచున్నది).

**వ్యక్తము** = అహంకారము – బుద్ధి, ప్రేమ – భావము మొదలైనవి (ప్రదర్శించబడుచున్నవి).

5. **దశేంద్రియములు** : 5 జ్ఞానేంద్రియములు, 5 కర్మేంద్రియములు ఈ దేహంలో సమావేశమై 'క్షేత్రము' యొక్క అంతర్విభాగమై చెన్నొందుచున్నాయి.

i. **పంచజ్ఞానేంద్రియములు** : చెవులు – కళ్లు, ముక్కు –నాలుక – చర్మము. **వాటి జ్ఞానములు** : వినికిడి – చూపు – వాసన – రుచి – స్పర్శ

ii. **పంచకర్మేంద్రియములు** : నోరు - చేతులు - కాళ్లు - గుదము-గుహ్యము.

ఈ పది ఇంద్రియములు (జ్ఞాన + కర్మేంద్రియములు) ఈ దేహము యొక్క "**జ్ఞాన కర్మ వ్యవహారసరళికి**" ఉపకరణములై ఉంటున్నాయి.

6. **పంచేంద్రియగోచరములు** :

| | | |
|---|---|---|
| చెవులకు | → | వినిపించేవి. |
| కళ్లకు | → | కనిపించేవి. |
| ముక్కుకు | → | ఘ్రాణవిషయములు |
| నాలుకకు | → | రుచికరములైనవి. |
| చర్మమునకు | → | స్పర్శవిషయములు |
| నోటియొక్క | → | ఉచ్ఛారణ - శబ్దార్ధములు |
| చేతులయొక్క | → | చేతలు, కదలికలు |
| కాళ్లయొక్క | → | చలనములు, నడక |
| గుదము- గుహ్యముయొక్క | → | విసర్జనములు. |

ఇవన్నీ ఇంద్రియగోచరములు + ఇంద్రియార్థములు కలిసి 'క్షేత్రము' యొక్క విభాగమై క్రియాశీలకంగా ప్రవర్తిస్తున్నాయి.

7. **ఇచ్ఛా-ద్వేషములు** (Interest & Dis-interest) : ప్రతి జీవునిలోని ఇష్ట - అయిష్టములు, ప్రియ - అప్రియములు ప్రదర్శించే విభాగం క్షేత్రములో ఏర్పడినవై ఉంటున్నాయి.

8. **సుఖమ్ - దుఃఖమ్** (Pleasure & Dis-pleasure) : ప్రతి జీవుని క్షేత్ర విభాగంలోను అంతర్విభాగంగా "ఇది నాకు సుఖం - ఇది నాకు దుఃఖం" ఇట్టి నిర్వచనాలు పేరుకొని ఉన్న విభాగం. "ఇది సుఖం - ఇది దుఃఖం" ఇట్టి సంబంధమైన స్వకీయ నిర్వచనాలే ఈ విభాగమును పునఃపునః నిర్మిస్తున్నాయి.

9. **సంఘాతం** (Association of various factors) : వస్తు – విషయాదులతో ఏర్పడే సమావేశముచే ప్రాప్తిస్తున్న అనుభూతులు – అనుభవములు – అభిప్రాయములు – ఆవేశములు ఈ సంఘాత విభాగపు అంతర్గత విశేష పరంపర.

10. **చేతనము** (Movement) : కదిలించేది – కదలికలు. ఆలోచనలు మొదలైన రూపమైన సర్వకదలికలు (మనస్సు).

11. **ధృతి** : జీవునిలోని ధైర్యము (Courage), ఉత్సాహము (Enthusiasm), పట్టుదల (Determination) మొదలైనవి.

ఇవన్నీ కలిపి 'క్షేత్రము' అని చెప్పబడుచున్నాయి. ఇక్కడ మనం వీటిని సంక్షిప్తంగా చెప్పుకున్నాం. శాస్త్రములు వీటన్నిటినీ అనేక విభాగములుగా విభజించి అనేక శబ్దార్థములతో ప్రబోధిస్తున్నాయి.

## క్షేత్రజ్ఞుడు

"అవన్నీ నావి" అని జీవుడు భావిస్తున్నాడు కదా! అట్టి భావన చేయువాడు భావనకు మునుముందే ఉండాలికదా! అట్టి మునుముందు తత్వమే క్షేత్రజ్ఞుడు. "సర్వ దేహములలోని క్షేత్రజ్ఞుడు నేనే – పరమాత్మయే" ... అని గ్రహించు.

## జ్ఞానము

లోకంలో "జ్ఞానము" అనగా శాస్త్ర పరిజ్ఞానం అనో, పాండిత్యము అనియో ప్రచారంలో ఉన్నది కదా! అయితే శాస్త్రకారులు దేనిని 'జ్ఞానము' అని పిలుస్తున్నారో, దేనిని 'అజ్ఞానము' అని అంటున్నారో ... అది చెప్పుచున్నాను. విను.

1. **అమానిత్వము** : "నేను వారికంటే వీరికంటే గొప్పవాడిని కదా".... **(ఆత్మస్తుతి – పరనింద)** అని భావించటం అజ్ఞానం. "నాకంటే

సర్వవిధాలా అధికులు ఉన్నారు. వారు నాకు సోదాహరణాలు" ... అని బుద్ధితో గమనించటం జ్ఞానం.

2. **అదంబిత్వము (గర్వము)** : నేను 'ఉన్నతుడను' అనే గర్వం అజ్ఞానం. అణుకువ కలిగి ఉండటం జ్ఞానం. (Humbleness).

3. **అహింస** : మాట చేతగాని, చేతలచేతగాని ఇతరులను బాధించటం – అవమానించటం అజ్ఞానం. "ఇతరులను బాధించకూడదు కదా!" అనునది జ్ఞానం.

4. **క్షాంతి (ఓర్పు – Forbearance):** కోపం – ఆవేశం – పగ .... ఇవన్నీ అజ్ఞానం. ఇతరుల తప్పులపట్ల ఓర్పు కలిగి ఉండటం జ్ఞానం.

5. **ఆర్జవమ్** : ద్వంద్వ ప్రమాణాలు మనస్సుచేత – వాక్కుచేత – బోధచేత ఏకత్వం వహించటం. చెప్పేది – చేసేది ఒక్కటే అయి ఉండటం. "కూతురు – కోడలు, నావారు – తదితరులు" – ఇటువంటి ద్వంద్వముల పట్ల ఒకే ప్రమాణం వహించి ఉండటం జ్ఞానం.

6. **ఆచార్యోపాసనమ్** : గురువులపట్ల ఉపాసనాభావం పెంపొందించుకొని ఉండటం జ్ఞానం. గురువుపట్ల దుర్భావాలు – దుర్భాషలు – ధిక్కారము – ఇటువంటివి అజ్ఞానం.

7. **శౌచం** (Purity in view) : అనుమానించటం – అవమానించటం – దూషించటం ..... ఇటువంటి అభ్యాసం అజ్ఞానం. శుచి అయిన భావాలు కలిగి ఉండటం జ్ఞానం.

8. **స్థైర్యం** : 'పిరికితనము – భయము – అపనమ్మకము – ఆవేదన" ...ఇవన్నీ అజ్ఞానము యొక్క సంకేతాలు. "తల్లిగర్భంలో ఉన్నప్పుడు రక్షించినవాడే సర్వదా సర్వత్రా సంరక్షకుడై ఉంటాడు" అనురూపంలో ధైర్యము కలిగి ఉండటం, ధైర్యంగా తాను అనుకున్నది చెప్పగలిగిన స్వభావం జ్ఞానమునకు సంకేతం.

9. **ఆత్మనిగ్రహం** : ఆవేశము పొందటం అజ్ఞానం. మనస్సు - ఇంద్రియములందు ఆవేశం తొలగించుకొంటూ నిగ్రహం పెంపొందించుకోవటం జ్ఞానం.

10. **ఇంద్రియార్థేషు వైరాగ్యం** : ఆవేశము - ఆకర్షణలకు లోనుకావటం అజ్ఞానం. శబ్ద స్పర్శ రూప రస గంధములవైపు రాగరహితులై ఉండటం (unattached emotionally) జ్ఞానం.

11. **అనహంకారం** : "కోపము - పరదూషణ - క్రోధము - మాటలలో పరుషత్వం" మొదలైనవి అహంకార లక్షణాలు. అవి లేకుండా అనహంకారులై ఉండటం జ్ఞానము.

12. **జన్మమృత్యు జరావ్యాధిదు దుఃఖదోష అనుదర్శనం** : "ఏదీ శాశ్వతం కాదు. జన్మ - మృత్యువులను సమన్వయించుకొని అధిగమించాలి. ఈ శరీరబలం చూచుకొని మురిసిపోకూడదు. ఇది జరా వ్యాధి దోషములు కలిగియున్నది కదా! ఏది ఎట్లా నిర్వర్తిస్తే ఇతరులకు - నాకు బాధగా ఉండదో అట్లా చేయాలి. ఇది దోషం. ఇది ఉచితం" - అన్ని సమయాలలో ఇటువంటి విచక్షణ కలిగి ఉండటం జ్ఞానం. అట్టి విచక్షణ చేయకపోవటం అజ్ఞానం.

13. **అసక్తి** (Non-Attachment) : "ఇవన్నీ నావికావు. నేను వీటి చే పరిమితుడను కాదు. అంతా ఈశ్వర ప్రసాదం. ఈశ్వర మహిమ" అని భావించటం జ్ఞానం.

    "ఇవన్నీ నావే! నాకే చెందాలి. నావే కావాలి. నాకే ఉండాలి. ఇట్లాగే ఉండాలి. వారికి ఉండకూడదు. ఇది నా సొంతం."..... ఇటువంటి భావాలు అజ్ఞానం.

14. **పుత్ర - దార - గృహాదిషు అనభిష్వంగః** : "ఈ పుత్రులు - భార్య - గృహములు మొదలైన నాయొక్క ఉనికిని చాటుచున్నాయి. ఇవి నాసొంతం. నేనే అధికారిని" ....ఇటువంటి భావాలు అజ్ఞానం.

"ఇదంతా పరమేశ్వరునికి చెందినవి. పరమేశ్వర రూపం"... అనునది జ్ఞానం.

15. **ఇష్ట - అనిష్ట ఉపపత్తిషు నిత్యంచ సమచిత్తత్వం** : ఆవేశ - కావేశములకు లోనై చిత్తమును అస్థిరం చేసుకోవటం అజ్ఞానం. ఇష్టమైన - అయిష్టమైన ఆయా విషయములు తారసపడుచున్నపుడు పొంగి - క్రుంగిపోకుండా చిత్తమునందు సమత్వము - సమభావన కలిగిఉండటం జ్ఞానం.

16. **అనన్యయోగేన అవ్యభిచారిణీః భక్తిః** : "సర్వము పరమాత్మయొక్క ప్రదర్శనంగా చమత్కారంగా గమనించటం - అనన్యయోగం. అదియే జ్ఞానం! భక్తి యొక్క ప్రవృద్ధతచే చెదరని ప్రేమ - ప్రపత్తులు కలిగి ఉండటం జ్ఞానం.

17. **వివిక్తదేశ సేవిత్వం** : "నేను ప్రత్యేకత గలవాడను, భక్తుడను - జ్ఞానిని అని సహజీవులు గుర్తించాలి. అది ఎట్లాగో ఆమార్గం ఆశ్రయిస్తాను".. అనునది అజ్ఞానం. ఉపాసన వ్యక్తిగతమైన అంతరంగసాధన. "నేను పరమేశ్వరుని ఉపాసకుణ్ణి - ఈ చరాచర సృష్టిస్వరూపుడగు పరమాత్మ నా ఉపాస్యవస్తువు" అను ఏకాంతసేవ - వివిక్త దేశసేవను ఆశ్రయించటం జ్ఞానం.

18. **అరతిః జనసంసది** : అనేకమంది యొక్క సమావేశము - వేరువేరు వాదోపవాదములు - ఒక వాదనను అనేకమందిచేత 'ఔను' అనిపించాలనే ఆవేశం ... ఇటువంటివి అజ్ఞానం. జనుల గురించిన చర్చలు - వాదోపవాదములకు దూరంగా ఉండటం జ్ఞానం.

19. **అధ్యాత్మజ్ఞాననిత్యత్వం** : అన్ని పరిస్థితులలోను అధ్యాత్మజ్ఞాన ప్రవచిత పాఠ్యాంశాలను దృష్టినుండి తొలగకుండా చూచుకోవటం జ్ఞానం. ఆయా పరిస్థితుల ప్రభావమునకు లోను అగుచు శాస్త్ర పాఠ్యాంశసారవిశేషాలను మరవటం, పరిస్థుతులు బాగుగా లేవని శాస్త్రముల తప్పులెన్నటం అజ్ఞానం.

20. **తత్వజ్ఞానార్ధ దర్శనం** : "మోక్షము - జీవన్ముక్తి - జన్మరాహిత్యము - శరీరనిరహంకారము - సమాధి - భక్తి - జ్ఞానము - వైరాగ్యము - యోగము" ... మొదలైన శాస్త్రవాక్యాల అంతరార్థము, సదుద్దేశ్యములను పరిశీలించటం, గమనించటం, అర్థం చేసుకోవటానికి ప్రయత్నించటం జ్ఞానం.

ఈ విధంగా జ్ఞానము - అజ్ఞానము శాస్త్రకారులచే ఉద్దేశ్యించబడుచున్నాయి.

'జ్ఞానము' అనునది పరమాత్మను తెలుసుకొని జీవత్వము నుండి శివత్వమువైపుగా ప్రయాణించే మార్గము.

## జ్ఞేయము

ఇక తెలియబడే పరమాత్మతత్వం జ్ఞేయము. 'జ్ఞేయము' గురించి శాస్త్రసారమేమిటో చెప్పుచున్నాను. విను.

'జ్ఞేయము' అనబడే ఈ జీవుని యొక్క పరమాత్మ స్వరూపము గురించి తెలుసుకుంటే మృతమునుండి అమృతత్వమునకు పరిణతి పొందగలవు.

అట్టి "స్వస్వరూప-పరమాత్మతత్వము"నకు ఆద్యంతాలు లేవు. పరబ్రహ్మము అదే! అది సత్ - అసత్‌లచే నిర్వచించబడేది కాదు.

ఉన్నదంతా అదే! అది ఇదిగా అవటంలేదు.

"అది లేదు" అని కొందరికి అనిపిస్తూ ఉంటే, "అదియే ఉన్నది. తదితరమైనది లేదు" అని మరికొందరికి సుస్పష్టమౌతోంది! ఏమి చమత్కారం!

ఈ సర్వచేతలు - చేతులు - మార్గములు - పాదములు పరమాత్మవే! ఈ దృష్టులు - దర్శనము - చూపులు - కళ్లు - ఈ సర్వ శిరస్సులు - ముఖములు - తత్వములు - అంతా ఆ పరమాత్మయొక్క చమత్కార విన్యాసములే! అంతటా చెవులు కలిగి అన్నీ వింటున్నది ఆ పరమాత్మచైతన్యమే! సమస్తములోను - సమస్తముగాను ఆవరించి - వ్యాపించి - తిష్ఠించుకొని ఉన్నది పరమాత్మయే!

ఆపరమాత్మయొక్క మహిమయే సర్వ దేహములలోని సర్వఇంద్రియ తత్వములుగా ఆభాసిస్తోంది. ప్రతిబింబిస్తోంది. సర్వ ఇంద్రియములకు సంబంధించనిదై ఉంటోంది. ఉంగరంగా ఉన్నది బంగారమే అయినప్పటికీ,... "బంగారం గుండ్రముగా ఉండును"... అని అనం కదా! అట్లాగే ఇంద్రియాలుగా ప్రతిబింబిస్తున్నది పరమాత్మయే! కానీ అది ఇంద్రియ – ఇంద్రియార్థములన్నిటికీ వేరై ఉన్నది.

ఆ పరమాత్మతత్వమే అన్నిటికీ భోక్త! (Expericer). కాని, దేని చేతకూ అది పరిమితం కాదు. దేనికీ సక్తత (Attachment) కలిగిలేదు. సర్వగుణ – లక్షణ – విలక్షణములు ఆ పరమాత్మ తత్వానివే అయినప్పటికీ, ప్రతిజీవునియొక్క బాహ్య – అభ్యంతరములలో వ్యాపించి ఉన్నది పరమాత్మ తత్వమే! అంతటా అన్నిటా వ్యాపకమై ఉండికూడా అది నిశ్చలం. చలనరహితం.

ఆత్మ అత్యంత సూక్ష్మతత్వమై ఉండటంచేత ఈ జీవులు తమయొక్క పరమాత్మ తత్వాన్ని గమనించటం లేదు. అద్దానిని బాహ్య వస్తువుగాచూస్తే అంతకన్నా దూరమైనది లేదు. అంతఃతత్వంగా గమనిస్తే ద్రష్టయొక్క స్వస్వరూపమే అది. ఇక అద్దాని కంటే దగ్గిరైనదేముంటుంది?

అట్టి పరమాత్మ అవిభక్తమైనది. అయినప్పటికీ ఈ వేరు వేరు జీవులలో వేరువేరుగా ఉన్నదానివలె ప్రదర్శన మగుచున్నది ఆ జ్ఞేయమగు పరమాత్మయే! సర్వజీవజాలమునకు మూలాధారము అదే! ఈ సర్వమును ప్రభవింపజేస్తున్నది – హరించుచున్నది అదియే! ఆ ఆత్మతత్వము నుండి ఈ ఏకానేక ఉపాధులు – జీవజాలాలు – వారివారి దర్శన ప్రదర్శనాలు ప్రకటితమగుచున్నాయి. ఇవన్నీ ప్రభవిస్తున్నది – లయిస్తున్నది పరమాత్మయందే! ఇదంతా పరమాత్మయే! జలంలో తరంగాలు ఉద్భవించి – లయిస్తూ ఉండగా జలం సర్వదా యధాతధం కదా! పరమాత్మనుండి ఈ జగత్తులు – జగదంతర్గత జీవులు – వారివారి మనో బుద్ధి చిత్త అహంకారాలు ప్రదర్శితమగుచు లయిస్తూ ఉండగా పరమాత్మసర్వదా యథాతథం సుమా!

జగత్తులలోని ప్రకాశమయ పదార్థములన్నిటినీ ఉద్దీపింపజేస్తున్నది ఆ పరమాత్మయే! అది జ్యోతులకే జ్యోతి. అంధకారమునకు ఆవల సర్వదా వెలుగొందుచున్నది అదే!

- అదియే జ్ఞాన రూపంగా తెలుసుకొంటున్నది.
- జ్ఞేయమగు తెలియబడేదంతా పరమాత్మయే.
- జ్ఞానమార్గములన్నిటియొక్క గమ్యము అదే!

అట్టి పరమాత్మ సర్వజీవుల హృదయాలలో జ్వాజ్వల్యమానంగా సర్వదా వెలుగొందుచున్నదయ్యా!

☆☆☆

ఓ అర్జునా! ఈ విధంగా క్షేత్రము అనగా ఏమో, జ్ఞాన – జ్ఞేయముల గురించి క్లుప్తంగా చెప్పాను. ఎవ్వరైతే నాపట్ల భక్తిని ప్రవృద్ధ పరచుకొని ఈ క్షేత్ర – క్షేత్రజ్ఞ – జ్ఞాన–జ్ఞేయ విశేషాలు విశ్లేషణపూర్వకంగా శ్రద్ధగా ఆలకించి విశ్లేషించుకొని బుద్ధిని సునిశితం చేసుకొంటారో..., అట్టివారు "నేను ఆస్వాదిస్తున్న సర్వాంతర్యామియగు పరమాత్మస్వరూపము"...ను చేరుకొనగలరు.

ఓ పార్థా! ప్రకృతి – పురుషుడు (లేక క్షేత్రము – క్షేత్రజ్ఞుడు)... ఈ రెండు కూడా అనాదియే (No beginning) అని గ్రహించు. ఇక వికారరూపములగు త్రిగుణములంటావా? ఇవన్నీ ప్రకృతి చేత ప్రకృతియందు సంభవిస్తున్నాయి. పరమాత్మస్వరూపుడగు 'పురుషుడు' సర్వజీవులలోను సర్వదా అప్రమేయుడు – నిత్యనిర్మలుడు – యథాతథుడు కూడా!

"కార్యము – కారణము – కర్తృతము (Doing - cause - Doer)" ఈ మూడు ఆత్మయందే ఆత్మయొక్క ప్రకృతి విభాగమునందు ఉత్పత్తి పొందుచున్నాయి. ఆవిధంగా ప్రకృతి యందు ఉత్పత్తి అగుచున్న గుణములకు భోక్త పురుషుడే! సుఖ – దుఃఖములకు హేతువుకూడా పురుషుడే! (జీవుడే!) ఈ పురుషుడు ప్రకృతియందు ప్రవేశించి ప్రకృతియందలి గుణములను ఆశ్రయించి

తనయొక్క అప్రమేయత్వం ఏమరచి సత్ – అసత్ యోనులలో జన్మపరంపరలు పొందుచున్నాడు – వాస్తవానికి పురుషుని స్వస్వరూపం (ప్రతి ఒక్కజీవుని స్వస్వరూపం) సర్వదా యథాతథం.

జీవుడే ఆత్మ! ఆత్మయే జీవుని స్వరూపం!

అట్టి ఆత్మస్వరూపమగు పరమపురుషుడు ప్రతి జీవునిలోను, ప్రతి దేహమునందు వేంచేసియుండి ఏఏచమత్కారములు నిర్వర్తిస్తున్నారో... విను.

1. **ఉపద్రష్ట** : కేవలం సాక్షిమాత్రంగా గుణములు – ఉపాధుల రాక – పోకలు మౌనంగా చూస్తూ ఉన్నారు. (Silent self beyond Qualities, thought and logic functions)

2. **అనుమంతా** : సర్వగుణ – మనో – బుద్ధి ధర్మములకు అనుమతిస్తూ ఉన్నారు. (Upholding the functions and functional qualities)

3. **భర్తా** : సర్వమునకు భరించుచూ కర్తృత్వము వహిస్తున్నారు. (Drafting the Experiences)

4. **భోక్తా** : అన్నిటికీ భోక్తగా ఉంటున్నారు. (Giver of 'meanings' and experiencing)

5. **మహేశ్వరః** : సర్వ ప్రకృతి తత్వాలకు స్వామిత్వము – మహేశ్వరత్వము వహిస్తున్నారు. (Textures and commands)

6. **పరమాత్మ** : సర్వమునకు అప్రమేయులై అంతర్యామి అయి ఉంటున్నారు. (Alpervading and Alpresent)

ఈ విధంగా పరమాత్మ దేహములకు – ప్రకృతికి ఆవల ప్రకాశిస్తూ సర్వాధారులై సర్వదా వేంచేసి ఉన్నారు. సర్వదేహాలలోను ఆక్రమించుకొని జీవ–శివస్వరూపులై వెలుగొందుచున్నారు!

⋆⋆⋆

ఓ అర్జునా! అట్టి "పురుషుడు – ప్రకృతి – గుణములు" అను

విభాగమును ఎవ్వరైతే అధ్యయనం చేసి అవగాహన పెంపొందించుకొని ఉంటారో... అట్టివారు, "ఈ ఉపాధులు, ఆయా ధర్మములు వచ్చిపోతూ ఉన్నప్పటికీ .... నేను జన్మరహితుడను" అని గ్రహించినవారై ఉంటారు. **వారు తమ యొక్క సర్వగుణాదారార - సర్వగుణాతీత - ప్రకృతిసహిత - ప్రకృతిరహిత ఆత్మతత్వమును ఆస్వాదిస్తూ ఉంటున్నారు.**

అట్టి తనయొక్క పరమాత్మస్వరూపం, "సర్వక్షేత్రాంతర్గత - క్షేత్రజ్ఞస్వరూప తత్వం" ఆస్వాదించటానికి ప్రతి జీవుడు అర్హుడే! మనం చెప్పుకున్న జ్ఞానమును ప్రవృద్ధి పరచుకొంటూ ఉండగా క్రమంగా ఈ జీవుడు ఆత్మసాక్షాత్కారానంద స్వస్వరూపుడు కాగలడు. దానికి సాధనామార్గాలు మరికొన్ని ఇక్కడ ఉదహరిస్తున్నాను.

1. **ద్యానయోగ మార్గం** : నిరంత ధ్యాసచే ధ్యాన యోగమును అభ్యసిస్తూ రాగా, తమయొక్క ఆత్మయందు ఆత్మచే అట్టి సర్వాంతర్యామిత్వము -అఖండ పరబ్రహ్మత్వమును దర్శించి - ప్రవేశించి - ఆస్వాదించవచ్చు. అట్టి ధ్యానయోగంచే అనేకులు ఆత్మ సాక్షాత్కారానందం సముపార్జించు కుంటున్నారు.

2. **సాంఖ్యయోగ మార్గం** : మరికొందరు శాస్త్రములు - గురువులు చెప్పుచున్నది విశ్లేషిస్తూ మనసు - బుద్ధి - చిత్తము - అహంకారములు క్షేత్రమని, వాటికి ఆవల వాటికి కారణకారణంగా వెలుగుచున్నది క్షేత్రజ్ఞుడని, సర్వక్షేత్రములలోని క్షేత్రజ్ఞుడు ఏకమేనని (అఖండమని) గ్రహించి అట్టి "క్షేత్రజ్ఞత్వం" పుణికిపుచ్చుకుంటున్నారు.

3. **కర్మయోగ మార్గం** : ఇంకొందరు తమయొక్క సర్వకర్మలు సర్వాత్మకునకు సమర్పించి కర్మయోగులై - కర్మసన్యాసులై - కర్మరహితులై ఇకప్పుడు క్షేత్రజ్ఞయోగత్వం సంపాదించుకుంటున్నారు.

4. **శ్రుతియోగూు** : ఇంకొందరు "ఆత్మతత్వం మేము ఎఱుగము కదా! మహనీయులను ఆశ్రయించి వారి వద్ద శ్రద్ధగా వినెదముగాక!"...

అని వారి వివరణ విని, అట్టి సర్వాంతర్యామిత్వము, సర్వక్షేత్రజ్ఞత్వం ఉపాసిస్తున్నారు. అట్టి ఉపాసనచే వారుకూడా మృత్యుస్థితులను అతిక్రమించి అమృతత్వం, ఆత్మత్వం అనువర్తిస్తున్నవారగుచున్నారు.

ఓ పార్థా! భరతర్షభా! ఈ 14లోకములలోని చరాచరసృష్టిలో కనబడే స్థావర - జంగమాత్మకమైనదంతా "క్షేతము + క్షేత్రజ్ఞుడు" - ఈ రెండిటియొక్క సంయోగమేనని, "సర్వే-సర్వత్రా క్షేత్రజ్ఞుడు నేనే" అని గ్రహించు.

## క్షేత్ర - క్షేత్రజ్ఞ సంయోగము

ఇక్కడ స్థావర - జంగమాత్మకంగా రాయినుండి బ్రహ్మదేవునివరకు కనబడేదంతా కూడా క్షేత్రము - క్షేత్రజ్ఞుల సంయోగమేనయ్యా!

క్షేత్రజ్ఞుడగు పరమేశ్వరుడు సర్వజీవులలోను సమస్వరూపుడై సర్వదా వేంచేసియున్నారు. అంతేగాని ఒక జీవునిలో అధికంగాను, మరొకరిలో స్వల్పంగాను కాదు. ఈకనబడే దేహాలు జనిస్తున్నాయి. నశిస్తున్నాయి. అయితే, ఈ నశ్వర దేహాలలో పరమాత్మ శాశ్వత పరంజ్యోతి స్వరూపుడై వెలుగొందుచున్నాడు. ఏ పరమాత్మ సర్వదేహాలలో సర్వదా వినాశనరహితుడై, కాలఃకాలస్వరూపుడై అనునిత్యంగా ప్రకాసిస్తున్నాడో,... అట్టి పరమాత్మ సందర్శనమే సరి అయిన సందర్శనము. మార్పు - చేర్పులులేనిది ఆత్మ. ***మార్పు చెందుచున్నదానిలో దాగియున్న మార్పు చెందని ఆత్మను సందర్శించువాడే సత్యమును చూస్తున్నవాడు.***

ఎవ్వడైతే సర్వేసర్వత్రా సమమై వేంచేసియున్న ఆత్మతత్వమును సర్వదా - సర్వత్రా సందర్శిస్తాడో,... అట్టివాడు తాను 'వినాశనము' అను స్థితిని అధిగమించినవాడై మహత్తరమైన గతిని ''క్షేత్రజ్ఞశ్చమాం'' స్థానం చేరుకున్నవాడగుచున్నాడు.

ఓ అర్జునా! సర్వసహజీవులలో క్షేత్రజ్ఞసందర్శనం అభ్యసించు. ఇక ఈ సకల జీవులయొక్క సర్వ ప్రవర్తనలను చూచి భ్రమ చెందకు. ఎందుకంటే...

ఈ దృశ్యములోని ప్రతి జీవునియొక్క కర్మవ్యవహారములన్నీ, క్రియా విశేషములన్నీ నిర్వర్తిస్తున్నది ప్రకృతి మాత్రమే! ఇదంతా జగన్నాటకం. జీవులందరిలో దేహములు ఉన్నప్పుడు - పతనమైనప్పుడు కూడా - సర్వదా వేంచేసి యున్న క్షేత్రజ్ఞస్వరూపమైన ఆత్మ దేనికీ కర్తకాదు. భోక్తకాదు. ఆత్మ సర్వదా అప్రమేయం. సర్వసహజీవులలోని అప్రమేయము – విభాగ దోషరహితము – నిత్యనిర్మలము – అకర్తాతత్వము అగు ఆత్మను లేక క్షేత్రజ్ఞుని ఎవ్వరు సర్వదా సందర్శిస్తూ ఉంటారో – అట్టివారు వాస్తవమును దర్శిస్తున్నవారు అగుచున్నారు.

ఎప్పుడైతే...

- "ఈ వేరువేరు భావములతోకూడిన జీవులంతా ఒకే ఆత్మస్వరూపులు – క్షేత్రజ్ఞ స్వరూపులు.
- ఒకే ఆత్మనుండి ఈ వేరువేరు భావజీవతరంగాలు – ఒకే జలంలో అనేక తరంగాలు బయల్వెడలుచున్నట్లు – బయల్వెడలుచున్నాయి."

అని గమనిస్తున్నాడో... ఆస్వాదిస్తున్నాడో అట్టివాడు బ్రహ్మమును సముపార్జించి బ్రహ్మమే తానై స్వయంజ్యోతి స్వరూపుడై ప్రకాసిస్తున్నాడు.

ఓ అర్జునా! ఈ క్షేత్ర – క్షేత్రజ్ఞయోగ సారాంశాన్ని మరొక్కసారి క్రోడీకరించి చెప్పుచున్నాను. విను.

సర్వదేహాలలో పరమాత్మ సర్వదా ప్రకాసిస్తూ ఉన్నారు.

ఈ దేహములు మార్పు చేర్పులు చెందుచున్నప్పటికీ,... ఇందలి పరమాత్మ ఈ దేహ – మనో – బుద్ధి – చిత్త ధర్మములచే స్పృశించబడటం లేదు. అప్రమేయుడై – ఏకస్వరూపుడై వెలుగొందుచున్నాడు. క్షేత్రజ్ఞ స్వరూపుడగు పరమాత్మ దేహముల ప్రారంభంకంటే మునుముందే ఉన్నవారు. ఆదిమధ్యాంతరహితుడు. గుణములకు అతీతుడు. అట్టి పరమాత్మ సర్వదేహములలో కేవలసాక్షిగా అమృతరూపుడై, దివ్యుడై సర్వదా ప్రకాసిస్తున్నారు. ఆయన ఈ దేహాలలో ఉన్నప్పటికీ, దేహ – మనో – బుద్ధి – చిత్త –

అహంకారాలకు తానే ఆధారమై ఉంటున్నప్పటికీ...ఆయన నిర్గుణుడై - అవ్యయుడై (మార్పు చేర్పులు లేనివాడై) వెలుగొందుచున్నాడు.

ఉదాహరణకు ఆకాశం (Space) అతి సూక్ష్మరూపంగా సర్వేసర్వత్రా ఆక్రమించుకొని ఉన్నది కదా! ఒక చోట ఒక గృహం నిర్మించబడటం చేతగాని, అనేక సంవత్సరాలు తరువాత ఆ గృహం నేలకూలటంచేతగాని అక్కడి ఆకాశము (Space)నకు మార్పు - చేర్పులు ఉండవు కదా! (Space is so subtle that it can not at all be affected by formation of matter or its distruction). అట్లాగే ఈ కనబడే అన్ని చరాచరజీవులలో జీవాత్మగా ఉన్నప్పటికీ పరమాత్మను ఎట్టి -దేహ - మనో - బుద్ధి - చిత్త - అహంకార దోషములు ఏమాత్రం స్పృశించవు.

ఇంకొక దృష్టాంతం చెపుతాను. విను.

ఒకే సూర్యుడు ఈ భూమియొక్క అనేక ప్రదేశాలలో ఒకేసారి ప్రకాసిస్తున్నాడు. (ఉత్తర భారతంలో ఒక సూర్యుడు - దక్షిణ భారతంలో మరొక సూర్యుడు - తూర్పున ఒక సూర్యుడు - పడమరలో వేరొక సూర్యుడు ప్రకాశించటంలేదు కదా!). అట్లాగే ఒకే పరమాత్మ (లేక) క్షేత్రజ్ఞుడు ఈ కనబడే సర్వ స్థావర - జంగమ జీవులలో ఒకేసారి ప్రకాసిస్తున్నారు.

ఈ విధంగా "క్షేత్రము - క్షేత్రజ్ఞుడు - ఈ సర్వదేహాలలో క్షేత్రజ్ఞుడు ప్రకాశించటం".... అనే తాత్విక సత్య రహస్యాన్ని ఎవ్వరైతే తమ జ్ఞాన చక్షువులతో గమనిస్తారో... అట్టివారు ఈ "భూతప్రకృతి" అనే 'బంధము' లేక "పరిమిత దృష్టి" నుండి విముక్తులై ఆ "ఆత్మతేజోసూర్య తత్వము"ను చేరుకోగలరు. "కిరణములన్నీ సూర్యునివే అయినట్లుగా ......... ఈ సహజీవులంతా - ఈ దృశ్యమంతా మమాత్మ సూర్యునియొక్క కిరణచమత్కారములే!" అని ఆస్వాదించగలడు.

*ఇతి క్షేత్ర - క్షేత్రజ్ఞ విబాగ యోగ పుష్పః*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

★★★

శ్లో॥ మాన - అవమానయోః తుల్యః, తుల్య మిత్ర - అరి పక్షయోః ।
సర్వారంభపరిత్యాగీ, 'గుణాతీతః' స ఉచ్యతే ॥

[యః] "మానావమానయో, మిత్రారిపక్షియో" త్యూః
సర్వారంబోపరిత్యాగీ [వర్తతే], సః 'గుణాతీతః' - ఉచ్యతే ॥

ఎవరైతే మానావమానములను, శత్రు మిత్రభావములను విడచి కర్తృత్వాభిమానరహితుడై ఉంటాడో, ..... ఆతడు 'గుణాతీతుడు' అని చెప్పబడుచున్నాడు.

# 14

# గుణత్రయ విభాగయోగ పుష్పం

**శ్రీబోగవానుడు** : ఓ అర్జునా! ఇప్పటిదాకా క్షేత్ర - క్షేత్రజ్ఞ విభాగం విన్నావుకదా! ఇప్పుడు గుణత్రయ విభాగం వివరిస్తున్నాను. జ్ఞానములన్నిటిలో ఉత్తమజ్ఞానమని చెప్పబడుచున్న "త్రిగుణ విభాగం - త్రిగుణాతీతత్వం" గురించిన విశేషాలు ఇప్పుడు వినబోతున్నావు. ఈ త్రిగుణ విభాగ విశేషమును గ్రహించి ఎందరెందరో ఈ దృశ్యముపట్ల మౌనయోగం సముపార్జించుకున్నవారై (మౌనులై) సంసారబంధముల నుండి విముక్తిని సులభంగా సముపార్జించు కోవటం జరుగుతోంది.

నేను చెప్పబోవుచున్న ఈ త్రిగుణవిభాగ జ్ఞానమును సంపాదించుకొంటూ, త్రిగుణాతీతత్వమును ఉపాసించుటచే, అట్టి వారు ఈ లోకముల ఉత్పత్తికిగాని, ఇవి కొనసాగుచున్నప్పుడు గాని, లయం అగుచున్న సందర్భంలోగాని వ్యథ - ఆదుర్దాలను ఏమాత్రం పొందనివారై ఉంటున్నారు. అనగా, లోక-లోకాంతర దృశ్యాదృశ్యములకు అతీత స్థానం అవతరిస్తున్నారు.

నా యొక్క నిర్మల - నిరాకార - అనంత పరబ్రహ్మమునందు జగత్తుల

ఉత్పత్తి స్థానమగు ఒకానొక విభాగం నా మాయచే పరిఢిల్లుతోంది. అట్టి నా యొక్క 'యోని'యే ఈ జగత్తులు – ఇందలి జీవరాసుల ఉత్పత్తికి స్థానమైయున్నది. చిదానంద స్వరూపుడనగు నాయందు నాయొక్క "ప్రదానము – Contribution" అను చమత్కారంచేత జీవోత్పత్తి – వినాశనధర్మములతో కూడిన జగత్తులన్నీ – జలంలో తరంగాలవలె – ఆవిర్భవిస్తున్నాయి, ఉనికిని కొనసాగిస్తున్నాయి, నాయందే లయిస్తున్నాయి.

అట్టి నాయొక్క నానావిధ యోనులందు ఉత్పత్తియగుచున్న ఈ వివిధ జీవరాసుల దేహములన్నిటికీ

తల్లి (ఉత్పత్తిస్థానం) నాయొక్క ప్రకృతి అని,

బీజప్రదాత (కారణం) పరబ్రహ్మమగు నేనే అని గ్రహించు.

(నిశ్చల జలంలో 'చంచలము' (లేక) 'స్పందన' చేత తరంగములు ప్రదర్శితమగుచున్నట్లు )

## గుణస్పర్శ

మూడు విధములైన గుణములు నాయొక్క ప్రకృతి (లేక "యోని") నుండి సంభవిస్తున్నాయి.

**1. సత్వ గుణము 2. రజోగుణము 3. తమోగుణము**

**ఈ జీవుడు వాస్తవానికి సర్వదా అప్రమేయము – గుణాతీతము అగు ఆత్మ స్వరూపుడే!**

అయితే ఏం? ఈ సత్వ–రజో–తమో గుణములు అవ్యయాత్మ స్వరూపుడగు దేహికి దేహముతో–దృశ్యముతో బంధము – సంబంధము కలుగజేస్తున్నాయి.

**1. సత్వగుణము :** ఈ గుణముచే జీవుడు 'అయో! నా బుద్ధికలుషితమైయున్నది కదా?" అని తలచి, ఇక నిర్మలము – ప్రకాశకము – విస్తారము అగు బుద్ధిని

నిర్మించుకునే మార్గాలు అన్వేషిస్తున్నాడు. అనగా, ఈ సత్వగుణం – "సుఖసంగము – జ్ఞానసంగము...(సుఖం ఎట్లా పొందాలి? జ్ఞానినై ఆత్మానందం ఎట్లా పొందాలి?)" అను సంబంధముల చమత్కారంచే ఈ జీవుని దృశ్యపరంపరా వ్యవహారములకు సంబంధితునిగా చేస్తోంది. బంధిస్తోంది. ''నేను బద్ధుణ్ణి, దుఃఖిని కనుక, సుఖిని కావాలి. జ్ఞానిని కావాలి" ....అని నిర్మలమగు ఆత్మకు బంధం ఆపాదించుకోవటం జరుగుతోంది.

**2. రజోగుణము :** ఈ రజోగుణము ''రాగము (Attachements)'' కలుగజేయుచున్నది. ఇది 'తృష్ణ' (Desire) అను సంజ్ఞను ప్రదర్శిస్తోంది. అట్టి 'తృష్ణ' అను స్వభావముచేతను, కర్మ (Tendency of Doing) అను సంజ్ఞచేతను ఈ జీవుని దేహముతో కట్టి ఉంచుతోంది. "ఏదో చేయాలి. ఇంకేదో పొందాలి" అను కర్మదాహరూపం ఈ రజోగుణ లక్షణం.

**3. తమోగుణము :** దీపకాంతికి తెరఅడ్డుపడితే చీకటి వచ్చిపడుతోంది కదా! స్వస్వరూప స్వస్థితిని ఏమరచటంచేత – అజ్ఞాన ఆవరణచేత తమోగుణము ప్రవృద్ధం కావటం జరుగుతోంది. అది ఈ దేహిని "నేను ఈ దేహముచే – దేహమునకు దేహాంతర్గతంగా పరిమితుడనై ఉన్నాను"... అనే భ్రమలో – మోహంలో ఉంచిఉంచుతోంది.

ఈ తమోగుణం – "చేయాలనికూడా చేయలేకపోవటం (బద్ధకం) – అప్రవృత్తి – ఆలస్యము (Slow approach) – మాంద్యము – ఇటువంటి విశేషములచే దేహిని దేహములకు బంధించి, ఆ బంధం దేహ – దేహాంతర విన్యాసరూపంగా కొనసాగిస్తోంది.

ఇప్పుడు ఈ సత్వరజతమో గుణముల గురించి మరికొన్ని విశేషాలు విశదీకరిస్తున్నాను. శ్రద్ధగా విను.

☆☆☆

**సత్వగుణం :** ఈ గుణము జీవునిలో ఉత్సాహం – సదవగాహన పరిపోషిస్తుంది. "నేను, ఇతరులు ప్రశాంతంగా, సంతోషంగా, సుఖంగా ఉండాలి"... అనే

సాత్వికాశయమును ప్రవృద్ధం చేస్తోంది. సత్వగుణము ప్రవృద్ధమగుచూ ఉంటే, ఈ జీవునిలో ఇక తదితర రజో–తమోగుణములు సన్నగిలుతూ ఉంటాయి. ఎప్పుడెప్పుడైతే ఇంద్రియములన్నిటిలో చైతన్యము – వివేకము వృద్ధి పొందుతూ ఈ జీవుడు చైతన్యవంతుడగుచూ (with blossoming Instinct and Impulse) ఉంటాడో... అట్టి విజ్ఞాన విశేషము యొక్క ఉనికి సత్వగుణం యొక్క ప్రవృద్ధత చేతనే. సాత్వికస్వభావము – ఉత్సాహము – (Instinct - Impulse) ప్రవృద్ధం అగుచూ ఉండగా జీవితపర్యంతం సాత్వికభావాలు (Positive Interpretations) సద్భావాలు – సాధుభావాలతో కూడిన ప్రవర్తనలు ఈ జీవుడు అనువర్తిస్తున్నాడు.

అట్టివాడు ఈ దేహపతనానంతరం "దోషములు లేనివి – విజ్ఞతతో కూడినవారు నివసించేవి" – అయినట్టి ఉత్తమ లోకాలలో నివాసం సముపార్జించుకుంటున్నాడు. అనగా, సాత్వికమైన భావాలతో తమతమ ధర్మములు నిర్వర్తించేవారు సాత్విక స్వభావ సమన్వితములగు జ్ఞానులు నివసించే లోకములను సముపార్జించుకుని, వారి సహవాసంతో తమ జ్ఞానం ప్రవృద్ధపరుచుకుంటున్నారు. ఈ విధంగా సత్వగుణము 'జ్ఞానము'ను ప్రవృద్ధ పరుస్తోంది. క్రమక్రమంగా ఆ జీవునికి "నేను సర్వదా ఆత్మనే" అనే సమున్నతమగు స్థితి – గతులకు దారిచూపుతోంది.

**రజోగుణం :** రజోగుణము ఈ దృశ్యవిషయ – విశేషములపట్ల రాగము (Attachment) కొంచం కొంచంగాను, క్రమక్రమంగాను అధికం చేస్తోంది. ఆ రాగము "కర్మ అభిలాష"ను (అది చేయాలి – ఇది చేయాలి – అనే తపనను) పెంచుకొంటూ పోతోంది. క్రమంగా కర్మలనుండి విరమించలేక పోవటం, లోభప్రవృత్తి, తృప్తిలేకపోవటం మొదలైనవి రూపుదిద్దుకుంటూ వృద్ధి చెందుతూ ఉంటాయి.

రజోగుణం అధికమౌతూ ఉంటే, ఇకప్పుడు ఈ జీవునిలో సత్వ – తమోగుణాలు తగ్గుతూ – సన్నగిలుతూ వస్తాయి. రజోగుణం నుండి "అసంతృప్తి – దృశ్యధ్యాస – ఆదుర్దా (Dissatisfaction - Avocation - Worrying)" అనే అలవాటు వచ్చిపడుతూ ఉంటాయి. ఈ జీవుడు ఎంతో కష్టపడి మానవ జన్మకు

వచ్చి ఉంటాడు కదా! ఇప్పుడు ఆతడు ముందుకు (ఊర్ధ్వస్థితులకు) పోకుండా ఈ రజోగుణం అడ్డుకుంటూ ఉంటుంది. "నా కున్నదంతా నాదే - నాకే ఉండాలి"... అనే అజ్ఞానం - లోభగుణం ఈ జీవుని కట్టి ఉంచుతోంది.

**తమోగుణం :** అజ్ఞానము (ఆత్మజ్ఞానమును ఏమఱచటము) చేత ఈ తమోగుణం రూపుదిద్దుకొంటోంది. ఈ గుణము జ్ఞానమును మరింతగా ఆవరించి ఉన్నదై ఈ జీవునిలో "అశ్రద్ధ - పరిశీలించకపోవటం - నిరుత్సాహము - అర్థం చేసుకోలేకపోవటం - ఆలస్యం" మొదలైనవి అధికం చేస్తోంది. తమోగుణం వృద్ధి చెందుతూ ఉంటే, అప్పుడిక సత్వగుణం - రజోగుణం ఈ జీవునిలో వెనుకంజవేస్తూ ఉంటాయి. ఈ జీవుడు బద్ధకము - అశ్రద్ధ - నెమ్మదితనము - నిద్ర (మౌర్ఖ్యము) అభ్యసిస్తున్న కారణంగా అప్రవృతి (Lazyness to take up anything) వచ్చి చేరుతోంది. పరిశీలనాశక్తి, ప్రదర్శనాశక్తి నెమ్మదిస్తూ వస్తాయి.

జీవితకాలమంతా ఈ తమోగుణ విభాగములైనట్టి అశ్రద్ధ - బద్ధకము - పరిశీలించకపోవటం - పనిలో నిరుత్సాహం - ఆలస్యము - అజాగ్రత్త మొదలైనవి అభ్యసించినవాడు... దేహానంతరం మూఢయోనులకు ప్రయాణిస్తున్నవాడగుచున్నాడు. జ్ఞానవృద్ధికి అవకాశములు అతి తక్కువగా ఉండే పక్షి - జంతు జన్మల వైపుగా దారి (Path) అనుసరిస్తున్న వాడై ఉంటున్నాడు. తమస్సు యొక్క ఫలితం అజ్ఞానం మరింత వృద్ధి కావటమే సుమా! ఆ అజ్ఞానానికి ఫలితంగా అజాకరూకత - మోహము - అజ్ఞానదశలు ఇంకాఇంకా వృద్ధి పొందుచున్నాయి. ఈ విధంగా తమోగుణం అలసత్వానికి - అంధకార బంధురమైన స్థానాలకు - అజ్ఞానమునకు ఆలవాలమగు స్థితిగతులకు త్రోవతీస్తూ ఈ జీవుని అధోగతిపాలు చేస్తోంది.

⋆⋆⋆

ఓ అర్జునా! వింటున్నావు కదా! ఈ విధంగా జీవితమంతా సత్వ - రజ - తమో గుణములలో (**ప్రకాశము - ప్రవృత్తి - అప్రవృత్తి, బద్ధకము**) ఏదైతే ఎక్కువగా ఈ జీవుడు జీవితమంతా అభ్యసిస్తూ వస్తాడో.... అదియే ఈ

జీవుని యొక్క ఉత్తరోత్తర స్థితిగతులకు వెంటనంటి త్రోవచూపుతోంది. అనగా, ఇక్కడ రెండు విషయాలు నీవు గమనించు.

1. **గుణముల ప్రభావము** : ఈ త్రిలోకములలోని సర్వజీవుల ఆయా స్థితి - ప్రవర్తన - అవగాహన - జన్మ - కర్మవిధానములన్నిటికీ త్రిగుణములే కారణం. ఏ జీవుడు ఏఏ జన్మలు పొందుచున్నాడో, ఏఏ మానసిక స్థితులు అనుభవిస్తున్నాడో... అదంతా ఆతని (త్రిగుణ విభాగంలో చెప్పుకున్న) అభ్యాసఫలములే! అభ్యాసములు గుణవృద్ధిని నిర్ణయం చేస్తున్నాయి. కనుక ఈ జగత్తులోని సర్వ జీవుల జ్ఞాన - ప్రవృత్తి - అజ్ఞానములకు ఆయా జీవులు ఆశ్రయించే గుణములు కర్తృత్వము వహిస్తున్నాయి. జీవితాంతం ఏ గుణములను అభ్యసిస్తాడో, అవియే ఉత్తరోత్తర ఉపాధులను నిర్మించుకుంటూ పోతున్నాయి.
2. **గుణములకు మునుముందే ఉన్న"గుణి"** : ఇక ప్రతి జీవునిలోని "ద్రష్ట" గుణములకువేరై, ఆత్మస్వరూపుడై ఉన్నాడు. ప్రతి జీవునిలో సర్వదా వేంచేసియున్న పరమాత్మ సర్వదా నిర్మలుడు. గుణాతీతుడు. ఈ రెండు విషయములు ఎవరు గమనిస్తారో అట్టివారు నా స్థానమును చేరి, నావలె "అప్రమేయ - అఖండ - నిత్య - సర్వాత్మత్వము"ను ఆస్వాదించగలరు. గుణాతీతులు కాగలుగుచున్నారు.

ఏ జీవుడైతే ఈ దేహపరంపరల ఉత్పత్తి - స్థితి - గతులకు కారణమగుచున్న త్రిగుణముల ప్రభావమును గమనించి క్రమంగా త్రిగుణాతీత దృష్టిచే ఈ సహజీవులను - ఈ జగత్తును సందర్శిస్తూ వస్తాడో... అట్టివాడు తన యొక్క త్రిగుణాతీతత్వం ఆస్వాదిస్తున్నాడు. తాను గుణాతీతుడగుచున్నాడు. అట్టి గుణాతీతత్వముచే ఈ జగత్తులో అగుపిస్తున్న జన్మ - మృత్యు - జరా - పునర్జన్మాది దుఃఖములను (concerned all worries) అధిగమించినవాడై అమృతానందం స్వరూపుడు, మృత్యుంజయుడు అగుచున్నాడు. "నేను గుణములచేతగాని ఉపాధుల రాకపోకలచేతగాని బద్ధుడను కాదు" - అని గ్రహిస్తున్నాడు.

**అర్జునుడు** : మహాత్మా! శ్రీకృష్ణా! ఏఏ గుణ అభ్యాసములచేత ఈ జీవుడు తనను తాను త్రిగుణాతీతంగా తీర్చిదిద్దుకోగలుగుచున్నాడో..., సందర్శించ గలుగుచున్నాడో అది వివరించండి. ఏఏ ఆచార – వ్యవహారాదులచే ఈ జీవుడు త్రిగుణములచే స్పృశించబడక, వాటికి వేరుగా సహజీవులలోని త్రిగుణాతీతమగు "స్వస్వరూప – అకర్తృత్వ – నిత్యనిర్మల ఆత్మ"ను అవలోకించగలుగుతాడు? తనను తాను ఎట్లా గుణాతీతమగు నిత్యానందాత్మ స్వరూపంగా సాక్షాత్కరించుకోగలుగుతాడు?

**శ్రీకృష్ణుడు** : అర్జునా! ఈ త్రిగుణములను అధిగమించనెంచి, "త్రిగుణాతీతుడు – అంతరంగ హృదయాంతరగుడు"– అగు పరమాత్మ సందర్శనమును ఆశయముగా కలిగియున్న మహాత్ములు ఏఏ అభ్యాసములు ఆశ్రయిస్తున్నారో ....అది చెప్పుచున్నాను. విను.

## త్రిగుణాతీతుడు

ఈ జీవులు "ప్రకాశము – ప్రవృత్తి – మోహము" అను త్రిగుణములలో ఏదో ఒకటి అధికం అభ్యసిస్తూ ఉండటంచేత... వారు ఆయా ప్రవర్తనలు – స్వభావములు – వ్యక్తిత్వములు కలిగిఉండటం జరుగుతోంది. (The practices of a person are framing and shaping the behavior, features and personality) ఈ జగన్నాటక దృశ్య – త్రిగుణచమత్కారమంతా గమనించిన జ్ఞానయోగి ఇదంతా చూస్తూ కూడా ఏమాత్రం వేదన చెందడు. ***ఆయా గుణమూ "సంప్రవృత్తి"ని ద్వేషించడు. "నివృత్తి"ని కాంక్షించడు.*** అనగా, ఈ జగత్తులో దేనినీ ద్వేషించడు, ఆకాంక్షించడు. ఈ జీవుల గుణములపట్ల "వారు అట్లా ఉన్నారేం? వీరు ఇట్లా ఉండాలికదా?"... అనే ఆవేశము – స్పర్థ – ఇష్టము – అయిష్టము మొదలైనవి పొందడు. "*ఈ ప్రతిజీవునిలోను ఈ ఈ గుణమూ వెనుక పరమాత్మ యొక్క జగన్నాటక సూత్రదారణయే వేంచేసియున్నది కదా!".. అను బావమును పెంపొందించుకొని ఉంటాడు.* ఇక, ఈ గుణములచే భావ – గుణ సంఘర్షణలు, వాటి – వాటి పర్యవసానములు చూచి "ఇదంతా కథాకల్పన చమత్కారం!"

అని గమనిస్తున్నాడు. **వాటిపట్ల ఉదాసీనత వహిస్తున్నాడు.** వాటియందు ప్రవృత్తిని కోరుకోడు. నివృత్తిని కోరుకోడు. ఈ జగత్తులోని సర్వసంఘటనలను చూచీ చూడనట్లే ఉంటాడు. అంతేగాని ఈ జగత్తులోని వ్యక్తులను – సంఘటనలను చూచి వ్యధ (Disturbance - perturbance) చెందడు. ఈ సర్వగుణములకు ఆధారమైన పరమాత్మనే సర్వేసర్వత్రా సందర్శిస్తూ ఉంటాడు. "గుణాతీతుడగు పరమాత్మయే ఈ సర్వజీవులుగా ప్రదర్శితమగుచున్నారు కదా!" అనే అనునిత్య సందర్శనమును ఏమరువడు. నిశ్చలంగా – గుణాతీతంగా – పరమాత్మ భావంతో ఈ జగత్తును – "నిశ్చింతతో కూడిన దృష్టి"తో సందర్శిస్తూ ఉంటాడు. ఆతడు సుఖాలు చూచి పొంగడు. దుఃఖాలు చూచి క్రుంగడు. సహజీవుల ప్రవర్తనలు చూచి "అయ్యో! ఆహాఁ!"... మొదలైన రూపంగా లోనుకాడు. ఈ జగత్తులోని మట్టి – రాయి – బంగారములను ఒకే తీరుగా ఉద్వేగరహితంగా దర్శించటం అభ్యసిస్తూ ఉంటాడు. గుణాతీతమగు "ఏకీభావము" నుండి ఏమాత్రం చెదరడు. సర్వమునకు సాక్షిత్వము వహించి, తనయొక్క ఆ కేవలసాక్షిత్వమును సర్వదా పరిపోషించుకుంటూ ఉంటాడు.

ఇక్కడ తనకు తారసపడుచున్న ప్రియ – అప్రియములను, నిందా – స్తుతులను, మాన – అవమానములను, శత్రు – మిత్రులను ఎవ్వరైతే ఉత్తమబుద్ధిచే సందర్శిస్తూ – అతీతులై ఉంటారో... సర్వకర్మలు నిర్వర్తిస్తూనే సర్వదా 'పరిత్యాగి' అయి ఉంటారో... అట్టివారు "గుణాతీతులు"– అని శాస్త్రములు గానం చేస్తూ చెప్పుచున్నాయి.

అట్టి గుణాతీతాభ్యాసి కర్తృత్వాభిమానం లేనివాడై ఉంటాడు. ఆపై ఇక, భోక్తృత్వమును కూడా అధిగమించిన వాడై ఉంటాడు. ఆతడు "**సర్వాత్మకుడను – కేవలీస్వరూపుడను**" అగు నాపట్ల భక్తి – ప్రపత్తులు సమర్పిస్తూ క్రమంగా ఈ త్రిగుణముల ప్రభావము – ప్రయోజనము – ఇతః పూర్వపు – ఉత్తరోత్తర ఫలములను అధిగమించిన వాడై.... సచ్చిదానంద పరబ్రహ్మమును పొందుటకు – అనగా, "బ్రాహ్మీస్థితి"కి యోగ్యతను సిద్ధింపజేసుకుంటున్నాడు.

ఓ అర్జునా! ఆత్మనుండి గుణములు, గుణములనుండి జగత్‌దృశ్య అనుభవములు ప్రదర్శిత మగుచున్నాయికదా! అయితే, జగత్తులకు, జగదంతర్గత దేహములకు, ఆ దేహములకు కారణభూతమగు గుణములకు ముందే స్థితి కలిగియున్న స్వరూపమే "నేను". అట్టి బ్రహ్మమే నా "స్థితి, స్థానము – నివాసము – తత్వము – స్వభావము" కూడా! అట్టి నా 'గుణి' స్వరూపమును గుర్తెరిగినవాడవై ఉండు. "బ్రహ్మమే నా స్వరూపము - ఉనికి - స్థానము" అని గ్రహించు. గమనించు. త్రిగుణాతీత – త్రిగుణాధారుడనగు నన్ను చేరు. త్రిగుణాతీతుడవై ఆత్మసుఖం ఆస్వాదించు.

*ఇతి గుణత్రయ విభాగయోగ పుష్పం*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

★★★

శ్లో॥ మాన - అవమానయోః తుల్యః, తుల్య మిత్ర - అరి పక్షయోః ।
సర్వారంభపరిత్యాగీ, 'గుణాతీతః' స ఉచ్యతే ॥

[యః] "మానావమానయో, మిత్రారిపక్షియో" త్యుూః
సర్వారంబాుపరిత్యాగీ [వర్తతే], సః 'గుణాతీతః' - ఉచ్యతే ॥

ఎవరైతే మానావమానములను, శత్రు మిత్రభావములను విడచి కర్తృత్వాభిమానరహితుడై ఉంటాడో, ..... ఆతడు 'గుణాతీతుడు' అని చెప్పబడుచున్నాడు.

# 15

# పురుషోత్తమ ప్రాప్తియోగ పుష్పం

**శ్రీకృష్ణ బాుగవాన్** : ఓ అర్జునా! "ఈ దృశ్య జగత్తంతా పరమాత్మ అనే కవినుండి బయల్వెడలిన త్రిగుణముల కథన విశేషమే" అని, "ఈ సర్వజీవులలో సర్వదా వేంచేసియున్న త్రిగుణాతీతుడగు పరమాత్మను సందర్శిచటం'' అనే అభ్యాసయోగమును ఆశ్రయించమని, ''అట్లు ఆశ్రయించి తద్వారా గుణాతీతత్వముచే ప్రకాశించవలసినది" గాను బోధించాను కదా!

అయితే స్వతఃగా ఆత్మ స్వరూపుడగు ఈ జీవుడు స్వస్వరూపానుసంధానం ఏమరచి "త్రిగుణపరిమిత దృష్టి"చే నిబద్ధితుడు ఎందుకు అగుచున్నాడో, ఈ పురుషుడు (జీవుడు) పురుషోత్తమత్వం సముపార్జించుకోవటం ఎట్లాగో... అది సవివరిస్తున్నాను. విను.

⋆⋆⋆

ఈ జీవునికి గుణముల చమత్కారము, తద్వారా జన్మ - కర్మ పరంపరలు, ఆ జన్మలలో ప్రకాశ - ప్రవృత్తి - మోహపరంపరలతో కూడిన

ఉత్తమ – అధమ (విజ్ఞాన – అజ్ఞాన) స్థితి – గతులు... సంప్రాప్తించటానికి కారణం? దృశ్యమా? కానేకాదు. ఏ ఈ దృశ్యము ద్రష్టచే "సుఖ–దుఃఖ; మాన – అవమాన; ప్రియ – అప్రియ; నింద – స్తుతి; మిత్ర – శత్రు; అయినవారు – కానివారు; జన్మ – మృత్యు" మొదలైన ద్వంద్వములతో కూడుకొనినదై అనుభవించబడుచున్నదో, ... – అంతటికీ మూల కారణం అంతరంగమే! అనగా ఈ ద్రష్ట యొక్క అంతరంగమే అన్నిటికీ స్థానముగా కలిగి ఉంటోంది. ఈ "సందర్శనము" అనే త్రిగుణకల్పిత – అనుభవ పరంపారారూప – సంసారమునకు మూలము అంతరంగమే! అనగా, అంతరంగము యొక్క అనుభవ పరంపరలు ఈ జగత్తునందు విస్తరించినయున్నాయి. అందుకని శాస్త్రములు ఈ సంసారదృష్టిని అశ్వత్థ (రావి) వృక్షముతో పోల్చుచున్నాయి. అజ్ఞానముచే ఏర్పడిన ఈ "సంసార దృష్టి" అనే వృక్షముయొక్క మూలము హృదయాంతరంగమునందు ఉన్నది. దీని శాఖోపశాఖలు "బాహ్యదేహ పరంపరానుభవముల – జగత్‌పరంపరల" రూపముగా విస్తరించి ఉన్నాయి.

ఈ సంసారవృక్షము యొక్క వ్రేళ్లు అంతరమున లోతుగా వ్యాపించి ఉన్నాయి. అద్దాని విస్తారము – సంసారవృక్షము యొక్క ఆకులు ఏమిటో తెలుసా? వేదములలోని కామ్య కర్మ విభాగములే! అనగా, "ఈ దృశ్యంలో ఏదో పొందాలి. అందుకై ఉపాసించాలి"... అనునవే ఆ సంసార వృక్షము యొక్క ఆకులు. అట్టి ఈ సంసార వృక్షము (The tree of Illusionary perceptions) యొక్క ఉనికి – వినాశనోపాయములు ఎవరు గ్రహించినవారై ఉంటారో... వారే విదిత వేత్తలు. వేదరహస్యం తెలిసినవారు, తెలియబడేదంతా ఏమై ఉన్నదో...అద్దానిని గ్రహించినవారగుచున్నారు. (వేదము = తెలియబడుచున్నది. వేదవిదులు = తెలియబడుచున్న దానియొక్క తత్త్వము ఎరిగినవారు.)

ఈ 'సంసారము' అనే అశ్వత్థ వృక్షము యొక్క శాఖలు అటు దేవతా జన్మలవైపుగాను – ఇటు మానవ – జంతు – స్థావర జన్మములవైపుగాను విస్తరించియున్నాయి. అనగా దృష్టులు (The perceptions of the preceiver) అటు దేవతా లోకములలోనికి, ఇటు భూ–పాతాళలోకములలోనికి విస్తారితమై

ఉన్నాయి. ఈ సంసారవృక్షము యొక్క వ్రేళ్లు 'త్రిగుణములు' అనే జలాన్ని పీల్చుకొని జీవనం పొందుతున్నాయి. "అనేక లౌకిక సమాచారాలు - అభిప్రాయాలు - కబుర్లు - దూషించుకోవటాలు - భూషించుకోవటాలు తిరస్కార పురస్కారాలు".... మొదలైన మిశ్రమములతో కూడిన ఎరువుచే పుష్టిని పొందుచున్నాయి. ఈ జీవుని "అనేక కర్మ - తదితర వ్యవహార - సంబంధ" పరంపరలలో బంధించి ఉంచుతున్నాయి. ఈ మనుష్యలోకంలో (జీవలోకంలో) అనేక ఉపాధిపరంపరలు ఈ జీవుని పట్ల వచ్చి - పోతూ ఉండటానికి సుధీర్ఘంగా కొనసాగటానికి కారణమగుచున్నాయి.

ఓ అర్జునా! ఈ విధంగా అంతరంగంలోంచి బయల్వెడలిన దృష్టియే ఈ జీవునికి అనేక ఉత్తమ - అధమ దేహపరంపరలుగాను, సృష్టిపరంపరలనుగాను సంప్రాప్తిస్తోంది. ఈతనిని అనేక కర్మ - అనుబంధ పరంపరలకు కట్టిపడవేసి ఉంచుతోంది. దృష్టియే సృష్టి. దృష్టియే సంసారము.

జీవులలో చాలామంది "నాకు ఈ దృశ్యమువలన సంబంధము - అనుబంధము - బంధము కలుగుచున్నాయి".. అని భ్రమిస్తున్నారు. అట్లా కానే కాదు. అంతరంగములో వ్రేళ్లు విస్తరించియున్న సంబంధ - అనుబంధ - బంధ సాంసారిక దృష్టులు బాహ్యాన ఎంతవెతకినా ఆను-పానులు దొరకవు. "నేను ఎందుకు బంధ - సంబంధములు అనుభవిస్తాను?" అని ప్రశ్నించుకొని ఒకానొకడు స్వర్గ - మర్త్య - పాతాళలోకములు ఎంతగా వెతికినప్పటికీ... అందుకు కార్య - కారణములు వాస్తవరూపం ఇక్కడ (దృశ్యంలో) లభించదు. ఎందుకంటే ఈ సంసారమనే అశ్వత్థవృక్షంయొక్క తన కార్య - కారణములనబడే వ్రేళ్లు అంతరంగంలో అతి లోతుగా - విస్తారంగా విస్తరించుకొని ఉన్నాయి. అంతటి ఈ సంసారవృక్షము కలుగజేస్తున్న దుఃఖాలకు (worries) అంతులేదు. పొంతులేదు. అద్దాని మొదలేమిటో - చివరేమిటో - అసలు ఎటునుంచివచ్చి భ్రమింపజేస్తోందో ఈ జీవుడు గమనించలేక పోతున్నాడు.

అటువంటి లోతులోతులలో, పాతుకొని - విస్తరించి ఉన్న ఈ

సంసారవృక్షమును "అసంగము – (Non-Attachment (or) Detachment with all incidents, people, situations, contacts, etc., including the incidents of "Birth and Death")" అనే గండ్రగొడ్డలితో మొదలంట్లా ఖండించివేయాలి. జగత్తుతో గుణసంబంధములను అతిక్రమించి గుణాతీతుడగు పరమాత్మతో సంబంధ – బాంధవ్యములు పెంపొందించుకోవాలి. ఈ "జగత్‌దృష్టులు" అనే సంసార వృక్షమును మొదలంట్లా త్రెంచి, ... ఆ అడ్డుతొలగించుకొని "పరమాత్మ" అనే పరమానంద స్థానమునకు త్రోవ చేసుకోవాలి.

ఈ సంసార ప్రవృత్తులన్నీ జలంలోంచి తరంగాలవలె ఎందులోంచి బయల్వెడలుచున్నాయో అట్టి ఆదిపురుష సంస్థానమగు నా స్థానము చేరినప్పుడు ఇక "పునరావృత్తి" అనే దోషం ఉండదు. ఇక దృశ్య సంబంధమగు తదితరమైనదంతా పునరావృత్తి దోషం కలిగి ఉంటుంది.

అటువంటి పునరావృత్తిరహిత – సర్వజగదతీత – సర్వజగత్ ఆధార స్థానం చేరటానికి, ఈ దృశ్యమును – దృశ్యత్వమును అధిగమించాలి. అందుకు ఉపాయము – మార్గము చెప్పుచున్నాను. విను.

1. **నిర్మామాన–మోహా** : క్రమంగా "అసంగము" అనే చురకత్తితో "మానము" (ఆత్మస్తుతి–పరనింద) – "మోహము" (Illusionary - Opinions, feelings, interpretations, perceptions)లను త్రెంచివేయాలి. హృదయములోని మానము – మోహము అనే మకిలిని కడిగివేయాలి.

2. **జిత సంగదోషాః** : మనస్సు "సంగతులు – సందర్భములు – విషయ పరంపరలు....., ఇత్యాది సంగదోషములను మూట కట్టుకొని ఉండటం" జరుగుతూ ఉంటుంది. అట్టి సంగదోషమును "అసంగము" అనే ఔషధముతో తొలగించుకోవాలి. (Attachement should be fought out with the help of Detachment).

3. **అధ్యాత్మనిత్యా** : అనునిత్యంగా ఈ దృశ్యాంతర్గత సహజీవులపట్ల "ఇదంతా పరమేశ్వరత్వముచే సర్వదా భాసిస్తున్నది కదా!".. అను

సంభావనను అఖండ దీపమువలె అంతరంగమున ఉపాసనా పూర్వకంగా వెలిగించాలి. అట్లా అనువర్తింపజేయుటచే 'ద్వితీయభావన'ను జయించాలి. 'అద్వియత్వం' సముపార్జించుకోవాలి.

4. **వినివృత్తకామా:** ఈ దృశ్యమునకు సంబంధించిన సర్వ కామములు (All Expectations at its root) హృదయమునుండి నివృత్తి చేసుకోవాలి. నిత్యయజ్ఞోపాసనాభావంతో కర్మబంధములను అధిగమించివేయాలి.

5. **ద్వంద్వైర్విముక్తః సుఖదుఃఖ సంజ్ఞైః** : "ఇది నాకు సుఖము - ఇది నాకు దుఃఖము" అను అంతరంగ నిర్వచనముల నుండి మనస్సుకు విముక్తిని (Relief) కలుగజేయాలి. నీయొక్క మనోబుద్ధులు అట్టి స్వయంకృతములైనట్టి పరిమితత్వములను అధిగమించాలి.

6. **అమూఢాః** : ఆయా విషయములను సమన్వయించుకోవటంలో నీ బుద్ధి "వివేకము - విజ్ఞానము - దీర్ఘదర్శనము".. మొదలైనవి అలవరచుకొన గలిగి ఉండాలి. మూఢత్వం త్యజించి ఉండాలి.

ఇటువంటి ఆయా సాధనమార్గములచే ఆ "తత్" పదమును, (సర్వము స్వస్వరూపంగా పరమాత్మతత్వంగా ఆస్వాదించే స్థితిని) తప్పక జేరుకోవచ్చు.

ఓ అర్జునా! ఈ జీవునిలో అజ్ఞానాంధకారము రూపుదిద్దుకొని స్వస్వరూపమును ఆవరించుకొనినదై ఉన్నది. అట్టి అజ్ఞానాంధకారం తొలగాలంటే ఈ భౌతిక సూర్యుడు - చంద్రుడు ఉదయించట చేతనో, ఒక దీపం వెలిగించటంచేతనో - తొలగేది కాదు. సూర్యుడు ఉదయిస్తే తొలగుచున్న చీకటి సూర్యుడు అస్తమించగానే వచ్చి పడుతోంది. చంద్రుడు పౌర్ణమిరోజు ఆకాశంలో ప్రకాశిస్తున్నప్పుడు కనపడని చీకటి అమావాస్య రోజు తిరిగి వచ్చి పడుతోంది. దీపం వెలుగుతుంటే కనిపించని చీకటి దీపం తొలగించగానే వచ్చిపడుతోంది. అయితే జ్ఞాన దీపంతో తొలగిపోతున్న అజ్ఞానాంధకారం మరల వచ్చిపడేదికాదు. నాయొక్క గుణాతీతమగు అధ్యాత్మానందస్థితికి చేరుకున్న తరువాత తిరిగి అది తొలగటం జరగదు. అట్టి పరంధామం స్వకీయమైన ప్రయత్నములచే తప్పక

లభించగలదు. అట్టి నా పరమపరుషస్థానం గురించి చెప్పుచున్నాను విను.

☆☆☆

మాయకు – సంసారమునకు ఆవల సర్వదా ఆత్మస్వరూపుడనై, నిత్యోదిత చైతన్య స్వరూపంగా నేను వెలుగొందుచున్నాను.

అట్టి అప్రమేయాత్మస్వరూపుడనగు నాయొక్క ఒకానొక అంశ యే ఈ జీవలోకంలో జీవతత్వంగా ప్రవేశిస్తోంది. సూర్యునికాంతి భూమిపైగల ఆయా వస్తువులపై బడినప్పుడు ఆ కాంతి వస్తువుయొక్క ఆకారంగా కనబడటం జరుగుతోంది చూచావా? అట్లాగే ఈ జీవలోకంలో ప్రవేశించినట్టి నాయొక్క అంశ జీవతత్వరూపంగా ప్రకృతియందు ప్రవేశించగానే ప్రకృతిలోని "పంచేంద్రియములు – ఆరవదియగు మనస్సు" అనే అంశ తన వైపు ఆకర్షిస్తోంది. అట్టి నా అంశ ఆయా శరీరములను పొందుతూ – పంచేంద్రియములను – మనస్సును ఉత్తేజింపజేసి తద్వారా దేహయానం ప్రారంభిస్తోంది.

వాయువు ఆయాపుష్పముల మీదుగా ప్రసరిస్తూ... పయనిస్తూ ఆ పుష్పసుగంధమును తనవెంట గొనిపోతూ ఉంటుంది చూచావా! అట్లాగే నా యొక్క జీవాంశకూడా ఒక శరీరమునుండి నిష్క్రమిస్తూ మరొక శరీరముతో ఉపక్రమిస్తున్నప్పుడు తన "పంచేద్రియ – మనస్సు"లను తనవెంట నుంచుకొని ప్రయాణిస్తోంది. మరొక శరీరములో ప్రవేశిస్తూ ఉన్నది. ఆ నూతన శరీరములో ఇతఃపూర్వపు సంస్కారములతో కూడుకొని మరల చెవులతో వినడమనే అనుభవం, కళ్లతో రూపానుభవం, చర్మంతో స్పర్శానుభవం, నాలుకతో రుచిఅనుభవం, ముక్కుతో ఆఘ్రాణానుభవం కొనసాగిస్తోంది. నూతన దేహంతో ఆ శబ్ద – స్పర్శ – రూప – రస–గంధానుభవములను కొంతకాలం ఆస్వాదిస్తోంది. ఇంతలోనే ఆ శరీరం నుండి నిష్క్రమించినపుడు మరల తన వెంట శబ్ద – స్పర్శ – రూప – రస – గంధానుభవాలు "సంస్కారరూపం"గా వెంట నిండుకొని మరొక నూతన దేహంలో మరల కొనసాగిస్తోంది. ఈ రీతిగా నా యొక్క జీవచైతన్యాంశ "దేహ – దేహాంతర" చమత్కార ప్రయాణం కొనసాగిస్తోంది.

సర్వజీవులయొక్క జీవాంశ – దేహదేహాంతర ప్రయాణములు – అనుభూత – అనుభవములు కొనసాగించటం ఇట్టిదే!

**ఈ విధంగా ఈ జీవుడు నా యొక్క అంశయే!**

**ప్రతి జీవుడు వాస్తవానికి ఆత్మస్వరూపుడే!**

అయితే....,

"ఆత్మస్వరూపులై ఉండగా వారి జీవాంశ ప్రకృతిలో ప్రవేశించి, ఇంద్రియమనస్సులను ఆకర్షించి దేహ – దేహాంతర ప్రయాణాలు నిర్వర్తించటం".... అనే చమత్కారమంతా వర్తమాన దేహంతో– దృశ్యంతో తదాత్మ్యతచే విమూఢులైనవారు గమనించలేకపోతున్నారు. వారు "ఎప్పుడో పుట్టాను – ఎప్పుడో మరణించువాడను" ... అని దేహాత్మభావనావేశపరులై ఉంటున్నారు. అయితే ఎవ్వరైతే జ్ఞానచక్షువులను నిశితం చేసుకొని గమనిస్తున్నారో, **అట్టివారు "నాయొక్క ఒకానొక స్వల్పాంశము ప్రకృతిలో ప్రవేశించి ఇంద్రియమనస్సులను ఆకర్షించి జన్మపరంపరలు ఆస్వాదిస్తోంది. ఇక నేను ఆ అంశముకంటే గరిష్ఠుడనై, అప్రమేయమగు ఆత్మస్వరూపుడనై, ఈ జన్మ – కర్మ తతంగములకు కేవల సాక్షినై ఉన్నానుకదా!"**..... అని గమనిస్తున్నారు. ఆరీతిగా సందర్శిస్తున్నారు. అట్టి సందర్శనమే "పురుషోత్తమప్రాప్తి యోగం."

ఓ అర్జునా! నిర్మలహృదయులగు యోగులు ప్రయత్నపూర్వకంగా తమ హృదయాంతర్గతంగా సర్వదా వేంచేసియున్న – అప్రమేయ స్వస్వరూపాత్మను సదా సందర్శిస్తున్నారు. మరికొందరు యోగులు హృదయముయొక్క నిర్మలత్వం ఇంకనూ సముపార్జించకపోవటంచేత,... ప్రయత్నశీలురై ఉండికూడా తమ హృదయాకాశంలో ఆత్మసాక్షాత్కారమును ఇంకనూ ఆవిష్కరించి – ఆస్వాదించలేకపోతున్నారు!

**తేజోరూపం** : ఓ అర్జునా! ఆత్మ తత్వస్వరూపుడనగు నేనే ఈ జగత్తుకు "తేజస్సు" అయి ఉన్నాను. "ఏ తేజోవిలాసము సూర్యగోళంలో విరాజిల్లుతూ,

చంద్రబింబములోను – అగ్నిలోను ప్రకాసిస్తోందో ఆ తేజస్సు ఆత్మస్వరూపుడనగు నా యొక్క అంశయే"... అని గ్రహించు.

**ఓజోరూపం :** అట్టి నా అంశయగు తేజస్సే సూర్య – చంద్రమండలములనుండి భూమియందు ప్రవేసించి 'ఓజస్సు'గా విరాజిల్లుతోంది. భూమియందు ప్రవేశించిన ఆ ఓజస్సు ఓషధులను పరిపోషిస్తూ రసరూపమగుచున్నది. ఆ రసతత్వం వృక్షజాలములకు పరిపోషణ ప్రసాదిస్తోంది. వృక్షజాలం జంతుజాలమునకు 'ఆహారం' ప్రసాదిస్తోంది.

వైశ్వానరాగ్ని: తేజోరూపంతో సూర్య చంద్రులలోను, ఓజోరూపంతో రసతత్వంగా భూమిలో ప్రవేసిస్తున్న నా జీవచైతన్యాంశయే సర్వజీవులలో వైశ్వానరాగ్ని రూపంగా ప్రవేశించుచున్నది. ప్రాణుల దేహములను ఆశ్రయించి వారు భుజిస్తున్న భక్ష్య – భోజ్య – లేహ్య – చోహ్యములను (చతుర్విధ ఆహారములను) పచనం చేస్తూ దేహనాళములో అన్నరసము ప్రవేశించటానికి కారణమగుచున్నది. ప్రాణ – అపానములను చెకుముకిరాళ్లవలె ఉపయోగించి సకల జీవరాసులలో జఠరాగ్నిని జనింపజేస్తున్నది.

అంతేకాదు.


నేను సర్వజీవుల హృదయంలో ప్రవేశించి అంతర్యామినై ఉంటున్నాను. ఆజీవుల యొక్క మరపు – జ్ఞాపకము – జ్ఞానము – అపోహ (అనుమానము) నావలననే కలుగుచున్నాయి.

వేదములన్నీ వేదవేద్యునిగా (తెసుసుకొనవలసినవాటిలో అత్యుత్తమమైనదిగా) గానం చేస్తున్నది తేజో – ఓజో – వైశ్వానరాంశరూపుడనగు నన్నే సుమా!

⋆⋆⋆

ఓ అర్జునా! ప్రతి జీవుడు "మార్పు చెందునది – మార్పు చెందనిది" అను రెండు చమత్కారవిశేషములు సమావేశముతో కూడుకొని ఉన్నాడు. సర్వ

విషయ - వ్యవహార - సంబంధ సంఘటనలు, తదంతర్గత పదార్థజాలము "క్షరము". ప్రతి జీవునిలోని 'నేను' అనునది మార్పు - చేర్పులు చెందనిదై (అక్షరమై) యున్నది.




ప్రతిజీవునిలోను మార్పుచెందు విభాగము (క్షరము–Changing Factors) మార్పుచెందని విభాగము (The changeless self-concept–అక్షరము) జంటకవులవలె కూడి ఉంటున్నాయి.

అయితే,...

ఈ జీవుడు ఒక దేహముచే పరిమితుడు కాదు. ఆతడు తాను సందర్శించే జగత్తంతటికీ సర్వాంతర్యామి కూడా! అట్టి సర్వాంతర్యామియే ఉత్తమపురుష (The First person). అదియే "పరమాత్మ" అని వ్యవహరించబడుతోంది. (ఆ విధంగా ప్రతి జీవుడు పరమాత్మస్వరూపుడే!)

ఓ అనఘా! పాపదృష్టి ఏమాత్రం లేనట్టి నిర్మలహృదయుడా! అర్జునా! ఇప్పుడు నేను చెప్పినట్టి "జీవుడు సర్వాంతర్యామిత్వము ఆస్వాదించటం" అనునది పరమోత్తమమగు శాస్త్రసారం. ఇది పురుషోత్తమ ప్రాప్తియోగం! ఇది రహస్యములలోకెల్ల గొప్ప రహస్యం. ఆత్మ దృష్టి (పురుషోత్తమత్వం).... ఆస్వాదించువాడు తత్వశాస్త్ర రహస్యం ఎఱిగినవాడగుచున్నాడు. "ఈ కనబడే సర్వమునందు నా పురుషోత్తమరూపమే సర్వదా అంతర్లీనగానంగా వేంచేసియున్నది."... అను స్థితిని బుద్ధితో గ్రహించినవాడు సర్వే-సర్వత్రా పొందవలసినది పొందినవాడు అగుచున్నాడు.

ఓ అర్జునా! అట్టి పురుషోత్తమ ప్రాప్తియోగమునకై సంసిద్ధుడవగుము. అభ్యసించు. ఆస్వాదించు. యోగారూఢుడవు కమ్ము. అప్పుడు నీవు దృశ్య కల్పిత బంధములనీ స్వతఃసిద్ధంగా అధిగమించివేయగలవు. ***దృశ్యాతీతమగు అమృత స్వరూపంతో దృశ్యమును ఆస్వాదించగలవు.***

***ఇతి పురుషోత్తమప్రాప్తి యోగ పుష్పః.***

***శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు***

★★★

శ్లో॥ త్రివిధమ్ నరకస్య ఇదమ్ ద్వారయ్ నాశనమ్ ఆత్మనః
**"కామః-క్రోధః తథా లోభః"! తస్మాత్ ఏతత్ త్రయమ్ త్యజేత్ ॥**

"కామః-క్రోదాః-లోబాః" ఇదమ్ త్రివిదారమ్ నరకస్య ద్వారమ్
ఆత్మనః నాశనమ్ । తస్మ్మాత్ ఏతత్ త్రయమ్ త్యజేత్ ॥

కామ-క్రోధ-లోభములనబడే మూడు ఈ జీవునికి నరక ద్వారములు. అవి ఆత్మానుభూతికి అడ్డు అయి జీవుని నిమ్నస్థితులకు దారితీస్తున్నాయి. అందుచేత ఈ మూడు త్యజించివేయాలి!

# 16.

# దైవాసుర సంపత్ విభాగయోగ పుష్పం

**శ్రీకృష్ణ బాగవానుడు** : ఓ అర్జునా! ఈ మూడు లోకములు ఎద్దానియందైతే ఉన్నాయో అట్టి పరమాత్మయోగమును (పురుషోత్తమప్రాప్తి యోగమును) అభ్యసించి తద్వారా ఈ సంసార స్థితులను అధిగమించాలని చెప్పి ఉన్నాను కదా! అయితే *ఈ జీవుడు అందుకు తగిన సాదానసంపత్తిని సముపార్జించుకోవాలి.* వాస్తవానికి కొంత సాధన సంపత్తి యొక్క ప్రయోజనంగానే ఈ జీవునికి మానవజన్మ లభించటంకూడా ! అట్టి సాధన సంపత్తిలో ఈతనికి సంసారబంధం (దేహాత్మ భావం - దృశ్యపరిమిత భావం) ప్రవృద్ధ పరచే సంపదకూడా వెంటనంటి ఉంటోంది. అందుచేత ఈ జీవుడు తన సాధన సంపత్తిని విభాగంచేసి ఏది బంధమును తొలగించటానికి తనకు సహకరిస్తోందో, ఏ సంపద తనకు సంసారబంధమును మరింత అధికంగా చేస్తోందో... విభాగించుకోవాలి. బంధనివృత్తి కలుగజేసే దైవీసంపదను ప్రవృద్ధం చేసుకోవాలి. బంధమును అధికం చేసే ఆసురీ సంపదను క్రమంగా తొలగించుకోవాలి. అందుకు ఈ మానవ జన్మ ఒక మహత్తరమైన సదవకాశం. అట్టి దైవ - అసుర సంపత్ విభాగ యోగం వివరించి చెప్పుచున్నాను. శ్రద్ధగా విను.

# దైవీ సంపద

1. **అభయం** (FEARLESSNESS) : ముందుగా భయము – పిరికితనము దరిజేరనీయరాదు. "తల్లి గర్భంలో రక్షించిన పరమాత్మ సర్వదా రక్షిస్తూనే ఉంటారుకదా!"... అని ధైర్యం వహించి ఉండాలి. "అయ్యో! భవిష్యత్తు సంగతేమిటి? ఏమౌతుందో? ఎట్లాగో? గతిఏమిటి? ఉన్నవేవో పోతాయేమో? లేని ఆపదలు వచ్చిపడతాయోమో?"... ఇటువంటి అధైర్యముతో కూడిన ఆలోచనలతో జీవుని విలువైన కాలం వృధాఅవుతోంది. కనుక ముందు ధైర్యం సర్వదా గూడుకట్టుకొని ఉండే ఆలోచనలను పరిపుష్టిచేసుకో. (నాయమాత్మా బలహీనేన లభ్యః – ఉపనిషత్).

2. **సత్త్వసంసుద్ధి** (Positive Attitude) : అంతఃకరణము సాత్వికమైన భావాలతో పవిత్రంగా ఉంచుకోవాలి. "కోపము – ఆవేశము – కసి – ద్వేషము – ఎదుటి వారిలో తప్పులుపట్టుకోవటం – దూషించటం – తప్పులు గుర్తుచేసుకొని రోజులతరబడి మాట్లాడుకోవటం"... ఇవన్నీ స్వకీయ గుణదోషములుగా గ్రహించి, అట్టి అభ్యాసములను ఉపసంహరించుకోవటం అభ్యసించాలి.

3. **జ్ఞానయోగవ్యవస్థితః** (Keeping up wisdom) : ప్రపంచంలో కొద్దిమంది జ్ఞానులు – అనేకమంది అజ్ఞానులు ఉండటం జగత్ స్వభావం. జ్ఞానులే మనకు మార్గ దర్శకులు. ఇక్కడి సంగతి – సందర్భము – వ్యవహారములను జ్ఞానదృష్టితో పరికించాలి. అజ్ఞాన దృష్టితోకాదు. మహనీయుల జ్ఞానవాక్యములను – ఆత్మజ్ఞానశాస్త్ర ప్రవచనములను మననం చేయాలి. సమాలోచన చేయాలి. అంతేగాని, "వాళ్లు మంచివారు కాదు! వీరి బుద్ధులు ఇంతే! వీరే ఇట్లా చేస్తుంటే, ఇక నేనెందుకు తప్పులు చేయకూడదు?"... ఇటువంటి అజ్ఞాన జనిత ఉద్వేగాలను సమాలోచన చేయటం శ్రేయం కాదు.

4. **దానం** (Attitude of Giving) : "ఇతరులకు నేనేమి ఇస్తున్నాను?".. అను ప్రశ్న దానబుద్ధి నుండి వస్తోంది. "ఇతరులు నాకేమి ఇచ్చారు?"... అనేది దానవబుద్ధి. ఆసురీస్వభావ బీజం. నాకు ఇవ్వబడుచున్న దానిలో కొంతైనా స్వామి స్వరూపులగు తదితరులకు సమర్పిస్తాను".. అనే స్వభావం దైవీసంపద. ద = ఇచ్చుట. ఆనం = మోక్షమార్గం. దానం చేసే స్వభావం దేవతల ఆశీర్వాదానికి అర్హత ప్రసాదిస్తుంది.

5. **దమము** (Control over Bodily Functions) : అది కావాలి – ఇది పొందాలి?" అనే కోరికల పరంపరలను క్రమంగా జయించాలి. ఇంద్రియనిగ్రహమును అభ్యసించాలి. దూర ప్రయాణం చేసేవాడు దారిలో అనారోగ్యకరమైన పదార్థాలను అతిగా మింగుతుంటే ఏమౌతుంది? ప్రయాణం దుఃఖ ప్రదమౌతుంది కదా? ఇంద్రియ విషయములపట్ల నిరోధము అభ్యసించకపోతే "స్వస్వరూప భావానందం – ఆత్మసాక్షాత్కారం" వైపు ప్రయాణం కొనసాగటం కుంటుపడుతూ ఉంటుంది.

6. **యజ్ఞము** (Commitment to Team Functions) : యజ్ఞభావంతో, తదితరులసుఖ సంతోషాలను, సామాజిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కర్మలను నిర్వర్తించటం, దేవతలను పూజించటం, గురువులను సేవించటం, వేదప్రతిపాదిత అగ్నిహోత్రాది ఉత్తమ కార్యాచరణం మొదలైన కర్మలు ప్రవృద్ధం చేసుకుంటూ ఉండటం దైవీ సంపత్తిని ప్రవృద్ధం చేస్తాయి.

7. **స్వాధ్యాయం** (Chanting) : తత్వ శాస్త్రగ్రంథాలను పఠించటం, పరిశీలించటం, వేదశాస్త్రపఠనం, స్తోత్రశ్లోకగానం, పరమాత్మ లీలల సంగీత లహరి – ఇవన్నీ దైవీ సంపత్తిని బలపరుస్తాయి. బుద్ధిని మృదు – మధురంగా తీర్చిదిద్దుతాయి.

8. **తపస్సు** (Constant Application of Thought) : పరమాత్మ గురించిన

తపనయే తపస్సు. పరమాత్మ గురించిన ధ్యాసయే ధ్యానం. "ధ్యానము – నామపారాయణము"వంటి తపోవిధాన అభ్యాసములను ప్రవృద్ధ పరచుకోవాలి.

9. **ఆర్జవం** : మనోవాక్కాయములందు ఏకభావన. ఐనవారిపట్ల – కానివారిపట్ల ఒకే ప్రమాణం. శరీర – మనో – ఇంద్రియములందు సరళత్వం పరిపోషించు కోవటం. అంతఃకరణంలో సౌమ్యత. సత్యమును ఉపాసించటం.

10. **అహింస** (Nonvoilence) : తదితర జీవులను శారీరకంగాకాని, మానసికంగాకాని బాధించకుండటం.

11. **సత్యం** (Practising Truth) : ప్రియముగా సంభాషించటం. సత్యాసత్యములను వివేక దృష్టితో గమనించగలగటం. నిత్యానిత్యములను విభాగించి దర్శించటం. (సత్యమేవ జయతే । న అనృతః ॥)

12. **అక్రోధము** (sabs anger) : ఇతరులపై క్రోధము – పరుషత్వము – దుర్భావములు మనస్సునందు కలిగి ఉండకపోవటం.

13. **త్యాగః** (Sacrificing/Giving Tendencies) :"ఇదంతా నాది కాదు. పరమాత్మది" అని గ్రహించి ఉండటం. ఇతరుల కొరకై 'త్యాగం' చేయటానికి మనస్సులో సంకల్పము కలిగి ఉండటం. తదితర జీవులను 'ఉపాసన' భావంతో సేవానిరతి కలిగి ఉండటం.

14. **శాంతి** : ప్రశాంత స్వభావం అభ్యసిస్తూ ఉండటం.

15. **అపైశునము** (Non-cruality) : ఇతరులను నిందించకపోవటం. ఉద్దేశ్య పూర్వకంగా బాధించాలనుకోకపోవటం. ఇతరుల లోపాలను అర్థం చేసుకొని 'తల్లి'వలె ప్రేమచూపటం.

16. **భూతేషు దయా** (Kindness) : సహజీవులపట్ల నిర్హేతుకమైన జాలి – దయ – కరుణ – ప్రేమ పెంపొందించుకోవటం.

17. **అలోలుప్త్వం** : ఇంద్రియవిషయాలపట్ల అనాసక్తులై (Non-attached) ఉండటం.

18. **మార్దవమ్** (softness) : పలుకులో – ప్రవర్తనలో కోమలత్వము, సౌకుమార్యము.

19. **హ్రీ** : "నేను చిన్నవాడిని. అనేకులు మహనీయులు ఉన్నారు. నాకన్నా కష్టపడేవారు ఉన్నారు. నాకన్నా ధన–సంపదలు లేనివారూ ఉన్నారు."... అని గమనించటం. అణుకువ కలిగి ఉండటం.

20. **అచాపలమ్** : చంచలబుద్ధి కలిగి ఉండకపోవటం. చపలబుద్ధి (getting attracted or emotionally distracted by petty things) కలిగి ఉండకపోవటం.

21. **తేజః** (Activeness) : బుద్ధి ఎప్పుడూ జాగరూకమై ఉత్సాహవంతంగా ఉండటం.

22. **క్షమః** (Excusing other's mistakes): ఇతరుల తప్పులను మన్నించగలగటం.

23. **ధృతి** : ధైర్యము – ఉత్సాహము – నైపుణ్యము ఆశ్రయించటం (Maintaining initiative)

24. **శౌచమ్** : శుచి అయిన – ఆరోగ్యమైన భావములను, అభిప్రాయములను పెంపొందించుకొంటూ ఉండటం.

25. **అద్రోహో** : ఇతరులకు నష్టపరచాలని, ద్రోహంచేయాలని... కష్టపెట్టాలని అనుకోకపోవటం.

26. **న అతిమానితః** : తనను తానే "నేను చాలా కష్టపడుచున్నాను. నేను

గొప్పవాడిని. నేను అర్హతగలవాడిని. ఇతరులు కారు." ... అని భావించకపోవటం.

ఈ 26 గుణముల వంటివి దైవీ సంపద ప్రవృద్ధమగుచూ ఉండగా అట్టి జీవునిలో అధికమగుచూ ఉంటుంది

## ఆసురీ సంపద

1. **దంబాయము** : కపటము, మోసము.

2. **దర్పము** : గర్వము, ఆత్మస్థుతి, పరనింద.

3. **అభిమానము** : దురహంకారము, దురభిమానము

4. **క్రోదాయము** : కోపము, ఆవేశము, ఉద్వేగము, పగ.

5. **పారుష్యము** : మాటలో కరుకుదనం, దెప్పిపొడవటం, తప్పులు ఎత్తి గేలిచేయటం, ఇతరులు బాధ పడేటట్లు సంభాషించటం.

6. **అజ్ఞానము** : నిజానిజాలు వివేచించకపోవటం. అర్థం చేసుకోవటానికి ప్రయత్నించక దుర్భావములు కొనసాగించటం. [Poor and weak way of analysing the situations atc.,]

7. **ఆభిజాత్యం** : "నా పుట్టుక గొప్పది. మేము గొప్పవాళ్లం" ... ఇటువంటి భావావేశాలు. ఎగతాళి చేయటం. అవమానించటం.

ఇవన్నీ జీవునిలో ఆసురీసంపదయొక్క ప్రవృద్ధికి సంజ్ఞలు అయి ఉన్నాయి.

నాయనా! అర్జునా! దైవీసంపద ఈ జీవుని సంసారవృక్షము నుండి విముక్తి ప్రసాదిస్తోంది. ఆసురీ సంపదయో? ఈతనిని సంసారవృక్షమునకు కట్టిపడవేసి ఉంచుతోంది. అందుచేత నీవు బద్ధకము – ఆలస్యము, ఆదుర్దాలను త్యజించు. దైవీసంపద వృద్ధి పొందే ప్రయత్నములను అధికం చేసుకో. కాలాన్ని వృధాగా వ్యర్థం చేసుకోకు.

ఈ విధంగా ఈ లోకంలో జీవులు దైవీ - ఆసురీ సంపదలను జన్మజన్మలుగా ఆర్జించుకొని ఉండటం జరుగుతోంది. ఈ దైవీ - ఆసురీ సంపదలకు సంబంధించిన రెండుమార్గాలు జీవునికి ఎదురుగా ఏర్పడి ఉన్నాయి. దైవీ సంపద గురించి వివరణ పూర్వకంగా చెప్పాను. ఇక ఆసురీ సంపదగురించి మరికొంత సవివరంగా చెప్పుచున్నాను. విను.

*ఆసురీ సంపద స్వభావాలు - అభ్యాసాలు :*

ఆసురీసంపద అధికం అగుచుండగా అట్టిజీవుడు "దేనిలో ప్రవృత్తి శుభప్రదం. దేనినుంచి నివృత్తి శుభప్రదం?"... అనే వివేచన చేయటం లేదు. అశుచి అయిన భావాలు ఆశ్రయిస్తూ క్రమంగా ఉత్తమ ఆచారములకు - ప్రవర్తనలకు - అవగాహనలకు దూరదూరంగా జరుగుచున్నాడు. "అసలు సత్యాసత్యాలు - నిత్యానిత్యాలు ఏమిటి?"... అనే విచక్షణను క్రమక్రమంగా కోల్పోవుచున్నాడు.

ఆసురీసంపదను పెంపొందించుకొనువాడు సత్యమును వదలి అసత్యమును - భ్రమపూర్వక విశేషాలను సమాశ్రయిస్తున్నాడు. క్షణానికొక బుద్ధిని కలిగి ఉంటున్నాడు. "ఈ జగత్తు ఉన్నది. ఈశ్వరుడు లేదు"... అని నమ్మటం - కేకలు వేయటం ప్రారంభిస్తున్నాడు. "ఈ జనులంతా స్త్రీ - పురుష సంయోగం వలన ఉత్పత్తి అగుచున్నారు. ఇంతకు మించి వేరే సృష్టికర్త లేదు".... అనే నిర్ణయాలను, నిరీశ్వర వాదాన్ని, మిధ్యాసిద్ధాంతాలను అపరిశీలనాత్మకంగా ఆశ్రయించినవాడై ఉంటున్నాడు. ప్రాపంచిక విషయాలను - సంబంధాలను - అనుబంధాలను - బాంధవ్యాలను ఆవేశపూర్వకంగా ఆశ్రయించి అల్పబుద్ధితో జీవితములను గడపివేస్తున్నారు.

ఆతడు క్రూర కర్మలను అవిచక్షణాపూర్వకంగా నిర్వర్తిస్తూ పర్యవసానములను గురించి యోచనయే చేయటం లేదు. "తదితర జీవులను దూషించటం. బాధించటం, వేధించటం, అవమానించటం" - ఇటువంటి అలవాట్లను అనాలోచనా పూర్వకంగా కొనసాగిస్తున్నాడు. సహజీవులను

బాధించటానికై శ్రమించి తపో శక్తులను సంపాదించి మరీ, క్రూరకర్మలందు నిమగ్నమగుచున్నాడు. జగత్తును పీడించటానికి సంసిద్ధుడగుచున్నాడు. జగత్ – కళ్యాణానికి బదులుగా జగత్ అహితము కొరకై జన్మలు పొంది క్రూర కర్ముడై ఉంటున్నాడు. దంభమును గర్వమును మనసంతా నింపుకొని అంతులేని కోరికలను పెంపొందించుకుంటున్నాడు. మాన – మద – గర్వాలతో సంచరిస్తున్నాడు. అసత్యములగు మిధ్యాసిద్ధాంతములను మిధ్యానిర్ణయములను స్వీకరించినవాడై మోహమదగర్వములను అనుక్షణికంగా ఉపాసిస్తున్నారు. "విషయ భోగములే జీవితసారం. వాటిని ఎట్లాగైనా పొందాలి. అందుకు ఏది చేసినా తప్పు ఏమీ లేదు"... అను నిశ్చితాభిప్రాయములు పెంపొందించుకొని ఉంటున్నాడు. ఒకటికాదు రెండుకాదు. వందలవేల ఆశలకు నిబద్ధుడై జీవితములు గడపివేస్తున్నాడు. కామ – క్రోధ పారాయణుడై లోకంలో ఇష్టం వచ్చినరీతిగా ప్రవర్తించుటకు సంసిద్ధుడగుచున్నాడు. "మనం అనుభవించటం కోసమే జీవితం. అందుకు ఇతరుల సంపదలను సంగ్రహిస్తే మాత్రం తప్పేమున్నది?".... అని తలచి తన కోరికలను తీర్చుకోవాలని సిద్ధపడుచున్నాడు. అన్యాయంగానైనా సరే, సంపదలు పెంచుకోవటానికి సంసిద్ధపడుచున్నాడు. అశుచికరమైన హావభావాలు ప్రవృద్ధం చేసుకుంటున్నాడు. "సహజీవులకు హాని చేయటం, బాధించటం, అపకారాలు చేసే బుద్ధులతో సమాలోచనలు చేయటం".. ఇటువంటి కార్యక్రమ – వ్యవహార – ఆలోచనలను పెంపొందించుకొంటున్నాడు. చావువచ్చి గుమ్మాన నిలుచునేంత వరకు అంతులేని దురాలోచనలను కొనసాగిస్తూ ఆయష్షును దుర్వినియోగపరచుకుంటున్నాడు. దుష్టభావాలను ఉపాసిస్తూ కామ – క్రోధాలను ప్రవృద్ధం చేసుకుంటున్నాడు.

- ఇంతవరకు నాచేత పొందబడినాయి.
- ఇక ఇవన్నీ నేను పొందవలసి ఉన్నది.
- ఇది ఇంత ఉన్నది. ఇంకా అంత సంపాదించవలసి ఉన్నది.
- ఇది నా ముందు ముందు పెంపొందవలసియున్న సంపద.

- వీరు మనకు గిట్టనివారు.
- వారి అంతు చూచాను. ఇక వీరి అంతు చూడబోవుచున్నాను.
- మిగతావాళ్ల సంగతి కూడా త్వరలోనే చూడబోతున్నానులే!
- నేనే అంతటికీ కర్తను. యజమానిని. నేనే, ఈశ్వరుడను. వీరువీరంతా నాకు 'దాసోఽహం' అంటున్నవారు. అనవలసినవారు. అని తీరవలసిందే మరి!
- నేను యజమానిని. వీళ్లంతా నా క్రింద క్రింద వాళ్లు.
- నేనే అన్నీ అనుభవిస్తాను. భోగిని.
- అన్నీ నాకు తెలుసు. నేనే తెలివిగల వాడిని! అన్నీ నాకు సిద్ధించాయి. సిద్ధిస్తాయికూడా!
- నా ప్రక్కన ఎవ్వరూ నిలువలేరు. బలవంతుడను. నేను సుఖపడవలసిన వాడను. నా అంతగా ఎవ్వరూ ఏదీ అనుభవించలేరు. సముపార్జించలేరు! సంపాదిచకూడదు!
- గొప్పవాడిని నేనే! నా అంతవారు ఎవరున్నారు? సేవకులు - బంధుజనులు - మాట వినేవారు... వీరంతా నాకున్నారు.
- ఈ చుట్టుప్రక్కల - ఇక్కడెక్కడా నా అంతవారు లేరు.
- నాతో ఎవరు సమానం చెప్పండి?
- గొప్ప పూజలు - దానాలు - యజ్ఞాలు నేనే చేయగలవాడను.
- అందరికీ ఎన్నో దానాలు చేసాను. అందరికీ నేనే సంతోషం కలుగ జేయగలిగేవాడిని. నాఅంతగా ఎవరు చేస్తున్నారు?

....ఈ విధంగా అనేక అజ్ఞాన పరంపరాభావాలచే ఆతడు విమోహితుడై చరిస్తున్నాడు. అనేక చిత్త విభ్రాంతులలో మునిగి - తేలుచున్నాడు. మోహముల పరంపరావలయంలో (Net of series of Illusionary Views) చిక్కుకుని "మేము

హాయిగానే ఉన్నామే!" అంటూ చెప్పుకుంటూ పోతున్నాడు. "అది అనుభవించాం. ఇది అనుభవించబోతున్నాం"... అని అనుకుంటూ అనేక కామ - ఉపభోగరచనలలో ఇరుక్కుని ఉంటున్నాడు. "ఇది ఇంతే" అని అనుకుంటూ విచక్షణారహితంగా వర్ణిస్తున్నాడు. "నాకు చెప్పేంతవారా?" అని చెప్పుకుంటూ, ఎవ్వరు ఏది చెప్పినా విన తిరస్కరిస్తున్నాడు.

ఓ అర్జునా! అట్టి సంపత్తిచేత పర్యవసానం ఏమిటి? అశుచితోకూడిన అనేక నరకస్థితులవైపుగా ఆతడు పరుగులు తీస్తున్నాడయ్యా.

"నేనే గొప్పవాడిని. వారు - వీరు తుచ్ఛులు" అని ఆతడు తననుతానే గొప్పనుకుంటూ చరిస్తున్నాడు. గర్విష్ఠుడై నిజానిజాల గురించి స్తబ్ధులై ఉంటున్నాడు. ధన - మాన - మద గర్వితుడై చరిస్తున్నాడు. ఏదో పేరుకోసం - ప్రతిష్ఠకోసం అవిధిపూర్వకంగా కార్యాలు ఆచరిస్తూ ఉన్నాడు. ప్రచారం కోసం యజ్ఞాలు చేస్తున్నాడు. "అహంకారము - బలము - దర్పము - కామము - క్రోధము"లచే ఆతని వివేకమంతా ఆవరించినదై ఉంటోంది. మాన - మద గర్వితుడై దుష్ట క్రియలను ఆచరించుచున్నాడు. అసూయాపరుడై చరిస్తూ, క్రమంగా తనయందు వేంచేసియున్న పరమాత్మనగు నన్ను ద్వేషిస్తూ, నన్ను దూరం చేసుకొంటున్నాడు.

***అధోమ తరగతి*** *(Lower Strata)* **:**

ఓ అర్జునా! ఆ విధంగా "ద్వేషము - క్రూరత్వము" మొదలైన ఆసురీ గుణములు తమ స్వభావంగా కలవారు మానవజాతిలో అధమతరగతికి చెందినవారు. వారిని మరలమరల ఆసురీయోనులలోకి నేను విసరివేస్తూ ఉంటాను. ఆసురీ యోనులలో జన్మలను ఆవిధంగా పొందుతూ పొందుతూ, మూఢమార్గములను ఆశ్రయిస్తూ ఆనందమయ ఆత్మస్వరూపుడనగు నన్ను ఏమరచి ఆతడు సుదీర్ఘ దేహపరంపరా ప్రయాణాలు చేయవలసి వస్తోంది. అధమాధమగతులకు, అజ్ఞానపూరిత జన్మలకు ఆతడు తనకు తానే త్రోవ చేసుకుంటున్నాడు. అజ్ఞానముతో కూడిన ఉపాధిసహస్రములు పొందుచున్నాడు.

*త్రివిధాః నరక ద్వారములు :*

ఓ ఫల్గుణా! "అజ్ఞాన పూరిత జన్మలు" అనబడే నరకస్థితికి దారితీయగల ద్వారాలు మూడు.

1. **కామము** : "ఏదో కావాలి - పొందాలి" - అనే భావావేశం వృద్ధి చేసుకోవటం. "ప్రాపంచికమైన దృశ్యసంబంధమైన" కోరికలను పెంపొందించుకోవటం.

2. **క్రోధము** : సహజీవులపై క్రోధము, ఆవేశము ప్రదర్శించటం. హింసించు - బాధించు స్వభావము.

3. **లోభము** : "ఇవన్నీ నావే! నాకే ఉండాలి"... అనే లోభగుణం.

అందుచేత, సత్యావగాహన - ఆనందము కోరుకొనే జీవుడు దుఃఖమార్గములగు కామ - క్రోధ - లోభములను సర్వప్రయత్నములతో త్యజించాలి! తమోగుణ నిర్మితములైన ఈ మూడు కామ - క్రోధ - లోభ ద్వారములను మూసివేసికొంటూ అటువైపుగా ఎవ్వరు అడుగులు వేయరో,... అట్టివారు తమకు తాము శ్రేయస్సును కలుగజేసుకొన్నవారగుచున్నారు.

ఓ అర్జునా! శాస్త్రములు మానవ జాతియొక్క మనుగడకై, శ్రేయస్సుకై మహనీయులగు అనుభవజ్ఞులచే ప్రవచనం చేయబడ్డాయి. అవి మానవాళికి ఏమేమి నిర్వర్తించాలో, ఏమేమి నిర్వర్తించకూడదో, చెప్పుచున్నాయి. అట్టి కార్య - అకార్యములను ఆలకించి - పర్యాలోచనచేసి జీవుడు తన జీవితాన్ని శాస్త్రప్రవచనానుకూల్యంగా మలచుకోవాలి. శాస్త్రానుకూలంగా ప్రవర్తన కలిగి ఉండాలి. ఎవ్వడైతే శాస్త్ర ప్రవచనములను - నియమావళిని - కర్మ నిర్దేశ్యములను పెడచెవిని పెట్టి తనకు తానే ఏది అనుకూలమని అనిపిస్తే ఆ మార్గంలో సంచరించనారంభిస్తాడో,... ***అట్టివాడు ఇహమందుగాని, పరమందుగాని తాను ఆశించుచున్న సుఖ-శాంతులు పొందలేడు.***

అందుచేత ఓ పార్థా! "ఏమి చేయాలి? ఏమి చేయకూడదు? ఇప్పుడు

యుద్ధం చేయాలా? చేయవద్దా?"... మొదలైన సందర్భములలో "శాస్త్రములు ఏది చెప్పుచున్నాయి? ఏఏ ప్రమాణాలు నిర్ణయిస్తున్నాయి? నిర్దేసిస్తున్నాయి?"... అని గమనించు. శాస్త్రములు ఏ మార్గం చూపుచున్నాయో ఆ మార్గంలో కార్యాకార్యములు నిర్ణయించుకో. అంతేగాని, ఏవేవో అభిప్రాయములతో స్వధర్మ – ధర్మచ్యుతుడవు కారాదు సుమా!

శాస్త్ర విధివిధానములేమిటో పెద్దల వద్ద అభ్యసించి విధులను ఆచరించటం, చెయ్యరానివి చేయకపోటమే నీ నిర్ణయమగుగాక! అంతేగాని, "ఇది చేస్తే ఏమిటినాకు లాభం? నా కోరికలు ఆశలు తీరుతాయా? లేదా? ఏం పొందాలి? ఏదో కావాలి? వారికన్నా వీరికన్నా గొప్ప అని అనిపించుకోవాలి కదా? వారు అల్పులు నన్ను దూషించారు. వారి–వీరి సంగతి చూడాలి"... ఇటువంటివి కార్యాకార్యాములకు ప్రమాణం కాకూడదుసుమా! "నాయిష్టం నేను ఇంతే"...... అని మూర్ఖత్వం వహించకూడదు.

శాస్త్రమే ప్రమాణంగా, స్వధర్మోన్ముఖుడై – కార్యాకార్యములు నిర్ణయించుకొనువారు తప్పక ఆ మార్గంలో సిద్ధిని పొందగలుగుతారు.

*ఇతి దైవాసుర సంపత్ విభాగయోగ పుష్పః*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

★★★

శ్లో॥ అనుద్వేగకరం వాక్యం, సత్యం, ప్రియహితం చయత్
స్వాధ్యాయ అభ్యసనం చ ఏవ "వాఙ్మయంతపః" ఉచ్యతే ॥

యత్ అనుద్వేగకరం – ప్రియ – హితంచ, సత్యం వాక్యం,
స్వ్యాదార్యాయ – అబార్యసనం ఏవం చ తత్ "వాఙ్మయం తపః" ఉచ్యతే ॥

సహజీవులకు ఉద్రేక – ఉద్వేగాలు కలిగించనట్టి ప్రియ – హిత – సత్య వాక్యములు పలకటం, స్తోత్ర – వేద పఠణం 'వాక్తపస్సు' అని పిలువబడుతోంది.

# 17.

# శ్రద్ధాత్రయవిభాగయోగ పుష్పం

**అర్జునుడు** : స్వామీ! శాస్త్రములు ప్రవచించిన – నిర్వచించిన మార్గంలో కార్యాకార్యములను నిర్ణయించుకొని నిర్వర్తించటంచేత మేము సిద్ధిని పొందగలగుతామని చెప్పారు. శాస్త్రప్రవచనాలు – విధినియమాలు అనుసరించకుండా కామ్యకర్మలు స్వీయాభిరుచిని అనుసరించి ఆశ్రయించటంచేత మేము ఇహ – పరములలో సంసిద్ధి పొందలేమని ప్రవచించారు! మీరు శ్రేయోభిలాషి అయి మాకు శ్రేయోవాక్యాలు బోధిస్తున్నారు.

అయితే,....... ఇప్పుడు నాదొక సందేహం.

ఒకానొకడు శ్రద్ధతో ఆయా కార్యములను నిర్వర్తిస్తూ ఉంటాడుగాని, శాస్త్రములు చెప్పిన విధి – విధానములను తెలిసియే – తెలియకయో – లేక పరిశీలించకయో... అనుసరించడనుకోండి. శాస్త్ర విధులను అనుసరించకయే శ్రద్ధతో కర్మలు నిర్వర్తించువారి నిష్ఠ ఎట్టిదో, ఏఏ ప్రయోజనములు ఉండటం జరుగుతుందో వివరించండి. అట్టి శాస్త్ర విధిని సమీకరించుకొననివారి యొక్క

నిష్ఠ (Their determination to function) సాత్వికమైన నిష్ఠయా? లేక రాజసికమైన నిష్ఠయా? లేక తామసికమైన నిష్ఠయా?

ఉదాహరణకు, ఒకడు భగవంతుని పుష్పాలతో పూజిస్తాడు. కాని శాస్త్ర విధానములు అనుసరించడు. సంధ్యోపాసనను నిర్వర్తిస్తాడు. కానీ, శాస్త్రములచే చెప్పబడిన వరుసక్రమంలా తెలియకపోవచ్చు.దేవాలయాలు సందర్శిస్తాడు. కానీ ఆచార - నియమాదులను తెలిసో - తెలియకో ఆచరించకపోవచ్చు. కర్మలు శ్రద్ధగా నిర్వర్తిస్తాడు. కానీ, విధి - విధానాలు ఏమంతగా అనుసరించడు. ఇటువంటి ఆయా కర్మోపాసనల సందర్భములలో శాస్త్రవిధి - నియమములు పాటించక, కానీ, శ్రద్ధ - ఆసక్తి కలిగియే ఉంటాడు. అట్టివాని శ్రద్ధ - నిష్ఠ ఎట్టిదో, ప్రయోజనములు ఏరీతిగా ఉంటాయో వివరించండి.

| శ్రద్ధ | → | స్వభావం |
|---|---|---|

**శ్రీ కృష్ణ భగవానుడు :**

ఓ అర్జునా! శ్రద్ధచేతనే ఒకడు సాధకుడగుచున్నాడు. శాస్త్రము ఈ జీవుని శ్రద్ధను పెపోదించటానికి ఉద్దేశ్యిస్తున్నాయి. నీవు అడిగినదానికి సమాధానంగా "శ్రద్ధ" యొక్క స్వభావము - ప్రయోజనములు ఏరీతిగా ఉంటాయో వివరిస్తున్నాను. విను. ఎందుకంటే ఈజీవుని శ్రద్ధయే ఈతని యానాన్ని నిర్ణయిస్తోంది. ఈ దేహులు అనేక దేహయాత్రలు చేస్తూ వారి యొక్క "స్వభావము"ను వెంటనంటి ఉంచుకుంటున్నారు. 'శ్రద్ధ' నుండి 'స్వభావం' రూపు దిద్దుకుంటోంది. అట్టి ఈ దేహులయొక్క స్వభావము మూడు రీతులుగా ఉంటోంది.

1. సాత్విక స్వభావము 2. రాజసిక స్వభావము 3. తామసిక స్వభావము. అట్టి త్రివిధములైన స్వభావములగురించి వివరిస్తున్నాను.

కొందరు కొన్నిటిపట్ల శ్రద్ధ వహించి ఉంటున్నారు. మరికొన్నిటి పట్ల అశ్రద్ధగా ఉంటున్నారు. ఇంకొందరు మరికొన్ని వేరే విషయములపై శ్రద్ధ చూపటం జరుగుతోంది. ఈ జీవులు ఈరీతిగా వివిధ విశేషములపై శ్రద్ధ కలిగి ఉంటున్నారు.

ఏ జీవుడు ఏశ్రద్ధ కలిగి ఉంటాడో, ఆతడు అట్టివాడే అగుచున్నాడు. శ్రద్ధ ఎటువైపుగా ఎక్కుబెట్టబడి ఉంటే, ఆ పురుషుడు కాలక్రమంగా అట్టివాడై ఉండటం జరుగుతోంది. శ్రద్ధనుబట్టే ఉపాసన – ఉపాసించబడుచున్న వస్తువు నిర్ణయమగుచున్నాయి.

ఉదాహరణకు,

**సాత్వికమైన శ్రద్ధగలవారు** : దైవీసంపత్తిని పెంపొందించుకోవటం, లోకశ్రేయస్సును ఉద్దేశ్యించటం కళ్యాణమూర్తులగు దేవతారూపములను ఉపాసించటం జరుగుతోంది.

**రాజసికమైన శ్రద్ధగలవారు** : యక్ష – రాక్షస గణములను బల–దర్ప–భౌతిక సంపదలకై ఉపాసిస్తున్నారు.

**తామసితకమైన శ్రద్ధగలవారు** : "వశపరచుకోవాలి – బాధించాలి" ఇటువంటి ఉద్దేశ్యములతో ప్రేత – భూత గణములను ఉపాసిస్తున్నారు.

ఇక్కడ మరొక్క విషయం దృష్టిలో ఉంచుకో. అశాస్త్రవిహితంగాను, సహజీవులను భయపెట్టే విధంగాను, దంభ – అహంకారములతో కూడుకొన్నదై కామరాగబలాన్వితంగా, పంచభూతాత్మికమైన ఈ శరీరాన్ని కృశింపజేస్తూ, స్వశరీరాంతర్గతుడనగు నన్ను కూడా వేధిస్తూ చేసే తపస్సు (శ్రద్ధతో చేస్తున్నప్పటికీ) అల్పబుద్ధిచే చేస్తున్న ఆసుర తపస్సే సుమా!

ఈ జీవుడు తన ఆశయములను అనుసరించి శ్రద్ధ కలిగిఉంటున్నాడు. శ్రద్ధయొక్క స్వభావం అనుసరించి వ్యక్తిత్వము రూపుదిద్దుకుంటోంది. శ్రద్ధను అనుసరించి స్వభావం, స్వభావాన్ని అనుసరించి శ్రద్ధ బలం పుంజుకుంటున్నాయి.

శ్రద్ధ – స్వభావాలు సూక్ష్మరూపాలు. అట్టి శ్రద్ధ – స్వభావములు స్థూల రూపములగు ఆయా అభ్యాసములచే రూపుదిద్దుకుంటున్నాయి. అనగా ఆహారము – యజ్ఞము – శారీరక + వాక్ + మానసిక తపస్సులు – దానం మొదలైనవి ఎట్టి శ్రద్ధతో ఒకడు నిర్వర్తిస్తాడో... అట్టి ఆ శ్రద్ధ – ఆప్రయత్నములు జీవుని స్వభావం నిర్ణయిస్తున్నాయి. కనుక వాటి భేదాల గురించి వివరిస్తాను. విను.

## సాత్వికశ్రద్ధ – స్వభావములు

**సాత్వికాహారం** : సాత్వికస్వభావం పెంపొందించుకొను సాధకులకు కమ్మటి రుచి – నేయితో కూడినవి – రసాయనిక మార్పులు చెందనివి స్వాభావికంగా లభించే పళ్లు – కాయలు మొదలైనవి ప్రియంగా ఉంటూ ఉంటాయి.

**సాత్విక యజ్ఞము** : ఫలాకాంక్షరహితంగా "ఇది నాకు విధించబడిన విద్యుక్తధర్మం" అను దృష్టిచే, "నేను ఇది తప్పక నిర్వర్తించాలి" అని ఉపాసనగా భావించి, మనస్సును సమరసభావంతో స్వార్థరహితంగా మలచుకుంటూ నిర్వర్తించేదంతా సాత్విక యజ్ఞం. సాత్వికస్వభావులు అట్టి సాత్వికయజ్ఞ – అభ్యాసులై ఉంటారు.

**సాత్విక తపస్సు** : శారీరక తపస్సు, దేవతలను, ద్విజులను, ప్రాజ్ఞులగు జ్ఞానులను పూజించటం, శుచి అయిన భావాలు (Positive and Optimistic feelings) కలిగి ఉండటం, మనోవాక్కాయములచే ఒకే రీతి అయిన భావప్రకటనలు కలిగి ఉండటం (ఆర్జవము), బ్రహ్మచర్యమును (సర్వము పరమాత్మయొక్క చమత్కార ప్రదర్శనమే – అను దృష్టి) వ్రతదీక్షగా పాటించటం – అహింసావ్రతం – ఇదంతా 'శారిరక తపస్సు'గా చెప్పబడుతోంది.

**సాత్విక వాచిక తపస్సు** : సహజీవులకు ఉద్రేకము – భయము – ఆవేశము – ఉద్వేగము కలగనట్లుగా సంభాషించటం, సత్యము – ప్రియములు వాక్ లక్షణశోభితమై ఉండటం, శాస్త్రగ్రంథముల ప్రవచనం, భగవంతుని గుణగానం, వేదాభ్యాసం మొదలైనవన్నీ వాచికతపస్సుగా చెప్పబడుతోంది.

**సాత్వికమానసిక తపసూ** : మనస్సు పవిత్రంగా, దుష్టభావ - "దురభిప్రాయరహితంగా ఉంచుకోవటం, ప్రాపంచిక విషయాలన్నిటిపట్లా, జీవితంలోని సర్వ సంఘటనలపట్ల" కథాంతర్గత విశేషాలవలె - స్వప్నసదృశ విశేషాలవలె" ఉద్వేగరహితమైన మౌనం వహించి ఉండటం, పరిశుద్ధమైన భావాలు - అభిప్రాయాలు పెంపొందించుకోవటం - **ఇది మానసిక తపసూ.**

సాత్వికస్వభావం గలవారు ఈ శారీరక - వాచిక - మానసిక తపస్సులను శ్రద్ధగాను, అభ్యాసపూర్వకంగానూ నిర్వర్తిస్తూ ఉంటారు. ప్రాపంచక ఫలములేవీ కోరకుండానే స్వభావపూర్వకంగా సాత్విక "శారీరక - వాచిక - మానసిక" తపస్సులను సత్వగుణోపాసకులు ఉపాసిస్తున్నారు.

**సాత్వికదానం** : "ఇది దానం చేయటం నా ధర్మము. ఇదంతా ప్రసాదించిన పరమాత్మకు కృతజ్ఞతలు చెప్పుకోవటం" అని భావించి ఎటువంటి ప్రత్యుపకారం ఆశించకుండా దేశ - కాల - పాత్రలను అనుసరించి చేసే దానం 'సాత్వికదానం'గా అభివర్ణించబడుతోంది.

ఈ విధంగా సాత్వికమైన అభ్యాసపరులు స్వభావసిద్ధంగా సాత్వికసంపద పెంపొందించుకుంటూ సాత్విక - శ్రద్ధా స్వభావములను తమ వ్యక్తిత్వంగా (As a personality) తీర్చిదిద్దుకుంటున్నారు.

## రాజసిక శ్రద్ధ - స్వభావములు

**రాజసిక ఆహారం** : చేదు - పులుపు - ఉప్పు - మిక్కిలి వేడైనవి ఎండి-మాడినవి అత్యంత దాహం కలుగజేసేవి - శరీరంలో రోగములను ప్రవృద్ధం చేసేవి - ఆవేశమును కలుగజేయునవి మొదలైన పానీయాలు - పదార్థాలు రాజసిక ప్రవృత్తులకు ఇష్టంగా అనిపిస్తూ ఉంటాయి.

**రాజసిక యజ్ఞము** : ఓ భరతశ్రేష్ఠా ! ఫలములను ఆసిస్తూ మునుముందుగానే కర్మఫలములను దృష్టిలో ఉంచుకొని, నలుగురూ చెప్పుకోవాలనే దంభముతో యజ్ఞములు చేస్తూ ఉంటే అది అంతరంగములోని రాజసగుణ - ప్రవృత్తి.

"దీనివలన నాకేం లాభం?"..... అను ఆవేశంతో వారు కర్మలు నిర్వర్తిస్తూ ఉంటారు.

**రాజసిక తపసూ** : గుర్తింపుకొరకై, సత్కారములకొరకై, స్వల్పకాలిక ప్రయోజనములకొరకై చేస్తున్న శారీరక – వాక్ – మానసిక తపస్సు 'రాజసిక తపస్సు' అని చెప్పబడుతోంది.

**రాజసికదానము** : ప్రత్యుపకారఫలము తిరిగి ఆశిస్తూ, కలుగబోయే లాభ–నష్టాలను దృష్టిలో ఉంచుకుంటూ, ఆ ప్రత్యుపకారం లభించనప్పుడు అవతలివారిని దూషిస్తూ – బాధిస్తూ చేస్తున్న దానం 'రాజసికదానం' అనిపించుకుంటూ ఉంటుంది.

## తామసిక శ్రద్ధ – స్వభాములు

**తామసికాహారం** : కాలీ – కాలని (పచనంకాని) ఆహారం, రసరహితం, దుర్గంధములతో కూడినది, పాచిపోయినది, తినగా మిగిలిపోయినది, అపవిత్రమైనవి అగు భోజనపదార్థాలు తామసికాహారులకు రుచికరమౌతూ ఉంటాయి.

**తామసిక యజ్ఞం** : శాస్త్ర విధి – విధానములను పూర్తిగా త్యజించి, అన్నదానం – జీవతృప్తులు లేకుండా, వేదమంత్రోచ్చారణలు లేకుండా, అతిధులకు సంభవానలు (Distribution to the Poor) లేకుండా శ్రద్ధ లేకుండా చేసే యజ్ఞాలు "తామసిక యజ్ఞం" అని పిలుస్తున్నారు.

**తామసిక తపసూ** : మూఢత్వముతో కూడిన పట్టుదల – హఠములతో, సహజీవులను హింసించాలని – వారికి నష్టం కలుగజేయాలనే ఉద్దేశ్యములతో, ఇతరులను తన వశంలో ఉంచుకోవాలనే ఆశయాలతో చేసే శారీరక – వాచిక – మానసిక తపస్సు "తామస తపస్సు" అని చెప్పబడుతోంది.

☆☆☆

అందుచేత ఓ అర్జునా! నీవు సాత్వికమైన భావాలు - ఉద్దేశ్యాలతో ఆహారసేవనం. యజ్ఞభావాలు - తపోక్రియలు నిర్వర్తించు. సర్వము పరమాత్మమయంగా గమనించి పరమాత్మసమర్పణ పూర్వకంగా స్వకర్మ - వ్యవహారాదులను ఉద్దేశ్యించు.

అట్టి పరమాత్మ ఎట్టిదో చెప్పటానికి..., వేదములు "ఓంతత్ సత్" అని సంజ్ఞలను ప్రతిపాదిస్తున్నాయి. వేదాంతర్భాగములగు క్రియాభాగములు (సంహిత), బ్రాహ్మణములు (ఉపాసనాకాండ) ఉపనిషత్ (జ్ఞానకాండ)లు విభాగము ఈ ఓం - తత్ - సత్ అను గంభీర శబ్దార్ధములను సర్వాంతర్యామియగు పరమాత్మపరంగా గానం చేస్తూ వినిపిస్తున్నాయి.

*1. 'ఓం' కారోపాసకులు*

వేదములసారమును గ్రహించి గానం చేసే మహనీయులు తమయొక్క యజ్ఞ - దాన - తపస్సులను ఓంకారోచ్చారణతో ప్రారంభిస్తూ, "సర్వాత్మకుడగు పరమాత్మ యొక్క అవగాహనయే అంతిమసారం. అసలైన ఆశయం. ఇచ్చేవాడు - ఇచ్చేది - స్వీకరించేవాడు పరమాత్మయే"..గా ప్రకటన చేసి మరీ ప్రారంభిస్తున్నారు.

*2. తత్-తత్త్వోపాసకులు - "తత్ → త్వమ్" ఉపాసకులు :*

వేదజ్ఞులు తాము ప్రారంభించే సర్వ యజ్ఞదాన తపస్సులను సర్వాత్మకుడగు పరమాత్మయందు శ్రద్ధను లగ్నంచేసి సమాచరిస్తున్నారు. ఏది చేసినా అది పరమాత్మపరంగా సమర్పిస్తున్నారు. స్వీకరించు వానిని పరమాత్మగా భావించి ఆ వేదవిదులు తమ విధులను నిర్వర్తిస్తున్నారు. తత్త్వోపాసకులు ("తత్→త్వమ్" ఉపాసకులు). యజ్ఞదానతపోక్రియలకు ఫలితం ఆశించకుండా సర్వము తత్ స్వరూపుడగు పరమాత్మకు సమర్పించి మోక్షకాంక్షులై కొనసాగిస్తున్నారు. అనగా, "జగత్తులోని జీవులంతా (త్వమ్ → పరమాత్మ) స్వరూపం"గా (తత్ స్వరూపంగా) ఉపాసిస్తున్నారు.

‘ఓం’ పరమాత్మ స్వరూపమునకు సంజ్ఞగాను, ‘తత్’ ఈ జీవాత్మ చేరవలసిన స్థానంగాను (తత్త్వమ్ అసి) భావిస్తూ ఉపాసిస్తూ వారు యజ్ఞ దానతపస్సులు నిర్వర్తిస్తున్నారు.

### *3. సత్ – సాధుభావోపాసకులు*

వీరు సాధుస్వభావులై సహజీవులందరినీ ప్రేమ – దయ – కారుణ్యములతో, సేవాభావంతో ఉపాసిస్తున్నారు. ఏది చేసినా “లోకములకు శుభమగు గాక! సర్వేజనాః సుఖినోభవన్తు ! శంనో అస్తు ద్విపదే! శం చతుష్పదే”... ఇటువంటి లోకశుభంకర – ‘శం’కర వాక్యముల అర్ధాన్ని ఉద్దేశ్యించి నిర్వర్తిస్తున్నారు.

శాస్త్రప్రవచనములైనట్టి వీరియొక్క యజ్ఞ – దాన – తపో క్రియా కార్యక్రమాలన్నీ లోకకళ్యాణమే తమ అంతర్లీనగానంగా కలిగి ఉన్నాయి.

“లోకశుభంకొరకు చేసే కర్మలన్నీ సత్కర్మలే” అని లోకగురువులు బోధిస్తున్నారు.

అట్టి పరమాత్మ స్వరూపమగు లోకకళ్యాణమే నీ సర్వకర్మల ఉద్దేశ్యములు అగుగాక! కర్మ శ్రద్ధగా చేయి. పరమాత్మకు సమర్పించి “**పరమాత్మను ఈ రూపంగా సేవిస్తున్నాను**” అను సద్భావనను పెంపొందించుకో.

సర్వ పరిపోషకుడగు ఓంకార సంజ్ఞార్ధ పరబ్రహ్మమును నీ ఎదురుగా ఉన్న “సర్వజీవ స్వరూపుడు”గా ఆరాధిస్తూ లోకశుభం కోరి, సద్భావంతో – శ్రద్ధగా – “యజ్ఞం – దానం – తపస్సు – సహజీవులసేవ – ధర్మరక్షణ” ... మొదలైన నీ స్వధర్మములను నిర్వర్తించు.

జీవితంలోని ప్రతి కర్మను పరమాత్మ స్వరూపంగా ఉపాసిస్తూ పరమాత్మ పరంగా పరమాత్మస్వరూపమగు లోకములకు శుభంకలుగజేసే ఉద్దేశ్యంతో ధర్మాచరణ పూర్వకంగా నిర్వహించు.

☆☆☆

నేను గుర్తు చేస్తున్న "ఓం తత్ సత్" మార్గంగా కాకుండా అశ్రద్ధగా, పరమాత్మకు సమర్పించకుండా "...వారికొరకో – వీరు సంతోషించాలనో – గొప్పలకోసమో – వారు వీరు పొగడాలనో"... ఇటువంటి ఉద్దేశ్యాలతో ఏ కర్మ చేసినప్పటికీ అది వృథా ప్రయాసయే "నాకొరకు" అని చేసే కర్మలు బంధాలవుతాయి. "స్వామి కొరకు".... అని చేసేవన్నీ మోక్షం ప్రసాదిస్తాయి.

అశ్రద్ధగా – అల్ప ఆశయములతో చేసే కర్మలన్నీ ఇహంలోగాని – పరంలోగాని నీకు జీవితాశయమగు "పరమోత్తమ శ్రేయస్సు" కలిగించలేవు.

అందుచేత

"ఓం తత్ సత్" శబ్దార్థమును గ్రహించి పరమాత్మను సేవించే ఉద్దేశ్యంతో శ్రద్ధగా నీ స్వధర్మము నిర్వర్తించు. శ్రద్ధనుబట్టి కర్మలు పవిత్రమౌతాయి. కర్మలను అనుసరించి స్వభావం పవిత్రత పొందుతుంది. పవిత్రమైన స్వభావం శాశ్వతానందమగు అఖండబ్రహ్మతత్త్వమును ఆస్వాదింపజేస్తున్నది.

*ఇతి శ్రద్ధాత్రయ విభాగయోగ పుష్పః*

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

★★★

శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మామ్ ఏకమ్ శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యోః మోక్షయిష్యామి! మాశుచః ॥
సర్వదారర్మాన్ పరిత్యజ్య "ఏకమ్ మామ్" శరణమ్ వ్రజ ।
త్వా సర్వపేబ్యోః అహమేవమోక్షయిష్యుమి! మా శుచః ॥

సమస్త కర్తవ్యాకర్తవ్యములను, కర్తృత్వ అకర్తృత్వములను నాకు సమర్పించివేసి నన్నే శరణువేడు. నేను నిన్ను సర్వకర్మదోషములనుండి విముక్తునిగా చేసి వేస్తాను. ఇక శోకరహితుడవగుము.

(Leave all worries at its core)

# 18.

# మోక్షసన్యాసయోగ పుష్పం

**అర్జునుడు** : హే మహాబాహో! హృశీకేశా! సర్వాంతర్యామీ! కేశిరాక్షస సంహారకా! ''సన్యాసము'' అను శాస్త్రప్రవచిత శబ్దముయొక్క తత్వార్థం తెలుసుకోగోరుచున్నాను. అట్లాగే 'త్యాగము' అనగా ఏమిటి? ఈ సన్యాస – త్యాగములకు భేదమేమైనా ఉన్నదా? ఈ రెండు శబ్దాలు ఒకే అర్థాన్ని సూచిస్తున్నాయా? వేరువేరైన శాస్త్రార్థమేమైనా కలిగి ప్రతిపాదిస్తున్నాయా? వివరించవలసినదిగా మిమ్ములను ప్రార్థిస్తున్నాను.

**శ్రీకృష్ణభగవానుడు** : 'సన్యాసము' 'త్యాగము' అను శబ్దములను అధ్యాత్మ శాస్త్ర ప్రవచకులు, వేరు – వేరు శాస్త్రకారులు వేరు వేరు అర్థములతో శబ్దప్రయోగాలు చేయటం జరుగుతోంది.

## కామ్య కర్మలు త్యజించటం

"నీవు కోరికలు కలిగియుండి నీ కొరకై కర్మలు నిర్వర్తిస్తూ ఉంటే అప్పుడవి 'కామ్యకర్మలు' అవుతాయి. అట్టి నీ కోరికలు తీరుటకై కాకుండా

సహజీవుల సుఖ – శాంతులకొరకై, స్వధర్మనిరతికై, ధర్మసంస్థాపనకొరకై నిర్వర్తిస్తే... అవి కామ్యకర్మలు కావు. కనుక "కామ్యకర్మలు సన్యసించటము కర్మసన్యాసము" అని కొందరు మహనీయులు చాటి చెప్పుచున్నాను.

## సర్వ కర్మల ఫలాలు త్యజించటం

ఇక మరికొందరు అధ్యాత్మశాస్త్రవేత్తలు – "సర్వకర్మలు చేయవచ్చు. అయితే ఆ కర్మల సర్వఫలములు త్యజించి ఉండటమే కర్మత్యాగం" అని అభివర్ణిస్తున్నారు.

## సర్వకర్మలను త్యజించటం

మరికొందరు శాస్త్రవేత్తలు, "సర్వకర్మలు నిర్వర్తించటంలోనూ ఏదో దోషం తోడుగా తత్సమయంలో ఉండియే తీరుతుంది. అందుచేత సర్వ కర్మలు (All Activities) త్యజించటమే కర్మసన్యాసం."... అని చెప్పుచున్నారు.

## అవిహిత కర్మల సన్యాసం

ఇక ఇంకొందరు శాస్త్రద్రష్టలు – "యజ్ఞము (Any function that serves the comfort of this world) – దానము (Giving – Contributing for others) తపస్సు (Cogitation) – ఈ మూడు మాత్రం ఎవ్వరూ ఏమాత్రం త్యజించరాదు. తదితరకర్మలు త్యజించాలి. అదియే త్యాగము. అదియే కర్మసన్యాసము"... అని ప్రబోధిస్తున్నారు.

⋆⋆⋆

ఓ భరతసత్తమా! ఈ విషయంలో కొన్ని విశేషాలు చెప్పుచున్నాను. విను.

ఓ పురుషవ్యాఘ్రా! "కర్మ – త్యాగము" అనునది కూడా "సత్వరజస్తమో కర్మ త్యాగములు" అనుమూడు విధములుగా పరికీర్తించబడుతోంది.

**సాత్వికత్యాగం :** సర్వము పరమాత్మకు చెందినదిగా గమనిస్తూ

ఉండటం. నీకు నియమించినకర్మలు సమర్పిత బుద్ధితో చక్కగా నిర్వర్తించటం. అట్టి కర్మలను సర్వాత్మకునకు సమర్పించబడే పూజాపుష్పాలుగా సంభావించటం. ('నాది' అనిపించేదంతా పరమాత్మదే!)

**రాజసికత్యాగం :** ఫలాపేక్షతో కర్మలు నిర్వర్తించటం – కర్మలు త్యజించటం.

**తామసికత్యాగం :** కోపంచేతనో, శ్రమ అని తలచో, బద్ధకము చేతనో, ఆవేశపూర్వకంగానో, తదితరులపై కక్షచేతనో కర్మలు త్యజించటం.

ఇప్పుడిక నా అభిప్రాయం ఏమిటో చెప్పుచున్నాను విను.

యజ్ఞ–దాన–తపస్సులు అనే త్రివిధకర్మల గురించి చెప్పుకున్నాం కదా!

**యజ్ఞకర్మ :** తదితరుల క్షేమ – శ్రేయస్సులను దృష్టిలోపెట్టుకొని ధర్మనిర్వహణ భావంతో నియమిత కర్మలు నిర్వర్తించటం.

**దానము :** ఇతరుల సుఖసంతోషములకై త్యాగభావంతో సమర్పించటం. జీవనవిధానం దాన – ధర్మ – సేవా పూర్వకంగా తీర్చిదిద్దుకోవటం.

**తపసూ :** శారీరక – వాచిక – మానసిక తపస్సులు.

యజ్ఞ – దాన – తపో కర్మలు మాత్రం ఏమాత్రం విడువనే కూడదు. తప్పక నిర్వర్తించాలి. ఎందుచేతనంటావా? అట్టి యజ్ఞ – దాన – తపోకర్మలు మనిషియొక్క మనస్సును పవిత్రంగా తయారు చేస్తాయి.

అయితే....,

అట్టి యజ్ఞ – దాన తపోకర్మలు కూడా, వాటియొక్క కర్మఫలములను సమర్పణబుద్ధితో త్యజించి ఉండటం, “ఇది నా కర్తవ్యం కదా!”.. అని నిర్ణయించుకొని నిర్వర్తించటం ఉత్తమమని నా నిశ్చితాభిప్రాయం.

ఓ అర్జునా! ఈ జీవులెవ్వరూ కూడా తమయొక్క నియమితమగు కర్మలను ఏమాత్రం విడువనేరాదు. ఒకవేళ ఏవేవో సాకులతో తనకు నియమించబడిన కర్మలను త్యజిస్తే (నిర్వర్తించటం మానితే),... అది తామసగుణము చేతనే అవుతుంది. అది మోహముతో కూడిన త్యాగమని అనిపించుకుంటుంది సుమా!

“శరీరకష్టం చేయవలసివస్తుందే! ఎందుకు శ్రమించాలి? అందుచేత ఈ శరీర కష్టం నేను ఎందుకు ఎగగొట్టరాదు?” అని నియమిత కర్మలు త్యజిస్తూ ఉంటే,... అప్పుడు అది “రాజసత్యాగం” మాత్రమే! “కర్మఫలత్యాగం” అనే ప్రయోజనం కలుగనే కలుగదు.

“నాకు నియమితమైన కర్మలు నేను తప్పక నిర్వర్తించటం శుభప్రదం.”..అను నిర్ణయంతో ఆ కర్మలు నిర్వర్తిస్తూ, ఆ కర్మఫలములను సమర్పణభావంతో దర్శిస్తూ ఉండటం సాత్వికత్యాగం అవుతుంది. అది కర్మయోగమై ఆ జీవుని అనేక దోషములనుండి సముద్ధరిస్తుంది. ఆ “కర్మఫలత్యాగి, శుద్ధ సత్త్వయుక్తుడు” అగు సాత్విక కర్మఫలసన్యాసి “ఈ ఈ కర్మలు ప్రియమైనవి కావుకదా” అని త్యజించడు. “ఈ ఈ కర్మలంటే నాకు ఇష్టంకదా”... అని ఉద్దేశ్యించి అతిగా అనువర్తించడు. “ఇది నాకు నియమిత కర్మ. కనుక తప్పక నిర్వర్తిస్తాను. ఇందులో నాయొక్క ఇష్టాఇష్టములకు తావెక్కడిది?.. అని సమన్వయించుకొని ఉంటాడు.

ఓ అర్జునా! శరీరధారులెవ్వరికీ కూడా “నేను ఏ కర్మలూ నిర్వర్తించను”... అను కర్మత్యాగంతో సర్వకర్మలు త్యజించి ఉండటం అసాధ్యం. అది కుదరనే కుదరదు. ఎవ్వరైతే కర్మఫలములను సమర్పిత బుద్ధితో త్యజించినవారై ఉంటారో.... అట్టివారే “కర్మత్యాగి – యోగి – ఫలత్యాగి” అని శాస్త్రములచే

అభివర్ణించబడుచూ ఉంటారు.

అర్జునా! ఎవరు సమర్పితభావంతో,... "నాకు నియమించబడిన కర్మలు తప్పక చేతనైనంత శ్రద్ధ – నైపుణ్యములతో నిర్వర్తిస్తాను".. అనే భావం సుదృఢం చేసుకోరో... వారు అత్యాగి (One who is not detatched, but attached to the functions)!

ఒకడు తాను నిర్వర్తించుచున్న కర్మలలో కొన్ని ప్రియమైనవి (ఇష్టమైనవి), మరికొన్ని అప్రియమైనవి (అయిష్టమైనవి) ఇంకొన్ని మిశ్రమమైనవి ఉండి ఉండటం కర్మల తాదాత్మ్యం చేతనే జరుగుతోంది. అయితే అలా అనిపించటానికి కారణం? ఆతడు కర్మసంగి కాబట్టి. ఆ కర్మిష్ఠుని "అత్యాగి (Attached to what he has to do)" అని శాస్త్రకారులు చెప్పుతూ ఉంటారు.

కర్మ సన్యాసి (One who dedicated all his allotted functions being discharged by him)కి "ఈ కర్మలంటే ఇష్టం. ఇవంటే ఇష్టం లేకపోయినా చేస్తున్నాను. ఇవి కొంత ఇష్టం – కొంత అయిష్టం కూడా".. అనునది ఉండనే ఉండదు. కర్మయోగికి తాను నిర్వర్తిస్తున్న కర్మలపట్ల ఇష్టానిష్టాలప్రసక్తి ఉండదు. "విహితమా? అవిహితమా?" (is it my function? Whether it is my allotted function?)"... అనునది మాత్రమే ఉంటుంది. **ఇదియే కర్మ – అత్యాగికి, "కర్మ సన్యాసి (లేక) కర్మయోగి"కి ఉన్న బేధం.** ఇక కర్మల నిర్వహణ విషయానికివస్తే – ఇరువురు అనివార్యంగా కర్మలు నిర్వర్తిస్తూనే ఉంటున్నారు.

ఇది ఇట్లా ఉండగా....,

అధ్యాత్మ శాస్త్రములలో ఒకానొకముఖ్యమైన విభాగం అయినట్టి "సాంఖ్యశాస్త్రం".. "నైష్కర్మ్య సిద్ధి" (లేక) 'అకర్మస్థితి' లేక "కర్మాతీతస్థితి" (లేక) "కర్మరాహిత్యస్థితి"గురించి సిద్ధాంతీకరిస్తున్నది. అట్టి "కర్మసంసిద్ధి" అనబడే కర్మయోగస్థితి గురించి సాంఖ్యశాస్త్రం ఏమని నిర్వచిస్తోందో.... ఇక్కడ ఉదహరిస్తున్నాను. విను.

ఒక కర్మ నిర్వర్తించబడాలంటే “ఐదు” విషయములు ఒకచోట ఒనగూడాలి. లేక, సమావేశము కావాలి. అప్పుడే ఏ కర్మ అయినా నిర్వర్తించబడగలదు.

1. **అధిష్ఠానము** : **ఈ పాంచభౌతికదేహం** ప్రకృతి ఇద్దానిని నిర్మించి ఈ జీవులకు కర్మనిర్వహణము కొరకై ఉపకరణంగా ప్రసాదిస్తోంది. చూడటం - మాట్లాడటం మొదలైనవి ఇందులోని క్రియాసామర్థ్య విశేషాలు.

2. **కర్త** : **ఈ జీవుడు** తన జీవతత్వంచే ఇద్దానిని చైతన్యవంతం చేస్తున్నాడు.

3. **పృథక్విధమ్**

**కరణము** : ఆయా వివిధ ఉపకరణములు. సాధనా సామాగ్రి.

4. **పృథక్ చేష్టా** : ఆయా అనేక సంఘటనలు. శబ్ద స్పర్శాది ఇంద్రియతత్వాలు. ఇతఃపూర్వపు-ఇప్పటి-భవిష్యత్ మానసిక స్థితి గతులు.

5. **దైవం** : దైవికమైన స్థితి (Various situations that unexpectedly and accidentally take place. The inexplicable Godliness which is running the total show of the world since times immemorial plays its role in the acts that take place).

ఈ ఐదు ఒనగూడితేనే ఒకమంచి - లేక చెడు క్రియ సిద్ధిస్తోంది. ఆయా ప్రతి ఒక్క కార్యక్రమంకూడా - అది శరీరముతోగాని, వాక్కుచేతగాని - (లేక) - మనస్సుచేతగాని - ప్రారంభించబడే మంచి - (లేక) - చెడు (Positive or negative) కార్యము కూడా → పైన చెప్పిన ఐదు ఒకచోట ఒనగూడితే మాత్రమే సిద్ధిస్తోంది.

ఈ విధంగా అధిష్ఠానము (శరీరము) - కర్త (జీవుడు) - ఆయా సందర్భములు (లేక) పరిస్థితులు - ఉపకరణములు - దైవము - ఈ ఐదు

కలిస్తేనే ఒక క్రియ సిద్ధిస్తూ ఉండగా, ఇక ఈ జీవుడు "ఇది నిర్వర్తించటానికి నేనే కారణం"... అంటూ కర్తృత్వము తనపైననో, మరొకజీవునిపైనో ఆపాదించటం "అల్పబుద్ధి" యొక్క సందర్శనమేగాని, సత్యసందర్శనం కాదు. విజ్ఞుడు ఇది గమనించి "నేనే కారణం. ఆతడే కారణం"... ఇటువంటి అల్పశబ్దాలను పలుకడు.

ఓ అర్జునా! "ఎవ్వరైతే...ఆయా కర్మలను నేను నిర్వర్తించటంలేదు. నేను వాస్తవానికి కర్తృత్వ – భోక్తృత్వ రహితుడను" అను భావం బలవత్తరంగా కలిగి ఉంటాడో,... ఎవరియొక్క బుద్ధి అహంకార – మమకారదులచే దోషభూయిష్టమై ఉండదో (ఇష్టాయిష్టములచే – ప్రియాప్రియములచే, నావారు – కానివారు అను భావములచే అల్పత్వము వహించి ఉండదో)... అట్టివాడు ఈ లోకంలో జీవులందరినీ సంహరించినప్పటికీ... ఆతడు ఎవ్వరినీ చంపనివాడే అవుతాడు. ఆతడు అట్టి కర్మచే నిబద్ధితుడు కాడు. ఆ కర్మ ఆతనిని బంధించదు.

(ఉదాహరణకు, ఒక తలారి ఉరిశిక్షను అమలు చేసినంతమాత్రంచేత ఆతడూ ఆకర్మచే (హత్యచేసినవాడు) కాదు కదా!)

⋆⋆⋆

ఓ అర్జునా! ఒక కర్మ నిర్వర్తించబడాలంటే,... కర్మ ప్రోత్సాహకాలు మునుముందుగా ప్రేరణపొందాలి. ఆ తరువాత కర్మసంయోగాలు క్రియాశీలకమై ప్రవర్తించాలి. అప్పుడే ఏ ఒక్క కర్మ అయినప్పటికీ,... అది నిర్వర్తించబడటం జరుగుతోంది.

అట్టి కర్మ ప్రోత్సాహకాలు మూడు విధములుగా, కర్మ సంయోగాలు (ఉపకరణాలు) మూడు విధములుగా ఉంటున్నాయి.

**కర్మ ప్రోత్సాహకాలు** (Inspirers) *:*

1. తెలివి (జ్ఞానం) (Knowing)
2. తెలియబడేవి (జ్ఞేయం) (That being known)

3. తెలుసుకొనువాడు (జ్ఞాత) (Knower)

**కర్మ – ఉపకరణాలు** (Instruments) :

1. కర్మకుసంబంధించిన ఉపకరణాలు. సాధనములు ఇంద్రియములు (కరణములు)

2. క్రియావ్యవహారం (Action \ Doings)

3. కర్త – జీవుడు (Doer)

ఈ మూడు మూడు కూడా తిరిగి సాత్విక – రాజసిక – తామసిక గుణస్వభావపూరితమై ఉండి ఉంటున్నాయి.

ఇప్పుడు జ్ఞానము – కర్మ – కర్త

బుద్ధి – ధృతి – సుఖం

ఇవి భేదంచేత ఎట్లా ప్రవర్తించుచున్నాయో, బ్రాహ్మణ – క్షత్రియ – వైస్య – శూద్ర స్వభావముల గురించి, ఆ నాలుగు స్వభావులు కూడా ఏవిధంగా తమతమ కర్మనిర్వహణచే సిద్ధిని పొందవచ్చునో – వివరిస్తున్నాను. విను.

## (1) సాత్వికగుణ వ్యక్తిత్వం

**సాత్వికజ్ఞానం** : ఏ జ్ఞాన సమాచారం చేత "సర్వ జీవులు ఒకే పరమాత్మ యొక్క సంప్రదర్శనం! అవ్యయమగు పరమాత్మ సర్వదా అవిభక్తం! వేరువేరుగా ఈ ఈ జీవులంతా కనిపిస్తున్నప్పటికీ... జీవులందరిలోను నిత్యసత్యమగు పరమాత్మ ఒక్కటే!" అను సారాంశము చెప్పుచున్నదో, ఏ జ్ఞానమాచారం నిరూపిస్తూ వస్తోందో,... అది సాత్విక జ్ఞానం.

భిన్నత్వంలోని ఏకత్వం సందర్శింపజేసేది సాత్విక జ్ఞానం.

**సాత్విక కర్మ** :

ఏ కర్మ అయితే......., 'నియమిత కర్మ' (A function that is alotted),

అయి ఉన్నదో.......,

సంగరహితంగా నిర్వర్తించబడుతోందో (Being discharged without attachment),

రాగ - ద్వేషరహితంగా నిర్వర్తించబడుతోందో (Being discharged without liking for some or disliking for some others),

ఫలాపేక్ష (Expectation of fruits (or) subjectivity towards what is going to finally result as) లేకుండా నిర్వర్తించబడుచున్నదో...,

అట్టి కర్మ "**సాత్విక కర్మ**" అని చెప్పబడుతోంది

**సాత్విక కర్త :** ఏ 'కర్త' అయితే.....,

సంగము (Attachment towards people\results\outcome) లేకుండా.....

"నేను నమిత్తమాత్రుడను మాత్రమే. అంతా పరమేశ్వరేచ్ఛ. పరమాత్మయొక్క ప్రదర్శనా చమత్కారం"...

అను అనహంకార - నిరహంకారములతోకూడిన అవగాహనతో నిర్వర్తిస్తున్నాడో,

ధైర్యము - ఉత్సాహము - కలుపుకోలుతనము (Duly keeping others also in view) కలిగి ఆయా కర్మలను నిర్వర్తిస్తున్నాడో,

తాను నిర్వర్తిస్తున్న స్వధర్మపూర్వకమైన కర్మ సిద్ధించినా - సిద్ధించకపోయినా నిర్వికారుడై ఉండి ఉంటున్నాడో,

... అట్టి కర్త "**సాత్విక కర్త**" అని చెప్పబడుచున్నాడు.

**సాత్వికబుద్ధి** : ఏ బుద్ధికైతే.........,

- నా ప్రవృత్తి ఎటువంటిది? నివృత్తి ఎటువంటిది? నేను 'చేయాలి'

అనుకున్నవి ఏవేమి? ఎట్టిది? నేను 'చేయకూడనివి' అని అనుకుంటున్నవి ఎట్టివి? ఏవేవి? అవి శాస్త్రానుకూలమేనా? లోకానుకూలమేనా?"

- నేను ఏది చేయటం ఉచితం? ఏది నాకు అనుచితం?
- నేను దేని పట్ల భయ - అభయములు కలిగినవాడనై ఉండాలి ?
- ఏకర్మలు నాకు బంధం అధికంగా చేస్తాయి? ఏది నాకు విముక్తి - మోక్షము కలుగ జేయగలవు?

ఇట్టి విచార - విమర్శలకు సంసిద్ధం అయి ఉన్న బుద్ధి సాత్వికబుద్ధి. ప్రవృత్తి - నివృత్తులను, కార్య - అకార్యములను, భయ - అభయములను, బంధ - మోక్షములను విశదపరిచే బుద్ధియే "**సాత్విక బుద్ధి**".

**సాత్వికధృతి / పట్టుదల** : ఏ ధృతి అయితే .........,

- యోగబలమును ప్రవృద్ధం చేస్తూ,
- అనన్యయోగ స్థితికి సమాచారం బలం సమకూరుస్తూ,
- ఒకడు ఒక వస్త్రంధరించునట్లు తాను మనస్సు - ప్రాణ - ఇంద్రియములకు వేరై, మనః - ప్రాణ - యింద్రియములను కంఠ-ఆభరణాలవలె ధారణ చేయునదై ఉన్న ధైర్యము.

"**నేను వేరు - ఈ మనసూ ప్రాణమూ ఇంద్రియాలు వేరు**" - అను ధారణయే సాత్వికధృతి.

**సాత్విక సుఖం** : ఏ 'సుఖము'ను భావనాపూర్వకంగా అభ్యసిస్తూరాగా సర్వ దుఃఖములు ఉపశమిస్తాయో (By practising happyness, where all worries simply pack out)... అది "**సాత్వికసుఖం**".

- మొట్టమొదట కష్టంగా ఉండి క్రమేపీ అమృతమయమై ఈ జీవుని హృదయం సుఖం ప్రసాదిస్తోందో - శాంతిమయం చేసివేస్తోందో...

అట్టిది సాత్విక సుఖం.

## (2) రాజసికగుణ వ్యక్తిత్వం

**రాజసికజ్ఞానం** : ఏ విచక్షణచే

- ఈ కళ్ళకు కనబడే జీవులు తమ గుణ – స్వభావ – భావన – జాతి – ప్రదేశాదులరీత్యా భిన్న–భిన్నములుగా కనిపిస్తారో" – అట్టి జ్ఞానం "**రాజసిక జ్ఞానం**".

**రాజసిక కర్మ :**

- అనేక ప్రయాసలతో కూడి,
- కోరికలు సిద్ధించాలనే వేడుకతో,
- అహంకార – మమకారములతోకూడి,
- ఇంకా ఏదో ఏదో పొందాలనే ఊహలతో నిర్వర్తించే కర్మ "**రాజసిక కర్మ**" అని పిలువబడుతోంది.

**రాజసిక కర్త:**

- రాగముతో (with deep attachment) నిర్వర్తిస్తూ ...,
- కర్మఫలములు ఎట్లాగైనా సముపార్జించాలనే భావనతో...,
- సహజీవులను బాధించటానికి వెనుకాడక, హింసాప్రవృత్తిని కొనసాగిస్తూ,
- అశుచికరమైన భావాలతో (వారికన్నా – వీరికన్నా గొప్పకావాలి – జయించాలి – అణచివేయాలి – మొదలైన భావాలతో).......,
- లోభ గుణంతో, ప్రారంభించువాడు,
- హర్ష – శోకములు కలిగి ఉంటూ (continuing the senses of pleasure and displeasure) కార్యములు కొనసాగించువాడు '**రాజసిక కర్త**' అని

చెప్పబడుచున్నాడు.

**రాజసిక బుద్ధి :**

- ఏది ధర్మమో.... ఏది అధర్మమో,
- ఏది కార్యమో... ఏది అకార్యమో (ఏది చేయవచ్చునో - ఏది చేయకూడదో)
- ఏ మార్గం ఉచితమో - ఏ మార్గం అనుచితమో పరిశీలించకుండా ప్రవర్తించేబుద్ధిని '**రాజసిక బుద్ధి**' అని అంటూ ఉంటారు.

**రాజసికధ్పృతి (ధైర్యము / పట్టుదల)**

ఓ పార్థా! అనుక్షణం ఫలితములగురించి ప్రసంగిస్తూ, అర్థ - కామములతో - కర్మ ఫలితములతో సంబంధం కల్పించుకొని, కర్మనిర్వర్తించే ధృతి (ధైర్యము) '**రాజసిక ధృతి**' అని అనబడుతోంది. ఫలితముల గురించి పట్టుదల వీడకపోవటం, ధర్మాధర్మములకు ప్రాముఖ్యత ఇవ్వకపోవటం రాజసిక ధృతి లక్షణాలై ఉన్నాయి.

**రాజసిక సుఖం**

- ఇంద్రియ విషయములు - దృశ్యవ్యవహారములకు సంబంధించినదైన సుఖం.
- మొట్టమొదట సుఖకరంగా ఉంటూ, పర్యవసానంగా కొద్దికాలంలో దుఃఖముగా పరిణమించబోవుచున్న సుఖం... అట్టి సుఖం '**రాజసిక సుఖం**'గా నిర్వచించబడుతోంది.

## (3) తామసిక గుణ వ్యక్తిత్వం

**తామసిక జ్ఞానం**

- "ఈ శరీరమే సర్వస్వము - శాశ్వతము - ఇంతకుమించి మరింకేమీ ఎక్కడా లేదు". అని సూచనలను ప్రవృద్ధం చేసే జ్ఞానం,

- ఆయా కార్యక్రమములందు సక్తతలో నిబంధించునది, (చేసే పని చెడుదని తెలిసికూడా వదలాలని అనిపించనిది),
- విచక్షణా జ్ఞానం – హేతు జ్ఞానం (Logic) లేకుండునది,
- తుచ్ఛము – అల్పము అగు భావాలు (ఆవేశము – క్రోధము – పగ – ద్వేషము – అసూయలతో కూడిన భావాలు)– అభిప్రాయాలు పెంపొందించేది అగు జ్ఞానం '**తామసిక జ్ఞానం**' అని చెప్పబడుతోంది.

**తామసిక కర్మ**

- అనుబంధం (Attachment) కలుగజేసేది,
- స్థితి – గతులను అధోమార్గంగా నడిపించేది,
- హింస ప్రవృత్తితో కూడినది, దుష్ట ఆచారవ్యవహారములతో కూడినది,
- ప్రేమ – దయ మొదలైనవి లేనట్టిది,
- "నిర్వర్తించగలమా? – లేదా?"... అను సామర్థ్యాసామర్థ్యములను పరిశీలించకుండానే కోపం – ఆవేశం – పగ – కసి..... మొదలైన వాటితోకూడి ప్రారంభించబడునది,
- మోహము (Illusions - Misconceptions - Pre-Conceived Notions - Mis - interpretations) తో కూడి ప్రారంభించేది.....,

అట్టి కర్మ '**తామసిక కర్మ**' అని చెప్పబడుతోంది.

**తామసిక కర్త**

- యుక్తాయుక్తములను విడచినవాడు,
- అవగాహన – వ్యతిరిక్త ఫలములను గమనించనివాడు,
- లోభగుణముతో ప్రారంభించువాడు,
- ఇతరులను కష్టపెట్టటానికి వెనుకాడనివాడు,

- అశుద్ధమైన ఆచారములను స్వీకరించువాడు, గర్వముతో - భయోద్వేగములతో నిర్వహించేవాడు,
- శోకములలో మునిగితేలువాడు, ఎప్పుడూ బాధపడుతూ పని నిర్వర్తించేవాడు,
- ముందు ఆలోచనలు చేయకుండా బద్ధకముతో పని ప్రారంభించువాడు

ఇట్టికర్త '**తామసిక కర్త**'గా చెప్పబడుచున్నాడు.

**తామసిక బుద్ధి** : ఏ బుద్ధికైతే...,

- ధర్మం అధర్మంగాను, అధర్మం ధర్మంగాను కనిపిస్తూ వస్తోందో...,
- అకార్యం కార్యంగాను - కార్యం అకార్యంగాను అనిపిస్తుందో...,
- అజ్ఞానభావములతో - అభిప్రాయములతో నిండి ఉంటుందో....,
- ప్రతిదానికి వ్యతిరేకార్థం చేసి దోషములను ఆపాదిస్తూ ఉంటుందో...,
- చెడును చూపటంలో ప్రావీణ్యత - మంచిని చూపటంలో అసమర్థత కలిగి ఉంటుందో.....,

అట్టి బుద్ధి "**తామసికబుద్ధి**" అని అనిపించుకుంటోంది.

**తామసిక ధ్యృతి / పట్టుదల** (Courage and Initiative)

"అపోహ - ఆకర్షణ - ఆవేదన - ఆవేశము - అభినివేశము - ఆక్రోశము-". ఇటువంటి స్వప్నసదృశ భయ - శోక - విషాద - ద్వేషములతో కూడినదై ఉన్న ధైర్యము.

ఆయా ఆవేశ - కావేశములను వాస్తవ - అవాస్తవాలతో పరిశీలించకయే కొనసాగించటం, తొలగించుకోవటానికి ప్రయత్నించకపోవటం, దుష్టమైన ఆలోచనలు - అభిప్రాయాలు బలం పుంజుకోనివ్వటం...

ఇట్టి క్రియలకు కలిగి ఉండే పట్టుదల '**తామసిక ధ్యృతి**' అని

అనిపించుకొంటోంది.

**తామసిక సుఖం :**

మొట్టమొదటి నుండి అనుబంధం (Deep attachment) కలిగిఉండే స్వభావంగల సుఖం.

- తనను తానే మోహం (Illusionary Senses, Views, Ideas, Opinions)చే దట్టంగా ఆవరింపజేసుకొనే విధంగా ఉండేది.
- నిద్ర – ఆలస్యము – బద్ధకము – మత్తు – సోమరితనము – నిస్తేజత్వము కలుగజేసేది... ఇటువంటి సుఖాలు కోరుకోవటమే 'తామసిక సుఖాభిలాష' అని చెప్పబడుతోంది.

☆☆☆

ఓ అర్జునా! ఈ దేవ – మానవ – పాతాళ లోకాలలోని వ్యక్తిత్వములన్నీ ప్రకృతిజనితమైన **"సత్వరజస్తమో త్రిగుణాు సంప్రదర్శనం"** తప్పితే మరింకేమీ ఎక్కడా ఏదీ ఏ రూపంగానూ లేదు. 'ఉనికి ఉన్నది' అనగానే ఈ "త్రిగుణాల సమన్వయము ఉన్నది" అనియే అర్థం. ప్రతివాడు ప్రతివస్తువు ఈ త్రిగుణ సమన్వయమే!

అంతరంగంలోను – వ్యక్తిత్వంలోను (In the inner personality) ఈ సత్వ – రజ – తమోగుణములలోని ఒక గుణము యొక్క అధికత్వం – ఆధిపత్యం అనుసరించి శాస్త్రములు చతుర్విధ వర్ణములుగా ఈ జీవులను విభజిస్తున్నాయి. (గుణములే ఈ విభజనకు కారణం కాని, జన్మలు కాదు. లోకవిభజనలు కాదు).

1. **బ్రాహ్మణ** : సత్వగుణ ప్రధానులు.
2. **క్షత్రియ** : రజోగుణ ప్రధానులు.
3. **వైశ్య** : రజో – తమోగుణ ప్రధానులు.
4. **శూద్ర** : తమోగుణ ప్రధానులు.

ఈ బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య శూద్రులనబడే చతుర్విధ వక్తిత్వ విభాగమంతా కూడా - జీవులయొక్క వారివారి స్వభావమునుండి ఉత్పన్నమగుచున్న గుణముల సంయోగము (ఏఏ పాళ్లలో ఏగుణం అధికమో... అద్దానిని) అనుసరించి ఉంటోంది. ఈ చాతుర్ణ్యములకు చెందిన జీవులందరిలోను ఆయా వివిధ స్వభావములు అంతర్లీనంగా అభ్యాసవశంగా ప్రవృద్ధమై, దాగి ఉన్నాయి. అయితే, ఈ త్రిగుణముల కర్తృత్వము ప్రకృతిదే!

## బ్రహ్మకర్మ స్వభావజము

- మనో నిగ్రహరూపమైన శమము.
- ఇంద్రియ నిగ్రహరూపమైన దమము.
- శాస్త్ర ప్రవిచతమైన - సానుకూల్యమైన భావాలు (Positive thinking).
- ఓర్పు - క్షాంతి.
- ఆర్జవం (ముక్కుకు సూటిగా - మనోవాక్కుల ఏకీభావం).
- జ్ఞానమున 'విజ్ఞానముగా' తీర్చిదిద్దుకోవాలనే అంతరంగమునందలి పట్టుదల - అభిలాష (The enthusiasm to convert Theoritical Knowledge into Practice).
- 'పరమాత్మ' యొక్క తత్త్వము పట్ల (ఆస్తిక్యము). "పరమాత్మ ఉన్నారు. ఆయనే అంతటికీ కారణ కారణుడు. ఆయనను చేరాలి" అనే ఆశయం కలిగి ఉండటం, అట్టి బోధలు వినిపించటం.
- యజ్ఞ - యాగ - పూజ - తపస్సులపట్ల (బ్రహ్మకర్మలపట్ల) అభిరుచి.

## క్షాత్ర-కర్మ స్వభావజము

- శౌర్యము (Ability to fight out Evils).
- తేజస్సు (Enlightened).
- ధృతి (Courage and initiative).

- దక్షత (Leadership quality).
- యుద్ధేచ అపలాయనం (Determination to continue to fight for winning over hurdles, Non-withdrawal in continuing efforts).
- దానము (To contribute for others).
- ఈశ్వరభావత్వం (Sense of adoring Godliness).
- క్షాత్రం (Qualities to execute a task).

మొదలైనవి.

## వైశ్య–కర్మ స్వభావజము

- కృషి,
- గోరక్షణ (ఆహారాది సంపదలను సంరక్షించటం – పరిపోషించటం),
- వాణిజ్యం (Services of business/ Transportation),

మొదలైనవి.

## శూద్ర–కర్మ స్వభావజము

- పరిచర్యాత్మకం (Extending services to physical needs of other members of the sociaty),
- సేవా స్వభావం (Enthusiasm to serve the people),

మొదలైనవి.

☆☆☆

ఓ అర్జునా! జీవులంతా కూడా ఈరీతిగా ప్రకృతియొక్క ప్రభావంచేత, వారివారి అభ్యాస – గుణాధిక్యతలను అనుసరించి చతుర్విధ గుణస్వభావులై ఉన్నారు. ఈ విధంగా "శాస్త్రజ్ఞాన సంపత్తి – పురుషకారము – కృషి – సేవ".... ఈ నాలుగు వారియొక్క లక్షణ సంపద అయి ఉన్నది. (Thinking - Protecting - Efforting - Physical servics)

ఈ నాలుగు విధములగు గుణస్వభావజులు కూడా ఆత్మానందానికి తప్పక అర్హులే! ఈ జగన్నాటకము యొక్క చమత్కారమునకై ఈ నాలుగు స్వభావులు – వారివారి పాత్రలు తప్పక ఆవస్యకమే! ఇక తక్కువ ఎక్కువలు ఏమున్నాయి? ఈ నలుగురుకూడా వారివారి స్వభావసిద్ధములగు బ్రాహ్మణ – క్షత్రియ – వైస్య – శూద్రగుణ సంపత్తులతో **వారివారి పాత్రోచితమైన స్వకర్మాను నిర్వర్తించి కర్మయోగులై, తద్వారా తప్పక సిద్ధిని పొందగురు.** "మోక్షస్థితి – సంసిద్ధి పొందటానికి వీరిలో ఒక గుణ ప్రధానులకే సాధ్యం. కొన్నికొన్ని గుణప్రధానులు సిద్ధిని పొందలేరు"... అను వాక్యం యుక్తియుక్తమే కాదు. ఈ విధమైన బ్రాహ్మణ – క్షత్రియ – వైస్య – శూద్ర గుణసంపదా ప్రధానులు వారివారి గుణములను అనుసరించి కర్మలు నిర్వర్తిసా్తూ సిద్ధిని – ఆత్మతాదాప్యమును – ముక్తిని ఏవిధంగా పొందవచ్చో, ... అది కూడా వివరిస్తున్నాను. విను.

☆☆☆

## "సంసిద్ధి"

ఈ వివిధగుణ ప్రధాన జీవులంతా ఒకే ఆత్మతత్వం నుంచి బయెల్వడలుచున్నారు కదా! అనగా అందరూ స్వతఃగా పరమాత్మ స్వరూప – స్వభావులే! త్రిగుణములు ఆత్మనుండే బయల్వెడలుచున్నాయి. ఇందులో ప్రతి ఒక్కరూ (ప్రతి ఒక్కగుణప్రధానుడూ) తనయొక్క గుణ సంపదను అనుసరించి సర్వాత్మకుడగు పరమేశ్వరునికి సమర్పణపూర్వకంగా తనకు విధించబడిన విధులను, కార్యక్రమములను నిర్వర్తిస్తూ సిద్ధిని పొందగలడు. **ఇందులో సందేహమే లేదు.**

– **సాత్వికాదియుక్తగు స్వభావుడు** "నేను క్షాత్రవ స్వభావునివలె రక్షణ కల్పించటల్లేదే! వైశ్య స్వభావునివలె కృషి – సంపదాభివృద్ధికి శ్రమించటం లేదే? శూద్ర స్వభావునివలె సేవించలేకపోతున్నానే?".... అని అనుకోవలసిన పని

లేదు. తన యొక్క మనో – ఇంద్రియ నిగ్రహం, తపస్సు, శుచి అయిన భావాలు, ఆత్మనిగ్రహం – నిర్దుష్టాభిప్రాయాలు – శాస్త్రజ్ఞాన – విజ్ఞాన పాటవాలు, ఆస్తిక్యత వంటి గుణాలతో సర్వాంతర్యామి – సర్వతత్వ స్వరూపుడు – సర్వ జీవస్వరూపుడు అగు పరమాత్మను ఆరాధిస్తూ సిద్ధిని సముపార్జించుకోవటమే ఉచితం.

**అట్లాగే క్షత్రియ స్వభావుడు,** "నేను బ్రాహ్మణ గుణసంపన్నునివలె జ్ఞాన విజ్ఞానశాస్త్ర సంపదకలిగి లేనే? వైశ్యగుణ సంపన్నునివలె కృషి – గోరక్షణ – సంపదాభివృద్ధి నిర్వర్తించటం లేదే? శూద్రగుణ సంపన్నుని వలె సేవాతత్పరత ప్రదర్శించటం లేదే?".... అని దిగులుపడవలసిన అవసరం లేనే లేదు. తనయొక్క శౌర్య – తేజో గుణసంపద – ధైర్యము – త్యాగనిరతి – యుద్ధ లాఘుము – దానము – ఈశ్వరభక్తి – క్షాత్రము ... ఇత్యాది గుణములచే సర్వస్వరూపుడగు పరమాత్మను సేవిస్తూ తప్పక సంసిద్ధి పొందగలడు.

**ఆవిధంగానే వైశ్యగుణ సంపన్నుడు,** "నేను బ్రాహ్మణ గుణసంపన్నునివలె శాస్త్ర పఠణాదులు చేయలేక పోతున్నానే?".... అని వేదన చెందనవసరం లేదు. తనయొక్క "కృషి – గోరక్షణ – సంపద రక్షణ – వాణిజ్య" కర్మలద్వారా "నేను సర్వాంతర్యామియగు పరమాత్మను ఈ రూపంగా సేవిస్తున్నాను".... అని భావన చేసి తన స్వభావసిద్ధమైన కర్మలను సమర్పణ – భక్తి పూర్వకంగా నిర్వర్తించునుగాక! ఆతని ఆ కర్మనిరతి ఆతనిని సముద్ధరిస్తుంది.

అదే విధంగా **శూద్రసంపదస్వభావుడు "సేవించాలి. నా సేవ ద్వారా జనులను సంతసింపజేయాలి".... అను స్వభావము** కొనసాగించుగాక! అయ్యో! నేను శాస్త్రాలు సేవించటం లేదే? పరాక్రమం ప్రదర్శించటం లేదే? సంపదలను వృద్ధి చేయటం లేదే?".... అని బాధ పడవలసిందేమీ లేదు. "నాయొక్క ఈ సేవాప్రవృత్తిచే పరమాత్మను సర్వదా సేవిస్తున్నాను".... అని భావించి ఆ సేవానిరతిని కొనసాగించాలి. తద్వారా ఆతడు తప్పకుండా సర్వాంతర్యామియగు పరమాత్మసందర్శనం సముపార్జించుకోగలడు.

☆☆☆

ఓ అర్జునా! ఏ గుణస్వభావునికి ఆ గుణసంపదద్వారా పరమాత్మ సమర్పణాభావంతో ఆ గుణసంపదకు సానుకూలమగుచున్న కర్మలు నిర్వర్తించటమే సముచితం. "ఏది స్వధర్మమైయున్నదో,... అయ్యది తప్పక ఆ జీవునికి శ్రేయస్సు కలుగజేయగలదు. అది గొప్పది – అని ఎవరికైనా అనిపించకపోయినప్పటికీ... అది శ్రేయోదాయకమే! గుణ స్వభావానుసారంగా తనకు నియమించబడిన కర్మ నిర్వర్తించటంచేత కర్మలదోషం ఆతనికి ఏ మాత్రం అంటదు.

ఓ పార్థా! తనకు గుణస్వభావానుసారంగా సహజమైయున్న నియమిత కర్మ తనకు ప్రసాదించబడిన భగవత్‌దత్తమైన సాధనంగా చూడాలి. గమనించాలి (చాతుర్వర్ణ్య ధర్మములు స్వభావ సంబంధమైనవేగాని, జన్మసంబంధమైనవి కావు). "ఇందులో కొన్ని కొన్ని దోషాలు ఉన్నాయే? మరి ఎందుకు చేయటం?" అని ఆయా "బ్రాహ్మణ – క్షత్రియ – వైశ్య – శూద్ర" గుణస్వభావులు తలచరాదు. అందులో దోషములు ఉన్నప్పటికీ గుణస్వభావానుసారంగా నియమితమైన కర్మ తప్పక నిర్వర్తించవలసిందే! ఇక ఆయా నియమిత కర్మలలో దోషం సంగతేమింటంటావా? ఇక్కడ ఒక్క విషయం ప్రతి ఒక్కరు గమనించాలి. అగ్ని ఉన్నచోట పొగలేకుండా ఉంటుందా? ఉండదు కదా! అట్లాగే ఏ (స్వభావ సంబంధమైన) కర్మ ప్రారంభించినప్పటికీ అందులో ఏవో కొన్నిదోషాలు అనివార్యంగా ఉంటాయి. అది 'కర్మ' యొక్క ఒకానొక అనివార్యమైన లక్షణం.

నీవు గుణ స్వభావసహజ – నియమిత కర్మ చేస్తున్నప్పుడు ఆ కర్మల యొక్క దోషం నిన్ను అంటకుండా ఉండటానికి 'నైష్కర్మ్యసిద్ధి'ని అవలంబించు.

## నైష్కర్మ్య సిద్ధి

- **సర్వత్ర అనాసక్తి బుద్ధితో** : (By maintaining detachment with the help of your understanding and intellectual ability)

- **జితాత్మా** : ఇంద్రియ విషయములను – దృశ్య సంబంధమైన సర్వ విషయములను మొదలంట్లా జయించినవాడవై, (అనగా) వాటికి

అతీతస్థానం సముపార్జించి, వాటిచేత ఆకర్షితుడవు కానివాడవై... ఉండి, ఆయా నీయొక్క నియమిత గుణస్వభావానుకూలమైన కర్మను నిర్వర్తించు.

ఈ విధంగా సర్వత్రా అనాసక్తబుద్ధితో - సర్వ దృశ్యములచే స్పృశించబడనివాడవై స్వధర్మ-కర్మలు నిర్వర్తిస్తూరాగా.... నీకు "నైష్కర్మ్యసిద్ధి" లేక "సన్న్యాసయోగము" సిద్ధించగలదు. అనగా,

- కర్మలు చేస్తూ చేయనివాడవై ఉండగలవు.
- జన్మలు పొందుతూ జన్మరాహిత్యం ఆస్వాదించగలవు.
- దృశ్యాంతర్గతంగా ఉంటూనే దృశ్యమునకు అతీతత్వమును స్వభావసిద్ధంగా సిద్ధించుకోగలవు.

'బ్రహ్మము' అను స్థితిని సముపార్జించుకోగలవు.

ఓ అర్జునా! ఏవిధములైన నిష్టా-జ్ఞానములచే (with the help of what kind of Determined practices and Awareness) నీవు 'బ్రహ్మము' అను స్థితి - స్వరూప - స్థానములను సిద్ధించుకోగలగుతావో,... అది ఇక్కడ మరల సంక్షిప్తంగా చెప్పుచున్నాను. శ్రద్ధగా విని, గ్రహించు.

**బుద్ధ్యా విశుద్ధయా** : బుద్ధిని నిర్మలం చేసుకో. ఆవేశము - కోపము - ఆశ - దురాశ - దృశ్యాకర్షణ మొదలైన దోషములను బుద్ధినుండి ప్రయత్నపూర్వకంగా తొలగించుకో.

**ధృత్యాత్మానం** : ధైర్యము - పట్టుదల సడలించుకోకు! దీనికీ - దానికీ దిగుళ్లుపడుతూ అపనమ్మకములతో కాలం వృధా చేసుకోకు!

**నియమ్యచ** : ఆహారం - లోక విషయాలు... వీటియందు నిష్ఠ - నియమములను వహించు. "ఏది ఎంతవరకు నియమిత కర్మనిరతికై అత్యవసరమో, అంతకుమించి ఆశ్రయించక పోవటం" - అను నియమము యొక్క అభ్యాసం కలిగి ఉండు. నియమ - నిష్టలు రచించుకొని - పెద్దలు చెప్పేమార్గంలో అనుసరించు.

**శబ్దాదీన్ విషయాన్ త్యక్త్వా** : ఇక్కడి శబ్ద – స్పర్శ – రూప – రస – గంధాలను, వాటి – వాటి విషయాలను మనస్సుతో క్రమక్రమంగా త్యజించినవాడవై ఉండు.

**రాగద్వేషౌవ్యుదస్యచ** : రాగ (Attachment) – ద్వేష (Disliking)ములను రెండిటికిని బద్ధుడవుకావద్దు. రాగద్వేషములను క్రమక్రమంగా వదలి ఉండు.

**వివిక్తసేవీ** : ఏకాంతసేవ ఆశ్రయించి "నేను – సర్వాంతర్యామి యగు పరమాత్మ" అను ఏకాంత సేవ హృదయాంతరంగంలో అలవరచుకో. తదితర జగత్తు బాహ్యమునందే వదిలివేయి. క్రమ–క్రమంగా బాహ్యజగత్తును భగవత్ స్వరూపంగా సందర్శించు.

**లఘ్వాశీ** : ప్రాపంచికసంబంధమైన సర్వ ఆశలను అతి పరిమితంగా ఉంచుకో (Keep yourself satisfied by simplifying your satisfication - level)

**యత వాక్–కాయ–మానసః** : నీ శరీరమును – వాక్కును – మనస్సును అధీనంలో ఉంచుకో. వశంచేసుకొని ఆధ్యాత్మికపరమైన సాధన వస్తువులుగా తీర్చి దిద్దుకో.

**ధ్యానయోగపరో** : పరమేశ్వరధ్యానం, సర్వాంతర్యామి యొక్క ధ్యాస అలవరచుకో. "ఈ శరీరవాక్కులు ఈశ్వరప్రసాదితాలేకదా"... అనే జ్ఞప్తిని పరిపుష్టి చేసుకో.

**నిత్యం వైరాగ్య – సముపాశ్రితః** : అనునిత్యంగా వైరాగ్యం (Detachment) అలవరచుకో. "ఇదంతా పరమాత్మదేకాని నాది కాదు"... అనురూపంతో కూడిన రాగరాహిత్యం సకల సమయములలోను అభ్యసిస్తూ ఉండు.

**అహంకారం – బలం – దర్పం – కామం – క్రోధం పరిగ్రహమ్ విముచ్య** : విషయాలు వస్తువులు నాకు సంబంధించినవి! నేను వాటికి సంబంధించిన వాడను! వీటిచే పరిమితుడను" అనే భావావేశం, అహంకార – బల – దర్పములు, – లేనివాటికోసం వెంపరలాడటం, వారిపై – వీరిపై క్రోధం... ఇవన్నీ వదలి వేస్తూ ఉండు. క్రమంగా మొదలంట్లా త్యజించివేయి.

**నిర్మమః : శాంతో** : మమకారం వదలు. శాంతమును అంతరంగంలో అభ్యసిస్తూ

– ఆస్వాదిస్తూ ఉండు.

ఇట్టి అభ్యాసములచే – "ప్రతి తరంగము జలమే అయినట్లు నేను, పరబ్రహ్మమే అయిఉన్నాను' అను 'పరబ్రహ్మతో ఏకీభావము' నకు అర్హుడవగుచున్నావు.

ఓ కౌంతేయా! బ్రహ్మముతో ఏకీ భావము అభ్యసించువాడు సర్వకాల – సర్వావస్థలయందు ప్రసన్నహృదయుడై ఉంటాడు. (He always practices and adopts pleasantness). ఆతడు సర్వవేదనలను – దుఃఖములను అతిక్రమించి వేస్తున్నాడు. ఏదీకూడా కావాలనో – వద్దనో కాంక్షించటం లేదు, ద్వేషించటం లేదు.

ఓ ధనంజయా! అట్టివాడు క్రమంగా సర్వాంతర్యామియగు నాపట్ల భక్తితత్పరత పెంపొందించుకొని... సర్వభూతాంతర్గతుడనగు నన్ను ప్రేమిస్తూ "పరాంగతి" (Highest path) సముపార్జించుకుంటున్నాడు. నాపట్ల పరాభక్తిని పెంపొందించుకొని, నన్ను చేరుచున్నాడు. అట్టి భక్తి యొక్క ఔన్నత్యముచే "ఈ సర్వముగా కనిపిస్తున్నది పరమాత్మయగు నేనే" అని గమనిస్తున్నాడు. పరమాత్మతత్వం గ్రహిస్తున్నాడు. **నాయందు అనన్య బాక్తితో నన్నే చేరినవాడగుచున్నాడు.**

## నాయందు ప్రవేశించి నేనే తానగుచున్నాడు.

ఓ అర్జునా! ఆయా గుణస్వభావానుసారం నియమిత (Allotted) కర్మలు నిర్వర్తిస్తూకూడా... నన్ను ఆశ్రయించువాడు, నన్ను సర్వాంతర్యామిగా – సర్వతత్వాత్మకుడుగా – సర్వ తత్వస్వరూపుడుగా ఉపాసనా పూర్వకంగా గ్రహించువాడు మత్ ప్రాసాదితంగా "**శాశ్వతమగు స్థితి – స్థానము**" పొందుచున్నాడు. శాశ్వత పదము (Permanentely placed undisturbed state)ను అలంకరించుచున్నాడు.

అందుచేత ఓ అర్జునా! నీవు చేస్తున్న సర్వ కార్యక్రమములు నివేదన

పూర్వకంగా నాకు సమర్పించు.

సమర్పణ బుద్ధితో సన్యసించియుండు. బుద్ధియోగంతో సర్వవ్యవహారములు త్యజించి ఉండు.

నీ చిత్తమును సర్వదా – సర్వత్రా – సర్వవిధములుగా సర్వ తత్వ స్వరూపుడనగు నాకు సమర్పణ చేయి. ఏ చిత్తముతో జగద్విషయాలపట్ల అహంకార – మమకారములు ఏర్పడుచున్నాయో,... అట్టి ఆ చిత్తమును నాకు సమర్పించు. సతతము చిత్తమును సన్యసించి పరమాత్మకు సమర్పించి, చిత్తము యొక్క పరిధిని అధిగమించి ఉండు.

నాయందు చిత్తమును నెలకొలిపి నీనీ స్వధర్మములను నిర్వహించు.

అప్పుడు నీకు తారసపడుచున్న అడ్డంకులన్నీ నేను తొలగిస్తాను. తన విద్యుక్త ధర్మనిర్వహణను నాకు సమర్పించినవాడు నాయొక్క ప్రసాదము (Help - Paricipation - sanction)చే తప్పక తరించగలడు. నేను అట్టివానిని సర్వ దుఃఖముల నుండి తరింరపజేస్తున్నాను.

ఓ అర్జునా! "సన్యాసి – త్యాగి"వై ఉండు.

(1) **సన్యాసయోగం :** చిత్తమును సమర్పించటం – సర్వకర్మఫలములను సన్యసించటం. సత్‌స్వరూపుడగు పరమాత్మను సర్వ స్వరూపుడుగా మననం చేయటం.

(2) **త్యాగయోగం :** విహిత కర్మలను నిర్వర్తిస్తూ పరమాత్మకు ఆ కర్మలకు సమర్పించి త్యాగివై ఉండటం"...

"సన్యాస – **త్యాగయోగం**" అభ్యాసం చేయటం ఏమరిచి అహంకార మమకారాలనే సేవిస్తూ జీవితం కొనసాగించదలచితే... అప్పుడు నీకు వ్యతిరేక ప్రయోజనములు (నష్టము) అనివార్యం సుమా!

ఒకవేళ నీవు అహంకారమును ఆశ్రయించి నీ స్వధర్మమగు ఈ "యుద్ధం చేయటం" అనే కర్మనుండి విరమించటానికి నిర్ణయించుకొన్నావా... నీ అట్టి

ప్రయత్నం నిష్ప్రయోజనమే అవగలదు. పైగా, స్వధర్మమును ఏమరచినవానికి పతనం అనివార్యం!

మరొకవిషయం!

ప్రకృతియే జీవులందరినీ ఆయా కర్మలందు నియమిస్తోంది! ఇక నీకు "చేయను" అను స్వతంత్రం మాత్రం ఎక్కడిది?

ప్రతి జీవుడు తనయొక్క గుణస్వభావంచేత తాను నిర్వర్తించవలసియున్న ఆయా కర్మలయందు ప్రకృతిచే నిబద్ధుడై ఉన్నాడు. ప్రకృతి నియమిత కర్మల నిబద్ధత్వం నుండి ఎవ్వడూ ఏమాత్రం తప్పించుకోజాలడు.

నీవు మోహావేశంలో "ఈ యుద్ధము అనే కర్మను నేను నిర్వర్తించను" అని నిర్ణయించుకొని విరమించయత్నించినప్పటికీ, నీవు ప్రకృతికి బద్ధుడవై బలవంతంగా నిర్వర్తించవలసి వస్తుంది. (ఉదాహరణకు, కౌరవులు క్రూరస్వభావంతో నీసోదరులను హింసించటానికి సమీపించినప్పుడైనా... నీవు బలవంతంగా యుద్ధం చేయాలని నిర్ణయించుకోవటం అనివార్యమౌతుంది).

ఎందుకంటే,

- ఈశ్వరుడు సర్వజీవుల హృదయాలలో సర్వదా వేంచేసియున్నారు.
- భ్రమణ యంత్రమును (Wheel) అధిరోహించినవాడు యంత్రముతోబాటు తానూ తిరుగుతాడు కదా!
- ఈ దృశ్య చమత్కార యంత్రమును ఈశ్వరుడు అంతర్యామి అయి త్రిప్పుచున్నారు. ఈశ్వర సంకల్పానుసారం ఈ సంసారచక్రంలో ఇష్ట - అయిష్టాలతో సంబంధం లేకుండానే ఈ జీవులంతా తిరుగాడుచున్నారు.

ఓ ఫల్గుణా! సర్వుల హృదయాలతో వేంచేసి, వారివారి మనోబుద్ధి చిత్త అహంకారాలను తనవశం చేసుకొని త్రిప్పుచున్న ఈశ్వరుడు సర్వజీవుల దృష్టి - ప్రయత్నములను భ్రమింపజేస్తూ ఉన్నారు. హృదయేశ్వరుని లీలచే

జీవులంతా ఆయా కర్మలను అనివార్యంగా, వశులై నిర్వర్తిస్తున్నారు.

అందుచేత నీవు **ఆ సర్వహృదయేశ్వరుని శరణు వేడు.**

సర్వభావములు ఆ సర్వాంతర్యామికే సమర్పించి - సర్వభావములచే ఆయనను ఆశ్రయించు.

కార్యకారణ స్వరూపుడగు ఆ పరమాత్మయొక్క కృపచే శాశ్వత-శాంత స్థానమగు 'ఆత్మాఽహమ్' స్థితిని తప్పక పొందగలుగుతావు.

☆☆☆

ఓ అర్జునా! రహస్యములలోకెల్ల అతిరహస్యమైన ఆత్మతత్త్వజ్ఞానాన్ని నీకు సవివరంగా ఇప్పటివరకు విశదీకరించాను.

నేను ఇప్పటివరకు చెప్పిన విశేషాలన్నీ ఆద్యంతంగా అన్నిటినీ క్రోడీకరించుకొని నీకు నీవుగా విచారణచేయి. విమర్శించుకో.

అటు తరువాత **"ఇప్పుడు ఈ యుద్ధం నేను చేయాలా? లేక ఈ యుద్ధరంగం నుండూ విరమించాలా?"**... అనునది నీకు నీవే నిర్ణయించుకో.

**నీకు ఏది ఇష్టమని శ్రేయమని, సమయోచితమని నీవు అనుకుంటావో... అది చేయి.** (జీవులు భగవద్గీతాంతర్గత విచారణను పరిశీలించి...... ఇక తమ బుద్ధిచే తమ ఉచితానుచితములు యోగ-సాంఖ్యాది మార్గములు నిర్ణయించుకొందురుగాక!)

☆☆☆

అయితే, ఇప్పుడు సర్వరహస్యములలోను "అత్యంత రహస్యము" (Greatest Factual Secret) అయి ఉన్నట్టి సర్వ వాక్య సారమైన పరమవిశేషాన్ని మరింకొక్కసారి 'సారవిషయం'గా క్రోడీకరించి (As a Brief Essence) చెప్పుచున్నాను. నీవంటే నాకు ఎంతో ఇష్టం. దృఢ చిత్త సమన్వితుడవు. కాబట్టి నీపై ప్రేమ చేత మరల ఈ వాక్యం చెప్పుచున్నాను. .... విను.

## సర్వత్యాగపూర్వక శరణాగతి

*శ్లో॥ మన్మనాభవ! మద్భక్తో! మద్యాజీ మాం నమస్కురు ।*
*మామేవ వైష్యతి సత్యం, తే । ప్రతిజానే, ప్రియోఽసిమే ॥*

- నీ మనసంతా నాపై నిలుపు!
- నాయందు సర్వ విధాలా భక్తి – ప్రేమ తత్పరతలు సమర్పించు!
- నీ సర్వ కర్మపుష్పములచే నన్ను పూజించువాడవై ఉండు!
- నాకు జీవ బ్రహ్మైక్య భావతత్పరతతో కూడిన వాడవై నమస్కరించు!

(న = సర్వాంతర్యామి; మ = జీవుడు)

నీవు నాకు అత్యంత ఆప్తుడవు సుమా!

సర్వజీవులు నాకు అత్యంత ఆప్తులు!

నన్ను శరణువేడితే సర్వ విధాలా నన్ను పొందగలరు!

దీపకాంతిని సమీపించినవాడు సహజంగానే చీకటినుండి బయల్వెడలతాడు కదా!

నీయొక్క సర్వ కృత – అకృత ధర్మములు, గుణస్వభావసిద్ధమగు సాత్విక – రాజసిక – వైశ్య – శూద్ర కర్మలు నాపట్ల సన్యసించినవాడవై, త్యాగివై ఉండు. సర్వదా, సర్వథా నన్ను శరణువేడు.

నిన్ను సర్వ దోషముల నుండి నేను తప్పక సముద్ధరిస్తాను.

కనుక అన్నిదిగుళ్లు వదలివేయి.

(Leave All worries. I am there to take care of!)

★★★

పరమోత్తమమగు ఈ గీతా శాస్త్ర రహస్యాన్ని తపస్సు, సేవాభావం, గురుశుశ్రూష – భక్తి – ఇటువంటి అభ్యాసగుణాలు లేనివానికి, నాపట్ల

అసూయపెపొందించుకొని ఉన్నవానికి నీవు చెప్పవద్దు. అత్యంత సూక్ష్మతత్వమగు ఈ ప్రవచన సారాంశము అశూయారాహిత్యము, భక్తి – శుశ్రూష – తపస్సు లేని వానికి చెప్పితే 'పెడర్థం'గా అర్థం చేసుకుంటాడేగాని సునిశిత దృష్టిచే సారాంశాన్ని గ్రహించలేడు.

ఎవ్వరైతే ఈ గీతా శాస్త్ర వ్యాఖ్యాన పూర్వక జ్ఞానాన్ని నాయందు భక్తి కలిగి ఉండి నా భక్తులకు విశదీకరిస్తూ ఉంటారో... అట్టివారికి ఇది భక్తి – జ్ఞాన సాధన కాగలదు.

అట్టివాడు సర్వాంతర్యామినగు నన్ను తప్పక చేరుకోగలడు.

ఇందులో ఏమాత్రం సందేహం లేదు.

ఇట్టి గీతాశాస్త్ర రహస్యతత్వాన్ని విశదీకరించు ఉత్సుకతతో ఉపాసించువారు నాకు అత్యంత ప్రియం అగుచున్నారు.

అంతకుమించిన ప్రియమైనవారు నాకు మరెవ్వరుంటారు?

⋆⋆⋆

ధర్మసూక్ష్మ తత్వాన్ని ప్రకటిస్తున్న మనిద్దరి ఈసంవాద రూపకమగు ఈ గీతాశాస్త్ర తత్వరహస్యమును ఎవ్వరైతే అధ్యయనం చేస్తూ ఉంటారో, అట్టివారు జ్ఞానయజ్ఞం నిర్వర్తించినవారై నాకు అత్యంత ప్రియతములగుచున్నారు.

ఎవ్వరైతే అసూయారహితమైన హృదయంతో ఈ గీతా శాస్త్రం వింటూ ఉంటారో ... వారు జీవన్ముక్తులగుచున్నారు. ఉత్తరోత్తరా శుభలోకములు పొందుచున్నారు.

పార్థా! ఇప్పుడు నేను చెప్పిన ఈ గీతాశాస్త్రము ఆమూలాగ్రం ఏకాగ్రచిత్తంతో విన్నావు కదా! ఓ ధనంజయా! నీలోని అజ్ఞానమోహమంతా నశించిందా? చెప్పు!

**అర్జునుడు :** హే అచ్యుతా! మీ ప్రసాద లబ్యమగు గీతాశాస్త్ర ప్రవచనాలు విన్నాను. నాలోని మోహంతొలగింది.

నిత్యానిత్యవివేకము– కర్మ – యోగం – భక్తి – జ్ఞాన శరణాగతులు ఘనమైన స్మృతి లభించినవాడనయ్యాను.

నా సందేహాలన్నీ తొలిగాయి.

ప్రశాంతచిత్తుడనయ్యాను.

మీరు ఆజ్ఞాపించినట్లే కర్మయోగం, ధ్యానయోగం, భక్తియోగం, జ్ఞానయోగం, సమర్పణయోగం, శరణాగతియోగం మొదలైనవన్నీ ఆచరిస్తాను. అనుసరిస్తాను.

ఇప్పుడీ యుద్ధధర్మం నిర్వర్తించటానికి సంసిద్ధుడనై ఉన్నాను.

⋆⋆⋆

**శ్రీ సంజయుడు** : ఓ ధృతరాష్ట్ర మహారాజా! అవతారమూర్తియగు వాసుదేవుడు – మహాత్ముడగు పార్థుల మధ్య జరిగిన సంవాదము నేను వినటం జరిగింది. ఇది మహాద్భుతం. వెంట్రుకలు నిక్కపొడిచేంత ఆశ్చర్యకరమైన గీతాగానం! రహస్యములలోకెల్ల అతి రహస్యమైనట్టి పరమాత్మ తత్వసారమైన ఈ శ్రీకృష్ణ ప్రవచితమగు "భగవత్ గీత"ను వ్యాసమహర్షి యొక్క వరప్రసాదంచేత నేను వినగలిగాను. యోగీశ్వరుడగు సాక్షాత్ శ్రీకృష్ణ భగవానుని పెదిమలనుండి జాలువారిన యోగతత్వాన్ని స్వయంగా వినగలగటం నాకు లభించిన మహోన్నతమగు అవకాశంగా భావిస్తున్నాను.

హే రాజన్! శ్రీ కేశవ – అర్జునుల మధ్య జరిగిన ఈ సంవాదమును మరలమరల స్మరిస్తూ ఉండగా నాహృదయం ఆనందడోలికలలో తేలియాడుతోంది.

శ్రీకృష్ణ భగవానుని అత్యద్భుత గీతాగాన సందేశాలు మరలమరల మననం చేస్తూ ఉంటే నా అంతరంగమంతా ఆశ్చర్యముతో, జ్ఞానానందంతో నిండిపోతోంది. బ్రహ్మానందమగుచున్నది.

*"ఎక్కడైతే యోగీశ్వరుడుగు శ్రీకృష్ణ భగవానుడు, ధనుర్ధారి అయిన అర్జునుడు వేంచేసి ఉంటారో అక్కడ విజయము, నీతి, న్యాయము, నిత్యానిత్య వివేకజ్ఞానము సర్వదా వేంచేసి ఉంటాయి" అని అభిప్రాయపడుచున్నాను!*

---

ఇతి మోక్షసన్యాసయోగ పుష్పః

*శ్రీ సాంబసదాశివ పాదారవిందార్పణమస్తు*

*లోకకళ్యాణమస్తు*

శంనో అస్తు ద్విపదే!

శం చతుష్పదే !

సర్వమతగురువులకు, మహర్షులకు, త్రిమతాచార్యులకు

సాష్టాంగదండ ప్రణామములు సమర్పిస్తూ......,

మద్గురువులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములు వారికి

ప్రణమిల్లుతూ.....,

దాసానుదాస

చరమావధిలు

దాసదాసః

యేలేశ్వరపు హనుమరామకృష్ణ

★★★

## శ్రీ యేలేశ్వరపు హనుమ రామకృష్ణగారిచే రచించబడిన

# శ్రీ వసిష్ఠ రామ సంవాదము

## (యోగవాసిష్టం - వచనకావ్యం)

### గ్రంథసంఖ్యావర్ణనం

1. **వైరాగ్య ప్రకరణం :** (1500 శ్లోకాలు) దీనిని పారాయణం చేస్తూఉంటే ఈ దృశ్యము పట్ల, శరీరాదుల పట్ల పేరుకొనియున్న అజ్ఞాన జనితమైన బుద్ధిమాంద్యము తొలుగుతుంది. సాత్విక వైరాగ్యం ఏర్పడుతుంది. "జీవితము - అనుదానిని వివేకముచే పరిశీలించకుండానే బ్రతికివేస్తున్నామా?" అను వివేకపూరితమైన శోధనం (Introspection) ఏర్పడుతుంది. అట్టి దృష్టియే ఆత్మవిషయమై సమాచారం పొందటానికి పునాది. [Vol.1]

2. **ముముక్షు వ్యవహార ప్రకరణ :** (1000 శ్లోకాలు) 'ముముక్షుత్వము' అంటేఏమిటో, ముముక్షువులు ఎట్లు వ్యవహరిస్తారో, వారి స్వభావమేమిటో, ఎట్టిదృష్టిచే ఆత్మవిషయం గ్రహించటానికి సిద్ధంగా ఉండాలో చెప్పబడింది. బద్ధకము, అశ్రద్ధ, మూర్ఖత్వము త్యజించి శమము, సంతోషము, విచారణ, సత్సంగమములను ఆశ్రయించవలసినదిగా బోధింపబడింది. 'పరిశీలనాదృష్టి - ప్రయత్నము' - ఈ రెండు ఉన్నవాడే ముముక్షువు. [Vol.1]

3. **ఉత్పత్తి ప్రకరణము :** (7000 శ్లోకాలు) అనేక దృష్టాంతముల సహాయంచే, "లౌకికములైన - నీవు - నేను - అను వ్యవహారములన్నీ అసలు ఉత్పన్నమే అయిఉండలేదు" - అని నిరూపించబడింది. స్థావరజంగమాత్మకమగు ఈ జగత్తు మూలమే లేనిదని, రూప రహితమని ప్రతిపాదించబడింది. [Vol.2&3]

"ఈ సంసారమంతా స్వకీయకల్పితమైన మనోరాజ్యము వంటిదేకాని, వాస్తవముకాదు. స్వప్నంలో ఎట్లు జరుగుతోందో, అదేవిధంగా, ఇదంతా అవస్తుమాత్రమై, కల్పితానుభవమాత్రమై ప్రాప్తిస్తోంది" అని యుక్తియుక్తంగా నిరూపించబడింది. ఎండమావులలో నీరు లభిస్తుందా? మెల్లకన్నువాడికి ఆకాశంలో కనిపించే "రెండవ చంద్రుడు" అసలు ఉన్నాడా? అంధకారంలో కనిపించే మోడువారిన ఒకానొక వృక్షం దయ్యమై, అపరిపక్వ బుద్ధికి మాత్రమే, ప్రాప్తిస్తోంది కదా! నావ కదులుతుండగా ఒడ్డున ఉన్న చెట్లు కదలుచున్నట్లు కనిపించినంత మాత్రంచేత, ఆ చెట్ల యొక్క కదలిక వాస్తవమా? ఈ సంసారము కూడా కల్పితమాత్రమని, ఒకానొకప్పుడు, ఒకానొకదృష్టిచే, ఒకానొకవిధంగా – భావనను అనుసరించి ప్రాప్తిస్తున్నదని తెలిసిపోతుంది. ఇది వాస్తవానికి సార రహితమని ఎరిగిన తరువాత దీనిగురించి ఎవడు దుఃఖిస్తాడు?

ఆభరణం – బంగారముకంటే వేరుకానట్లు, జలంకంటే తరంగాలు వేరుకానట్లు, ఈ జగత్తు పరమాత్మగానే దర్శించబడగలదు. ఇదంతా ద్రష్ట యొక్క దృష్టి కంటే వేరేమికాదు. ఆకాశంలో నీలపు పదార్థం ఏదైనా ఉన్నదా? చిత్రపటంలోని అగ్నికి ఉష్ణత్వమెక్కడ? ఈ జగత్తు కూడా అసత్తే.

కాని, అవివేకదృష్టికి మాత్రం 'సత్తు' (as if truely exists)గా తోచుచున్నది. ఎప్పుడో జరిగిపోయిన ఒకానొక దృశ్యము ఇప్పుడు మనన కారణంగా మనోవీధిలో ప్రత్యక్షమై ప్రాప్తిస్తోంది చూచావా! అదేవిధంగా ఈ జగత్తుకూడా వర్తమానంలో అనుభవమౌతోంది. ఈ కనబడే పదార్థములను జ్ఞానదృష్టిచే పరిశీలించినపుడు ఇవన్నీ "అస్థిరము, తుచ్ఛము, శూన్యము" అని ఈ ప్రకరణం బోధిస్తోంది.

4. **స్థితి ప్రకరణం :** (3000 శ్లోకాలు) "ఈ జగత్తు అహంభావమునందే స్థితి పొందియున్నది కాని, ఎక్కడో బాహ్యమునందు కాదు" అనునట్టి పరమార్థము అనేక కథలద్వారా, దృష్టాంతముల ద్వారా

నిరూపించబడింది. ఈ భ్రాంతిమయ జగత్తులు, ఈ ద్రష్ట దర్శనము – దృశ్యములు (Perceiver, Perception and Objects) – ఇవన్నీ ఎట్లు వృద్ధిపొందుచున్నాయో చెప్పబడింది. [Vol.4]

5. **ఉపశమన ప్రకరణం :** (5000 శ్లోకాలు) ఇందులో, "నేను, నీవు, అతడు, జగత్తు" – అను వ్యవహారమంతా ఉపశమింపచేయగల యుక్తులేమిటో చెప్పబడింది.

ఈ జగత్తు ఒకనికి సుస్పష్టంగా, మరొకనికి అస్పష్టంగా ఉన్నప్పటికీ – వాస్తవానికి ఇది అసత్యమే. ఊహాకల్పితమైన రూపములు ఆ ఊహ ఉపశమించగానే తొలగిపోతాయి కదా! ఈ జగత్తు స్వకల్పితమనండి. లేక స్వప్న కల్పితమనండి. ఇది (మనస్సునుండి) జ్ఞానముచే తొలగిపోతోంది. ఎవరికైతే జగద్భ్రమ నశించుట లేదో – వారికి మాత్రం ఇదంతా ఒక అంతులేని అనేక సంఘటణలతో కూడిన 'కథ' వలె ప్రాప్తిస్తూ పోతోంది. ఈ సంసారమంతా కల్పిత మాత్రమే. "అట్టి కల్పనలలోనే కొందరు మనోహరత్వమును, మరికొందరు దుఃఖపరంపరలను తమయొక్క అజ్ఞానంచేత, లేక మూర్ఖత్వంచేత పొందుచున్నారు" – అని ఈ ప్రకరణం నిరూపిస్తోంది. [Vol.5]

6. **నిర్వాణ ప్రకరణం :** (14500 శ్లోకాలు) జ్ఞానం వికసిస్తుంది. కల్పనలన్నీ తొలగిపోతాయి. "నిర్వాణము" అనబడే పరమశ్రేయస్సు లభించగలదు. ఇందలి విషయమును గ్రహించువాడు – నిర్విషయము, చిత్రప్రకాశమాత్రము, విజ్ఞానమయము, నిరామయము – అయినట్టి ఆత్మరూపమున ప్రతిష్ఠితుడగుచున్నాడు. సంసార భ్రమలన్నీ తొలగుటచేత పరమాకాశమువలె స్వచ్ఛుడౌతాడు. పరిపూర్ణుడు, కృతకృత్యుడు, అగుటచేత, ఇక అతడు ప్రశాంత పూర్వకంగా ఈ 'జగత్ యాత్ర' నిర్వర్తించగలడు.

*"ఒక దర్పణం ఎదురుగా ఉన్న దృశ్యమును ఎట్టి ప్రత్యేకమైన ప్రయత్నం లేకుండానే, తనయందు ప్రతిబింబించుటకు ఆశ్రయమౌతోంది కదా! నేను కూడా పూర్ణమగు బ్రహ్మమునై ఈ జగత్తూ, ఈ ఈ కార్యమూ ప్రతిబింబించుటకు కర్తృత్వము లేకుండానే ఆశ్రయభూతుడనగుచున్నాను."*

అని పఠించువాడు (The Student) గ్రహిస్తున్నాడు. సమస్తము స్వస్వరూపముచే మ్రింగబడగా, అతడు తృప్తుడగుచున్నాడు. బాహ్యేంద్రియములు, చిత్తము, అహంకారము – సర్వము చిదాకాశమేనని తెలుసుకొనుచున్నాడు. కార్య, కారణ, కర్తృత్వముల విషయంలో అత్యంత నిర్లిప్తుడై, దేనిచేత కూడా స్పృశించబడనివాడై ఉంటున్నాడు.

ఈ ప్రకరణము పఠిస్తున్ననాడు – తననుతాను – దేహము కలిగి యున్నప్పటికీ – విదేహిగా, సంసారి అయినప్పటికీ – అసంసారిగా గాంచుచున్నాడు. "నేను సర్వదా అఖండుడనే" అని గ్రహిస్తున్నాడు. ఇక అతనిని లోకవ్యవహారములు తాకలేవు. పరిపూర్ణమగు చిన్మయావస్థను పొందినవాడై స్వయముగా, తానే 'చిదాదిత్యుడు' అగుచున్నాడు. అతనిపట్ల దృశ్యములన్నీ అదృశ్యమగుటచే, అతడు శుద్ధస్వరూపము, స్వచ్ఛత్వము పొందుచున్నాడు. ఈ 'సంసారము' అనే కుత్సిత వ్యాధి నశిస్తోంది. 'అహంకారము' అనే పిశాచం వదలిపోవుటచే తాను శరీరం కలిగి ఉన్నప్పటికీ, "నేను ఈ దేహమునే" అను దురభిప్రాయం తొలగించి వేసుకుంటున్నాడు.

మహాత్ముడగు అట్టి జీవన్ముక్తుని హృదయమే పరమాత్మ. అతడు "సత్త" (Absolute existence) అనురూపముగల అనందము యొక్క విస్తారముచే, సర్వోత్తముడై, హరిహరాదులతో సమానమైన అనుభవమును పొందుచున్నాడు.

[Vol. 6, 7 & 8]

★★★

# రచయిత - ఇతర రచనలు

**శ్రీ వసిష్ఠరామ సంవాదము (యోగవాసిష్ఠం)**

| | |
|---|---|
| Vol 1. వైరాగ్య ప్రకరణము (ముముక్షు వ్యవహారము ప్రకరణము) | రూ. 70/- |
| Vol 2. ఉత్పత్తి ప్రకరణము (ప్రథమార్థము) | రూ. 100/- |
| Vol 3. ఉత్పత్తి ప్రకరణము (ద్వితీయార్థము) | రూ. 120/- |
| Vol 4. స్థితి ప్రకరణము | రూ. 100/- |
| Vol 5. ఉపశమన ప్రకరణము | రూ. 130/- |
| Vol 6. నిర్వాణ ప్రకరణము (పూర్వార్థము) | రూ. 160/- |
| Vol 7. నిర్వాణ ప్రకరణము (ఉత్తరార్థము - 1) | రూ. 140/- |
| Vol 8. నిర్వాణ ప్రకరణము (ఉత్తరార్థము - 2) | రూ. 150/- |

**కఠ - ఈసావాస్యోపనిషత్**

(వచన పుష్పాలు మరియు నారద భక్తి సూత్రాలు) రూ. 25/-

**శ్రీమద్ భగవద్గీత - అధ్యయన పుష్పం** రూ. 150/-

**ప్రతులకోసం:-**

వై. కనకదుర్గ, ఫ్లాట్.నెం. ఎ-301,
ఆదిత్య అపార్ట్‌మెంట్స్, దుర్గానగర్ కాలనీ,
పంజగుట్ట, హైదరాబాద్
ఫోన్ నెంబరు : 040 - 23416218